www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 2-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 348 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా. 8.10 తదుపరి నవమి; నక్షత్రం: పూర్వాషాఢ రా. 10.50 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: ఉ. 8.39-10.14; దుర్ముహూర్తం: ఉ. 8.39-9.28, రా. 10.17-11.03; అమృతఘడియలు: సా. 6.06-7.41; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.13; సూర్యాస్తమయం: 6.26 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎన్నికల వేళ వెరీ 'హాట్'..!

ఇటు ఎన్నికల హీటు.. అటు మండుటెండలు



- ఈ వేసవిలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మంటలే
- దేశంలో సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు
- మధ్య భారతం పరిసర ప్రాంతాల్లో మరింత తీవ్రత
- ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎండల తీవ్రత అధికం
- సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు

2

పింఛన్లపై..

వంచన వైసీపీదే!



వలంటీర్లపై ఈసీ నిర్ణయానికి కారణం వైసీపీనే

- వారిని సొంత కార్యకర్తల్లా వాడుకున్న పార్టీ
- 'వైసీపీకి బ్రాండ్ అంబాసిడర్లు' అని చెప్పిన జగన్
- ఎన్నికలకు 2 నెలల ముందు నుంచే పార్టీ సేవలోకి
- రాజీనామాలు చేసేయాలని ఎప్పుడో ఆదేశాలు
- అవ్వా తాతలు కాదు.. అధికారమే ముఖ్యం
- ఈ సంగతి గతంలోనే బయటపెట్టిన 'ఆంధ్రజ్యోతి'
- తాజాగా మరింత ఊపందుకున్న రాజీనామాలు
- విపక్షాలపై విషం చిమ్మి పోవాలని సూచనలు
- 1.26 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు
- వారిచేత ఇంటింటికీ పెన్షన్ ఇప్పించలేరా?

వలంటీర్లను పింఛను పంపిణీకి దూరం పెట్టాలని ఈసీ ఆదేశించడానికి ముందే... చాలా చోట్ల వాళ్ల చేత వైసీపీ నేతలు రాజీనామా చేయించారు.

? అంటే... ఆయా వార్డుల్లో అవ్వా తాతలకు పెన్షన్ అందకూడదనే అలా చేశారా?

ఎన్నికల ముందు రెండు నెలలపాటు వలంటీర్లను పూర్తిగా రాజకీయ అవసరాలకే వాడుకోవాలని.. వారితో రాజీనామాలు చేయించాలని వైసీపీ ఎప్పుడో నిర్ణయించుకుంది.

? అంటే.. ఈ రెండు నెలలపాటు వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయించకూడదన్నది వైసీపీ నిర్ణయమే కదా! చేయాల్సిందంతా తెరవెనుక చేసేసి.. ఇప్పుడు ఈసీ జారీ చేసిన ఆదేశాలను విపక్షాలపై బురదజల్లేందుకు వాడుకుంటున్నారు.

నాడు సాఫీగా..

సంక్షేమ పథకాలు, సామాజిక పెన్షన్లను జగన్ కొత్తగా ప్రవేశ పెట్టలేదు. ఎప్పటి నుంచో ఇవి అమలవుతున్నాయి. సామాజిక పెన్షన్ ప్రవేశపెట్టిందే తెలుగుదేశం పార్టీ. రూ.75 ఉన్న పెన్షన్ వైఎస్ హయాంలో రూ.200లకు చేరింది. దానిని చంద్రబాబు ఒకేసారి ఐదురెట్లు పెంచి వెయ్యి చేశారు. ఆ తర్వాత రూ.2వేలకు పెంచారు. అవ్వా తాతలకు ప్రతి నెలా సాఫీగా పెన్షన్ల పంపిణీ సాగిపోయేది.

సచివాలయాల సిబ్బంది కదిలితే..

రాష్ట్ర వ్యాప్తంగా 15వేల గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. ఒక్కో సచివాలయంలో 8 నుంచి 14 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. అంటే... సుమారు 1.26 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. పెద్ద పంచాయతీల్లో బిల్లు కలెక్టర్లు, ఇతర సిబ్బందితో కలిపితే 1.62 లక్షల మంది అందుబాటులో ఉంటారు. వీరంతా రంగంలోకి దిగితే... కేవలం రెండు రోజుల్లోనే అవ్వా తాతలకు ఇంటింటికీ వెళ్లి పింఛను అందించవచ్చు.

? గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను జగన్ సర్కారు విప్లవాత్మకంగా చెప్పుకొంటోంది. మరి... ఎన్నికల సమయంలో రెండు నెలలు సచివాలయాల సిబ్బంది ద్వారా పెన్షన్లను ఇంటికే పంపిణీ చేయలేరా? అది కూడా చేయలేనప్పుడు... అన్ని గొప్పలు ఎందుకు?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒక పార్టీ కార్యకర్తల ద్వారా ప్రభుత్వ పథకాలను అమలు చేయవచ్చా? అందులోనూ ఎన్నికల సమయంలో అలా చేయొచ్చా? చేస్తే... ఎలక్షన్ కమిషన్ మౌనంగా ఉండగలదా? వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరం చేయడం నేరం, ఘోరమైతే దానికి అధికార పార్టీ నేతలే కారణమని స్పష్టంగా చెప్పవచ్చు. ఎందుకంటే... వలంటీర్ల నియామకం నుంచి నేటిదాకా ఎప్పుడూ వారిని ప్రజలకు సేవచేసే వారిగా చూడలేదు. తమ సొంత పార్టీ కార్యకర్తల్లాగానే వైసీపీ భావించింది. ఎమ్మెల్యేల నుంచి సీఎం దాకా... అందరిదీ ఒకే మాట! 'వలంటీర్లు మా వాళ్లు. మా పార్టీ కార్యకర్తలు!' అనే చెబుతున్నారు. ఇక ఎన్నికల షెడ్యూలుకు ముందే వలంటీర్లను విచ్చలవిడిగా తమ ప్రచారానికి వాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే.. ఎన్నికల ప్రక్రియకు, పింఛను పంపిణీ వంటి కార్యక్రమాలకు వలంటీర్లను దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్

మిగతా 12వ పేజీలో...

మీరు చెప్పిన మాటలే ఇవి...

"మా జెండాను అజెండాగా తీసుకొని త్రికరణ శుద్ధితో పని చేస్తున్నందుకు బహుమతిగా వలంటీర్లకు పురస్కారాలు ఇస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 2.60లక్షల మంది వలంటీర్ల సైన్యం ఉంది. ఆ సైన్యాన్ని చూస్తే ప్రతిపక్షాలకు గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటాయి. రాబోయే రెండు నెలలు వలంటీర్లు చేసే యుద్ధం పైనే మా ప్రభుత్వ సౌధం నిలబడుతుంది. ప్రతీ వలంటీర్ తన క్లస్టర్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందినవారు ఎన్నికల్లో మా పార్టీ కోసం నిలిచేలా చూడాలి. వలంటీర్లు వైసీపీకి బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలి."

– సీఎం జగన్ (ఫిబ్రవరి 15న వలంటీర్లకు వందనం సభలో)

? ఇప్పుడు చెప్పండి.. మీ పార్టీ బ్రాండ్ అంబాసిడర్లతో ఎన్నికల సమయంలో ప్రభుత్వ పథకాలను అమలు చేయొచ్చా?



3 నుంచి పింఛన్ల పంపిణీ

ఆర్థిక సంవత్సరం ముగింపు, బ్యాంకులకు వరుస సెలవులే కారణం

- అన్ని జిల్లాల అధికారులకు వెల్లడించిన సెర్ప్
- ఎన్నికల కోడ్‌తో పింఛన్ల పంపిణీకి కొత్త మార్గదర్శకాలు జారీ

3 నుంచి అని చెప్పిందెవరు?

'ఒకటో తేదీనే వలంటీర్లు అందించే పింఛను విపక్షాల వల్ల ఆగిపోయింది'... అని వైసీపీ గగ్గోలు పెడుతోంది. ఇదో పచ్చి అబద్ధం!


ఎందుకంటే... ఈసారి పెన్షన్ 3వ తేదీ నుంచి పంపిణీ చేయాలని ముందే నిర్ణయించారు. ఒకటో తేదీన ఇవ్వలేమని కూడా చెప్పారు. జగన్ రోత పత్రికలోనే ఈ వార్త ప్రచురితమైంది. వలంటీర్లపై ఈసీ ఆంక్షలు పెట్టడానికి రెండు రోజుల ముందే... అంటే మార్చి 28వ తేదీనే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు, వరుస సెలవులే దీనికి కారణమని తెలిపారు. గత ఏడాది కూడా ఏప్రిల్ 3 నుంచే పెన్షన్లు పంపిణీ చేసినట్లు అధికారులు గుర్తు చేశారని పై కథనంలో రాశారు.

వాస్తవం ఇది కాగా విపక్షాలు వలంటీర్ల మీద ఫిర్యాదు చేయడంతోనే పెన్షన్ల పంపిణీ ఆలస్యమైందంటూ ప్రభుత్వ పెద్దలు విషం చిమ్ముతున్నారు.

ఎన్నికల ముందు రెండు నెలలు పూర్తిగా వైసీపీకే పని చేయాలంటూ వలంటీర్లను వైసీపీ ఆదేశించిన వైనంపై ఫిబ్రవరి 10వ తేదీన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన ప్రత్యేక కథనం.



అవ్వా తాతలకు జగన్ వెన్నుపోటు



- పింఛన్లు ఇంటికి పంపే అవకాశమున్నా కావాలనే పంపడం లేదు
- టీడీపీ అడ్డుకుంటోందని ఫేక్ ప్రచారం
- టీడీపీ వస్తే పింఛన్ 4 వేలిస్తాం
- వలంటీర్ వ్యవస్థకు వ్యతిరేకం కాదు: బాబు

11

ఇళ్ల వద్దకే పింఛన్లు!




- ఇంటింటికీ వెళ్లి పంపిణీకే ప్రయత్నం
- పెన్షన్లకు అవసరమైనంత సొమ్ముంది
- టీడీపీ నేతలతో సీఎస్ జవహర్ రెడ్డి!

- పెన్షన్ల పంపిణీపై వైసీపీ నీచ రాజకీయం: జనసేన
- పింఛన్లపై రాజకీయం చేయడం సరికాదు: షర్మిల
- పంపిణీ జాప్యంలో జవహర్ రెడ్డి కుట్ర: బీజేపీ
- రాజకీయ ప్రయోజనాల కోసమే నిందలు: సీపీఐ

12

జగన్ అక్రమాస్తుల కేసులో

ఎందుకీ జాప్యం?



- ముఖ్యమంత్రి కాబట్టే ఆలస్యం జరుగుతోందా: సుప్రీంకోర్టు
- సీఎం అయితే హాజరు నుంచి మినహాయింపు అడుగుతారా?
- ట్రయల్ సుదీర్ఘంగా సాగుతుంటే మినహాయింపు ఎలా ఇస్తారు?
- విచారణ సవ్యంగా జరుగుతుంటే సమస్యలెందుకు వస్తాయి?
- ధర్మాసనం ఆగ్రహం.. అఫిడవిట్ వేయాలని సీబీఐకి ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసు విచారణలో జాప్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి సంబంధించిన కేసులో నిర్లక్ష్యం ఎందుకని సీబీఐని ప్రశ్నించింది. ఈ కేసులో జాప్యం ఎందుకు చేస్తున్నారో వివరణ ఇస్తూ నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అక్రమాస్తుల కేసుకు సంబంధించి జగన్‌కు గతంలో మంజూరుచేసిన బెయిల్‌ను రద్దుచేయాలని కోరుతూ నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. ఈ క్రమంలో సీబీఐ కోర్టులో ట్రయల్ ఎందుకు ఆలస్యమవుతోందో కారణాలు చెప్పాలని ధర్మాసనం ప్రశ్నించింది. డిశ్చార్జి పిటిషన్ల కారణంగా ఆలస్యమవుతోందని ఎస్వీ రాజు తెలిపారు. రాజకీయ కారణాలతో విచారణ ఆలస్యం కాకూడదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అయితే విచారణ సవ్యంగానే జరుగుతోందని రాజు తెలిపారు. సవ్యంగా జరిగితే

మిగతా 12వ పేజీలో...



జగన్ బస్సు వెంట పరుగులు పెడుతున్న గోపాలమిత్రలు

జగన్‌కు నిరసనల సెగ

- బస్సు వెంట పరుగుపెట్టిన గోపాలమిత్రలు
- ప్లకార్డులు పట్టుకుని పెద్దపెట్టున నినాదాలు
- తమ డిమాండ్లు వినేవరకు వదలని వైనం

3

అభివాదాలతోనే సరి!

- రోజంతా మూగనోము పట్టిన జగన్.. మండుటెండలకు మాడిన జనం
- యాత్ర దారికి అడ్డంటూ చెట్ల నరికివేత.. విద్యుత్ వైర్లూ తొలగింపు
- కరెంటు లేక ఉక్కపోతతో జనం విలవిల.. ప్రయాణికులకూ నరకమే
- శ్రీసత్యసాయిలో ముగిసిన 'మేమంతా సిద్ధం'

నన్ను బ్లేడ్‌తో కోస్తున్నారు!


- కలిసేందుకు వస్తున్నవారిలో కిరాయి మూకలు ఉంటున్నాయి
- వారు సన్నటి బ్లేడ్‌లతో నన్ను, నా సెక్యూరిటీ సిబ్బందినీ కోస్తున్నారు
- ప్రత్యర్థి పార్టీ పన్నాగాలు తెలుసు కదా
- పగిలేకొద్దీ గాజు గ్లాసుకు పదునెక్కువ
- వైసీపీ ఫ్యాన్‌కు సౌండెక్కువ.. గాలి తక్కువ
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు
- జనసేనలో చేరిన మండలి బుద్ధప్రసాద్



సోమవారం మండలి బుద్ధప్రసాద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జనసేనాని పవన్

కాకినాడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తన భద్రతపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పర్యటనల సమయంలో తనను కలిసే అభిమానులు, నేతలు, కార్యకర్తల్లో కొందరు కిరాయి మూకలు కలుస్తున్నాయని అనుమానాలు వ్యక్తం చేశారు. వారు జనంతో కలిసిపోయి సన్నని బ్లేడ్‌లతో తనను, తన సెక్యూరిటీని కోస్తున్నారని తెలిపారు. "మన ప్రత్యర్థి పార్టీ పన్నాగాలు తెలుసు కదా.. వాటిని గమనించుకుంటూ జాగ్రత్తగా ముందుకు వెళ్లాలి" అని పరోక్షంగా వైసీపీని

మిగతా 11వ పేజీలో...



ఎన్నికల వేళా షాకులే!

జనంపై 1148.72 కోట్ల ట్రూఅప్ భారం

- వేరియబుల్ చార్జీలతో కలుపుకొంటే 2,149 కోట్లు
- గత ఏడాది ధరల సవరణకు జెన్కోకు అనుమతి
- డిస్కమ్‌లకు ఏపీఈఆర్సీ ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దాదాపు ఐదేళ్లుగా విద్యుత్ చార్జీల మోత మోగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల వేళ కూడా వినియోగదారులను వదిలిపెట్టలేదు. ఇంధన సర్దుబాటు చార్జీలు రూ.1148.72 కోట్లను వినియోగదారులనుంచి వసూలు చేసి జెన్కోకు చెల్లించాలంటూ విద్యుత్తు పంపిణీ సంస్థలను ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆదేశించింది. 2018-19 నుంచి 2022-23 దాకా విద్యుదుత్పత్తి కోసం జెన్కో... బొగ్గు , ఇతర ఇంధన ఉత్పత్తుల కోసం చేస్తున్న వ్యయాలకూ.. డిస్కమ్‌లకు సరఫరా చేస్తున్న విద్యుత్తు ధరకూ మధ్య తీవ్ర వ్యత్యాసం ఉందని ఈఆర్సీ ముందు జెన్కో వాదించింది. ఈ వ్యత్యాసం 2018-19లో రూ.37.33 కోట్లు 2019-20లో రూ.205.11 కోట్లు,2022-23లో రూ.906.28 కోట్లు మొత్తంగా రూ.1148.72 కోట్లు అదనంగా ఖర్చు అయ్యిందని ఈఆర్సీకి జెన్కో వెల్లడించింది. జెన్కో వాదనతో ఈఆర్సీ

మిగతా 12వ పేజీలో...

కడప బరిలోనే షర్మిల



- లోక్‌సభకు పోటీ ఖరారు.. ఢిల్లీలో కాంగ్రెస్ సీఈసీ భేటీ
- 5 ఎంపీ, 114 అసెంబ్లీ అభ్యర్థులకు లైన్ క్లియర్
- నేడు ఇడుపులపాయలో జాబితా ప్రకటన

11

కేజ్రీవాల్ తిహాడ్ జైలుకు



- 15 వరకూ జ్యుడీషియల్ కస్టడీ
- రామాయణం, భగవద్గీత, హౌ డూ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్ పుస్తకాలకు అనుమతి
- విచారణను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారు
- ప్రత్యేక కోర్టులో ఈడీ తరఫు న్యాయవాది ఎస్వీ రాజు
- పదవిలో ఉండి జైలుకెళ్లిన తొలి సీఎంగా కేజ్రీ రికార్డు

2

టోల్ బాదుడుకు 2 నెలల విరామం



- ఎన్నికల నేపథ్యంలో పెంపుపై కేంద్రం వాయిదా నిర్ణయం
- ఆ నష్టాన్ని ఎన్‌హెచ్ఏఐ భరిస్తుందంటూ సందేశం

2

ఇవేం పదోన్నతులు?

ప్రిన్సిపాళ్లుగా లైబ్రేరియన్లు, పీడీలా?

- విద్యాసంస్థల్లో పదోన్నతులకు సమన్యాయం, సానుభూతి ప్రామాణికం కారాదు
- లైబ్రేరియన్లకు బుక్ కంటెంట్ ఏం తెలుస్తుంది?
- సీనియారిటీ ఉందని నర్సింగ్ సూపరింటెండెంట్‌కు సర్జన్‌గా పదోన్నతి కల్పిస్తారా?
- ఐఐటీ, ఐఐఎమ్‌లు, మెడికల్ కాలేజీలకు లైబ్రేరియన్లు, పీడీలు నేతృత్వం వహిస్తున్నారా?
- పాలన కోసమైతే ఎంబీఏలను నియమించొచ్చుగా?
- టీచర్లందరినీ డిస్మిస్ చేసి ఏఐని వాడొచ్చుగా!

ప్రవీణ్ ప్రకాశ్ పై హైకోర్టు ప్రశ్నల వర్షం

- విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందని వ్యాఖ్య
- జీవోను మరోసారి లోతుగా పరిశీలించాలని సూచన



అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో పదోన్నతులకు సమన్యాయం, సానుభూతి అనేవి ప్రామాణికం కాకూడదని సోమవారం హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నం. 76పై వివరణ ఇచ్చేందుకు

మిగతా 12వ పేజీలో...

ఇదో.. 'బొమ్మల' కథ!

స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ అధికారులే.. నిర్మాత మాత్రం జనం ఖజానా

- జూన్‌లో మొదలయ్యే విద్యా సంవత్సరానికి విద్యా కానుకలో జగన్ బొమ్మలు, పేర్లు
- బ్యాగులు, బెల్టులపై ఆ పేరుతోనే లోగోలు
- నోట్ పుస్తకాలపైనా ముఖ్యమంత్రి ఫొటోలు
- ఎన్నికల వేళా బొమ్మలతోనే కిట్లు తయారీ
- వీటి కోసం వెయ్యి కోట్ల ప్రజాధనం ఖర్చు
- ఎన్నికల్లో వైసీపీ ఓడితే వీటిని ఏం చేస్తారు?
- చెరిపేందుకు వీల్లేకుండా ముద్రణ.. రాతలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇదో.. బొమ్మల కథ! సీఎం జగన్ ఫొటోలతో ఏర్చికూర్చిన అందమైన చిత్రాల కథ!! దీనికి స్క్రీన్‌ప్లే, డైరెక్షన్.. జగన్ భక్త అధికారులే. సుమారు రూ.వెయ్యి కోట్లతో రూపొందించిన ఈ బొమ్మల కథకు నిర్మాత మాత్రం ప్రభుత్వ ఖజానా! మళ్లీ వస్తుందో రాదో తెలియని వైసీపీ ప్రభుత్వం



మిగతా 12వ పేజీలో...

'మిస్ టీన్ గెలాక్సీ యూకే'గా సుహానీరావు

- టైటిల్ దక్కించుకున్న తెలుగు యువతి
- తొలి దక్షిణాసియా వాసిగా రికార్డు



2

బంగ్లాదేశ్‌లో బాయ్‌కాట్ భారత్

- భారత వస్తువుల బహిష్కరణకు ప్రతిపక్షం పిలుపు
- బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకుంటోందని ఆరోపణ
- 'బాయ్‌కాట్ భారత్' అంటే ముందు మీ భార్యల చీరలను కాల్చేయండి: హసీనా




బంగ్లాదేశ్.. భారత్ మద్దతుతో ఏర్పడిన దేశం. ఇండియాతో అత్యంత సుదీర్ఘమైన భూసరిహద్దును కలిగి ఉన్న దేశం. వాణిజ్యావసరాలకు మనపైన ఆధారపడమే కాకుండా గతంలో భారత ఉపఖండంలో భాగంగా ఉండి సాంస్కృతికంగానూ భారత్‌కు ఎంతో దగ్గరైన దేశం. అలాంటి దేశంలో ఇప్పుడు 'బాయ్‌కాట్ ఇండియా' నినాదం బయల్దేరింది. బంగ్లాదేశ్ ప్రస్తుత ప్రధాని షేక్ హసీనా జనవరిలో 5వ సారి అధికారంలోకి వచ్చాక.. సోషల్ మీడియా వేదికగా ప్రారంభమైన ఈ ఉద్యమం ఇప్పుడు ఊపందుకుంది. బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకుంటోందని, తమ సొంత ప్రయోజనాల కోసం షేక్ హసీనానే మళ్లీ ప్రధాని అయ్యేలా గత ఎన్నికల్లో అప్రజాస్వామిక చర్యలకు పాల్పడిందని ఐరోపా, అమెరికా దేశాల్లో ఉంటున్న ప్రవాస బంగ్లాదేశీలు తొలుత 'బాయ్‌కాట్ భారత్' ఉద్యమానికి పిలుపునిచ్చారు. భారత్ నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులను కొనవద్దని, వాడవద్దని బంగ్లాదేశ్ ప్రజలను కోరారు. ప్రస్తుతం పారిస్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న బంగ్లాదేశీ వైద్యుడు పినాకీ భట్టాచార్య ఈ ఆన్‌లైన్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ప్రవాసీ బంగ్లాదేశీల పిలుపునకు బంగ్లాదేశ్‌లో కొన్ని వర్గాల నుంచి మద్దతు రావడంతో ప్రతిపక్ష బీఎన్‌పీ ఈ 'బాయ్‌కాట్ భారత్' నినాదాన్ని అందిపుచ్చుకొంది. షేక్ హసీనా భారతదేశ అవసరాల కోసం పనిచేస్తున్నారని ఆరోపిస్తోంది. ఈసారి బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు అత్యంత వివాదాస్పదమైనప్పటికీ, ప్రతిపక్షాలు ఈ ఎన్నికలను బహిష్కరించినప్పటికీ.. హసీనా ప్రధాని అయిన వెంటనే భారత ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలుపడం, మద్దతు ప్రకటించడమే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించింది. అయితే, బంగ్లాదేశ్‌లో 'బాయ్‌కాట్ భారత్' ఉద్యమం జనం నుంచి పుట్టలేదని, కేవలం రాజకీయ ఎజెండానే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది సోషల్ మీడియాలోనే ట్రెండింగ్‌లో ఉంది తప్ప, వాస్తవంలో అంతగా జనాదరణ లేదన్నారు.

వాటన్నింటినీ కాల్చివేస్తారా?

'బాయ్‌కాట్ భారత్' నినాదంపై బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా అత్యంత తీవ్రంగా స్పందించారు. ఇండియా నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులను బాయ్‌కాట్ చేయాలంటే ప్రతిపక్ష బీఎన్‌పీ నేతలు ముందుగా తమ భార్యల చీరలను వారి నుంచి లాగేసుకొని కాల్చేయాలన్నారు. "బీఎన్‌పీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతల భార్యలు ఇండియాకు వెళ్లి భారీ సంఖ్యలో చీరలు కొనుక్కొని రావడం, వాటిని బంగ్లాదేశ్‌లో అమ్మడం చూశాను. వాటన్నింటినీ కాల్చివేస్తారా" అని హసీనా ప్రశ్నించారు. ఇండియా నుంచి దిగుమతి చేసుకుంటున్న మసాలాలు, ఉల్లిగడ్డం, అల్లం, వెల్లుల్లి ఇవేవీ లేకుండా ఆహారం వండుకొని తినాలన్నారు. కాగా, ఇటీవల మాల్దీవుల్లో కూడా 'ఇండియా అవుట్' ఉద్యమం జరిగిన సంగతి తెలిసిందే. గతంలో ప్రతిపక్షంలో ఉన్న ముయిజ్జు ఈ నినాదంతోనే అధికారంలోకి వచ్చారు. కాగా, రంజాన్ నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు 50వేల టన్నుల ఉల్లిగడ్డలను పంపాలని భారత ప్రభుత్వం ఇటీవలే నిర్ణయించింది.

- సెంట్రల్ డెస్క్

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
అనంతపురం	41.0	25.0
కర్నూలు	41.0	27.0
హైదరాబాద్	39.0	26.0
గుంటూరు	38.0	26.0
విజయవాడ	37.1	25.2

టోల్ బాదుడుకు 2 నెలల విరామం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: జాతీయ రహదారులపై టోల్ ఫీజు పెంపుదలను రెండు నెలలపాటు నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలోనే గతంలో ఎన్నడూలేని విధంగా పెంపుదలను నిలిపివేస్తూ జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఆదేశాలు జారీ చేసింది. గత వారమే కేంద్రం ఈ మేరకు ఎన్నికల సంఘం అనుమతిని కోరింది. ఈసీ ఆమేరకు అనుమతి ఇచ్చింది. సాధారణంగా జాతీయ రహదారులపై టోల్ ధరలు ప్రతి ఏడాది ఏప్రిల్ 1 నుంచి పెరుగుతాయి. అయితే టోల్ ఫీ పెంపుదలను రెండు నెలలపాటు నిలిపివేయాలంటూ స్థానిక ప్రాజెక్టు డైరెక్టర్లు మార్చి 30వ తేదీన మౌఖికంగా టోల్ నిర్వహణ సంస్థలను ఆదేశించారు. దీనిపై హైవే డెవలపర్స్ ఆర్గనైజేషన్, జాతీయ హైవే బిల్డర్స్ ఫెడరేషన్ ఆదివారం స్పందించాయి. 'ఎటువంటి కారణం చెప్పకుండా పెంపుదలను నిలిపివేయాలంటూ జారీ చేసిన మౌఖిక ఉత్తర్వులు గందరగోళానికి దారితీస్తాయి. స్పష్టత కోసం అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలి. పెంపుదలను రెండు నెలలపాటు నిలిపివేయడంతో వచ్చే నష్టాన్ని ఎన్‌హెచ్‌ఏఐ భర్తీ చేస్తుందంటూ ఇచ్చిన హామీని కూడా లిఖితపూర్వకంగా ఇవ్వాలి' అంటూ ఎన్‌హెచ్‌ఏఐకి ఓ లేఖ రాశాయి.

ఒక వాహనానికి ఒకటే ఫాస్ట్‌ట్యాగ్

కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఒక వాహనానికి ఒకటే ఫాస్ట్‌ట్యాగ్ అమల్లోకి వచ్చింది. ఇప్పటి వరకూ ఒక ఫాస్ట్‌ట్యాగ్‌ను అనేక వాహనాలకు వాడుతున్నారు. అలాగే ఒక వాహనానికి అనేక ట్యాగ్‌లను కూడా వాడుతున్నారు. దీని వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. టోల్‌గేట్ల వద్ద వాహనాలు సాఫీగా ముందుకు సాగాలన్న లక్ష్యంతో కేంద్రం 'ఒక వాహనం... ఒక ఫాస్ట్‌ట్యాగ్' విధానాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆ ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయి.

జాతీయ భద్రత, ఆర్థిక నేరాలపైనే సీబీఐ దృష్టిసారించాలి

- సీబీఐ ఆవిర్భావ దినోత్సవంలో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: "దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థలు కొన్నేళ్లుగా విభిన్న కేసులను దర్యాప్తు చేయాల్సి వస్తోందని, కానీ, జాతీయ భద్రత, ఆర్థిక నేరాలు, ప్రజా శ్రేయస్సుకు సంబంధించిన అంశాలపైనే అవి దృష్టి సారించాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. ఆధునిక సాంకేతికత నేరాల తీరునే మార్చేసిందని, దర్యాప్తు సంస్థలు ఇప్పుడు సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. సీబీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన డీపీ కోహ్లీ స్మారక సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. దాడులు, సోదాల సందర్భంగా వ్యక్తిగత వస్తువులను అనవసరంగా జప్తు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత హక్కులకు, విచారణ విధి విధానాలకు మధ్య సమతుల్యత పాటించాల్సిన అవసరాన్ని అటువంటి ఘటనలు తెరపైకి తెస్తున్నాయని చెప్పారు. సీబీఐ వంటి సంస్థల సోదాలు, జప్తు అధికారాలు, వ్యక్తిగత హక్కుల మధ్య పాటించాల్సిన సున్నితమైన సమతుల్యత నిష్పక్షపాత, న్యాయబద్ధ సమాజానికి మూలస్తంభంగా నిలుస్తుందని అభివర్ణించారు. న్యాయస్థానాలను క్రమబద్ధం చేయడమే కాకుండా సీబీఐ సమర్థతను పెంచడానికి కూడా ఉపకరిస్తుందని తెలిపారు. "సీబీఐ అవినీతి నిరోధక దర్యాప్తు సంస్థ. కానీ, దాని పరిధికి మించి విస్తృతమైన క్రిమినల్ కేసులను దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేయడం పెరుగుతోంది. దాని విస్తృతిని మనం పెంచేస్తున్నాం. జాతీయ భద్రత, ఆర్థిక నేరాలు వంటి వాటిపైనే అది దృష్టి సారిస్తే మంచిది" అని సూచించారు. సీబీఐలో పెద్దఎత్తున డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు ఉండడాన్ని ఆయన తప్పుబట్టారు. "దర్యాప్తు ప్రక్రియను డిజిటలైజ్ చేయడమే దీనికి మార్గం. ఎఫ్ఐఆర్ నమోదు నుంచే దీనిని ప్రారంభించాలి. కేసులు పెద్దఎత్తున పేరుకుపోతున్నాయి. విచారణలో ఆలస్యాన్ని నివారించాలంటే సాంకేతికతను అందిపుచ్చుకోవాలి" అని సూచించారు. దర్యాప్తు సంస్థల్లో సంస్థాగత సంస్కరణలు చేయాలని తెలిపారు. నేరాల తీరు ఊహాతీతంగా పెరిగిపోతోందని, వాటిని ఎదుర్కోవడానికి సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు తమ సామర్థ్యాలను పెంచుకోవాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

'మిస్ టీన్ గెలాక్సీ యూకే'గా సిద్దిపేట జిల్లా యువతి



బెజ్జంకి, ఏప్రిల్ 1: 'మిస్ టీన్ గెలాక్సీ పెజెంట్ యూకే' టైటిల్ తెలంగాణకు చెందిన సుహానీరావుకు దక్కింది. ఈ టైటిల్ గెలిచిన మొదటి దక్షిణాసియా వాసిగా ఆమె రికార్డు సృష్టించారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన బోయినపల్లి ప్రమోద్ రావు- సరిత దంపతుల కుమార్తె సుహానీరావు. వీరి కుటుంబం 14 ఏళ్ల క్రితం యూకే వెళ్లి బకింగ్‌హామ్ షేర్‌లో స్థిరపడింది. గతనెలలో యూకేలో జరిగిన 'మిస్ టీన్ గెలాక్సీ పెజెంట్ యూకే' టైటిల్ పోరులో యూకే నలుమూలల నుంచి వచ్చిన 25 మంది ఫైనలిస్టు యువతులతో పోటీపడి సుహానీరావు టైటిల్ సాధించారు. ఆగస్టులో యూఎస్‌ఏ ఫ్లోరిడాలో జరగనున్న గెలాక్సీ ఇంటర్నేషనల్ పెజెంట్‌లో యూకే తరఫున ఆమె ప్రాతినిధ్యం వహించనున్నారు. అంతర్జాతీయ మిస్ టీన్ కిరీటం కోసం ఆమె పోటీ పడనున్నారు.

కేజ్రీవాల్ తిహాడ్ జైలుకు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను సోమవారం తిహాడ్ జైలుకు తరలించారు. తద్వారా, పదవిలో ఉంటూనే అరెస్టైన, జైలుకు వెళ్లిన తొలి ముఖ్యమంత్రిగా ఆయన చరిత్రకెక్కారు! అంతకు ముందు.. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఏప్రిల్ 15వ తేదీ వరకూ జ్యుడిషియల్ కస్టడీకి పంపించాలని రౌజ్ ఎవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఆదేశాలు జారీ చేశారు. జైల్లో ఉన్న కాలంలో కేజ్రీవాల్ చదువుకునేందుకు భగవద్గీత, రామాయణంతోపాటు ప్రముఖ జర్నలిస్టు నీరజా చౌదరి రచించిన 'హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్' అన్న పుస్తకాలతోపాటు దేవుడి లాకెట్‌ను అనుమతించాల్సిందిగా ఆయన తరఫు న్యాయవాదులు కోరారు. అలాగే, కేజ్రీవాల్ మధుమేహంతో బాధ పడుతుండడం, ఇమ్యూనిటీ తక్కువగా ఉండడంతో ఆయనకు ఇంటి భోజనంతోపాటు బాటిల్ నీళ్లు తెచ్చుకోవడానికి అనుమతించారు. అలాగే, ఆయన తన భార్య సునీతను కలుసుకోవడానికి అనుమతి ఇచ్చారు. షుగర్ లెవల్స్ ఒక్కసారిగా తక్కువైతే తినడానికి టోఫీలను; రగ్గు, దుప్పట్లు, దిండ్లను కూడా అనుమతించారు. కాగా, కోర్టు లోపలికి వెళుతూ కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ చేస్తున్న పని (కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం) దేశానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు.

ఆ ఇద్దరు మంత్రులతోనే నాయర్ చర్చలు

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌ను మార్చి 21వ తేదీన అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. గత నెల 22 నుంచి 31 వరకు ఈడీ కస్టడీలో ఉన్నారు. కస్టడీ గడువు ముగియడంతో సోమవారం ఆయనను రౌజ్ ఎవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఆయనను మరో 15 రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరింది. విచారణలో కేజ్రీవాల్ ఏమాత్రం సహకరించడం లేదని ఈడీ తరఫున వాదించిన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తెలిపారు. ఆప్ తరఫున మధ్యవర్తిగా వ్యవహరించిన విజయ్ నాయర్ తన ఆదేశాలు తీసుకోలేదని, పార్టీ నేతలు, మంత్రులు అతిషీ మర్లెనా, సౌరభ్ భరద్వాజ్‌ని ఆయన కలుసుకునేవారని కేజ్రీవాల్ చెప్పినట్లు ఆయన వివరించారు. దాంతో, ఈ వాదనలకూ, ఆయనను జ్యుడిషియల్ కస్టడీలో ఉంచేందుకు సంబంధం ఏమిటని న్యాయమూర్తి కావేరీ బవేజా ప్రశ్నించారు. విచారణలో అనేక పొంతన లేని జవాబులు ఇచ్చారని, ఇంటరాగేషన్‌ను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తెలిపారు. ఆయనను ఇంకా ప్రశ్నించాల్సి ఉందని, కొద్ది రోజుల తర్వాత ఆయనను మళ్లీ ఈడీ కస్టడీకి కోరతామని చెప్పారు. నిజానికి, ఢిల్లీ మద్యం కుంభకోణం ప్రధాన రూపకర్త, కుట్రదారు కేజ్రీవాల్ మాత్రమేనని, స్కాం ద్వారా వచ్చిన రూ.45 కోట్ల నిధులను గోవాలో ఎన్నికల ప్రచారానికి ఉపయోగించారని ఈడీ తన రిమాండ్ దరఖాస్తులో కోర్టుకు తెలిపిన విషయం తెలిసిందే. ప్రభుత్వాధినేతగా, ఆప్ పార్టీ అధినేతగా మనీలాండరింగ్ నిరోధక చట్టం సెక్షన్ 70 కింద ఆయన శిక్షార్హుడని ఈడీ వాదించింది. "విజయ్ నాయర్‌తో పెద్దగా మాట్లాడలేదని కేజ్రీవాల్ చెప్పారు. కానీ, నాయర్ ఓ క్యాబినెట్ మంత్రి ఆఫీసు బంగళాలో ఉంటూ సీఎం క్యాంప్ ఆఫీసు నుంచి పని చేసేవారు. కుంభకోణంలో భాగంగా నిందితులకూ, విజయ్ నాయర్‌కూ మధ్య జరిగిన పది సమావేశాలకు సంబంధించి సాక్ష్యాలను కేజ్రీవాల్‌కు వెల్లడించాం. దినేశ్ అరోరా, అభిషేక్ బోయినపల్లి వంటి మధ్యవర్తులతో జరిగిన సంభాషణల ఆధారాలు కూడా చూపించాం. వీరందరినీ విజయ్ నాయర్ ఎందుకు కలిశారని అడిగినప్పుడు అసలు వారెవరో నాకు తెలియదని కేజ్రీవాల్ బుకాయించారు. పొంతన లేని సమాధానాలు చెప్పడం, అసలు జవాబులు చెప్పడానికి నిరాకరించడంతో మొత్తం డబ్బు ఎలా వెళ్లిందో నిర్ధారించేందుకు ఆయనను మరింత విచారించాల్సి ఉంది" అని ఈడీ వాదించింది. ఆయన పలుకుబడి కలిగిన వ్యక్తి అని, సాక్షులను ప్రభావితం చేస్తారని తెలిపింది. అందుకే ఆయనను 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పంపించాలని అభ్యర్థించింది. దీనిని న్యాయమూర్తి కావేరీ బవేజా ఆమోదించారు.

జైలు నుంచి ఆదేశాలపై నోట్ ఇవ్వండి

ఢిల్లీ మద్యం స్కాం కేసులో అరెస్టైన కేజ్రీవాల్.. కస్టడీలో ఉంటూనే పాలనకు సంబంధించిన ఆదేశాలు జారీ చేయడంపై ప్రత్యేక జడ్జికి నోట్ సమర్పించాలని ఈడీకి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కేజ్రీవాల్ ఇటువంటి ఆదేశాలు జారీ చేయకుండా నిలువరించాలంటూ దాఖలైన పిల్‌పై జడ్జి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, లోక్‌సభ ఎన్నికల వేళ కేజ్రీవాల్‌ను జైల్లో ఉంచాలనే ఏకైక లక్ష్యంతోనే బీజేపీ ఆయనను అరెస్టు చేయించిందని కేజ్రీవాల్ భార్య సునీత ఆరోపించారు. 11 రోజులపాటు కేజ్రీవాల్‌ను ప్రశ్నించారని, విచారణ పూర్తయిందని, కోర్టు ఆయనను దోషిగా తేల్చలేదని, మరి, ఆయనను ఇంకా ఎందుకు జైల్లో ఉంచుతున్నారని ప్రశ్నించారు.



జైలు నంబర్ 2లో కేజ్రీవాల్

కేజ్రీవాల్‌ను జైలు నంబర్ 2లోని ప్రత్యేక బ్యారక్‌లో ఉంచినట్లు తిహాడ్ జైలు అధికార వర్గాలు తెలిపాయి. ఈ బ్యారక్‌లో ఆయన ఒక్కరే ఉంటారని, 24 గంటల సీసీ టీవీ నిఘా ఉంటుందని వివరించాయి. కాగా, ఇక్కడి జైలు నంబర్ 1లో ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఉండగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను జైలు నంబర్ 6లో ఉంచారు. జైలు నంబర్ 2లో ఉన్న ఆప్ నేత సంజయ్ సింగ్‌ను ఐదో నంబర్ జైల్లోకి మార్చారు.

కేజ్రీవాల్ అరెస్టుకు కాంగ్రెస్సే కారణం

- దుమారం రేపుతున్న విజయన్ వ్యాఖ్యలు


కొజికోడ్, ఏప్రిల్ 1: కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ బీజేపీయేతర పార్టీల కూటమి 'ఇండియా' నేతలు ఢిల్లీలో భారీ సభ నిర్వహించి ప్రకటించుకున్న ఐక్యత 24 గంటల్లోనే బీటలు వారడం మొదలుపెట్టింది. మద్యం పాలసీ వ్యవహారంలో ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తొలుత ఫిర్యాదు చేసిందీ, ఈడీ విచారణకు కారణమైందీ కాంగ్రెస్ పార్టీయేనని కేరళ సీఎం, 'ఇండియా' లో భాగస్వామి అయిన సీపీఎం నేత పినరయి విజయన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఆప్ అని మాత్రమే కాకుండా.. రాష్ట్రాల్లోని కాంగ్రెసేతర పక్షాల పట్ల ఆ పార్టీ వైఖరి ఇలాగే ఉంటోందని తీవ్రంగా విమర్శించారు. ఎల్‌డీఎఫ్ అభ్యర్థుల తరఫున సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన విజయన్.. కేరళలోని ప్రధాన ప్రతిపక్షం యూడీఎఫ్‌కు నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. "ఎక్సైజ్ పాలసీ వ్యవహారంలో సిసోడియా అరెస్టు వేళ కేజ్రీవాల్‌పై కాంగ్రెస్ గురిపెట్టింది. ఆయన్ను ఎందుకు అరెస్టు చేయడం లేదని అప్పట్లో ప్రశ్నించింది. తన పొరపాట్లను కాంగ్రెస్ నాయకత్వం గుర్తించి తీరాలి" అని విజయన్ అన్నారు.

పీఐబీ అధినేతగా షెఫాలీ శరణ్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్‌గా ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసు సీనియర్ అధికారి షెఫాలీ శరణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవిలో ఉన్నవారు కేంద్ర ప్రభుత్వ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తారు. స్వాతంత్ర్యం తర్వాత ఈ బాధ్యతలు నిర్వహించిన అయిదవ మహిళా అధికారి షెఫాలీ శరణ్. పీఐబీలో దాదాపు మూడు దశాబ్దాలుగా ఆమె పలు మంత్రిత్వ శాఖల బాధ్యతలు నిర్వర్తించారు. లోక్‌సభ టీవీ పరిపాలనా విభాగం డైరెక్టర్‌గా కూడా పనిచేశారు.

కేంద్ర సాహిత్య అకాడమీకి సి.రాధాకృష్ణన్ రాజీనామా



మలప్పురం, ఏప్రిల్ 1: కేంద్ర సాహిత్య అకాడమీ ఉత్సవాలను కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రారంభించడాన్ని వ్యతిరేకిస్తూ అకాడమీ సభ్యుడి పదవికి మలయాళ రచయిత సి.రాధాకృష్ణన్ రాజీనామా చేశారు. ఈ మేరకు అకాడమీ కార్యదర్శికి సోమవారం ఆయన లేఖ రాశారు. అసలు సాహిత్యం గురించి ఏ అవగాహన లేని వ్యక్తితో ఉత్సవాలను ప్రారంభించమేంటని లేఖలో ఆక్షేపించారు. స్వయం ప్రతిపత్తి గల అకాడమీ చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారని.. అకాడమీ విషయాల్లో కేంద్రం జోక్యం పెరిగిపోయిందని ఆరోపించారు. తాను ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని.. అకాడమీ స్వతంత్ర ప్రతిపత్తిని దిగజార్చే రాజకీయంపైనే తన నిరసన అని పేర్కొన్నారు. ఇప్పటికైనా రచయితల ఆందోళనలను రాష్ట్రపతి లేదా ప్రధాని పట్టించుకుంటారనే ఆశతోనే రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

తమిళం నేర్చుకుంటా.. ఐరాసలో మాట్లాడుతా

ఆ ప్రాచీన భాష గొప్పదనాన్ని చాటి చెప్పాలి.. రాజకీయాల వల్లే ఆ భాష విస్తరించలేదు

- ఇంకా నయం ఇడ్లీ, దోసెలను రాజకీయం చేయలేదు: మోదీ
- తనకు ఉప్మా, పొంగల్ ఇష్టమని వ్యాఖ్య

చెన్నై, ఏప్రిల్ 1: తమిళనాడుతో తనకు అయిదు దశాబ్దాల అనుబంధం ఉందని, తమిళ భాష అంటే తనకు ఎంతో గౌరవమని ప్రధాని మోదీ అన్నారు. ఎన్నికలను పురస్కరించుకొని ఓ తమిళ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ తాను తమిళం నేర్చుకుంటానని, ఐక్య రాజ్యసమితి (ఐరాస)లో ఆ భాషలో ప్రసంగిస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఇంతవరకు తమిళ భాషకు అన్యాయం జరిగిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. "వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తమిళ భాష భారత దేశంలో ఉందన్న విషయాన్ని ప్రపంచానికి చెప్పలేకపోయాం. గర్వపడలేకపోయాం. ఈ ఘన వారసత్వాన్ని ప్రపంచమంతా చెప్పుకోవాలి" అని అన్నారు. భాషను రాజకీయం చేయడం వల్లనే తమిళం దేశమంతటా విస్తరించలేకపోయిందని మోదీ అభిప్రాయపడ్డారు. "ఇంకా నయం ఇడ్లీ, దోసెలను కూడా రాజకీయం చేయలేద"ని చమత్కరించారు. "ఒకవేళ ఇడ్లీ, దోసెలను కూడా రాజకీయం చేసి ఉంటే అవి తమిళనాడుకే పరిమితమయి ఉండేవి. ఇప్పుడు అన్ని చోట్లా ఎప్పుడంటే అప్పుడు దొరుకుతున్నాయి. తమిళ భాష ప్రపంచమంతా విస్తరించాలి. రాజకీయాల వల్ల అది ఒక ప్రాంతానికే పరిమితమయింది. ఇది తమిళ భాషకు, దేశానికి నష్టం కలిగించింది" అని అన్నారు. ఇడ్లీ, దోసెల మాదిరిగానే తమిళం కూడా ప్రపంచమంతా విస్తరించాలని ఆకాంక్షించారు. తనకు మాత్రం తమిళ వంటకాలయిన ఉప్మా, పొంగల్ అంటే ఇష్టమని చెప్పారు.



తమిళనాడుతో తనకు ఉన్న అనుబంధాన్ని మోదీ వివరించారు. ఎమర్జెన్సీ సమయంలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేయడం కోసం ఇక్కడికి వచ్చానని చెప్పారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నిర్వహించిన ఏక్తా యాత్రలో పాల్గొన్నానని తెలిపారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఈరోడ్‌లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కుమరన్ కుటుంబానికి చెందిన 90 ఏళ్ల వృద్ధ మహిళ వచ్చి తనను ఆశీర్వదించడం మరుపురాని అనుభూతి అని అన్నారు. రాష్ట్ర రాజకీయాలపై మోదీ తన అభిప్రాయాలు చెబుతూ ఎన్‌డీఏ కూటమిలో లేకపోవడం వల్ల నష్టపోయింది అన్నాడీఎంకే తప్ప బీజేపీ కాదని అన్నారు. ఈసారి ఎన్‌డీఏ కూటమికి ఓటు వేయాలని రాష్ట్ర ప్రజలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. "ఈ కూటమి సమాజంలోని వివిధ ఆర్థిక, సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలతో కూడుకున్నది. ఇదొక పూలగుచ్ఛం. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ గుచ్ఛంలో తమ సొంత పుష్పాన్ని చూసుకోవచ్చు. ఇదే మా విజయ రహస్యం" అని వ్యాఖ్యానించారు. అభివృద్ధి అంశాలపై మోదీ తన అభిప్రాయాలు చెబుతూ వికసిత్ భారత్ లక్ష్య సాధనకు తమిళనాడు చోదక శక్తిగా మారిందని ప్రశంసించారు. ఇతర చోట్ల ఘన విజయాలను సాధిస్తున్నా ఇక్కడ మాత్రం అడుగు పెట్టలేకపోతుండడంపై మోదీ సమాధానం ఇస్తూ ఎన్నికల్లో గెలవడం అన్నది తన లక్ష్యం కాదని చెప్పారు.

రాహుల్ 'మ్యాచ్ ఫిక్సింగ్' వ్యాఖ్యలపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

మోదీపై 'మ్యాచ్ ఫిక్సింగ్' వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మీద బీజేపీ ఎన్నికల కమిషన్(ఈసీ)కు ఫిర్యాదు చేసింది. తప్పుడు ఆరోపణలు చేసినందుకు ప్రధాని మోదీకి, దేశానికి రాహుల్ బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పేలా ఆదేశించాలని ఈసీని బీజేపీ కోరింది. లోక్‌సభ ఎన్నికల్లో 'మ్యాచ్ ఫిక్సింగ్' ద్వారా మోదీ గెలవాలనుకుంటున్నారని, అందులో భాగంగా ఎన్నికల కమిషనర్లు అనే అంపైర్లను మోదీ ఎంపిక చేశారని, ఎన్నికల అనంతరం రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని ఆదివారం ఓ బహిరంగ సభలో రాహుల్ వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమైనవని, రాహుల్ గాంధీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈసీకి కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం హర్దీప్, అరుణ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ పదేపదే అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మరోసారి ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్లు తెలిపారు. ఇండియా కూటమి నేతలపైనా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.


ఎన్నికల వేళ వెరీ 'హాట్'..!

- ఇటు ఎన్నికల హీటు.. అటు మండుటెండలు
- ఏప్రిల్ నుంచి జూన్ వరకు మంటలే
- మధ్య భారతం పరిసర ప్రాంతాల్లో మరింత తీవ్రత
- ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎండల తీవ్రత అధికం
- సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాలులు

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎల్‌నినో బలహీనపడుతున్నా... దాని ప్రభావం మరో మూడు నెలల వరకూ ఉంటుందన్న వాతావరణ నిపుణుల హెచ్చరికల నేపథ్యంలో జూన్ వరకూ దేశంలో అత్యంత తీవ్ర వేసవి పరిస్థితులు ఏర్పడనున్నాయి. గత నెల రెండో వారం నుంచే దేశంలో ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మార్చి చివరి వారం నుంచి దక్షిణ, మధ్య, పశ్చిమ భారతంలో పలుచోట్ల వడగాడ్పులు వీయడంతోపాటు పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీల వరకు నమోదవుతుండడంతో ప్రజలు ఠారెత్తిపోతున్నారు. మార్చిలోనే తీవ్రంగా ఉన్న ఎండలు ఏప్రిల్ నుంచి జూన్ వరకూ భరించలేనంతగా ఉండనున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. ఇంకా వడగాడ్పులు సాధారణం కంటే ఎక్కువ రోజులు వీయనున్నాయి. ప్రధానంగా మధ్య భారతం, దానికి ఆనుకుని దక్షిణ, పశ్చిమ, తూర్పున ఉన్న పలు రాష్ట్రాల్లో వేసవి అత్యంత దారుణంగా ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ సంబంధించి ఎండలు, వర్షాలపై బులెటిన్ విడుదల చేసింది. ఈశాన్య వాయవ్య భారతంలో కొన్నిప్రాంతాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. రాత్రిపూట కూడా వేడి వాతావరణం నెలకొంటుంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. మూడు నెలల వేసవి సీజన్‌లో దక్షిణ, మధ్య, తూర్పు భారతంలో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. నెలకు సగటున మూడు రోజులు వరకు వడగాడ్పులు వీస్తుంటాయని, ఈ ఏడాది మాత్రం నాలుగు నుంచి ఎనిమిది రోజులు వీయనున్నాయని అంచనా వేస్తున్నారు. గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర కర్ణాటక, ఏపీ, రాజస్థాన్, మధ్య మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లలో వడగాడ్పుల ప్రభావం అసాధారణంగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది.

ఆరోగ్యంపైనా ప్రభావం...

ఏప్రిల్ నెలకు సంబంధించి ఎండలు, వడగాడ్పులపై వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేసింది. మధ్య భారతం, దానిని ఆనుకుని దక్షిణాది రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. కాగా ఏప్రిల్‌లో దేశంలో సగటు కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వడగాడ్పుల సీజన్ ప్రధానంగా వృద్ధులు, పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరించారు. రోజుల తరబడి వడగాడ్పులు ఉండే అవకాశం ఉన్నందున వాతావరణం మరింత పొడిగా మారి, ఆరోగ్యాలపై ప్రభావం ఉంటుందన్నారు.



ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశంలో ఉష్ణోగ్రతల నమోదుకు సంబంధించి ఐఎండీ అంచనా

నేడు, రేపు మన్యంలో వడగాలులు

రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత కొనసాగినా, రానున్న రెండు రోజులు వడగాల్పులు కాస్త తగ్గనున్నాయి. అయితే మంగళ, బుధవారాల్లో మన్యం జిల్లాలో కురుపాం, సీతానగరం, పార్వతీపురం, భామిని, జియ్యమ్మవలస, సీతంపేట, కొమరాడ, వీరఘట్టం, గరుగుబిల్లి, అనకాపల్లి జిల్లా మాడుగుల మండలంలో వడగాల్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

వడగాలులతో జాగ్రత్త

- 4న ప్రకాశం బ్యారేజీ, 8న సాగర్ నుంచి మంచినీటి చెరువులకు నీటి విడుదల: సీఎస్

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎండ వేడిమి, వడగాల్పులు అధికమవుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులను, జిల్లా కలెక్టర్లను సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం అమరావతి సచివాలయం నుంచి పింఛన్ల పంపిణీతో పాటు వడగాల్పులపై తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పనులను ఉదయం 10.30 గంటలలోపు పూర్తి చేయాలని, కూలీలు పనిచేసే చోట తాగునీరు, నీడ ఉండే విధంగా చూడడంతో పాటు మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. పాఠశాలలకు ఒంటిపూట బడులు జరుగుతున్నందున విద్యాశాఖ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీనిపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ... ఉదయం 7.40 గంటల నుంచి 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని సర్క్యులర్ జారీ చేశామని వివరించారు. వేసవి దృష్ట్యా మంచినీటి చెరువులు పూర్తిగా నీటితో నింపేందుకుగాను ఈ నెల 4వ తేదీన ప్రకాశం బ్యారేజీ నుంచి ఏలూరు, బందరు, రైవస్ కాలువలకు, ఈ నెల 8న సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ.. 20 జిల్లాల్లో సమ్మర్ కంటిన్జెన్సీ ప్రణాళికను అమలు చేసేందుకు కలెక్టర్లు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

ఆస్పత్రుల ఆశలపై నీళ్లు..!

- బకాయిల విడుదలలో మళ్లీ మొండిచేయి
- మార్చి 31నాటికి 700కోట్లు ఇస్తామన్న ప్రభుత్వం
- ఒక్క రూపాయి కూడా విడుదల చేయని వైనం
- సేవలు నిలిపివేసే ఆలోచనలో నెట్‌వర్క్ ఆస్పత్రులు
- ఎస్మాపై న్యాయ నిపుణుల సలహాలు స్వీకరణ

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రాష్ట్ర ప్రభుత్వం, ట్రస్ట్ అధికారులు మరోసారి మొండిచేయి చూపించారు. మార్చి 31 నాటికి రూ.700 కోట్ల వరకూ బకాయిలు విడుదల చేస్తామన్న హామీని మరోసారి నీరుగార్చారు. ఆదివారం నాటికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు దాదాపు రూ.1400 కోట్ల బకాయిలకు గానూ గత వారంలో రూ.180 కోట్లు మాత్రమే విడుదల చేశారు. మార్చి 31నాటికి మరో రూ.700 కోట్ల వరకూ చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ ఈ హామీని నెరవేర్చలేదు. అయితే ఆయుష్మాన్ భారత్ కింద ఇవ్వాల్సిన రూ.70 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను రెండు రోజుల్లో ఆస్పత్రులకు చెల్లించే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆస్పత్రులను మభ్యపెడుతూ వస్తోంది. ఆస్పత్రులు నెల రోజులకొకసారి నోటీసులు ఇవ్వడం, దాని ఆధారంగా అధికారులు చర్చలకు పిలవడం పరిపాటిగా మారింది. చర్చల్లో భాగంగా పది రోజుల్లో, పదిహేను రోజుల్లో బకాయిలు మొత్తం విడుదల చేస్తామని అధికారులు హామీలు ఇవ్వడం, ఆ నమ్మకంతో ఆస్పత్రులు వెనక్కి తగ్గడం జరుగుతోంది. కానీ బకాయిలు మాత్రం క్లియర్ కావడం లేదు. దీంతో ఈసారి గట్టిగా పట్టుబట్టిన ఆస్పత్రుల యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయాలన్న ఆలోచనలో ఉన్నాయి. మరోవైపు ఎన్నికల కోడ్, ఎమర్జెన్సీ సేవల పేరుతో ఎస్మా ప్రయోగించే అవకాశం ఉందా..? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్పత్రుల యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ప్రభుత్వం ఒకవేళ ఎస్మా ప్రయోగిస్తే ఏం చేయాలన్న దానిపై న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నాయి. ఈ వారంలో బకాయిలు విడుదల చేయకపోతే ముందుగా ఇచ్చిన నోటీసుల ఆధారంగా సేవలు నిలుపుదల చేయాలని నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయానికి వచ్చేశాయి.



జస్టిస్ రవీంద్రబాబు దంపతులకు స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు

మల్లన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి

శ్రీశైలం, ఏప్రిల్ 1: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను హైకోర్టు జడ్జి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

అభివాదాలతోనే సరి!

రోజంతా మూగనోము పట్టిన జగన్.. మండుటెండలకు మాడిన జనం



ముదిగుబ్బ మండలం ఎన్‌ఎస్‌పీ కొట్టాల వద్ద బస్సుయాత్రలో కరువైన జనం,

- బస్సుయాత్ర దారికి అడ్డుగా ఉన్నాయని పచ్చనిచెట్ల నరికివేత.. విద్యుత్ వైర్లూ తొలగింపు
- కరెంటు లేక ఉక్కపోతతో జనం విలవిల
- కదిరిలో గంటన్నర ఆలస్యంగా ఇఫ్తార్‌కు
- వెళ్లిపోకుండా బలవంతంగా ముస్లింల కట్టడి
- కదిరి రోడ్‌షోతో 3గంటలపాటు ట్రాఫిక్ స్తంభన
- ప్రయాణికులకు నరకయాతన
- శ్రీసత్యసాయిలో ముగిసిన 'మేమంతా సిద్ధం'

పుట్టపర్తి (ఆంధ్రజ్యోతి) కదిరి, ఏప్రిల్ 1 : నమస్కారాలు, వట్టి అభివాదాలు! నోరు విప్పింది లేదు. బస్సుపై నిలబడి చేతులు ఊపారేగానీ చెప్పిన మాట ఒక్కటీ లేదు. కానీ, తన మౌనంతోనే ఆయన జనాలకు నరకం చూపించారు. బలవంతంగా తరలించిన ప్రజలు, మహిళలు మండుటెండలో నిలబడలేక అల్లాడిపోయారు. ఆయన బస్సు మార్గంలో అడ్డంగా ఉన్నాయని కొన్ని చోట్ల విద్యుత్ వైర్లు తెంపేశారు. దీంతో జనం ఉక్కపోతకు అల్లాడిపోయారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం సంజీవపురం బస కేంద్రం నుంచి సోమవారం జగన్ బస్సు యాత్ర 'మేమంతా సిద్ధం' ప్రారంభమైంది. బత్తలపల్లి, రాళ్ల అనంతపురం, ముదిగుబ్బ, ములకవేముల, పట్నం, కుటాగుళ్ల మీదుగా యాత్ర కదిరికి చేరుకుంది. కదిరిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. సోమవారం యాత్ర మొత్తం చప్పగా సాగింది. పార్టీ శ్రేణులను నిరుత్సాహపరచింది. బత్తలపల్లి, ముదిగుబ్బ, కూటగూళ్ల, కదిరిలో పార్టీ శ్రేణులకు వైసీపీ అభ్యర్థులు జే బ్రాండ్ మద్యం కిక్కు చూపించారు. నగదు పంపిణీ చేశారు. అయినా అంతంత మాత్రంగానే జనస్పందన లభించింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ పెద్దగా స్పందన కనిపించలేదు. ప్రజాసంకల్ప పాదయాత్ర సమయంలోనూ, ఆ తర్వాత సీఎం హోదాలోనూ జిల్లాలో పలుమార్లు జగన్ పర్యటించారు. అనేక హామీలు ఇచ్చారు. ఐదేళ్లు గడిచినా ఏ ఒక్కటీ నెరవేర్చింది లేదు. వీటిపై జగన్ నోరు మెదపలేదు. కొత్తగా హామీలు కూడా ఇవ్వలేదు. ఆయా నియోజకవర్గాల పరిధిలో బస్సుపైకి వైసీపీ అభ్యర్థులను ఎక్కించుకున్నా, ప్రజలకు పరిచయం చేయలేదు. ఓటు వేయాలని అభ్యర్థించలేదు. జగన్ వెంట జనం కంటే పోలీసులే ఎక్కువగా కనిపించారు.

కదిరి ఎమ్మెల్యేకు అవమానం....

కదిరి వైసీపీ ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డికి జగన్ బస్సుయాత్రకు ఆహ్వానం అందలేదని ఆయన వర్గీయులు చెబుతున్నారు. కదిరి నియోజకవర్గంలోనే బస్సుయాత్ర చేపడుతున్నా.. స్థానిక ఎమ్మెల్యేకి ఆహ్వానం లేకపోవడంపై ఆయన వర్గీయులు మండిపడుతున్నారు. ఆహ్వానం అందకపోవడంతో అవమానంగా భావించిన ఎమ్మెల్యే, సభకు దూరంగా ఉన్నట్లు తెలిసింది. కదిరి అభ్యర్థిగా ఎమ్మెల్యే సిద్దారెడ్డిని కాదని మగ్బూల్ అహ్మద్‌ను వైసీపీ అధిష్ఠానం ఎంపిక చేసింది. అప్పట్నుంచి ఎమ్మెల్యే సిద్దారెడ్డి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కదిరి పట్టణానికి సాయంత్రం ఆరు గంటలకు జగన్ చేరుకున్నారు. వేమారెడ్డి సర్కిల్ నుంచి మదనపల్లి రోడ్డులోని పీవీఆర్ గ్రాండ్ వరకూ రోడ్ షో నిర్వహించారు. అనంతరం పీవీఆర్ గ్రాండ్‌లో ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ముస్లింలు తమ ఉపవాస దీక్షలను సాయంత్రం 6.31 గంటలకు విరమించాల్సి ఉంది. కానీ సీఎం జగన్ గంటన్నర ఆలస్యంగా.. రాత్రి 8 గంటలకు ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. అంతవరకూ ఇఫ్తార్ విందుకోసం వచ్చిన ముస్లింలను ఎక్కడికీ వెళ్లనివ్వకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఉపవాస ప్రార్థనలు ముగిసినా, సీఎం జగన్ కోసం వారు అక్కడే వేచి ఉండాల్సి వచ్చింది. ఇఫ్తార్‌లో ఆయన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తనకల్లు మండలంలోని చీకటిమానుపల్లి వద్ద విడిది కేంద్రానికి వెళ్లారు. కాగా, జగన్ రాక సందర్భంగా సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు కదిరిలో వాహనాల రాకపోకలను ఆపేశారు. దీంతో ప్రజలు, ప్రయాణికులు దాదాపు మూడు గంటలపాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంబులెన్స్‌లు వెళ్లాలన్నా అరగంటకు పైగా పట్టింది.



జగన్ యాత్రకు నిరసనల సెగ

- బస్సు వెంట పరుగుపెట్టిన గోపాలమిత్రలు
- ప్లకార్డులు పట్టుకుని పెద్దపెట్టున నినాదాలు
- తమ డిమాండ్లు వినేవరకు వదలని వైనం

బస్సుయాత్రలో జగన్‌కు గోపాలమిత్రల నుంచి నిరసన సెగ తగిలింది. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గోపాలమిత్రలు రోడ్డుపైకి వచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం ఘంటాపురం క్రాస్ వద్ద బ్యానర్, ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ జగన్ బస్సుయాత్రకు అడ్డు వెళ్లారు. దీంతో పోలీసులు వారిని పక్కకు పంపించేశారు. జగన్ ముందుకు కదలడంతో బస్సు వెంట గోపాలమిత్రలు పరుగులు తీశారు. విషయాన్ని గుర్తించిన జగన్ బస్సు ఆపి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇద్దరు గోపాలమిత్ర నేతలను బస్సులోకి పిలిచారు. పార్టీ మళ్లీ అధికారంలోకి రాగానే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, కొంతదూరం వెళ్లాక దించేశారు.

పచ్చనిచెట్ల నరికివేత....

జగన్ బస్సుయాత్రకు అడ్డొస్తాయని కదిరి మున్సిపాలిటీ పరిధి కుటాగుళ్ల వద్ద పలు చెట్ల కొమ్మలు నరికేశారు. బస్సుయాత్రకు అడ్డంగా లేకున్నా ఎక్స్‌కవేటర్ పెట్టి మరీ చెట్లను కొట్టేశారు. యాత్ర కొనసాగే రహదారిలో బత్తలపల్లి, ముదిగుబ్బ మండల కేంద్రాలతోపాటు పల్లెల్లో కూడా విద్యుత్ వైర్లను తొలగించారు. దీంతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వేసవిలో ఉక్కపోతతో జనం విలవిల్లాడారు.

ట్రాఫిక్ తిప్పలు...

జగన్ వస్తున్నారంటే ఎక్కడి వాహనాలు అక్కడ ఆగిపోవాల్సిందే. అత్యవసర పరిస్థితులు, ఆపదలు ఉన్నా భరించాల్సిందే. కిలోమీటర్ల మేర ఆర్టీసీ బస్సులు భారీ వాహనాలు నిలిచిపోయినా, జనం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయినా, ప్రాణాలు పోతున్నా పట్టించుకోరు. జగన్ బస్సు యాత్ర కారణంగా కదిరి, అనంతపురం, మదనపల్లి మార్గాల్లో ప్రయాణించే వారు సోమవారం గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతపురం, కదిరి, మదనపల్లి ప్రధాన రహదారిలో బత్తలపల్లి మండలం సవజీవపురం నుంచి చీకటిమానిపల్లె దాకా వందలాది వాహనాలను గంటల తరబడి నిలిపేశారు. మండే ఎండలో చిన్నారులు, వృద్ధులు, మహిళలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతూ అసహనం వ్యక్తం చేశారు.

అనంతబాబూ.. గోబ్యాక్

- ధర్మవరంలో వైసీపీ ఎమ్మెల్సీకి నిరసన సెగ
- దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసి, దళితుల మనోభావాలు దెబ్బతీశావంటూ ఆగ్రహం
- ఎమ్మెల్సీ దండవేసిన అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 1: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం దళితవాడలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌కు దళితుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. దళితవాడలో సోమవారం రాత్రి ఆయన అంబేడ్కర్ విగ్రహానికి దండ వేయడంతో ఒక్కసారిగా దళితుల్లో ఆగ్రహం పెల్లుబుకి గోబ్యాక్ గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ ప్రతిఘటించారు. ప్రత్తిపాడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్సీ అనంతబాబు సోమవారం ధర్మవరంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలో పలు వీధుల్లో వీరు ముగ్గురూ తొలుత కలిసికట్టుగా ప్రచారం చేశారు. ముందుగా అనంతబాబు దళితవాడకు చేరుకుని అంబేడ్కర్‌కు దండ వేయడంతో వివాదం రాజుకుంది. దళితులు వెంటనే దండ వేసి వెళ్తున్న ఆయన్ను అడ్డుకున్నారు. తనవద్ద పనిచేసే దళిత యువకుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసి దళితుల మనోభావాలు దెబ్బతీశారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన్ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనంతబాబు గోబ్యాక్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేసి తమ నిరసన తెలిపారు. అనంతరం.. అనంతబాబు దండ వేయడంతో అంబేడ్కర్ విగ్రహానికి అపచారం జరిగిందంటూ.. విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

'ప్రజాశాంతి'కి ఎన్నికల గుర్తు కేటాయింపుపై ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వు

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రజాశాంతి పార్టీకి కామన్ సింబల్ కేటాయించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ ఆ పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ దాఖలు చేసిన పిటిషన్ పై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపులా వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ సోమవారం ఆదేశాలిచ్చారు. ప్రజాశాంతి పార్టీకి కామన్ సింబల్‌గా హెలికాప్టర్ గుర్తును కేటాయించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ ఆ పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పార్టీ ఇన్ పర్సన్ కేఏ పాల్ వాదనలు వినిపిస్తూ.. కామన్ సింబల్ కోరుతూ ఈ ఏడాది జనవరి 19న వినతి ఇస్తే నిర్దిష్ట ఫార్మాట్‌లో లేదని మార్చి 12న తన అప్లికేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరిందన్నారు. ఈసీఐ నిర్దేశించిన ఫార్మాట్‌లో మళ్లీ మార్చి 19న వినతిపత్రం ఇచ్చానని.. ఏదైనా ఒక కామన్ సింబల్ కేటాయించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్, న్యాయవాది శివదర్శన్ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్ వినతి కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలనలో ఉందని, ఏప్రిల్ 10లోగా దీని పై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పిటిషనర్ అప్లికేషన్ నిర్దిష్ట ఫార్మాట్‌లో ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి కామన్ సింబల్ కేటాయిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పటికే జారీ అయినందున కామన్ సింబల్ జారీ చేయడం వీలుపడదన్నారు.

'పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌పై అవగాహన

- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఈవో మీనా ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఓటర్లు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే విషయమై పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. ఈ మేరకు సోమవారం అమరావతి సచివాలయం నుంచి పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌పై.. అధికారుల బాధ్యతలు, వారు నిర్వహించాల్సిన విధుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు మీనా వివరించారు. కడప జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు రూపొందించిన ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లోని పలు అంశాలను ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి ఏప్రిల్, మే నెలల్లో తేదీల వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలను, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, పోలీసులు ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాలు కల్పించడం, అందుకు అవసరమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలను వివరించారు.



ఖాతాదారుల సమక్షంలో లక్కీడ్రా తీసున్న వేగ జ్యూయలరీ సిబ్బంది

వేగ జ్యూయలర్స్ లక్కీడ్రా విజేతలు వీరే!

విజయవాడ, ఏప్రిల్ 1 : విజయవాడ లబ్బీపేటలోని వేగ జ్యూయలర్స్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మార్చి నెలలో ఆభరణాలు కొనుగోలు చేసినవారి పేర్లతో ఆదివారం లక్కీడ్రా తీశారు. ఈ లక్కీ డ్రాలో వసంత ఆదిశేషమ్మ(విజయవాడ), ఎస్.రోహిణి, వి.వెంకటరమణ (గుంటూరు)లు డైమండ్ నెక్లెస్‌లు గెలుచుకున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా సంస్థ యజమానులు వనమా నవీన్, వనమా సుధాకర్ మాట్లాడుతూ బంగారు ఆభరణాల తయారీలో స్వచ్ఛత, మరియు నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడబోమన్నారు. అలాగే, ఏప్రిల్ నెలలో కొనుగోలు చేసే ప్రతి ఆభరణంపై గ్రాముకు రూ.250, పాత బంగారం మార్పిడిపై గ్రాముకు అదనంగా రూ.50 చొప్పున తగ్గింపు ఆఫర్‌ను ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. డైమండ్ జ్యూయలరీ క్యారెట్ రూ.54వేలకు అందిస్తామని, పోల్కీ జ్యూయలరీపై ఎలాంటి తరుగు, మజూరీ చార్జీలు ఉండవని నవీన్, సుధాకర్ తెలిపారు.

విజయవాడ కేంద్రంగా ఐఎన్ఏఐసీఎస్

- 6న ఆవిర్భావ సభ... ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సర్జన్స్ ఇండియన్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం కూడా: డాక్టర్ గుంటూరు వరుణ్



విజయవాడ(మాచవరం), ఏప్రిల్ 1: విజయవాడ కేంద్రంగా గత ఏడాది ఏర్పడిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సర్జన్స్(ఐఏఐసీఎస్) ప్రథమ వార్షికోత్సవ సభ ఈ నెల 6న నగరంలోని తాజ్ వివంతాలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి, డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ ఛైర్మన్ డాక్టర్ గుంటూరు వరుణ్ తెలిపారు. నగరంలోని వరుణ్ కార్డియాక్ సైన్సెస్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులుతో కలిసి ఆయన మాట్లాడారు. అదే వేదికపై ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సర్జన్స్(ఐఎన్ఏఐసీఎస్)ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తొలి సభలో దేశ విదేశాల నుంచి 100 నుంచి 150 మంది వరకు ప్రముఖ కార్డియాక్ సర్జన్స్ పాల్గొంటారని తెలిపారు. తాను స్థాపించిన రాధా లక్ష్మీ హార్ట్ ఫౌండేషన్ సహకారంతో, కృష్ణా విల్క్ యూనియన్ సభ్యులైన పాడి రైతులకు అందిస్తున్న ఉచిత వైద్య సేవల ముగింపు సభకూడా అదే వేదికపై జరుగుతుందని తెలిపారు.

అసోసియేషన్ ఏర్పాటు అభినందనీయం: చలసాని ఆంజనేయులు

అత్యధునాతన వైద్యాన్ని మారుమూల గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన డాక్టర్ వరుణ్ దేశ విదేశాల్లోని ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సర్జన్స్‌తో విజయవాడ వేదికగా అసోసియేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. 'మా కృష్ణా మిల్క్ యూనియన్ సభ్యులైన 1,700 మందికిపైగా పాడి రైతులకు ఇప్పటి వరకు డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ ఉచిత గుండె వైద్య పరీక్షలు చేసింది. వారిలో 940 మందికి గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. వారిలో ఇప్పటి వరకూ సుమారు 400 మందికిపైగా ఉచితంగా యాంజియో పరీక్షలు చేశారు. అవసరమైన 38 మందికి స్టంట్లు వేశారు. ఇంకా అవసరమైన వారికి బైపాస్ సర్జరీలతో పాటు అత్యంత ఖరీదైన టావీ చికిత్స కూడా ఉచితంగా చేసేందుకు ముందుకు వచ్చారు. ఇటువంటి ఆదర్శవంతమైన సేవలు ఐఏఐసీఎస్ వేదికగా దేశ వ్యాప్తంగా విస్తరించాలి' అని ఆంజనేయులు ఆకాంక్షించారు.

ఏపీ పీజీ సెట్-2024కు నోటిఫికేషన్ విడుదల

విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే అర్హత పరీక్ష ఏపీ పీజీ సెట్-2024కు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. సెట్ ఛైర్మన్, ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా కన్వీనర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు ఆధ్వర్యంలో ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అనంతరం సెట్ వివరాలను కన్వీనర్ వెల్లడించారు. పీజీ సెట్‌కు మే నాలుగో తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఓసీ అభ్యర్థులు రూ.850, బీసీ అభ్యర్థులు రూ.750, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు రూ.650 దరఖాస్తు రుసుముగా చెల్లించాలన్నారు. రూ.500 రూపాయల అపరాధ రుసుముతో మే ఐదు నుంచి మే 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వేయి రూపాయల అపరాధ రుసుముతో మే 16 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. మే 27, 28 తేదీల్లో అభ్యర్థులు తమ దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సరిచేసుకునే అవకాశం కల్పిస్తున్నట్టు వెల్లడించారు. మే 31వ తేదీ నుంచి వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు తమ హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని ఆయన వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 10 నుంచి 14వ తేదీ వరకు ఏపీపీజీ సెట్-2024 నిర్వహించనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు ఏపీపీజీసెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కన్వీనర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ఓఎస్‌డీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వివేకం సినిమా ప్రదర్శనను ఆపండి

- హైకోర్టులో వివేకా హత్య కేసు నిందితుడు దస్తగిరి వ్యాజ్యం

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి బయోపిక్‌గా చెబుతున్న 'వివేకం' సినిమాను యూట్యూబ్, ఓటీటీలలో ప్రదర్శించకుండా నిలుపుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వివేకా హత్య కేసు నిందితుడు షేక్ దస్తగిరి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను సీబీఐ, పులివెందుల కోర్టులో ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఆ సినిమా తీశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తనను అభాసుపాలు చేసేలా సినిమాలో తన పేరు వాడారని, తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున ఆ సినిమా ప్రదర్శనను నిలుపుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్ మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఎదుట విచారణకు రానుంది.

కన్నెర్రచేసిన కాంట్రాక్టర్లు

హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం... సెక్షన్‌కు తాళాలు

- 9 నెలలుగా పెండింగ్‌లో రెండు కోట్ల బిల్లులు
- స్థానిక అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆగ్రహం
- సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశాం: కమిషనర్




హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో ధ్వంసమైన ఫర్నిచర్, పగిలిన అద్దాలు

హిందూపురం, ఏప్రిల్ 1: తొమ్మిది నెలల క్రితమే పనులు పూర్తి చేసినా బిల్లులు రాకపోవడంతో కడుపుమండిన కాంట్రాక్టర్లు కన్నెర్ర చేశారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపాలిటీ కార్యాలయంలో ఫర్నిచర్‌ను సోమవారం ధ్వంసం చేశారు. పట్టణంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను తొమ్మిది నెలల క్రితం పూర్తి చేశారు. వీటికి సంబంధించి కాంట్రాక్టర్లకు రూ.2 కోట్లకు పైగా బిల్లులు రావాల్సి ఉంది. ప్రీ ఆడిట్ పేరిట అకౌంట్ సెక్షన్ అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేయకుండా నిర్లక్ష్యం వహించారని, దీంతో తమకు బిల్లులు అందకుండా పోయాయంటూ కాంట్రాక్టర్లు ఆరోపిస్తూ అధికారులతో వాదనకు దిగారు. 'ఈ ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రావని చెప్పాం. అయినా మాతో బలవంతంగా పనులు చేయించారు. బిల్లులు అడిగితే ఎన్నికల విధుల్లో ఉన్నాం అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. మార్చి 30లోగా బిల్లులు అప్‌లోడ్ చేసి ఉంటే మాకు డబ్బులు వచ్చేవి. ఇప్పుడు సీఎఫ్ఎంఎస్ సైట్‌ను ఆర్థిక శాఖ అధికారులు మూసేశారు. వడ్డీకి అప్పులు తెచ్చి పనులు చేశాం. ఇప్పుడు మా పరిస్థితి ఏమిటి..?' అని కార్యాలయం అకౌంట్స్ సెక్షన్ అధికారులను నిలదీశారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో తీవ్ర అసహనానికి గురైన కాంట్రాక్టర్లు... ఉద్యోగులందరినీ బయటకు పంపేశారు. ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేశారు. ఆ సెక్షన్ గదికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 'బిల్లులు అందకపోతే తీవ్రంగా నష్టపోతామని అధికారుల కాళ్లు పట్టుకున్నాం. అయినా స్పందించలేదు. మిగిలిన ప్రాంతాల్లో అందరికీ బిల్లులు మంజూరయ్యాయి. ఒక్క హిందూపురంలో మాత్రమే అధికారుల నిర్లక్ష్యంతో బిల్లులు అందలేదు. వారికి జీతాలు రాకుంటే ధర్నాలు చేస్తారు. అప్పులు తెచ్చి పనులు చేసిన మా గురించి మాత్రం పట్టించుకోరు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 15 మంది కాంట్రాక్టర్లు ఉన్నాం. ఎన్నికల కమిషన్ మాకు మినహాయింపు ఇచ్చి బిల్లులు అందేలా చూడాలి' అని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ, 'బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశాం. ప్రీ ఆడిట్ మా పరిధిలో ఉండదు. అది ప్రభుత్వ ఆధీనంలో ఉంటుంది. వారు చేసిన తప్పిదాలకు కాంట్రాక్టర్లు మా కార్యాలయంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడం సరికాదు' అని అన్నారు.

జగన్.. వెర్రికుక్క!

- చిన్నాన్నను చంపిన వారిని పక్కన పెట్టుకుని దేవుడికి తెలుసని చెప్పడం సిగ్గుచేటు: ఆదినారాయణరెడ్డి



జమ్మలమడుగు, ఏప్రిల్ 1: "రాష్ట్రంలో సీఎం జగన్ ఓ వెర్రికుక్క" అని మాజీ మంత్రి, జమ్మలమడుగు బీజేపీ అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి విమర్శించారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ రూ.11 లక్షల కోట్లు అప్పు చేసి ఎక్కడ దాచారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కరెంటు చార్జీలు సహా అన్ని వస్తువుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని అన్నారు. "ఎక్కడ చూసినా నేను బటన్ నొక్కినా అని జగన్ అంటున్నాడు. బటన్ నొక్కడం పేరుతో తాను వెన్నతిని.. ప్రజలకు నీళ్ల కలిపిన మజ్జిగ ఇచ్చాడు. అభివృద్ధి చేయకపోగా రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాడు. జగన్ చేసిన అప్పులు, చేసిన ఖర్చుకు ప్రజలకు లెక్కలు చెప్పాలి." అన్నారు. ప్రొద్దుటూరు 'సిద్ధం' సభలో జగన్.. ఎంపీ అవినాశ్‌రెడ్డిని పక్కన పెట్టుకుని వివేకాను చంపింది ఎవరో ఆ దేవుడికే తెలుసని చెప్పడం సిగ్గుచేటన్నారు.

ప్రజా సమస్యలపై గళం విప్పేందుకే యునైటెడ్ ఫ్రంట్: లక్ష్మీనారాయణ

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 1: చట్టసభల్లో ప్రజా సమస్యలపై గళం వినిపించేందుకే ఎనిమిది పార్టీలు కలిసి ఏపీ యునైటెడ్ ఫ్రంట్‌గా ఏర్పడ్డాయని ఫ్రంట్ కన్వీనరు, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకు రాజకీయాలు దిగజారిపోవడంతో ప్రజా సమస్యలు మరుగున పడుతున్నాయని, ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ, టీడీపీ ప్రభుత్వాలు ఏపీకి ప్రత్యేక హోదా తీసుకురాలేకపోయాయని విమర్శించారు.

ఏపీకి ఐదు టీఎంసీల జలాలు ఇవ్వండి

- కేఆర్ఎంబీని కోరిన జల వనరుల శాఖ

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలను కేటాయింపుల కంటే తక్కువగా వినియోగించినందున ఏపీకి రావాల్సిన వాటా మేరకు ఐదు టీఎంసీల కృష్ణా జలాలను నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా విడుదల చేయాలని కేఆర్ఎంబీని రాష్ట్ర జల వనరుల శాఖ కోరింది. ఈమేరకు కేఆర్ఎంబీ చైర్మన్‌కు రాష్ట్ర జల వనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ సి.నారాయణరెడ్డి సోమవారం లేఖ రాశారు. ఈనెల 8 నుంచి రోజుకు 5500 క్యూసెక్కుల చొప్పు న విడుదల చేయాలని కేఆర్ఎంబీని ఏపీ అభ్యర్థించింది. 2023 అక్టోబరు ఒకటో తేదీ నుంచి 2024 ఏప్రిల్ ఒకటో తేదీదాకా శ్రీశైలం జలాశయం నుంచి ఏపీ 26.98 టీఎంసీలు, తెలంగాణ 17.60 టీఎంసీలు వినియోగించాయని వె ల్లడించింది. నాగార్జునసాగర్ నుంచి ఏపీ 15.477 టీఎంసీలు, తె లంగాణ 24.791 టీఎంసీలు.. మొ త్తంగా ఏపీ 42.457 టీఎంసీలు, తెలంగాణ 42.391 టీఎంసీ లు వినియోగించాయని ఏపీ వెల్లడించింది. కేటాయించిన 45 టీఎంసీల కంటే ఏపీ తక్కువగా వినియోగిస్తే, తెలంగాణ మాత్రం కే టాంపులు 35 టీఎంసీల కంటే 7.391 టీఎంసీలను అధికంగా 42.391 టీఎంసీలు వినియోగించిందని కేఆర్ఎంబీకి ఏపీ వివరించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సభ-సందేశం

లోక్‌సభ ఎన్నికలు వేగంగా సమీపిస్తున్న తరుణంలో, ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో ఆదివారం 'ఇండియా' కూటమి తన బలప్రదర్శన నిర్వహించింది. బీజేపీని ఓడించి దేశాన్ని గెలిపించాలని ప్రజలకు ఈ ప్రజాస్వామ్య పరిరక్షణ సభ పిలుపునిచ్చింది. మోదీ నియంతృత్వపాలన అంతం కానిదే ఈ దేశంలో ప్రజాస్వామ్యం మనుగడసాధించలేదని అంటూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ఐక్య పోరాటానికి సిద్ధమైంది. క్రికెట్ తరహాలో మోదీ మ్యాచ్‌ఫిక్సింగ్ చేయబట్టే ఇన్నేసి స్థానాలు గెలుస్తున్నారని లేకుంటే బీజేపీకి 180సీట్లుకూడా దాటవని రాహుల్ లెక్కవేశారు. జేబులో కొందరు బిలియనీర్లను పెట్టుకొని, ఐటీ, సీబీఐ, ఈడీ ఇత్యాది కేంద్రప్రభుత్వ సంస్థలను విపక్షనేతలమీద ఆయుధాలుగా వాడుతూ, మీడియాను నియంత్రిస్తూ, ఈవీఎంలను వాడుతూ అధికారంలో కొనసాగుతున్నారే తప్ప మోదీకి నిజంగా అంతటి ప్రజామోదం లేదన్నది సారాంశం. రామ్‌లీలామైదానంలో విపక్షనేతలు రాముడిని కూడా తలుచుకున్నారు. అధికారం, అపార వనరులు అండగా ఉన్న రావణుడిని యుద్ధంలో అవేమీలేని రాముడు ఓడించినట్టుగా, మోదీ నాయకత్వంలోని బీజేపీని గద్దెదించాలన్నారు. విపక్షపార్టీలకు చెందిన ఇద్దరు ముఖ్యమంత్రుల అరెస్టులు పదిహేడు పార్టీల ఈ ర్యాలీ ఊహించినకంటే బలంగా జరగడానికి ఓ కారణం కావచ్చు. హేమంత్ సొరేన్, అరవింద్ కేజ్రీవాల్ అరెస్టులకు వ్యతిరేకంగా మాత్రమే ఈ సభ జరుగుతున్నట్టుగా కనిపించకూడదని, ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇండియా కూటమి కట్టుబడినట్టుగా సందేశం ఉండాలని కాంగ్రెస్ చెప్పిన హితవు మేరకు, కటకటాల్లో ఉన్న కేజ్రీవాల్ కటౌట్లను తీసివేయడం సహా ఆమ్ ఆద్మీ పార్టీ ఈ సభా నిర్వహణలో చాలా ప్రజాస్వామికంగా వ్యవహరించిందట.

ఇండియా కూటమికి పునాదులు పడి దాదాపు తొమ్మిదినెలలు అవుతున్నది. మార్చి 17న ముంబైలో జరిగిన సభకు విపక్షనేతలు అనేకమంది హాజరైనప్పటికీ, అది ప్రధానంగా రాహుల్ న్యాయ యాత్రతో ముడిపడిన వ్యవహారంగా ప్రజలకు కనిపించింది. ఇప్పటి సదస్సులో కూటమిలోని అన్ని పార్టీల ప్రాతినిధ్యమూ ఉన్నట్టే. మమతాబెనర్జీ స్వయంగా రాకపోయినప్పటికీ, ఆమె సందేశాన్ని ఆ పార్టీ ప్రతినిధి చదివి వినిపించారు. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌తోనూ, వామపక్షాలతోనూ సీట్ల సర్దుబాటుకు ససేమిరా అంటున్న తృణమూల్ పార్టీ ఈ సదస్సు ద్వారా తాను ఇప్పటికే, ఎప్పటికీ కూటమిలో భాగస్వామినేనంటూ ప్రకటించడం ఓ విచిత్రం, విశేషం. జైళ్ళలో ఉన్న కేజ్రీవాల్, హేమంత్ సొరేన్ తరఫున వారి భార్యలు ఈ ర్యాలీలో పాల్గొని, తమ తమ పార్టీల అజెండాలకు అనుగుణంగా సందేశాలు, ఎన్నికల హామీలు ఇవ్వడం అటుంచితే, ముందువరుసలో రెండు ఖాళీ కుర్చీలు ఉంచడం ద్వారా ఈ సభ తన నిరసనను సైతం ప్రకటించింది. మోదీ నిరంకుశ విధానాల కారణంగా ఇద్దరు ముఖ్యమంత్రులు ఎన్నికల వేళ ప్రజలకు దూరంగా ఉండిపోవాల్సి వచ్చిందని చెప్పేందుకు ఇది ఉపకరిస్తుంది.

పదేళ్ళుగా అధికారంలో ఉన్నపార్టీ నిజానికి ఈపాటికే అవినీతి విషయంలో ఆత్మరక్షణలో పడాలి. కానీ, మోదీ ప్రభుత్వం ఇందుకు భిన్నంగా అవినీతిని ఎన్నికల ఆయుధంగా మార్చుకొని విపక్షనేతలమీద కేసులు పెడుతోంది, వారిని జైళ్ళలోకి నెడుతోంది, అందుకు తన అధీనంలో ఉన్న సంస్థలను వాడుతోంది. పదేళ్ళుగా అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ, విపక్షపార్టీలు ఇంకా ఆత్మరక్షణలోనే ఉంటూ అవినీతి ఆరోపణలను ఖండించాల్సివస్తున్నది. సభలో కూటమి నేతలు అధికారపక్షంమీద చేసిన రాజకీయ విమర్శలను అటుంచితే, దాదాపు నేతలందరూ ప్రజల దైనందిన జీవితాలకు ఉపకరించే చాలా అంశాలను ప్రస్తావించారు, నిర్దిష్టమైన హామీలు కూడా ఇచ్చారు. ఉపాధిలేమి, రైతులకు కనీస మద్దతుధర, ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు ఇత్యాదివి ప్రస్తావనకు రావడం, కూటమి ఉమ్మడి ఎజెండాగా కనిపించడం బాగుంది. ఢిల్లీ పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినప్పటికీ, పరిమితులు విధించినప్పటికీ, ర్యాలీలో ప్రజలు లక్షలాదిగా పాల్గొన్నారని విపక్షనేతలు సంతోషిస్తున్నారు. ర్యాలీ విజయవంతమైనప్పటికీ, కొన్ని చోట్ల సీట్ల సర్దుబాటు సహా చాలా అంశాలను ఇండియా కూటమి ఇంకా పరిష్కరించుకోవాల్సి ఉంది. ఖర్గే హెచ్చరించినట్టుగా, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, విభేదాలన్నింటినీ పక్కనబెట్టి కలసికట్టుగా కదులుతున్నట్టు కనిపించడం ఎంతో ముఖ్యం.

మోదీకే అన్ని వర్గాల మద్దతు!

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దేశ పాలనా బాధ్యతలు చేపట్టి మరో నెలకు పదేళ్లు పూర్తి అవుతుంది. ఈ పదేళ్లలో ఆయన ఎన్నో ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. కాని ఏ వ్యక్తి పాలన గురించి అయినా సమగ్రంగా అన్ని కోణాలతో సమీక్షించిన తర్వాతే సరైన విధంగా అంచనాకు రావడం సరైంది. ఈ దృష్ట్యా చూస్తే అత్యధిక ప్రజలు మోదీ నాయకత్వం కొనసాగడం వల్లే భారతదేశం పటిష్టంగా మారుతుందని, అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట ఇనుమడిస్తుందని, తమ జీవితాలు బాగుపడతాయని భావిస్తున్నారు.

సాధారణంగా చదువుకున్నవారు, దేశ సంపదను పెంచేవారు ఆ దేశ ప్రభుత్వ విధానాలను విమర్శిస్తారు. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మోదీ నాయకత్వాన్ని ఈ దేశంలో విద్యావంతులు, మధ్యతరగతి, సంపన్న వర్గాలు కూడా సమర్థిస్తున్నారు. 'వై ఇండియాస్ ఎలైట్స్ బ్యాక్ నరేంద్ర మోదీ' అన్న శీర్షికతో తాజాగా బ్రిటన్‌కు చెందిన అంతర్జాతీయ పత్రిక ద ఎకనమిస్ట్‌లో ప్రచురించిన ఒక వ్యాసంలో మోదీ ప్రజాదరణలో ప్రపంచ దేశాధినేతలందరిలోనూ విభిన్నమైన వ్యక్తి అని ఈ పత్రిక తెలిపింది.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

సబ్ కాసాథ్, సబ్ కా వికాస్ అన్న నినాదంతో పరిపాలన ప్రారంభించిన మోదీ ఇవాళ మహిళలు, రైతులు, యువకులు, పేదలు అని నాలుగు వర్గాలుగా సమాజాన్ని విభజించి వారికి ప్రయోజనాలు నిర్దిష్టంగా చేరేలా కృషి చేస్తున్నారు. దేశ ఆర్థిక విధానాలు సంపన్నుల నుంచి సామాన్యుల వరకూ అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధి, ఆర్థిక పటిష్టతే ప్రధాన లక్ష్యాలుగా ఒక సమతుల్య దృక్పథంతో పనిచేస్తున్నారు.

నిజానికి ప్రపంచంలోని చాలా దేశాల్లో ప్రజాదరణ గల నేతల్ని అక్కడి ఉన్నత స్థాయి వర్గం వ్యతిరేకిస్తుంది. అమెరికాలో ట్రంప్ కూడా ఈ పరిస్థితి ఎదుర్కొన్నారు. విద్యావంతుల్లో కేవలం 26 శాతం మంది మాత్రమే ట్రంప్‌కు మద్దతిచ్చారు. సామాన్య జనంలో 50శాతం ఆయనకు మద్దతు పలికారు. కాని మోదీకి విద్యావంతుల్లో 80శాతం, ప్రాథమిక విద్యా స్థాయిని కూడా దాటని సామాన్యుల్లో 66 శాతం మద్దతు ఉన్నదని గ్యాలప్ సర్వేలో వెల్లడైంది. 'వివిధ దేశాల్లో నేతలు రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. కాని భారత్‌లో మోదీకి ఆ పరిస్థితి లేదు. అందుకే మూడోసారి తిరుగులేని విజయం సాధిస్తున్న మోదీని అత్యంత శక్తివంతుడైన నేతగా అభివర్ణించవచ్చు' అని ఎకనామిస్ట్ అభిప్రాయపడింది. 'ఉన్నత స్థాయి వర్గాల మద్దతు పొందే క్రమంలో ఆయనేమీ సామాన్యుల మద్దతును కోల్పోలేదు' అని వివరించింది. 2019 ఎన్నికల్లో డిగ్రీ చదువుకున్న వారిలో 42 శాతం మోదీకే ఓటువేశారని లోక్‌నీతి – సిఎస్‌డిఎస్ సర్వే కూడా వివరించింది.



మోదీ హయాంలో ఒక సమైక్య జాతీయవాద శక్తిగా భారతదేశం రూపొందిందని, తమ నమ్మకాలకు, విశ్వాసాలకు సరైన విలువ దక్కిందని భారతీయులంతా భావిస్తున్నారు. ఇక మోదీ సారథ్యంలో బీజేపీ మూడోసారి అప్రతిహతంగా అధికారంలోకి రావడానికి ప్రతిబంధకాలేమున్నాయి?

ఆర్థిక వ్యవస్థే మోదీకి ఉన్నత వర్గాల్లో ఆదరణ పెరగడానికి ప్రధాన కారణం అని ద ఎకనామిస్ట్ పత్రిక పేర్కొంది. మోదీ హయాంలో భారత్ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు అంతర్జాతీయంగా తన ప్రత్యేకతను, విశిష్టతను నిరూపించుకోవడంలో మోదీ విజయం సాధించారు. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా భారతీయులందరూ భారత్ ఆర్థిక వ్యవస్థ చైనాను ఢీకొనాలంటే మోదీ లాంటి నాయకుడు అవసరమని భావిస్తున్నారు. అంతేగాక, మోదీ లాంటి బలమైన నేత ఎవరూ ప్రతిపక్షాల్లో కనుచూపుమేర కనపడడం లేదు. ఒక విశ్వసనీయ ప్రతిపక్ష పార్టీ అవతరించేంతవరకూ మోదీ ప్రాబల్యానికి ఢోకా లేదని ద ఎకనమిస్ట్ ప్రతినిధులతో పాటు ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు.

అమెరికాకు చెందిన న్యూయార్క్ టైమ్స్ కూడా మోదీ హయాంలో భారత దేశం ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మారిందని, ఎన్ని సంక్షోభాలు వచ్చినా భారతదేశ అభివృద్ధి వేగం తగ్గకుండా ఆయన చూశారని తాజా సంచికలో ప్రశంసించింది. మోదీ పాలనలో కోట్లాది మంది భారతీయుల జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మోదీ మూడోసారి అఖండ విజయం తప్పక సాధిస్తారని చెప్పేందుకు భారతీయ స్టాక్ మార్కెట్ ఆయన అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ మూడు రెట్లు అభివృద్ధి చెందడమే నిదర్శనమని తెలిపింది.

ఎక్కడైతే గ్రామీణ సంక్షోభం, పేదరికం ఉన్నదో అక్కడ మోదీ ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిస్థితి మెరుగుపరుస్తున్నదని ఈ పత్రిక తెలిపింది. ఉచిత ఆహార ధాన్యాలు, శౌచాలయాలు, గ్యాస్ సిలిండర్లు, గృహనిర్మాణం, ఎల్ఇడి విద్యుద్దీపాలు, ప్రతి ఒక్కరి చేతుల్లో స్మార్ట్ ఫోన్లు, దాదాపు ఉచితంగా మొబైల్ డాటా లభ్యం కావడం ఇవన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇవాళ గ్రామీణ జీవితమే మారిపోయింది. భారతదేశంలో వినియోగదారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, 2027 నాటికి ఇండియా ప్రపంచంలో అతి పెద్ద వినియోగ మార్కెట్‌గా అవతరిస్తుందని సిఎన్‌బిసి ఒక వార్తాకథనంలో పేర్కొంది. గ్రామాలకు, పట్టణాలకూ మధ్య వ్యత్యాసాలు తగ్గిపోవడం వల్ల వినియోగదారులు పెరిగిపోతున్నారని, మార్కెట్ గ్రామాలకు కూడా విస్తరిస్తోందని తెలిపింది. దేశంలో అత్యధికంగా ఉన్న యువ జనాభా కూడా వినియోగదారులు పెరిగేందుకు కారణమని, యువత ఎలెక్ట్రానిక్స్‌తో సహా వివిధ పరికరాలను కొనుగోలు చేస్తున్నారని తెలిపింది. బ్యాంకింగ్, వ్యాపార వ్యవహారాల్లో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడం, మొబైల్, ఆధార్, బ్యాంకు ఖాతాలను సాఫ్ట్‌వేర్ ప్లాట్ ఫారమ్‌లలో విలీనం చేసి ఆర్థిక లావాదేవీలను సులభతరం చేయడం, జీఎస్టీని ప్రవేశపెట్టి పన్నుల వ్యవస్థను ప్రక్షాళనం చేయడం, కార్పొరేట్ పన్నులను తగ్గించి ఆ రంగానికి భారతదేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించడం, ఆత్మనిర్భర్ భారత్ ద్వారా స్వదేశీ పరిశ్రమను ప్రోత్సహించడం, బ్యాంకు రుణాల ద్వారా స్వయం ఉపాధికి చేయూతనివ్వడం ఇవన్నీ భారతదేశ ఆర్థిక పురోగతి ప్రయాణంలో మనకు కనిపిస్తాయి.

మోదీ ఈ ఎన్నికల్లో విజయం సాధించకపోతే భారతీయ మార్కెట్‌లు 25 శాతం మేరకు పడిపోతాయని ఆసియాలో అతిపెద్ద మార్కెట్ వ్యూహకర్తల్లో ఒకటైన క్రిస్‌వుడ్ ఆందోళన వ్యక్తంచేసింది. కాని మోదీ ఆ పరిస్థితి రానివ్వరని, ప్రజల్లోనే కాక, అధికారంలో అన్నిస్థాయిల్లో మోదీ పట్టు బలంగా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ హయాంలో భారత ప్రభుత్వం పరిపాలనాపరంగా విఫలమైతే మోదీ హయాంలో ఆర్థిక వ్యవస్థతో పాటు పరిపాలనా వ్యవస్థలను కూడా నియంత్రణలో ఉంచుకోవడం ఇందుకు కారణం.

ఇవాళ భారతదేశంలో మోదీ విశ్వరూపం తప్ప మరేమీ కనపడడం లేదు. జీ–20 సమావేశాలు మాత్రమే కాదు, దేశంలో ఏ సానుకూల పరిణామం జరిగినా అందుకు మోదీయే కారణం అని ప్రజలు విశ్వసిస్తున్నారు. తమకు సంక్షేమ పథకాలు ఎలాంటి మధ్య దళారీలు లేకుండా చేరుతున్నాయని సామాన్యులు భావిస్తుంటే, సంపద పెంచేందుకు తమకు అవకాశం కల్పిస్తున్నారని పారిశ్రామికవేత్తలు గ్రహించారు. మోదీ హయాంలో ఒక సమైక్య జాతీయ వాద శక్తిగా భారతదేశం రూపొందిందని, తమ నమ్మకాలకు, విశ్వాసాలకు సరైన విలువ దక్కిందని భారతీయులంతా భావిస్తున్నారు. ఇక మోదీ సారథ్యంలో బీజేపీ మూడోసారి అప్రతిహతంగా అధికారంలోకి రావడానికి ప్రతిబంధకాలేమున్నాయి?

అసలు సమస్య ఆశ్రిత గుజరాతీవాదం!

ఆధునిక భారతదేశ రాజకీయ పరిణామాలకు పునాది 1857. బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య ప్రథమ పోరాటం సాగిన సంవత్సరమది. ఆ పోరాటం విజయవంతం కాకపోయినప్పటికీ, సామాజిక రంగంలో అదొక కొత్త సమీకరణల్ని ముందుకు తీసుకుని వచ్చింది. బ్రిటీష్ వలస వ్యతిరేక పోరాట కాలంలో హిందూ ముస్లింల మధ్య ప్రగాఢ ఐక్యత ఏర్పడింది. ప్రాదేశిక జాతీయవాదం (Territorial Nationalism) అనే భావన బలంగా ముందుకు వచ్చింది. భారతదేశ సరిహద్దుల లోపల నివసించేవారందరూ ఒకే జాతి అనేది దీని సారాంశం. దాని పేరు భారతజాతి / హిందూజాతి.

హిందూ ముస్లిం సమూహాలు భారీ సంఖ్యలో ఢిల్లీ ఎర్రకోట ముందు నిలబడి, 80 యేళ్ళు దాటిన వృద్ధ చక్రవర్తి రెండవ బహదూర్ షా జాఫర్‌ను స్వాతంత్ర్య ఉద్యమంలో తమకు నాయకత్వం వహించమని ముక్తకంఠంతో కోరడం ఒక గొప్ప చారిత్రాత్మక ఘట్టం. ప్రజల కోరిక మేరకు జాఫర్ ఆ తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. అందుకు శిక్షగా రంగూన్‌లో హౌస్ అరెస్టులో ఉండి 1962లో చనిపోయాడు. ఆ తరువాత ఆరంభమైన జాతీయోద్యమం భారత స్వాతంత్ర్య ప్రథ పోరాటం నుంచి 'ప్రాదేశిక జాతీయవాదం'ను ఆదర్శంగా స్వీకరించింది.

గతంలో ఎవరు ఎక్కడ నివాసం వున్నా ప్రస్తుతం భారతదేశంలో విలీనమై నివసిస్తున్నారు కనుక వీరందరూ భారతీయులే అనేది ప్రాదేశిక జాతీయవాదం అవగాహన. ఉర్దూ మహాకవి ముహమ్మద్ అల్లమా ఇక్బాల్ 1904లో 'సారే జహాఁ సే అచ్చా హిందూసితా హమారా' (ప్రపంచంలో మహోన్నతమైనది మన హిందూదేశము) అనే పల్లవితో సుప్రసిద్ధ జాతీయ గీతాన్ని రాశారు. అందులోని ఒక చరణంలో 'మనం హిందువులం మనది హిందూదేశము' (హిందూ హై హమ్ – వతన్ హై హిందూస్తాన్ హమారా) అంటారు. ఇందులోని హిందూ, హిందూస్తాన్ వగయిరా పదాల్ని ప్రాదేశిక జాతీయవాద దృక్పథంతో రాశారు. ఇప్పుడు హిందూమతంగా ప్రచారంలో వున్నది అప్పట్లో సనాతనధర్మం పేరుతో వుండేది. హిందూ పదం జాతి పేరుగా వుండేది. ప్రాదేశిక జాతీయవాదం ప్రకారం దేశంలోని ముస్లింలు, క్రైస్తవులు అందరూ హిందువులే!

వినాయక్ దామోదర్ సావర్కర్ 1922లో 'హిందూత్వ ఆవశ్యకతలు' పేరుతో ఒక సిద్ధాంత గ్రంథాన్ని రాశారు. దీన్ని 1923లో 'హిందూత్వ – హిందువు అంటే ఎవరు?' అనే పేరుతో ప్రచురించారు. సావర్కర్ పుస్తకానికి రెండు ప్రత్యేకతలున్నాయి. మొదటిది: హిందూ పదానికి ప్రాదేశిక అర్థాన్ని తొలగించి మతపరమైన అర్థాన్ని ఇచ్చారు. రెండోది: హిందూమత సమూహపు రాజకీయార్థిక సాంస్కృతిక ఆధిపత్యాన్ని సూచించడానికి 'హిందూత్వ' అనే కొత్త పదాన్ని ప్రయోగించారు. ఆ పదం సావర్కర్ స్వీయసృష్టి. అక్కడి నుండి మన రాజకీయాల్లో సాంస్కృతిక జాతీయవాదం (Cultural Nationalism) ప్రవేశించింది. హిందూమత ప్రాతిపదికగా జాతి నిర్మాణం దీని లక్ష్యం. అంచేత దీన్ని హిందూ జాతీయవాదం అనవచ్చు.



ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టుల్ని సామాజికంగా వెలివేస్తున్నాం, ఆర్థికంగా అణచివేస్తున్నాం, రాజకీయంగా దూరంగా పెడుతున్నాం అని చెప్పడం ద్వారా కరడుగట్టిన హిందూత్వవాదుల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు సంఘపరివారం చేస్తున్నది. అయోధ్యలో రామాలయ నిర్మాణం ద్వారా సామరస్య హిందువులని సంతృప్తిపరచే ప్రయత్నం చేస్తున్నది. ఇలాంటి ముసుగులు ఎన్ని కప్పినా కేంద్ర ప్రభుత్వ గుజరాతీ పక్షపాతం అందరికీ స్పష్టంగానే కనిపిస్తున్నది. జాగ్రత్తగా గమనిస్తే ఉత్తర – దక్షిణ వివాదంకన్నా, గుజరాతీ వ్యతిరేక వివాదం వేగంగా రగులుకుంటున్నది.

వి.డి. సావర్కర్ ప్రతిపాదించిన ద్విజాతి సిద్ధాంతం, హిందూ జాతీయవాదం ప్రేరణతో హిందువులకు రాజ్యాధికారాన్ని సాధించే లక్ష్యంతో 1925లో ఆరెస్సెస్ ఏర్పడింది. ఆ సంస్థ రెండవ సర్సంఘ్ ఛాలక్ గురూజీ ఎంఎస్ గోల్వాల్కర్ 'బంచ్ ఆఫ్ థాట్స్' అనే గ్రంథంలో హిందూదేశానికి మిత్రులు ఎవరో శత్రువులు ఎవరో వివరించారు. తలనుండి పుట్టినా, ఛాతీ నుండి పుట్టినా, ఉదరభాగం నుండి పుట్టినా కాళ్ళ నుండి పుట్టినా నాలుగు వర్ణాలూ ఒకే విరాట్ పురుషుని దేహం నుండి పుట్టాయి కనుక అవన్నీ పవిత్రమైనవే అనేది వారి వివరణ. వర్ణాల్లో ఒకటి ఎక్కువ అనీ మరొకటి తక్కువ అని భావించడం, హిందూ సమాజంలో నిచ్చెనమెట్ల వ్యవస్థ వుందని చెప్పడం తప్పు అంటూ వారు హిందూ ఐక్యతను బోధించారు.

మరోవైపు, ముస్లింలు భారతదేశంలో పుట్టి, ఇక్కడే బతికి, ఇక్కడే చనిపోయినా భారతదేశం వారికి పితృభూమి, కర్మభూమి మాత్రమే అవుతుంది గానీ పుణ్యభూమి మాత్రం కాదు. కాబట్టి వారు 'అన్యులు' అనేది గోల్వాల్కర్ వర్గీకరణ. ఇదే ప్రమాణం క్రైస్తవులు, కమ్యూనిస్టులకు కూడ వర్తిస్తుందని వారొక సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశారు. అక్కడితో ఆగకుండా 'ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు హిందూదేశానికి అంతర్గత ముప్పు' అని ప్రకటించారు.

సమాజంలో వ్యష్టి ప్రయోజనాలని పరిరక్షించాలనే ప్రజాస్వామ్యం, సమిష్టి ప్రయోజనాలను కాపాడాలనే సామ్యవాదం రెండూ భారత సమాజానికి పనికిరావని ఎంఎస్ గోల్వాల్కర్ ప్రగాఢ అభిప్రాయం. యజమానులు – శ్రామికులు అనే సామాజికార్థిక విభజన వారికి నచ్చేది కాదు. నాలుగు వర్ణాలవారు ఎవరి హక్కుల్ని వారు ఆస్వాదిస్తూ, ఎవరి బాధ్యతల్ని వారు నిర్వర్తించే వర్ణవ్యవస్థే ప్రపంచంలో నిలిచి వెలుగుతుందని వారు ప్రవచించారు.

దేశం బలపడడానికి ఆర్థిక రంగంలో హిందూ పెట్టుబడిదారుల్ని ప్రోత్సహించాలనే మాట గోల్వార్కర్ నాటికే వుంది. అయితే, దేశంలో సామ్యవాద భావాలు, కమ్యూనిస్టు పార్టీల ప్రభావం బలంగావున్న కారణంగా అప్పట్లో ఆరెస్సెస్ దాని రాజకీయ విభాగాలయిన జనసంఘ్, బీజేపీలు పెద్దగా ప్రభావాన్ని చూపలేకపోయాయి. 1990వ దశకం ఆరంభంలో తూర్పు యూరప్, రష్యాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు పతనం అయ్యాక, గ్యాట్ ఒప్పందాలు కుదిరాక, సరళీకృత ఆర్థిక విధానం రంగప్రవేశం చేశాక సాంస్కృతిక జాతీయవాదానికి ఆర్థిక జాతీయవాదాన్ని జత చేశారు. ఈ ఘనత లాల్ కిషన్ అద్వాణీకి దక్కుతుంది. బడా పెట్టుబడిదారీ సంస్థలు ఆరెస్సెస్, బీజేపీలను ప్రోత్సహించడం మొదలెట్టాయి. ఈ ఫార్ములా రెండు పక్షాలకూ ప్రయోజనకారిగా మారింది. ఇరువురూ ఒక అవగాహనతో ఒకరినొకరు సమర్థించుకుంటూ ఒకరు ఆర్థిక రంగంలో, మరొకరు రాజకీయ రంగంలో బలపడ్డారు.

నరేంద్ర దామోదర్ దాస్ మోదీజీ 2001 చివర్లో గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యాక సాంస్కృతిక జాతీయవాదం, ఆర్థిక జాతీయవాదం కొత్త పుంతలు తొక్కాయి. నరేంద్ర మోదీజీ చొరవతో గుజరాత్‌లో హిందూ జాతీయవాదం గుజరాత్ జాతీయవాదంగా, గుజరాత్ ఆర్థిక జాతీయవాదంగా కొత్త శక్తిని పుంజుకుంది. గుజరాత్ మోడల్‌నే భారతదేశ మోడల్‌గా మార్చడానికి గుజరాతీ మెగా కార్పొరేట్లు గుజరాత్ ముఖ్యమంత్రిని దేశప్రధానిగా మార్చుకున్నారు.

మోదీజీ ప్రధాని అయ్యాక గుజరాత్ మెగా కార్పొరేట్లకు భారీ మేళ్ళు జరిగాయన్న అభిప్రాయం బలంగా ఉంది. దీనినే చాలామంది ప్రయోజిత పెట్టుబడీదారీ వ్యవస్థ (క్రోనీ కేపిటలిజం) అంటున్నారు. అందుకు భిన్నంగా, గుజరాత్ మెగా కార్పొరేట్లే తమ ధనబలాన్నీ, మీడియా బలాన్నీ ప్రయోగించి తమకు అనుకూలుడైన మోదీజీని దేశప్రధాని కుర్చీలో కూర్చోబెట్టుకున్నారనే వాదనా వుంది. దీనినే ప్రయోజిత ప్రజాస్వామ్యం (క్రోనీ డెమోక్రసీ) అంటున్నారు.

రాజకీయార్థిక రంగాల్లో ఇటీవలి పరిణామాల్ని లోతుగా గమనిస్తే దేశంలో ప్రయోజిత ప్రజాస్వామ్యం కొనసాగుతున్నదనే వాదనకే బలం చేకూరుతోంది. క్రోనీ డెమోక్రసీ అంటే ప్రజాస్వామ్యానికి నాలుగు మూల స్తంభాలయిన శాసన, కార్యనిర్వాహక, న్యాయ, మీడియా వ్యవస్థల పనితీరు ప్రాయోజిత కార్యక్రమాలుగా మారిపోయాయని అర్థం. క్రోనీ డెమోక్రసీ అనేది కొత్త సిద్ధాంతం ఏమీకాదు. మనం పెద్దగా పట్టించుకోలేదుగానీ మార్క్సిస్టు మూల సూత్రాల్లోనే ఈ ప్రస్తావన వున్నది. 'పెట్టుబడీదారీ వ్యవస్థ తన ప్రయోజనాలకు అనుకూలమైన పార్లమెంటరీ వ్యవస్థను రూపొందించుకున్నది' అని కార్ల్ మార్క్స్ అన్నాడు. పెట్టుబడీదారులు తమ ప్రయోజనాలను నెరవేర్చిపెట్టే రాజకీయ నాయకుల్ని దేశాధినేతలుగా నియమించుకునేందుకు ఇది అవకాశం ఇస్తుంది. గుజరాతీ మెగా కార్పొరేట్లు తమ ప్రతినిధిని దేశాధినేత స్థానంలో పెట్టుకునే స్థాయికి ఇప్పుడు ఇది అభివృద్ధి చెందింది.

ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశాన్ని అణిచివేస్తున్నదనే వాదనలు గోల్వార్కర్ నాటికే వున్నాయి. దక్షిణాదికి చెందిన ఆదిశంకరాచార్యను తాము ఎంతగా గౌరవిస్తారో వారు చాలా వివరంగా చెప్పుకొచ్చారు. అయినప్పటికీ ఆ వివాదం మళ్ళీ రాజుకుంది. దక్షిణాది ఆరు రాష్ట్రాల్లో ఎక్కడా ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం లేకపోవడం దీనికి ఒక సంకేతం. ఇప్పుడు ఉత్తరాది వ్యతిరేకతతోపాటూ గుజరాతీ వ్యతిరేకత కూడా దేశమంతటా క్రమంగా పుంజుకుంటున్నది.

ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టుల్ని సామాజికంగా వెలివేస్తున్నాం, ఆర్థికంగా అణచివేస్తున్నాం, రాజకీయంగా దూరంగా పెడుతున్నాం అని చెప్పడం ద్వారా కరడుగట్టిన హిందూత్వవాదుల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు సంఘపరివారం చేస్తున్నది. అయోధ్యలో రామాలయ నిర్మాణం ద్వారా సామరస్య హిందువులని సంతృప్తిపరచే ప్రయత్నం చేస్తున్నది. ఇలాంటి ముసుగులు ఎన్ని కప్పినా కేంద్ర ప్రభుత్వ గుజరాతీ పక్షపాతం అందరికీ స్పష్టంగానే కనిపిస్తున్నది. జాగ్రత్తగా గమనిస్తే ఉత్తర – దక్షిణ వివాదంకన్నా, గుజరాతీ వ్యతిరేక వివాదం వేగంగా రగులుకుంటున్నది.

● ఉషా ఎస్ డానీ
సామాజిక విశ్లేషకులు

నేటి సందర్భంలో వైకోమ్ స్ఫూర్తి

'దేవాలయానికి వెళ్ళే దారిలో అంటరాని జనం నడిస్తే, ఆ దారులు మైల పడిపోతాయని వాళ్ళు అంటున్నారు. వైకోమ్ ఆలయంలో దేవుడు గానీ, బ్రాహ్మణులు గానీ అంటరాని జనం ఉనికితోనే మైలపడిపోతారా అని నేను అడుగుతున్నాను. వైకోమ్ ఆలయంలో దేవుడు మైల పడేమాట నిజమే అయితే, అది దేవుడే కాదు. వట్టి రాయి మాత్రమే. మాసిన బట్టలు ఉతకడానికి మాత్రమే పనికి వచ్చే రాయి అని నేనంటాను.'
– పెరియార్

వంద సంవత్సరాల క్రితం, 1924 మార్చి 30వ తేదీన, ఈళవ, నాయర్, పులయ కులాలకు చెందిన ముగ్గురు వాలంటీర్లు, వేలాది మందితో కలిసి వైకోమ్ దేవాలయ వీధులలోకి ప్రవేశించే ప్రయత్నం చేశారు. నాటి ట్రావెన్‌కూర్ సంస్థాన పోలీసులు అందరినీ అరెస్టు చేశారు. ఆనాటి నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకూ వరసగా రోజూ ఇదే విధంగా ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. ఈ సత్యాగ్రహ పోరాటం సుదీర్ఘంగా కొనసాగింది. జాతీయోద్యమంలో 1924 మార్చి 30 నుంచి 1925 నవంబరు 23 వరకూ, 600 రోజులకి పైగా జరిగిన చారిత్రాత్మక పోరాటం ఇది. వందేళ్ళ వైకోమ్ సత్యాగ్రహాన్ని మళ్ళీ గుర్తు చేసుకోవాల్సి ఉంది.



వైకోమ్ ఉద్యమం జరిగి వందేళ్ళు గడిచిపోయాయి. అవే ప్రవర్తనలు, అవే గొంతులు, అలాంటి వాదనలే ఇవాళ మత విశ్వాసాలు, ఆచారాలు, సనాతన ధర్మం పేరుతో మరింత బలంగా, అధికారం అండతో మళ్ళీ వినిపిస్తున్నాయి. రాజకీయ ఉద్యమంలో సామాజిక సమానత్వాన్ని ఒక ప్రశ్నగా ఎజెండా మీదకు తెచ్చిన ఉద్యమంగా వైకోమ్ ఉద్యమానికి ప్రాధాన్యత ఉంటుంది.

1920లలో అంటరానితనాన్ని హిందూయిజానికి కళంకంగా భావించడం మొదలయింది. అంటరానితనాన్ని రద్దు చేస్తే హిందూయిజాన్ని శుద్ధి చేయవచ్చనీ, అప్పుడు ప్రతి ఒక్కరూ అందులో సమానులుగా చేరవచ్చుననీ భావించారు. 1909లో దాదాపు ఐదువేలమంది ఈళవ కులస్థుల సమావేశమొకటి ప్రభుత్వం నడిపే ఆలయాన్నింటిలో ప్రవేశం కావాలని కోరింది. నారాయణగురు సన్నిహిత సహచరుడు అయిన టికె. మాధవన్ దీనిని జాతీయ స్థాయికి తీసుకెళ్ళాడు. దేవాలయ ప్రవేశం హిందువులందరి జన్మహక్కనీ, అంటరానితనాన్ని నిర్మూలించడానికి కృషి చేయాలనీ టికె. మాధవన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని 1923లో జరిగిన కాకినాడ కాంగ్రెస్ సదస్సు ఆమోదించింది. 1924లో కేరళ కాంగ్రెస్ కమిటీలో ఒక అస్పృశ్యతా కమిటీని కెకెలప్పన్ ఏర్పాటు చేశాడు. వైకోమ్ ఆలయం చుట్టూ వుండే వీధులని ఇతర కింది కులాల ప్రజలు ఈళవ కులస్థులు ఉపయోగించుకునే హక్కుల కోసం కాంగ్రెస్ పోరాడాలని నిర్ణయించారు.

వైకోమ్ పోరాటం మొదలు కాగానే ఆనాడు తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న పెరియార్‌కి పిలుపు వచ్చింది. వైకోమ్‌లో ఉన్న స్థానిక నాయకులు అందరూ అరెస్టవడంతో, గాంధీ సహచరుడూ, యంగ్ ఇండియా సంపాదకుడూ అయిన జార్జి జోసెఫ్ ఆహ్వానం మేరకు పెరియార్ వైకోమ్ పోరాటంలో పాల్గొనడంతో వైకోమ్ పోరాటానికి ఊపు వచ్చింది. పెరియార్ ఈ ఉద్యమంలో కీలక పాత్ర వహించాడు. రెండుసార్లు అరెస్టయ్యాడు. పెరియార్ వైకోమ్ పోరాటంలో మొత్తం 141 రోజులపాటు పాల్గొన్నాడు. 74 రోజులపాటు నిర్బంధంలో ఉన్నాడు. 67 రోజులు కేరళలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి వైకోమ్ ఉద్యమానికి మద్దతు కూడగట్టాడు. 'నేను దేవుణ్ణి చూడాలనుకోవడం లేదు. కుక్కలు, పందులు సైతం స్వేచ్ఛగా నడయాడే వీధులలో మనుషులు నడిచే హక్కు కోసం పోరాడుతున్నాను' అన్న పెరియార్ మాటలు ప్రజలను కదిలించాయి. వైకోమ్ ఉద్యమంలో పాల్గొనకుండా కట్టడి చేయడానికి పెరియార్‌ను రాజద్రోహ నేరం కింద నిర్బంధించారు. క్రమంగా ఇది దేశవ్యాపితంగా అందరి దృష్టి ఆకర్షించింది. 1924 ఏప్రిల్ నెలలో అమృత్‌సర్ నుంచి వచ్చిన సిక్కుల జాతా ఒకటి సత్యాగ్రహ వాలంటీర్ల కొరకు ఒక ఉచిత వంటశాలను ఏర్పాటు చేసింది.

600 రోజులకి పైగా సత్యాగ్రహ పోరాటం కొనసాగినాక, అది ఒక విధమైన రాజీతో ముగిసింది. దేవాలయానికి మూడు వైపులా నిర్మించిన కొత్త రోడ్లపై అవర్ణులని అనుమతించారు. అయితే, నాలుగవ వైపున ఉన్న ప్రధానమైన రహదారిలోకి మాత్రం అవర్ణులను అనుమతించలేదు. కొత్తగా నిర్మించిన మూడు రహదారులు కూడా దేవాలయానికి కొంచెం దూరంలోనే ఉన్నాయి.

వైకోమ్ సత్యాగ్రహం తర్వాత కేరళలో ఇతర ఉద్యమాలకు పునాది వేసింది. గాంధీ వైఖరి అసంతృప్తికి దారితీసింది. గాంధీ దీనిని మొదటి నుంచీ 'హిందువుల సమస్య'గానే చూశాడు. వైకోమ్ సత్యాగ్రహంతో ప్రారంభం నుంచీ సంబంధం ఉండి, తన సహచరుడు, యంగ్ ఇండియా సంపాదకుడుగా పనిచేసిన జార్జి జోసెఫ్ సిరియన్ క్రిస్టియన్ కావడంతో, తనని ఈ ఉద్యమానికి దూరంగా ఉండమని గాంధీ ఆదేశించాడు. అదే విధంగా సిక్కుల బృందం ఏర్పాటు చేసిన వంటశాలను తక్షణమే మూసివేయాలని ఆదేశించాడు. ఈ ఉద్యమం తర్వాత పెరియార్ కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకున్నాడు. అంబేద్కర్ మహద్ సత్యాగ్రహం సందర్భంగా వైకోమ్ ఉద్యమం స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నాడు. తదనంతర కాలంలో పెరియార్, అంబేద్కర్ వంటి నాయకులు దీనిని దేవాలయ ప్రవేశానికి మించిన సమస్యగా పరిగణించారు. కాగా, గాంధీ, దేవాలయ ప్రవేశం అంటరానితనాన్ని తొలగించే మార్గమని భావించాడు.

'ఒక మతం, సామాజిక సమానత్వం మీద ఆధారపడిన మతంగా ఉండాలంటే, దేవాలయ ప్రవేశాన్ని అనుమతించే విధంగా స్మృతిని వారిస్తే సరిపోదు. అది చాతుర్వర్ణ సిద్ధాంతాన్ని సమూలంగా నిర్మూలించాలి. సకల అసమానతలకు, కులవ్యవస్థకు మూలం చాతుర్వర్ణ సిద్ధాంతంలో ఉంది. అంటరానితనం అసమానతకు ఒక రూపం మాత్రమే. చాతుర్వర్ణ వ్యవస్థను సమూలంగా నిర్మూలించకుంటే దళితులూ దేవాలయ ప్రవేశాన్ని తిరస్కరిస్తారు, హిందూమతాన్ని తిరస్కరిస్తారు' అని అంబేడ్కర్ అంటాడు.

జాతీయోద్యమంలో వలసవాదంపై పోరాటంలో ఎంచుకున్న మార్గంపై అనేక చర్చలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మరొకవైపు, అంబేడ్కర్ వంటివారు స్వాతంత్రోద్యమం దళితుల హక్కులకు ఎటువంటి హామీ ఇస్తుందనే ప్రశ్నను సూటిగా ముందుకు తెచ్చారు.

సామాజిక వైరుధ్యాలు, సమస్యల పట్ల జాతీయోద్యమంలో వ్యక్తమైన వైఖరులకీ, నాయకత్వ స్వభావం, దానికి ఉన్న పరిమితులకీ అద్దం పట్టిన ఉద్యమం వైకోమ్ ఉద్యమం. వైకోమ్ ఉద్యమం జరిగి వందేళ్ళు గడిచిపోయాయి. మారిన పరిస్థితులు, మారని విషయాలు రెండూ ఉన్నాయి. ఇప్పటికీ, దేవాలయాలలో ప్రవేశం కోసం వివిధ ప్రాంతాలలో దళితులు పోరాడుతున్న సంఘటనల గురించి చదువుతూనే ఉన్నాము. బాల్య వివాహాలు లేకుంటే సనాతన ధర్మాన్ని కాపాడలేమని, మహిళల స్థితి అధోగతిపాలవుతుందని 1928లో వాదించిన టి.కె. ఆచార్య వంటి సనాతనవాదుల వాదనలని వేరు వేరు రూపాలలో మనం వింటూనే ఉన్నాము. వైకోమ్ సత్యాగ్రహుల డిమాండ్ విషయమై నంబూద్రి బ్రాహ్మణులని ఒప్పించడానికి వెళ్ళిన గాంధీని దూరంగా బయట నిలబెట్టి అవమానించారు. ఆదిశంకరాచార్య బోధనల ప్రకారమే తాము నడుచుకుంటున్నామనీ, దేశమంతటా ఉన్న అంటరానితనాన్ని ఇంకొంచెం పొడిగిస్తున్నామనీ, గతజన్మల పాపఫలమే అవర్ణుల దుర్గతికి కారణమనీ నీలకంఠన్ నంబూద్రి పొగరుగా సమాధానమిచ్చాడు. అవే ప్రవర్తనలు, అవే గొంతులు, అలాంటి వాదనలే ఇవాళ మత విశ్వాసాలు, ఆచారాలు, సనాతన ధర్మం పేరుతో మరింత బలంగా, అధికారం అండతో మళ్ళీ వినిపిస్తున్నాయి. వైకోమ్ ఉద్యమం సాధించిన (పాక్షిక) విజయం, అది సాధించలేకపోయిన అంశాలని, చర్చలోకి రాని ఇతర అంశాలని అటుంచితే, రాజకీయ ఉద్యమంలో సామాజిక సమానత్వాన్ని ఒక ప్రశ్నగా ఎజెండా మీదకు తెచ్చిన ఉద్యమంగా వైకోమ్ ఉద్యమానికి ప్రాధాన్యత ఉంటుంది. ఆ ప్రశ్న ఇప్పటికీ విలువైనదే.

■ సుధా కిరణ్

ఎలెక్టోరల్ బాండ్లు అవినీతి రూపం కాదా?

'కేజ్రీవాల్ అరెస్ట్‌పై యాగీ ఎందుకు?' అంటూ మార్చి 26 ఆంధ్రజ్యోతి ఎడిట్ పేజీలో సత్యకుమార్ పలికిన అసత్య పలుకులు చూసిన తర్వాత ఈ వివరణ రాయాలనిపించింది. బీజేపీ ఎలెక్టోరల్ బాండ్లు పొందడం అవినీతి ఎలా అవుతుంది? అంటూ ఆయన వితండవాదం చేస్తున్నారు. అవినీతిని తెలివిగా చట్టబద్ధం చేసినంత మాత్రాన అవినీతి కాకుండా పోతుందా? ఒకప్పుడు పార్టీ సభ్యుల సభ్యత్వం, చందాలపై ఆధారపడ్డ రాజకీయ పక్షాలు ఇవాళ కార్పొరేట్ సంస్థలపై ఎందుకు ఆధారపడుతున్నాయి? ఎలెక్టోరల్ బాండ్ల పంపకం క్విడ్ ప్రో కో కాకపోతే అధికారపక్షం బీజేపీకే ఎందుకు 47శాతం నిధులు ముట్టాయి. బాండ్లు అవినీతి రూపం కాకపోతే 2019 నుంచి పొందిన విరాళం సుప్రీంకోర్టు ఆదేశించే వరకు ఎందుకు రహస్యంగా ఉంచారు? కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన సంస్థ బీజేపీ, బీఆర్ఎస్‌కు మాత్రమే వందలకోట్లు ఇవ్వడంలో మతలబు చెప్పగలరా? లిక్కర్ కుంభకోణంలో ముద్దాయిగా అరెస్టయిన శరత్ చంద్రారెడ్డి జైలు నుంచి విడుదల అయిన రెండవ రోజే రూ.5కోట్లు ఇవ్వడాన్ని ఎలా సమర్థించుకుంటారు? శరత్ చంద్రారెడ్డిని ఈడీ, సీబీఐ అప్రూవర్‌గా మార్చి, ఆయన్ను ముద్దాయి నుంచి లిక్కర్ కుంభకోణంలో సాక్షిగా మార్చిన నెలరోజులకు ఆయన కంపెనీ బీజేపీకి రూ.50కోట్లు సమర్పించుకోవడం చట్టబద్ధమా? కేజ్రీవాల్ ప్రధాన భాగస్వామిగా మొదలైన అవినీతి వ్యతిరేక ఉద్యమం బీజేపీ అధికారంలోకి రావడానికి తోడ్పడింది అనే విషయం మర్చిపోయి గొంగడిలో బువ్వతింటూ ప్రతిపక్షాలపై అవినీతి విమర్శ చేయడం గురివింద సామెతను గుర్తుకు తెస్తుంది? ఇటు కేజ్రీవాల్‌ను అబద్ధపు సాక్ష్యాలతో, రాజకీయ లబ్ధి కోసం జైలులో పెట్టించిన బీజేపీ వెనువెంటనే కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప సారథ్యంలో మైనింగ్ మాఫియా గాలి జనార్దన్ రెడ్డికి బీజేపీ తీర్థం ఇవ్వడంలోనే మీ నిజాయితీ ఎంతో వెల్లడయ్యింది. ఇప్పటికీ ఓ సవాలు విసురుతున్నాను సత్యకుమార్ గారికి. ఎక్కడో కాదు, అరబిందో ఫార్మా ఇచ్చిన ఎలెక్టోరల్ బాండ్లపై సీబీఐ ఈడీలతో స్వచ్ఛందంగా విచారణకు ఆదేశించుకోండి? మీ నిజాయితీ బయటపడుతుంది!

– నల్లమోతు తిరుమలరావు
ఆమ్ ఆద్మీ పార్టీ కోర్ కమిటీ సభ్యులు

అధికారం వేటలో



వేటాడి జీవించిన ఆదిమ దశలోంచి
ఎదిగి ఎదిరించి వొదిగి
రాటుదేలిన పరిణామక్రమంలో
ఇప్పుడు వోట్లను వేటాడుతున్న
ఎన్నికల జూదంలో
ప్రలోభాల వలయంలో
పావులుగా మారిన జనమంతా,

కులాలవారీగా మతాలవారీగా
ముద్రలు పడిన మనమంతా
బహురూపుల మూకస్వామ్యంలో
గొణుగుతూనే వున్నాం రోజంతా –

"ఎవరికి దక్కిన ఆధిపత్యం?
ఎవరనుభవిస్తున్న అధికారం?"
బదులుగా బరితెగించి
సాగుతున్న అధికారం వేటలో
ఆధిపత్య హోరులో
నీతిన్యాయం జనస్వామ్య విధ్వంసం!

మహామహుల సిద్ధాంతాలన్నీ
వాళ్లకు మేలి ముసుగు వ్యాపారం,
శ్రామికవర్గ రాజ్యాధికారాన్ని
కాలరాస్తున్న
అనైతిక ధనార్జన దౌర్జన్య
రాజ్యతంత్రంలో
తరతరాలకు తరగని అర్జనే
అంతిమలక్ష్యం
నేతల వారి దాతల
నేటి ప్రత్యక్ష పురాణం!!

– నిఖిలేశ్వర్

రాజీ డ్రామా రివర్స్..!

అనుకున్నదొకటి.. అయ్యిందొకటి.. అధికార పార్టీ వ్యూహం బెడిసికొట్టింది. ఎన్నికల వేళ తమ రాజకీయ ప్రయోజనార్థం వలంటీర్లను రాజీనామాలతో రెచ్చగొట్టాలన్న ప్రయత్నానికి ఎదురుదెబ్బ తగిలింది. వైసీపీ నాయకుల ఒత్తిళ్లు, ప్రజాప్రతినిధుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ జిల్లావ్యాప్తంగా రాజీ'డ్రామా'కు అనుకున్నంత స్పందన రాలేదు. రెండు జిల్లాల్లో కలిపి 20,008 మంది సచివాలయ ఉద్యోగులు ఉండగా, కేవలం 880 మందే రాజీనామా చేయడం, మిగతా వారు అంతగా ఆసక్తి చూపక పోవడంతో వైసీపీ నాయకులకు దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయ్యింది.



బందరు మునిసిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రం అందజేస్తున్న వలంటీర్లు

రెండు జిల్లాల్లో వలంటీర్ల రాజీనామాలకు స్పందన నిల్

- ఉద్యోగం వదులుకునేది లేదని తేల్చిచెప్పిన వలంటీర్లు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 20వేల మంది వలంటీర్లు
- రాజీనామా చేసింది 880 మందే.. ఒక్క బందరులోనే 860 మంది
- అది కూడా ఎమ్మెల్యే పేర్ని నాని బలవంతం వల్లే..
- ఎన్టీఆర్ జిల్లా మొత్తం మీద ఆరుగురే రాజీనామా
- డబ్బు ఆఫర్ ఇచ్చినా పట్టించుకోని వలంటీర్లు

వైసీపీ నాయకులకు షాక్

విజయవాడ/మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : రెండు జిల్లాల్లో 845 గ్రామ, 440 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 20,008 మంది సచివాలయ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరందరిలో ఆది, సోమవారాల్లో కేవలం 880 మంది వలంటీర్లు (కృష్ణాలో 874, ఎన్టీఆర్‌లో 6 మంది) మాత్రమే రాజీనామాలు చేశారు. ఈ లెక్కన చూస్తే కేవలం 4.39 శాతం మందే రాజీనామాలు చేశారని అర్థమవుతోంది. దీనివల్ల వేలాదిగా రాజీనామాలు చేయించాలని చూసిన అధికార వైసీపీ నేతలకు వలంటీర్ల నుంచే మద్దతు కరువైనట్టైంది.

రెండు జిల్లాల్లో ఇలా..

కృష్ణా జిల్లావ్యాప్తంగా మొత్తం 9,600 మంది వలంటీర్లు ఉన్నారు. వీరిలో 874 మంది రాజీనామాలు చేయటమంటే 9.1 శాతం మందే రాజీనామా చేసినట్టు. మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే పేర్ని నాని బెదిరింపులకు భయపడి 860 మంది రాజీనామాలు చేశారు. వీరిలో మచిలీపట్నం అర్బన్‌లో 578 మంది, మచిలీపట్నం మండల పరిధిలో 282 మంది ఉన్నారు. కృష్ణాజిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల నుంచి ఎలాంటి స్పందనా లేదు. కేవలం 14 మందే రాజీనామా చేశారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మొత్తంగా 10,418 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరిలో ఆరుగురు రాజీనామా చేశారంటే మొత్తంగా 0.05 శాతమే.

అధికార పార్టీకి ఝలక్

వలంటీర్లంతా తమ చెప్పుచేతల్లో ఉన్నారని విర్రవీగిన అధికార పార్టీ నేతలకు ఇదో ఝలక్. బలవంతంగా రాజీనామాలు చేయించాలని చూసిన అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులకు చెంపపెట్టు. టీడీపీ ప్రభుత్వం వస్తే వలంటీర్లను తొలగించేస్తుందని, ఉద్యోగాలను కాపాడుకోవాలంటే వైసీపీ అధికారంలో ఉండాలని, దానికోసం మాతో కలిసి పనిచేయాలంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు ఒత్తిడి తెచ్చారు. బలవంతపు రాజీనామాలకు ఉసిగొల్పారు. రెండు నెలలు తమతో కలిసి పనిచేస్తే, మళ్లీ అధికారం రాగానే విధుల్లోకి తీసుకుంటామని, రాజీనామా చేసిన రెండు నెలలకు కూడా జీతాలు చెల్లిస్తామని మభ్యపెట్టినా వలంటీర్లు పెద్దగా పట్టించుకోలేదు.

అంతా రివర్స్

వలంటీర్లతో రాజీనామాలు చేయించటం వల్ల పథకాలకు సంబంధించి ఇంటింటికీ నేరుగా వెళ్లే అవకాశముండదు. విపక్షాలపై నెపం మోపి రాజకీయ ప్రయోజనాలను పొందాలన్నది వైసీపీ మొదటి ఎత్తుగడ. ఎన్నికల సందర్భంలో వలంటీర్లను పూర్తిగా తమ కోసం వాడుకోవాలన్న ఆలోచన రెండోది. వలంటీర్లతో ప్రచారం చేయించుకోవటంతో పాటు బహుమతులు, నగదు లావాదేవీలు వంటివి కూడా నిర్వహించుకోవచ్చన్నది వైసీపీ ప్లాన్. ఓటర్లకు నగదును పంపిణీ చేయించేందుకు వలంటీర్లనే ఉపయోగించాలని వైసీపీ నేతలు భావించారు. వలంటీర్లయితే తాము ఉద్యోగాలు కల్పించామని, నమ్మకంతో పనిచేస్తారని, అదే పార్టీ నాయకులైతే డబ్బును సక్రమంగా పంపిణీ చేయరన్న ఆలోచన ప్రభుత్వ పెద్దల్లో ఉంది. కానీ, అధికార పార్టీ ఒత్తిళ్లకు వలంటీర్లు లొంగలేదు. టీడీపీ ప్రభుత్వం వస్తే వలంటీర్లను తొలగించేస్తారన్న ప్రచారాన్ని కూడా విశ్వసించలేదు. వలంటీర్లను తొలగించబోమని చంద్రబాబు అనేక సభల్లో చెప్పారు. సచివాలయ వ్యవస్థను పటిష్టం చేస్తామని చంద్రబాబు హామీ ఇవ్వటంతో తమకు నష్టం లేదనే భావనలోనే వలంటీర్లు ఉన్నారు.

రాజీనామా చేయండి.. జీతాలిస్తాం..

మచిలీపట్నం నియోజకవర్గంలో పనిచేస్తున్న వలంటీర్లు రాజీనామా చేస్తే రెండు, మూడు నెలల పాటు పార్టీ తరఫున జీతాలు ఇస్తామని నగరంలోని కార్పొరేటర్లు, పంచాయతీల్లోని సర్పంచ్‌లు, వైసీపీ నాయకుల ద్వారా భరోసా కల్పించినట్లు విశ్వసనీయ సమాచారం. మళ్లీ ప్రభుత్వం వస్తే వి ఎమ్మల్నే తిరిగి వలంటీర్లుగా నియమిస్తామని, ఈ 45 రోజుల పాటు వైసీపీ అభ్యర్థిని గెలిపించడానికి పనిచేయాలని ఒత్తిడి తెచ్చారు. అయితే, ఐదేళ్లుగా తమ సేవలను వినియోగించుకున్నారని, ఇప్పటికిప్పుడు తమతో రాజీనామా చేయిస్తున్నారని అధిక శాతం మంది వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజే మచిలీపట్నంలోని పలు సచివాలయాలకు వలంటీర్లను పిలిచి, పూలదండలు వేసి, మీ సేవలు మరువలేమని, వైసీపీకి అనుకూలంగా ఈ ఎన్నికల్లో పనిచేయాలని చెప్పి పంపారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే సేవలు వినియోగించుకుంటామని కూడా పేర్కొన్నారు. దీంతో అప్పట్లోనే వలంటీర్లతో రాజీనామాలు చేయిస్తారనే ప్రచారం జరిగింది. కొన్ని ప్రాంతాల్లోని వలంటీర్లు వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ అంశంపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో మచిలీపట్నం మండలం చిన్నాపురం పంచాయతీలో ఆరుగురు వలంటీర్లను విధుల నుంచి తొలగించారు.



పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన మండలి బుద్ధప్రసాద్

జనసేనలోకి బుద్ధప్రసాద్

అవనిగడ్డ అభ్యర్థిగా ఖరారయ్యే అవకాశం

- గెలుపు గుర్రాల కోసం జనసేన అన్ని కోణాల్లో పరిశీలన
- బుద్ధప్రసాద్‌కు అనుకూలత
- అంతర్గత సర్వేలోనూ ఇదే స్పష్టం

అవనిగడ్డ, ఏప్రిల్ 1 : మాజీ ఉపసభాపతి, టీడీపీ సీనియర్ నేత మండలి బుద్ధప్రసాద్ సోమవారం జనసేన పార్టీలో చేరారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీల పొత్తులో భాగంగా అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించగా, ఆ పార్టీ నుంచి వచ్చిన పిలుపు మేరకు బుద్ధప్రసాద్ సోమవారం పిఠాపురం వెళ్లి అక్కడ ప్రచారంలో ఉన్న పవన్ కల్యాణ్‌ను కలిసి ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఆ పార్టీ తరఫున అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పోటీ చేసే ఆశావహులు ఎక్కువగా ఉండటంతో ప్రత్యామ్నాయంగా టీడీపీ నేత మండలి బుద్ధప్రసాద్‌ను పార్టీలోకి ఆహ్వానించినట్టు తెలుస్తోంది. సోమవారం తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్, బుద్ధప్రసాద్ అల్లుడు శీలం అశ్విన్ కుమార్, సోదరుడు మండలి ఉదయ్ భాస్కర్‌తో కలిసి జనసేన పార్టీలో చేరగా, పవన్ కల్యాణ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

అన్నివైపుల నుంచీ పరిశీలించాకే...

జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లాలో పోటీ చేస్తున్న ఏకైక స్థానమైన అవనిగడ్డ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగానూ, మంత్రిగానూ, ఉపసభాపతిగా పనిచేసిన అనుభవం ఉన్న బుద్ధప్రసాద్‌ను బరిలో నిలపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. జనసేన నుంచి టికెట్ ఆశిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్, బండి రామకృష్ణ, బండ్రెడ్డి రామకృష్ణ పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించారు. అందులో సానుకూలంగా ఫలితాలు రాలేదు. దీనికితోడు పార్టీ వారం రోజులుగా నిర్వహించిన అంతర్గత సర్వేలోనూ బుద్ధప్రసాద్ జనసేన అభ్యర్థి అయితే గెలుస్తారని నివేదికలు వచ్చాయి. దీంతో ఆయనకు సీటు ఇవ్వాలని పార్టీ భావిస్తున్నట్టు టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. టీడీపీలో కూడా గడిచిన కొద్దిరోజులుగా జనసేన తరఫున మండలి బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వాలని డిమాండ్ చేస్తుండటం, జనసేనలోని కొందరు సీనియర్ నేతలు కూడా మండలి వెంట ఉండటంతో ఆయనకే టికెట్ ఖరారయ్యే అవకాశాలున్నాయని చర్చ నడుస్తోంది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-22 (మంగళ)

సహర్ (ఉదయం) : 4-48 (బుధ)

మైలవరంలో తెగని వైరం

వైసీపీలో ముదురుతున్న వర్గ విభేదాలు

- మంత్రి జోగి రమేశ్ వర్గంతో ఇబ్బందులు
- ఫ్లెక్సీలో జోగి ఫొటో లేదని ఓ వర్గంపై దాడి
- చొక్కాలు పట్టుకుని పిడిగుద్దులు
- ఎప్పటికప్పుడు పెనమలూరుకు అప్‌డేట్స్

విజయవాడ/ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 1 : మంత్రి జోగి రమేశ్ పెనమలూరుకే పరిమితమైనా.. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ టీడీపీలో చేరినా.. మైలవరం వైసీపీలో వర్గ విభేదాలు మాత్రం వీడట్లేదు. రెండు వర్గాల మధ్య ఆరని చిచ్చు దావానలంలా వ్యాపించి పార్టీని నిలువునా దహిం చేస్తోంది. తాజాగా కొండపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన వైసీపీ కార్యాలయ ప్రారంభానికి ఆ పార్టీ మైలవరం అభ్యర్థి సర్నాల తిరుపతిరావు వచ్చారు. ఈ క్రమంలో అక్కడ ఏర్పా టుచేసిన ఫ్లెక్సీలో జోగి రమేశ్ ఫొటో లేదని ఒకరు గొడవకు దిగారు. వాగ్వాదం ముదిరి గొడవ పెద్దదైంది. ఈ క్రమంలో జోగి రమేశ్ మనిషి ఒకరు కొండపల్లికి చెందిన ఓ నాయకుడి షర్ట్ పట్టుకున్నాడు. దీంతో ఆయన అనుచరులు ఒక్కసారిగా జోగి మనిషిపై విరుచుకుపడ్డారు. దీంతో అక్కడున్న వారు వారికి సర్దిచెప్పి పంపడంతో గొడవ సద్దుమణిగింది. ఈ విషయం వీడియో తీస్తున్న ఒక మీడియా వ్యక్తిని 'నువ్వు, నీ కుటుంబం, భూమి లేకుండా చేస్తాం..' అని బెదిరించడంతో ఎలాంటి వీడియోలు బయటకు రాలేదు.

మైలవరంలో రెచ్చిపోతున్న జోగి అనుచరులు

మంత్రి జోగి రమేశ్ అనుచరుల ఆగడాలు రోజురోజుకూ శ్రుతిమించుతున్నాయి. జోగి ఆధిపత్యం సహించలేక, పార్టీ విధానాలు నచ్చక మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దీంతో వసంత వెంట నడిచిన అనుచరులపై అవకాశం వచ్చినప్పుడల్లా జోగి వర్గం బూతు పురాణం అందుకుంటోంది. వీలైతే దాడికి పాల్పడుతోంది. వసంత అనుచరుల్లో ఒకరైన జి.కొండూరు మాజీ జడ్పీటీసీ కాజ బ్రహ్మయ్యను, సున్నంపాడు సర్పంచ్ దేశం వెంకట సుధాకర్‌రెడ్డిను మైలవరంలో జోగి వర్గం ఇష్టానుసారంగా తిట్టడమే కాకుండా దాడికి పాల్పడ్డారు. ఆ ఘటన జరిగిన కొద్దిరోజులకే జి.కొండూరు మండలం వెలగలేరులో జరిగిన ఆత్మీయ సమావేశంలో మాజీ జడ్పీటీసీ కాజ బ్రహ్మయ్యను వెలగలేరుకు చెందిన ఓ నాయకుడు బూతులు తిట్టడంతో గొడవ జరిగింది. ఆ గొడవను నిలువరించలేక విజయవాడ పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి కేశినేని నాని మధ్యలోనే సభను వదిలి వెళ్లిపోయారు. ఇలాంటి ఘటనల వల్ల జోగి వర్గం పార్టీకి తీరని నష్టాన్ని కలిగిస్తోందని పలువురు వైసీపీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. జోగి పెనమలూరులో ఉన్నా.. మైలవరంలో ఏం జరుగుతుందనే విషయాలను రోజూ అనుచరుల ద్వారా సమాచారం తెప్పించుకుంటున్నారని, కొందరిని వైసీపీ నుంచి బయటకు పంపేందుకు పొమ్మనకుండానే పొగబెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సచివాలయాలకు వచ్చి తీసుకోండి

పెన్షనర్లకు వలంటీర్ల వాట్సాప్ సందేశాలు

- ఇంటింటికీ వెళ్లి పెన్షన్ ఇచ్చే అవకాశం ఉన్నా..
- పెన్షనర్లను ఇబ్బంది పెట్టే నిర్ణయాలు
- వృద్ధులు, అనారోగ్య పీడితులకు కష్టమే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పెన్షన్లు తీసుకోవటానికి గ్రామ, వార్డు సచివాలయాలకు రావాలంటూ వలంటీర్లు పెన్షనర్లకు వాట్సాప్ సందేశాలు పంపిస్తున్నారు. ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు డోర్ టు డోర్ తిరిగి పెన్షన్ పంపిణీ చేయటం ఉండదని, సచివాలయాల్లో ఉన్న సిబ్బంది పంపిణీ చేస్తారని చెబుతున్నారు. వచ్చేటపుడు ముఖ్యమంత్రి జగన్ బొమ్మ ఉన్న పాస్‌బుక్ కాకుండా, ఆధార్ కార్డు కానీ, ఏదైనా ఇతర గుర్తింపు కార్డును కానీ తీసుకురావాలని సూచిస్తున్నారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా పెన్షనర్లకు వలంటీర్ల వాట్సాప్ నెంబర్ల నుంచి సందేశాలు వెళ్తున్నాయి. డోర్ టు డోర్ పెన్షన్లను పంపిణీ చేసే అవకాశం ఉన్నా ఉద్దేశపూర్వకంగా, ప్రభుత్వం ఇచ్చిన మౌఖిక ఆదేశాలను డీఆర్‌డీఏ అధికారులు అమలు చేస్తున్నారు. వలంటీర్లు కాకపోతే సచివాలయ ఉద్యోగుల ద్వారా లేదా వీఆర్వోల ద్వారా రెండు, మూడు రోజుల్లోనే ఇంటింటికీ తిరిగి పెన్షన్లను పంపిణీ చేయొచ్చు. కానీ, సచివాలయాలకు వచ్చి పెన్షన్లు తీసుకోవాల్సిందిగా చెబుతున్నారు. వృద్ధుల్లో నడవలేని వారు, అనారోగ్యం కారణంగా మంచాలపై ఉన్నవారుంటారు. వీరందరికీ డోర్ టు డోర్ పంపిణీ చేసే అవకాశం ఉన్నా రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వం పన్నిన కుట్రలో భాగంగా వృద్ధులను ఇబ్బంది పెట్టే చర్యలకు పాల్పడుతున్నారు.

ఉద్యోగాల పేరిట మోసం

200 మంది వద్ద రూ.లక్ష చొప్పున వసూలు

- 125 మందికి మేధా టవర్స్‌లో ఉద్యోగం
- ఆరు నెలల తర్వాత బయటకు పంపేసిన వైనం
- డబ్బు తిరిగి ఇవ్వకపోగా నిర్లక్ష్యపు సమాధానం

హాలివుడ్ కంపెనీ ఎదుట ఉద్యోగుల ఆందోళన

గన్నవరం, ఏప్రిల్ 1 : డబ్బు తీసుకుని ఉద్యోగం ఆశ కల్పించి, చివరికి రోడ్డున పడేశారని గన్నవరం మేధా టవర్స్‌లోని హాలివుడ్ కంపెనీ ఉద్యోగులు సోమవారం ఆందోళనకు దిగారు. హైదరాబాద్‌లోని రోటోమాక్ కంపెనీ వీఎఫ్ఎక్స్‌లో శిక్షణ, ఉద్యోగ కల్పన పేరుతో హాలివుడ్ కంపెనీ గత ఏడాది 200 మంది యువకుల వద్ద రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకూ తీసుకుంది. శిక్షణ పూర్తి చేసుకున్న యువకుల్లో 125 మందికి మేధా టవర్స్‌లోని తమ కంపెనీలో గత ఏడాది జనవరిలో ఉద్యోగాలు ఇచ్చారు. నెలకు రూ.10 వేలు చెల్లించారు. ఆగస్టు వరకూ ఉద్యోగం చేసిన తరువాత అందరినీ తొలగించారు. అదేమని ప్రశ్నిస్తే.. కంపెనీ నష్టాల్లో ఉందని, 2024 జనవరిలో మళ్లీ ఉద్యోగం చూపిస్తామని నమ్మబలికారు. అది నమ్మిన యువకులు గత జనవరి 20న కంపెనీ హెచ్‌వోడీని కలిశారు. సరైన సమాధానం రాలేదు. అయినా కంపెనీ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. చివరకూ సోమవారం కంపెనీ వద్ద ఆందోళనకు దిగారు. మాట్లాడదాం.. కూర్చోమని నమ్మబలికిన హెచ్‌వోడీ అందరినీ ఒక గదిలో ఉంచి గన్నవరం పోలీసులను తీసుకొచ్చారు. సీఐ ప్రసాద్ ఉద్యోగులతో చర్చించారు. యాజమాన్యం చెప్పినట్టుగా వినాలని, ఏదైనా హడావిడి చేస్తే కేసులు పెడతామని, అన్యాయం ఏదైనా జరిగితే పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో హెచ్‌వోడీ వ్యవహరించిన తీరుపై బాధితులు మండిపడ్డారు. మేధా టవర్స్ మెయిన్ గేటు వద్ద నిలబడి మళ్లీ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పవన్ అనే ఉద్యోగి మాట్లాడుతూ రోటో మాక్ హాలివుడ్ కంపెనీ యజమానులు ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారన్నారు. పేద కుటుంబాలకు చెందిన తాము ఉద్యోగాలు వస్తాయని ఆశతో వీఎఫ్ఎక్స్‌లో శిక్షణ తీసుకున్నామన్నారు. ఆరు నెలలు ఉద్యోగం చేశాక నష్టాల పేరుతో తమను ఇళ్లకు పంపించేశారని చెప్పారు. తాము కట్టిన డబ్బు జనవరిలో ఇస్తామని చెప్పారన్నారు. ఆ మాట ప్రకారం వస్తే కంపెనీ హెచ్‌వోడీ రమణారెడ్డి సమాధానం చెప్పకపోగా, డబ్బులు లేవు.. ఉద్యోగం లేదు.. వెళ్లిపోమంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారని కన్నీటిపర్యంతమయ్యారు. న్యాయం చేయమంటే పోలీసులతో బెదిరించటం దుర్మార్గమన్నారు. సాయి వంశీ అనే ఉద్యోగి మాట్లాడుతూ రూ.లక్ష తీసుకుని పట్టుమని ఏడాది కూడా ఉద్యోగంలో లేకుండా చేశారన్నారు. హెచ్‌వోడీ, హెచ్ఆర్‌కు అప్పు చేసి డబ్బు కట్టామన్నారు. ఉద్యోగం లేకుంటే తమ డబ్బు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ఎం.సాయి, కె.పవన్, సీహెచ్ రూబెన్, కె.అనిల్, ప్రకాష్ తదితరులు ఆందోళన చేయగా, వారికి మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు, నాని మద్దతు తెలిపారు.



గన్నవరం మేధా టవర్ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం

ఈనెల 8వ తేదీ వరకూ..

- బిషప్ అజరయ్య పాఠశాలను పరిశీలించిన విద్యాశాఖ కమిషనర్

- 6లో..

షెడ్యూల్ ప్రకారం పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్

- పోలింగ్ సిబ్బందికి దశలవారీగా శిక్షణ
- కలెక్టర్ ఢిల్లీరావు వెల్లడి

- 6లో..

అధికారుల ఆదేశాలు బేఖాతరు

- మూసేసిన క్వారీ వద్ద నిత్యం లారీలు, ఎక్స్‌కవేటర్లు
- పగలంతా విశ్రాంతి, అర్ధరాత్రుళ్లు ఇసుక దందా

వాహనాలను తొలగించాలని తహసీల్దార్ అల్టిమేటం

తోట్లవల్లూరు : ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత రొయ్యూరు క్వారీలో ఇసుక తవ్వకాలు ఆగలేదు. దాదాపుగా 50 లారీలు, ఆరు ఎక్స్‌కవేటర్లను నిర్వాహకులు అక్కడే ఉంచి అక్రమార్కులు చీకటి దందాకు పాల్పడుతున్నారు. పగలంతా వాహనాలకు విశ్రాంతి ఇస్తూ అర్ధరాత్రి సమయంలో మెరుపు వేగంతో ఇసుకను తోడేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రి యథేచ్ఛగా ఇసుక దోపిడీ చేసిన విషయం తెలిసిందే. తహసీల్దార్ ఎం.కుసుమకుమారి సోమవారంలోపు లారీలను, ఎక్స్‌కవేటర్లను క్వారీ దగ్గర నుంచి తీసుకెళ్లాలని నిర్వాహకులను ఆదేశించారు. అయినా సాయంత్రం వరకు లారీలు క్వారీ వద్దే ఉన్నాయి. మూడు ఎక్స్‌కవేటర్లను మాత్రం దగ్గరలోని పొలాల్లోకి తరలించారు. అంతకుమించి ఒక్క లారీని కూడా బయటకు తీయలేదు. ఇంకా మూడు ఎక్స్‌కవేటర్లు క్వారీ దగ్గరే ఉన్నాయి. ఆదేశాలను లెక్కచేయకుండా లారీలు, ఎక్స్‌కవేటర్లను క్వారీ దగ్గర ఉంచటం వెనుక వైసీపీ నేతల అండదండలున్నట్టు తెలుస్తోంది. క్వారీ నిర్వాహకులతో మంత్రి జోగి రమేశ్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అనుచరులు కలవటంతో రాజకీయ అండ లభించిందని విమర్శలు వస్తున్నాయి. మంత్రి అనుచరులు ప్రత్యక్షంగా ఇసుక రవాణాలోకి దిగారని ఆరోపణలున్నాయి. ఎస్సీ సొసైటీ దగ్గర పట్టా భూముల్లో ఇసుక తీయటానికి అనుమతి లభించనప్పటికీ గ్రావెల్‌తో రహదారి నిర్మించి చాలా ఇసుకను దోచేశారు. మరో రహదారి వేసేందుకు గ్రావెల్ తోలి ఉంచారు. ఈ విషయమై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా, లారీలను తొలగించమని నిర్వాహకులను ఆదేశించామని, క్వారీ వద్ద అలాగే ఉంటే మంగళవారం వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.



రొయ్యూరు క్వారీ వద్ద లారీలు, ఎక్స్‌కవేటర్

క్వారీలో తాజాగా ఇసుక తీసిన ఆనవాళ్లు


స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో టీచర్లతో మాట్లాడుతున్న డీఈవో

పది మూల్యాంకనం ప్రారంభం

- కృష్ణా జిల్లాలో రెండు కేంద్రాలు..
- 611 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 101 మంది సీఈలు
- డీఈవో తాహెరా సుల్తానా

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో రెండు కేంద్రాల్లో పదో తరగతి జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తున్నారు. డీఈవో తాహెరా సుల్తానా క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. లేడీయాంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన శిబిరంలో తెలుగు, ఇంగ్లీషు, హిందీ, సంస్కృతం, ఉర్దూ జవాబుపత్రాలను మూల్యాంకనం చేస్తున్నారు. మోమిన్, రాణిలు డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తున్నారు. నిర్మలా హైస్కూల్‌లో శిబిరంలో డైట్ లెక్చరర్ లలితామోహన్, సీఈ బోర్డు సెక్రటరీ జాన్ సాహెబ్ వ్యవహరిస్తున్నారు. ఈ శిబిరంలో గణితం, సైన్సు, సోషల్ జవాబుపత్రాలను మూల్యాంకనం చేస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్ డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్ రాజు వ్యవహరిస్తున్నారు. డీఈవో తాహెరా సుల్తానా సోమవారం కేంద్రాలను పరిశీలించారు. అనారోగ్యం కారణంగా 81 మంది టీచర్ల కొరత ఏర్పడిందని, మంగళవారం ఈ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఖచ్చితంగా జవాబుపత్రాలను మూల్యాంకనం చేయాలన్నారు.


ఎన్టీఆర్ జిల్లాలో మూల్యాంకన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖ కమిషనర్

ఎన్టీఆర్ జిల్లాలో పకడ్బందీగా..

- కేంద్రాన్ని పరిశీలించిన విద్యాశాఖ కమిషనర్

విద్యాధరపురం : 2024 విద్యాసంవత్సరం పదోతరగతి పరీక్షల జావాబుపత్రాల మూల్యాంకన కార్యక్రమం సోమవారం ఎన్టీఆర్ జిల్లా కేంద్రాల్లో ప్రారంభమైంది. విజయవాడలోని బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలోని మూల్యాంకన కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి, పరిశీలకులు కె.వి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఈ ఏడాది టెన్త్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయని తెలిపారు. జావాబుపత్రాల మూల్యాంకన కార్యక్రమం ఈనెల 8వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలోని రెండు బ్లాకుల్లో జరుగుతున్న మూల్యాంకన కార్యక్రమంలో 766 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కె.వి.ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పనులు కాక నిరాశతో ప్రజలు, విద్యుత్ లేక అవస్థ పడుతున్న సిబ్బంది

పామర్రు పంచాయతీకి పవర్ కట్!

- బకాయిలు చెల్లించలేదని విద్యుత్ శాఖ చర్యలు

పామర్రు, ఏప్రిల్ 1 : నిధుల లేమి ఓ వైపు, ఖర్చుల భారం మరోవైపు అల్లాడుతున్న గ్రామ పంచాయతీలపై పెండింగ్ బకాయిల పేరుతో విద్యుత్‌శాఖ అధికారులు చర్యలకు దిగుతున్నారు. దీనిలో భాగంగానే నియోజకవర్గ కేంద్రమైన పామర్రు పట్టణ మేజర్ పంచాయతీ కార్యాలయంతోపాటు, గ్రామ సచివాలయాలకు అధికారులు విద్యుత్ సరఫరా నిలుదలచేశారు. ఈ నేపథ్యంలో వివిధ అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. పామర్రు పంచాయతీ పరిధిలోని 49 విద్యుత్ సర్వీసులున్నాయి. గత కొన్నేళ్లుగా బకాయిలు రూ. 4కోట్ల 45లక్షల 82వేలకు చేరుకున్నాయి. ఇటీవల కేంద్రం విడుదల చేసిన 15 ఆర్థిక సంఘ నిధుల్లో నుంచి బకాయిలను రాబట్టుకునేందుకు విద్యుత్ అధికారులు పలుమార్లు గ్రామ పంచాయతీలకు నోటీసులు ఇచ్చినప్పటికీ పాలకమండలిగాని, పంచాయతీ అధికారులుగానీ పట్టించుకోకపోవడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది పంచాయతీ కార్యాలయంతోపాటు ఒకటి, రెండు గ్రామ సచివాలయ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. దీంతో కార్యాలయాల్లో పౌరసేవలు నిలిచిపోయాయి. ప్రజలతో పాటు గ్రామ సచివాలయాల సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీమ్‌ను వివరణ కోరగా.. విద్యుత్ శాఖ సూచన మేరకు బకాయిల్లో 20శాతం రూ.10లక్షల 81వేల444 చెల్లింపు చేశామన్నారు. సరఫరా పునరుద్ధరణలో అధికారులు జాప్యం చేస్తున్నారని, ఈవిషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. రెండు రోజుల్లో సమస్యకు పరిష్కారం లభిస్తుందనే అశాభావం వ్యక్తం చేశారు.

వలంటీర్ల రాజీనామాలు
ఆమోదించకండి



- వలంటీర్లను అడ్డుపెట్టుకుని జగన్‌రెడ్డి రాజకీయాలు : రవీంద్ర ధ్వజం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 : వలంటీర్లపై ఒత్తిడి తెచ్చి బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారని అధికారులు వాటిని ఆమోదించవద్దని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర కోరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రవీంద్ర మాట్లాడారు. మూకుమ్మడి రాజీనామాలకు వైసీపీ నాయకులు ఒక ఫార్మెట్ తయారు చేసి ఇచ్చారని, అదే ఫార్మెట్‌లో వలంటీర్లు రాజీనామా పత్రాలు సమర్పిస్తున్నారన్నారు. వలంటీర్ల నిజస్వరూపం ప్రజలకు ఇప్పుడు అర్థమైందన్నారు. వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్ వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయించవద్దని చెబితే దానికి వ్యతిరేకంగా వ్యవహరించడం సబబు కాదన్నారు. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లను వాడుకునేందుకు బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. దీనికి కారకులపై ఈసీ చట్టరీత్యాచర్యలు తీసుకోవాలన్నారు. రాజీనామాలు సమర్పించిన వలంటీర్లు 'జై జగన్' అంటూ కార్యాలయాల నుంచి బయటకు రావడం విడ్డూరంగా ఉందన్నారు.

ఎన్నికలైన 20 రోజులకే
వైసీపీ అడ్రస్ గల్లంతు!

- కేశినేని శివనాథ్ (చిన్ని)

మైలవరం, ఏప్రిల్ 1 : పక్క రాష్ట్రంలో ఓ పార్టీ 100రోజుల్లో ఎలా కొట్టుకుపోయిందో.. ఆంధ్రరాష్ట్రంలో ఎన్నికలైన ఇరవై రోజులకే వైసీపీ కొట్టుకుపోతుందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. మైలవరంలో ఓ ప్రవేటు కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు బూత్ కన్వీనర్లు, క్లష్టర్లు, శంఖారావం సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, వైసీపీ డబ్బు సంచులతో గెలవొచ్చని మభ్యపడుతున్నా.. ప్రజల గుండెల్లో టీడీపీ బలంగా ఉందని, ఎప్పుడు గెలిపించుకుందామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. చంద్రబాబు మా కుటుంబాన్ని నమ్మి రెండుసార్లు టికెట్టు ఇచ్చి గెలిపిస్తే పార్టీ మారిన నాని వంటి వ్యక్తులకు భవిష్యత్తు ఉండదని అన్నారు. నాకు పదవులు ఇచ్చినా.. ఇవ్వకపోయినా టీడీపీని వీడక నిత్యం పార్టీ కోసం శ్రమిస్తానన్నారు. జనసేన, బీజేపి, టీడీపీ కూటమి భారీ విజయానికి ప్రతిఒక్కరూ అహర్నిశలు శ్రమించి



బాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఆయన కోరారు.

● టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబు, లోకేశ్‌లను తిట్టమంటే చేతకాదన్నందుకు నీకు ప్రాధాన్యత ఇవ్వలేక పోతున్నాను అనడం.. శాసన సభ్యుడిగా గెలిచిన నాటి నుంచి జగన్‌రెడ్డిని మైలవరం అభివృద్ధి గురించి కలిసే అవకాశం లేకపోవడంతో వైసీపీని వీడటం జరిగిందన్నారు. నియోజకవర్గంలో గడప గడపకు తిరుగుతుంటే మా పిల్లలు ఉన్నత చదువులు చదువుకున్నారు.. ఉద్యోగాలు లేవని, ఇళ్ల ముందు డ్రెయినేజీలు, రోడ్లు లేవని ప్రజలు అడుగుతుంటే సమాధానం చెప్పేపరిస్థితి లేకపోయిందన్నారు. అన్ని సమస్యలకు పరిష్కారం వలంటీర్లే అన్నట్లు, వార్డు నెంబర్లు దగ్గర నుంచి సర్పంచ్‌లు, శాసన సభ్యుల వరకు నిర్వీర్యం చేసి అభివృద్ధిని పక్కన పెట్టిన వైసీపీలో ఎలా కొనసాగాలని ప్రశ్నించారు. చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని, యువత భవిష్యత్తుకు గ్యారంటీ భరోసా ఉంటుందని టీడీపీలో చేరడం జరిగిందన్నారు. శంఖారావం కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని బూత్ కన్వీనర్లకు, క్లష్టర్లలను ఆయన కోరారు. అనంతరం బూత్ కన్వీనర్లకు కిట్టు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోమటి సుధాకర్, జనసేన నియోజకవర్గ నాయకులు అక్కల రామ్మోహనరావు (గాంధీ), జంపాల సీతారామయ్య, జువ్వా రాంబాబు, విజయబాబు, ఉయ్యూరు నర్సింహరావు, బుల్లిబాబు, లంక లితీష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, క్లష్టర్లు పాల్గొన్నారు.



తొలి జాబితాలో
దక్కని చోటు


- ఎంపీల జాబితా విడుదల చేసిన కాంగ్రెస్
- విజయవాడ, మచిలీపట్నం స్థానాలు పెండింగ్

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ స్థానాల అభ్యర్థులకు సంబంధించి విడుదల చేసిన జాబితాలో ఉమ్మడి కృష్ణా జిల్లాకు స్థానం దక్కలేదు. ఉమ్మడి జిల్లాలో విజయవాడ, మచిలీపట్నం లోక్‌స్థానాలకు సంబంధించి ఏదోఒక స్థానానికి అభ్యర్థిని ఖరారు చేస్తారని ఆశావహులు భావించారు. కాంగ్రెస్ ఎన్నికల కమిటీ (సీఈసీ) రాష్ట్రంలో కడప, కాకినాడ, రాజమండ్రి, విశాఖ, బాపట్లతో పాలు పలు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను సోమవారం ప్రకటించింది. ఇందులో జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాలను పెండింగ్‌లో పెట్టారు. త్వరలో విడుదల చేయబోయే రెండో జాబితాలో ఈ రెండు స్థానాల అభ్యర్థుల పేర్లు ఉండొచ్చని భావిస్తున్నారు. విజయవాడ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడానికి నలుగైదుగురు పోటీపడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు బుర్రా కిరణ్, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర కమిటీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహరావు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వారితోపాటు వల్లూరి అశోక్ ఉంది. ఇప్పటికే టీడీపీ, వైసీపీలు కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతలను అభ్యర్థులుగా ప్రకటించాయి. అదే కోవలో వెళ్లానుకుంటే కాంగ్రెస్ పార్టీ నుంచి బుర్రా కిరణ్, సుంకర పద్మశ్రీ, వల్లూరి అశోక్‌లకు అవకాశాలు దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. ఇది కాకుండా కాపు సామాజికవర్గం నుంచి అభ్యర్థి ఎంపిక చేయాలనుకుంటే నరహరశెట్టి నరసింహరావుకు అవకాశం దక్కవచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నరసింహరావు 2019 ఎన్నికల్లో విజయవాడ ఎంపీగా పోటీ చేశారు. మచిలీపట్నం ఎంపీ స్థానాన్ని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మాజీ చైర్మన్ గొల్లు కృష్ణ, చలమలశెట్టి ఆదికిరణ్ ఆశిస్తున్నారు. వారితోపాటు కోకా ఫణిభూషణ్ ఎంపీగా పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ ముగ్గురిలో ఫణిభూషణ్, కృష్ణ బీసీ సామాజికవర్గానికి చెందిన వారు. ఆదికిరణ్ ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు. మచిలీపట్నం లోక్‌సభ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా ప్రస్తుత ఎంపీ వల్లభనేని బాలశౌరి, వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ పేర్లను ప్రకటించాయి. ఈ ఇద్దరు అభ్యర్థులు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు. కాంగ్రెస్ పార్టీ ఈసారి ఇక్కడ బీసీ అస్త్రాన్ని ప్రయోగించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో గొల్లు కృష్ణకు గానీ, ఫణిభూషణ్‌కు గానీ లైన్ క్లియర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదటి జాబితాలో పేర్లు లేకపోవడంతో ఆశావహులు నీరసించారు. త్వరలో విడుదల కాబోయే జాబితాలో తమ పేర్లు ఉంటాయా అన్న సందిగ్ధంలో ఉన్నారు. జాబితాలో వారి పేర్లను ఉండేలా చేసుకోవడానికి ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో సీనియర్లు కచ్చితంగా పోటీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. దీనికి తగినట్టుగానే మొదటి జాబితాలో సీనియర్ నేతల పేర్లను ప్రకటించారు.

ముస్లింలకు అండగా టీడీపీ

- విజయవాడ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని

విద్యాధరపురం, ఏప్రిల్ 1 : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ముస్లిం మైనార్టీలకు అండగా నిలిచిందని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. సోమవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని ముస్లిం మహిళలు టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా ఆధ్వర్యంలో గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో కేశినేని చిన్ని సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ముస్లిం మత సంప్రదాయం ప్రకారం వారిని సత్కరించారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ప్రజాశ్రేయస్సు కోసం ఏ


ముస్లిం మహిళకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన కేశినేని చిన్ని

కూటమిలో చేరినా శాంతిభద్రతలు కాపాడి ముస్లింల మనోభావాలు దెబ్బతినకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించే పార్టీ అని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో రూ.15కోట్లతో షాదీఖానా, 92 సెంట్ల స్థలంలో ఉర్దూ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదే అని తెలిపారు. పాతబస్తీని కేంద్ర, రాష్ట్ర నిధులతో అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ముస్లిం ఐక్యవేదిక ఎన్టీఆర్ జిల్లా ప్రెసిడెంట్ సయ్యద్ నసీమా, జనరల్ సెక్రటరీ సయ్యద్ సత్తార్‌అహ్మద్, కేశినేని చిన్ని సమక్షంలో పార్టీకి మద్దతు తెలిపారు.

టీడీపీలో చేరిన హోప్ ఫర్ నీడి సంస్థ సభ్యులు

హోప్ ఫర్ నీడి సంస్థ సభ్యులు కేశినేని చిన్ని సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శివనాథ్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొమ్మారెడ్డి పట్టాభిరామ్, విజయవాడ మాజీ మేయర్ కోనేరు శ్రీధర్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రాభివృద్ధితో పాటు యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా శ్రవిస్తున్న చంద్రబాబునాయుడిని గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఎన్టీఆర్ భవన్‌లో తూర్పు కాపు ఆత్మీయ సమ్మేళన సమావేశపు కరపత్రాన్ని సోమవారం కేశినేని శివనాథ్ ఆవిష్కరించారు. ఈ నెల 14వ తేదీ జక్కంపూడి రోడ్డులోని వైఎస్ రెడ్డి కళ్యాణమండపంలో ఈ సమావేశం జరగనున్నది.

సిద్ధం సభలు పాలపొంగులే

- బందరు ఎంపీ బాలశౌరి


విలేకరుల సమావేశంలో నేతలు

పెనమలూరు, ఏప్రిల్ 1 : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిద్ధం సభలు పాలపొంగుల్లాంటివని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి వ్యాఖ్యానించారు. ఐదేళ్లుగా అభివృద్ధి జాడ లేకుండా.. ఉత్తుత్తి బటన్‌లు నొక్కుతూ ప్రజలను మభ్యపెట్టి, అదే ప్రజల వద్దకు వెళ్లి తనకు ఓట్లు వెయ్యమని అడగడం ఒక్క జగన్‌కే చెల్లిందన్నారు. సోమవారం పోరంకి వందడుగుల రోడ్డులో జనసేన కార్యాలయం ప్రారంభానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. కంకిపాడు నుంచి గుడివాడకు కోట్ల రూపాయల కేంద్ర నిధులతో త్వరలో గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి నివేదించామన్నారు. బందరు పార్లమెంటులోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేస్తానన్నారు. పెనమలూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బోడె ప్రసాద్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో తనతోపాటు బందరు ఎంపీ సీటును కూడా గెలిపించుకునేందుకు కృషి చేస్తానన్నారు. గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, సైకో జగన్‌ను ధృతరాష్ట్రుడితో పోల్చారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ, బాలశౌరిని మరింత మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, పామర్రు టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా, జనసేన బాధ్యులు ముప్పారాజా, అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, జనసేన, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

కృత్తివెన్నులో బ్రహ్మరథం పట్టిన ప్రజలు


ప్రచార ర్యాలీలో బాలశౌరి, కాగిత కృష్ణప్రసాద్

కృత్తివెన్ను : రానున్న ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పటం ఖాయమని బందరు ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌లు అన్నారు. సోమవారం తొలిసారిగా బాలశౌరి పెడన నియోజకవర్గ పర్యటనలో మండలానికి విచ్చేయగా, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వారికి బ్రహ్మరథం పట్టారు. గజమాలలతో ఘనంగా సత్కరించి అభిమానం చాటుకున్నారు. లక్ష్మీపురం నుంచి చినగొల్లపాలెం వరకు బైక్‌లు, కార్లతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

మండలికి సీటిస్తే మూకుమ్మడి రాజీనామాలు

- తాము ఉండలేమని స్పష్టం చేసిన జనసేన ముఖ్యనేతలు


బుద్ధప్రసాద్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న జనసేన నేతలు, కార్యకర్తలు

అవనిగడ్డ, ఏప్రిల్ 1 : మండలి బుద్ధప్రసాద్‌కు టిక్కెట్ ఇస్తే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని జనసేన పార్టీ ముఖ్య నేతలు స్పష్టం చేశారు. సోమవారం అవనిగడ్డలో పార్టీ సీనియర్ నేత బచ్చు వెంకటనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జనసేన క్రియాశీలక కార్యకర్తలు, ముఖ్య నేతలు మాట్లాడుతూ, కృష్ణాజిల్లాలో జనసేనకు వచ్చిన ఒక్క స్థానాన్ని కూడా నిలబెట్టుకోలేక పోతే ఎలా అని ప్రశ్నించారు. దీనికితోడు కొద్దిరోజులుగా మండలి ఇంటి వద్ద టీడీపీ నేతలు వరుస సమావేశాలు నిర్వహించి, జనసేన పార్టీకి ప్రజల్లో ఆదరణ లేదని, జనసేన పోటీ చేస్తున్న 21 స్థానాల్లో మొదటిగా ఓడిపోయేది అవనిగడ్డ సీటేనని వ్యాఖ్యలు చేశారన్నారు. ఆ సమయంలో మండలి బుద్ధప్రసాద్, వెంకట్రామ్ అక్కడే ఉన్న విషయం గుర్తు చేశారు. మండలి బుద్ధప్రసాద్ ఇప్పుడు జనసేనలోకి వచ్చి ఎలా గెలుస్తారని, దీనికితోడు కండువాలు మార్చే వ్యక్తిని కాదని, డబ్బు రాజకీయాలకు తాను దూరమని చెప్పిన మండలి ఇప్పుడు డబ్బు ఎక్కడి నుంచి తీసుకొచ్చి పోటీ చేస్తున్నారని పలువురు కార్యకర్తలు ప్రశ్నించారు. బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వాలని జిల్లా పార్టీ ఎలా సూచిస్తుందని కొందరు తీవ్ర వ్యాఖ్యలు చేయటంతో నియోజకవర్గ నేతలకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ అనుచరులకు మధ్య కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పార్టీలో ఎవరో ఒకరికి టిక్కెట్ ఇస్తే తామంతా ఒకే తాటిపైకి వచ్చి గెలిపించుకుంటామని, పక్క పార్టీ నుంచి తీసుకొచ్చి టిక్కెట్ ఇస్తే తాము ఉండబోమని, భావదేవరపల్లి, కోడూరు మండలాలకు చెందిన పలువురు నేతలు స్పష్టం చేశారు. పార్టీలో ముందు నుంచి పనిచేసిన నాయకులకే సీటు ఇవ్వాలని అధినేతపై ఒత్తిడి తెస్తామని, దీనికోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమని బండ్రెడ్డి రామకృష్ణ కార్యకర్తలకు నచ్చచెప్పారు. కార్యక్రమంలో జనసేన నేతలు రాయపూడి వేణుగోపాలరావు, మత్తి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు, చిలకలపూడి పాపారావు, బండ్రెడ్డి మల్లిఖార్జున, పూషడపు రత్నగోపాల్, కోన రాజశేఖర్, కొండవీటి సునీత, అరజా రాధిక, శ్రీలీల, పప్పుశెట్టి శ్రీను, ఎంపీటీసీలు కటికల వసంత్, బొప్పన భాను, ఆరు మండలాలకు చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్

- పోలింగ్ సిబ్బందికి దశల వారీగా శిక్షణ కలెక్టర్ ఢిల్లీరావు వెల్లడి

కృష్ణలంక, ఏప్రిల్ 1 : జిల్లాలో ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియకు చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఢిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులతో కలిసి హాజరయ్యారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి జిల్లాస్థాయిలో సన్నద్ధత, ప్రక్రియ చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కలెక్టర్ వివరించారు. ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించనున్న కార్యకలాపాలను వివరించారు. పీఓలు, ఏపీవోలు తదితరులతో పాటు ఇతర పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, పాల్గొన్న ఇతర అధికారులు

ఏప్రిల్ 1 నాటికి జిల్లాలో రూ.1.87 కోట్ల నగదు, రూ.86.89 లక్షల మద్యం, రూ.5.58 లక్షల మత్తు పదార్థాలు, రూ.2.32 కోట్ల విలువైన లోహాలు మొత్తం రూ.5.27 కోట్ల విలువైన సీజర్లు జరిగినట్లు కలెక్టర్ వివరించారు.

జిల్లాలో కట్టుదిట్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

కృష్ణలంక : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, ఇప్పటి వరకు వివిధ మార్గాల ద్వారా 1235 ఫిర్యాదులు రాగా వాటిలో 1213 పరిష్కరించడం జరిగిందని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా కోడ్ ఉల్లంఘనలతో పాటు ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. మీడియాలో 43 ప్రతికూల వార్తలకు సంబంధించి 31 వార్తలపై ఇప్పటికే తగు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి వివిధ అనుమతుల కోసం ఎన్‌కోర్ ద్వారా వచ్చిన 44 దరఖాస్తుల్లో 30 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.


గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు రామ్మోహన్ మిశ్రాకు బొకేతో స్వాగతం పలుకుతున్న ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

ఎన్నికల పరిశీలకునికి స్వాగతం

గన్నవరం, ఏప్రిల్ 1 : రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు, విశ్రాంత ఐఏఎస్ రామ్మోహన్ మిశ్రాకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ఎయిరిండియా విమానంలో సోమవారం రాత్రి ఆయన ఇక్కడికి విచ్చేశారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, అదనపు సీఈవో ఎంఎన్ హరేందిర ప్రసాద్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి తదితరులు పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ వెళ్లారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడి
యువకుడు దుర్మరణం



జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 1 : బతుకు దెరువు కోసం రాష్ట్రానికి వచ్చి కన్నతండ్రి, సొంత బాబాయి కళ్లెదుటే యువకుడు మృతి చెందిన విషాద ఘటన సోమవారం చిల్లకల్లులో జరిగింది. నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వల్లెగూడెంకు చెందిన రావూరి కిరణ్ (30) తండ్రి కృష్ణ, బాబాయితో కలిసి కేబుల్ వైర్లు రిపేరు చేస్తుంటారు. దీనిలో భాగంగా చిల్లకల్లులోని ప్రైవేట్ కేబుల్ ఆపరేటర్ వైర్లు సరిచేసేందుకు వచ్చి విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన తీగలను సరిచేస్తుండగా విద్యుత్ షాక్ తగిలిందా.. లేక అదుపు తప్పి కింద పడటంతో తల పగలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సతీష్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

చికిత్స పొందుతూ..
అమెరికాలో గీతాంజలి మృతి

- కొణకంచిలో విషాదఛాయలు

పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 1 : అమెరికాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలో కొణకంచి గ్రామానికి చెందిన కమతం గీతాంజలి (30) సోమవారం ఉదయం మృతి చెందినట్టు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. గీతాంజలి పుట్టినరోజు సందర్భంగా అమెరికాలో ఆలయానికి వెళ్లి వస్తుండగా ఆదివారం ప్రమాదంలో గీతాంజలి కుమార్తె హానిక (6) అక్కడికక్కడే మృతి చెందగా, గీతాంజలి అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. దీంతో కొణకంచిలో విషాద వాతావరణం నెలకొంది. గీతాంజలి భర్త నరేష్, కుమారుడు సురక్షితంగా ఉన్నారు.

ఉపాధి హామీ లక్ష్యం.. 80 లక్షల పనిదినాలు

వన్‌టౌన్, ఏప్రిల్1 : ఎన్టీఆర్ జిల్లాలో ఉపాధి హామీ కింద 80 లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుని ఆ మేరకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఢిల్లీరావు, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వారానికి ఐదులక్షల పనిదినాలను కల్పించేందుకు ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నట్టు తెలిపారు. వేకువజామునే పనులు మొదలు పెట్టి ఉదయం 10 గంటలకల్లా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవి దృష్ట్యా కూలీలకు సంబంధించి అన్ని చర్యలు తీసుకున్నామని తాటి ఆకులు, ఈత ఆకులతో పందిళ్లు వేయడం, గ్రీన్ షెడ్స్ ఏర్పాటు చేయడం వంటి వాటిపై దృష్టి పెట్టామన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పెన్షన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్వామా పీడీ జె.సునీత, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా పథకం ఎస్ఈ డి.వెంకటరమణ సంబంధిత శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాలో 76 లక్షల 'ఉపాధి' పనిదినాలు
- కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం : జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా 2023-24సంవత్సరంలో 76లక్షల పనిదినాలను కల్పించినట్టు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా గత ఏడాదిలో 73లక్షల పనిదానాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 76లక్షల పనిదినాలను కల్పించి రూ.191 కోట్లను కూలీలకు వేతనాలుగా చెల్లించామన్నారు. 22వేల కుటుంబాలకు వందరోజుల పాటు, మహిళలకు 41లక్షల పనిదినాలను, ఎస్సీ కుటుంబాలకు 29లక్షల పనిదినాలను కల్పించామని తెలిపారు. పింఛన్ల పంపిణీ అంశంపై మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనందకుమార్, డీపీవో నాగేశ్వరనాయక్, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు



బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్ల ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

లయోల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాజెక్ట్ ప్రదర్శన



భారతీనగర్, ఏప్రిల్ 1: లయోల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈసీఈ, ఎంఈసీహెచ్, ఎంటీఏ, మెకానికల్ విభాగం సహకారంతో సోమవారం ప్రాజెక్ట్ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో ఈసీఈ, ఎంఈసీహెచ్, ఎంటీఏ విద్యార్థులు 44 ప్రాజెక్టులను ప్రదర్శించారు. పర్యావరణ ప్రదేశాలను వాడుకొని శక్తి ఉత్పత్తిని ప్రాజెక్టు రూపంలో తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఒ.మహేష్, శరత్‌కుమార్, డాక్టర్ కాన్తీ, లలీతా మాధవి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్‌పోస్టుల తనిఖీ

పటమట, ఏప్రిల్ 1 : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) అమల్లో ఉన్నందున విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్ సోమవారం తూర్పు నియోజకవర్గం పరిధిలోని వివిధ చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారధి, ఆటోనగర్, రామవరప్పాడు రింగ్ చెక్ పోస్టులను పరిశీలించి తనిఖీల తీరును పరిశీలించారు. అక్రమంగా నగదు, మద్యం, విలువైన లోహాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సిబ్బంది నిరంతర నిఘా, అప్రమత్తతతో వ్యవహరించాలని ఆర్డీవో సూచించారు. ప్రతీ నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఎంసీసీ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఎలక్షన్ సీజన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్) పటిష్ట అమలుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల అధికారులు కృషి చేయాలన్నారు. సెంట్రల్ జోన్ ఏసీపీ పి.భాస్కరరావు, పటమట సీఐ మోహన్ రెడ్డి, పోలీస్, మునిసిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు

పాయకాపురం, ఏప్రిల్ 1 : ప్రేమ పేరుతో బాలికను మోసగించి అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై నున్న రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం వాంబేకాలనీకి చెందిన బాలిక(15)కు రామకృష్ణాపురంకు చెందిన మన్నెం శ్రీకాంత్(28)తో పరిచయమైంది. బాలికకు ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పిన యువకుడు ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు పోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడి అరెస్టు

పాయకాపురం, ఏప్రిల్ 1: యువతిని ప్రేమ పేరుతో వంచించి ఆపై బెదిరించి అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై నున్న రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం సుందరయ్యనగర్‌కు చెందిన యువతి(22) నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తుంది. అదే ఆసుపత్రిలో పనిచేసే వీరంరెడ్డి మునీంద్రరెడ్డితో పరిచయం ఉంది. ప్రేమ పేరుతో యువతితో చనువుగా మెలిగిన మునీంద్రరెడ్డి ఆ సమయంలో ఫొటోలు, వీడియోలు తీశాడు. అనంతరం ఫొటోలను, వీడియోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరింపులకు గురి చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇటీవల బెదిరింపులు ఎక్కువ అవడంతో బాధితురాలు కుటుంబ సభ్యుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు యువకుడిపై అత్యాచారం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసిన నున్న రూరల్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

మొగల్రాజపురం, ఏప్రిల్ 1: విద్యుత్ మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు మొగల్రాజపురం సెక్షన్ మహాత్మాగాంధీ ఇండోర్ సబ్ స్టేషన్, 11 కేవీ జమ్మిచెట్టు ఫీడర్ పరిధిలో మధుగార్డెన్ ఏరియా, ఏఎస్ రామారావు రోడ్డు, శాంతి నగర్, జమ్మిచెట్టుసెంటర్, ఉడ్‌పేట, బాడవపేట, వాటర్ ట్యాంకు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పాయకాపురం: పాయకాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కండ్రిక మెయిన్‌రోడ్డు, పంపింగ్ స్టేషన్ ప్రాంతాలు, సుబ్బారెడ్డి స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలపై కుట్రలు

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

గుణదల, ఏప్రిల్ 1: జగన్మోహనరెడ్డి తన పరిపాలన కేవలం కక్షపూరిత విధానాలు, రాజకీయ లబ్ధి కోసమే వాడుకుంటున్నారని జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తూర్పు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ సతీమణి గద్దె అనురాధ, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ సోదరి శ్రీదేవిలు సోమవారం 2వ డివిజన్ కుమ్మర వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ లబ్ధిలో భాగంగానే పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న జాప్యాన్ని ప్రతిపక్షాలపై నెట్టేందుకు జగన్ కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. ప్రజలకు మంచి చేయాలని చిత్తశుద్ధి జగన్‌కు లేదన్నారు. సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయాలని టీడీపీ వారు చెబుతుంటే జగన్ దాన్ని రాజకీయాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రూ 4వేలు పెన్షన్ డోర్‌టూ డోర్ అందించనున్నట్లు తెలిపారు.



2వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో గద్దె అనురాధ. కేశినేని శివనాథ్ సోదరి శ్రీదేవి

తూర్పులో గద్దె రామ్మోహన్‌కు, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు గాబ్రియేలు, నుగసాని కృష్ణప్రసాద్, ముత్యాల కృష్ణ, చిన్నా, మంతెన దుర్గా ప్రసాద్, నాళం నరేంద్ర, దేవరపల్లి శ్రీహరి, కొండెపి శ్రీకృష్ణ, యలమంచలి రాజశేఖర్, వెల్లంకి సుధాకర్, రత్నశ్రీ పాల్గొన్నారు.

పింఛన్లు ఇవ్వలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం

పటమట : పింఛన్ల పంపిణీని టీడీపీ నిలుపు చేసిందని తాజాగా వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేస్తుందని, ఇది వాస్తవ విరుద్ధమైన విషయమని గద్దె క్రాంతికుమార్ అన్నారు. 9వ డివిజన్‌లో గద్దె క్రాంతికుమార్ సోమవారం స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి కాంతిశ్రీతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ వైసీపీ అంటేనే అబద్ధాల ప్రభుత్వం అని మండిపడ్డారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్(చిన్ని)లను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. యలమంచిలి దేవేంద్ర, ఎం.లక్ష్మి, కె.దుర్గాభవానీ, అన్నాబత్తుని శ్రీదేవి, ఎం. గోవింద్, రామకృష్ణ, కె. సుబ్బారావులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థి కోటేశ్వరరావును గెలిపించాలి

వన్‌టౌన్, ఏప్రిల్ 1: ఇండియా కూటమి అభ్యర్థిగా పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావును గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. సీపీఐ నాయకుడు కొరగంజి శేఖర్‌బాబు 19వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం లెనిన్‌భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు, శంకర్‌లు కలిసి



శేఖర్‌బాబు చిత్రపటానికి నివాళులర్పించిన దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావు తదితరులు

కొరగంజి శేఖర్‌బాబు స్ఫూర్తితో ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని తరిమికొట్టి లౌకిక ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఎన్‌డీఏ రాష్ట్రానికి ద్రోహం చేసిందని, ప్రత్యేక హోదాపై ఇండియాకూటమి తొలి సంతకం చేస్తుందని పేర్కొన్నారు. నక్కా వీరభద్రరావు, కొరగంజి దుర్గాంబ, తాడిపైడయ్య, పంచదార్ల దుర్గాంబ, మూలి సాంబశివరావు, పలువురు ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులతో ఉపాధి అవకాశాలు

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుణదల, ఏప్రిల్ 1: యువతకు పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ సెంటర్‌ను కేఎస్ లక్ష్మణరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాలిసెట్ ఎంట్రన్స్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పరీక్షలో మంచి ఫలితాలు సాధించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం గర్వించదగిన విషయం అన్నారు. కోచింగ్ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉంటుందని చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్. వెంకటేశ్వరరావు, నగర నాయకులు కుమారస్వామి, మాధవ్, భార్గవ్, సంతోష్, పృథ్వి, యశస్విని, మణికంఠ, జ్వాలిత పాల్గొన్నారు.

రేపటి నుంచి మహిళలకు ఉచిత శిక్షణా తరగతులు

వన్‌టౌన్, ఏప్రిల్ 1: కాకరపర్తి భావనారాయణ కళాశాల ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి మహిళలకు వివిధ చేతివృత్తులలో ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో శిక్షణ తరగతుల పోస్టర్‌ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ అప్లికేషన్, గ్రాఫిక్ డిజైనింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ స్టైలింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, గ్లాస్ సాండ, పాట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేబీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తదితరులు

పెయింటింగ్, ఇంటీరియర్ డిజైనింగ్, జ్యూయలరీ మేకింగ్, మెహందీ డిజైన్స్, డైయింగ్ ట్రెయింగ్, ఆన్‌లైన్ పర్చేజింగ్ తదితర అంశాలలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. బాలబాలికలకు స్పోకెన్ ఇంగ్లీష్, స్పోకెన్ హిందీ, పెయింటింగ్, డ్రాయింగ్, వేదిక్ మ్యాథమెటిక్స్, కంప్యూటర్ బేసిక్స్ తదితర అంశాల్లో శిక్షణ తరగతులను నిర్వహిస్తామని వివరించారు. ఇప్పటికే దరఖాస్తులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ కే.రామకృష్ణ, ఐక్యూఏసీ కో- ఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, అధ్యాపకులు వి.శైలజ, కల్మాబేగం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు తక్షణమే పింఛన్లు పంపిణీ చేయాలి

పీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ

వన్‌టౌన్, ఏప్రిల్ 1: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ అందుబాటులో ఉండని కారణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా వృద్ధులు, దివ్యాంగులకు తక్షణమే పింఛన్లను పంపిణీ చేయాలని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ కోరారు. సోమవారం గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఫోన్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పింఛన్ల పంపిణీకి పదిరోజుల సమయం పడుతుందని, ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి అనడం సరికాదన్నారు. వలంటీర్లను పార్టీ ప్రతినిధులుగా, ప్రచార కార్యకర్తలుగా వినియోగించుకోవడం సరికాదన్నారు.

డాక్టర్ కలాంకు సినీ నటుడు సుమన్ అభినందనలు

ఆటోనగర్(పెనమలూరు), ఏప్రిల్ 1: అనేక సంక్షేమ కార్యక్రమాల్లో, ప్రజా సేవల్లో పాల్గొని డాక్టరేట్ సాధించి నేడు జన్మదినాన్ని జరుపుకొంటున్న ఆటోనగర్ బ్యాటరీ కలాం అధినేత డాక్టర్ అబ్దుల్ కలాంను సోమవారం సినీనటుడు సుమన్ అభినందించారు. డాక్టర్ కలాం చేసిన సామాజిక సేవలను సుమన్ అభినందిస్తూ డాక్టర్ కలాంకు తాను అత్యంత ఆప్తుడనే విషయాన్ని గుర్తు చేశారు. కలాం జన్మదిన వేడుకల కేకును కోసి శుభాకాంక్షలు తెలిపారు. ఐలా చైర్మన్ దుర్గాప్రసాద్, బాహుబలేంద్ర కోటేశ్వరరావు పాల్గొన్నారు.



డాక్టర్ కలాం జన్మదిన వేడుకల్లో సుమన్, దుర్గా ప్రసాద్ తదితరులు

కేశినేని చిన్నిని భారీ మెజారిటీతో గెలిపిస్తాం : మాధవ



పేదలకు భోజనం అందజేస్తున్న మాధవ

పాతరాజరాజేశ్వరిపేట, ఏప్రిల్ 1 : రానున్న ఎన్నికల్లో విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్నిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్. మాధవ అన్నారు. కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో 55వ డివిజన్ నైజాం గేట్ వద్ద సోమవారం అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పేదలకు భోజనం అందజేశారు. డివిజన్ అధ్యక్షుడు మెహ్మద్ జాహీద్ పాల్గొన్నారు.

జనశిక్షణా సంస్థాన్‌లో 5 నుంచి స్వయం ఉపాధి శిక్షణ

మొగల్రాజపురం, ఏప్రిల్ 1: జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి నిమిత్తం జన శిక్షణా సంస్థాన్ చైర్మన్ విద్యాఖన్నా ఆధ్వర్యంలో ఏప్రిల్‌లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. 5న కటింగ్ టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, 7 నుంచి ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్, 11వ తేదీ నుంచి హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెషిన్ ఎంబ్రాయిడరీ, 13 నుంచి ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ రిఫ్రిజిరేషన్, ఐస్ క్రీం మేకింగ్, 17నుంచి స్క్రీన్ ప్రింటింగ్, జామ్ అండ్ జ్యూస్ తయారీ, బాతిక్ ప్రింటింగ్, హోమ్ క్రాఫ్ట్, వంటి వాటిలో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు మొగల్రాజపురం రావి చెట్టు సెంటర్‌లో ఉన్న కార్యాలయంలో కాని, ఫోన్ 0866-2470420 లో కాని సంప్రదించవచ్చని తెలిపారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



వన్‌టౌన్, ఏప్రిల్ 1: ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, అవాంఛనీయ సంఘటనలను ప్రేరేపించినా, పోలీసుల విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని వెస్ట్ ఏసీపీ మురళీ కృష్ణారెడ్డి అన్నారు. ఎన్నికల దృష్ట్యా వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం సీఐ శేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి భరోసా కల్పిస్తూ పారామిలటరీ, సాధారణ పోలీసులు కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. వెస్ట్ డివిజన్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లేస్తున్నారు... మార్జిన్ వదిలేస్తున్నారు

● 44వ డివిజన్‌లో రోడ్ల దుస్థితి ● సైక్లిస్టులు, వాహనదారులకు గాయాలు

భవానీపురం, ఏప్రిల్ 1: లక్షలాది రూపాయల వ్యయంతో రోడ్లేస్తున్నా... కీలకమైన మార్జిన్‌ల వద్ద గ్రావెల్ నింపకుండా వదిలేస్తున్నారు. దీంతో సిమెంట్ రోడ్లు అంచుల పాడై రోడ్లు దెబ్బతినే అవకాశాలున్నాయి. 44వ డివిజన్‌లో ఇటీవల కేసీ స్కూల్, గంజి యలమందయ్య వీధి, కల్యాణ వెంకటేశ్వరస్వామి గుడి వీధుల్లో సీసీ రోడ్లను వేశారు. రోడ్లు వేశాక వాటరింగ్ చేసి నెలలు అవుతున్నా మార్జిన్‌ల వెంబడి గ్రావెల్ పరచడం మరిచారు. ఈ కారణంగా అంచుల వెంబడి రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, సైక్లిస్టులు కింద పడి గాయపడుతున్నారు. మార్జిన్‌ల నిర్వహణ ఖర్చును కాంట్రాక్టర్లు మిగుల్చుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కొన్ని చోట్లైతే ఇళ్ల మెటీరియల్ వ్యర్థాలను నింపడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఈ విషయంపై ఇంజనీరింగ్ అధికారులు స్పందించి కాంట్రాక్టర్లపై చర్యలకు ఉపక్రమించి మార్జిన్‌లను నింపాల్సిన అవసరం ఉంది.



కేసీ స్కూల్ వద్ద గ్రావెల్‌తో నింపకుండా వదిలేసిన రోడ్డు మార్జిన్

నిరుద్యోగులను మోసగించిన జగన్

● కేశినేని వెంకట్



టీడీపీ అమలు చేసే పథకాలు వివరిస్తున్న కేశినేని వెంకట్

సత్యనారాయణపురం, ఏప్రిల్ 1: జగన్‌రెడ్డి చెప్పేవన్నీ మోసాలని, ప్రతీ ఏడాది జాబ్‌క్యాలెండర్ ప్రకటిస్తానని నిరుద్యోగులను నమ్మించి మోసం చేశాడని టీడీపీ పార్లమెంటు అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) తనయుడు కేశినేని వెంకట్ ఆరోపించారు. 30వ డివిజన్ బుడమేరు మధ్యకట్ట వద్ద కేశినేని వెంకట్ సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు పడుతున్న కష్టాలు అడిగి తెలుసుకొని ప్రజల భవిష్యత్తుకు టీడీపీ గ్యారెంటీ అని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే పరిశ్రమలు వస్తాయని, తద్వారా యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. చంద్రబాబు నాయుడుకే సంపద ఎలా సృష్టించాలో తెలుసు అన్నారు. ఎన్నికలకు కొద్ది రోజులే ఉన్నాయని, టీడీపీ ప్రవేశపెట్టే పథకాలను ప్రతి ఇంటికీ తీసుకు వెళ్లి జగన్మోహనరెడ్డి పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో చౌదరి సూర్యనారాయణ, ఎల్.ఎస్.ఆర్, గరిమెళ్ల చిన్నా, రెడ్డి శంకర్, అనురాధ, భాస్కర్, కరణం వెంకట రమణ, టీడీపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో వీఎంసీకి రాష్ట్రంలో ద్వితీయ స్థానం

చిట్టినగర్, ఏప్రిల్ 1: ఆస్తి పన్ను వసూళ్లలో విజయవాడ నగరపాలక సంస్థ రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని కమిషనర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. 2లక్షల15వేల445 అసెస్‌మెంట్లకు గాను మార్చి 31 నాటికి రూ.124.35 కోట్లు వసూలు చేశామని వివరించారు. ఈ విషయంలో నగర ప్రజలకు, సచివాలయ కార్యదర్శులు, వీఎంసీ అధికారులకు అభినందనలు తెలిపారు. వీఎంసీ మొత్తం డిమాండ్ 157.23కోట్లకు గాను రూ.124.35కోట్లు వసూలు చేశామన్నారు. మార్చి 31వ తేదీ ఒక్కరోజునే రూ.3.49కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు.

ఎన్టీఆర్‌కు తండ్రిగా.. ?




స్పై యూనివర్స్ నుంచి వచ్చి హిట్ అయిన చిత్రం 'వార్'. హృతిక్ రోషన్ హీరోగా నటించిన ఆ చిత్రానికి సీక్వెల్ ఇప్పుడు రూపొందుతోంది. ఈ సినిమాతో జూనియర్ ఎన్టీఆర్ బాలీవుడ్‌కు పరిచయమవుతున్నారు. ఒక కొత్త లుక్‌లో కనిపించడం కోసం ఫిన్లాండ్ నుంచి వచ్చిన స్పెషల్ ట్రైనర్ దగ్గర శిక్షణ పొందనున్నారు ఎన్టీఆర్. దాదాపు రూ. 300 కోట్ల బడ్జెట్‌తో యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు కూడా నటిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్టీఆర్ తండ్రి పాత్రను ఆయన పోషిస్తారని సమాచారం. అయితే ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ ధ్రువీకరించాల్సి ఉంది. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అలియా భట్, కియారా అడ్వాణీ హీరోయిన్లుగా నటిస్తారని అంటున్నారు.



టిల్లు స్క్వేర్ చూసి ఎంజాయ్ చేశా

మెగాస్టార్ చిరంజీవి

ఇటీవల విడుదలై విజయం సాధించిన 'టిల్లు స్క్వేర్' చిత్రాన్ని చూసి మెగాస్టార్ చిరంజీవి బాగా ఎంజాయ్ చేశారు. వెంటనే ఆయన చిత్రబృందాన్ని తన ఇంటికి పిలిపించుకొని ప్రత్యేకంగా అభినందించడం విశేషం. ఆయన ఆహ్వానంపై హీరో సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు మల్లిక్ రామ్, నిర్మాత నాగవంశీ చిరు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'ఒక సినిమా హిట్ అయి, దానికి సీక్వెల్‌గా మరో చిత్రం వస్తుంటే అంచనాలు భారీ స్థాయిలో ఉంటాయి. వాటిని అందుకోవడం అంత తేలికైన విషయం కాదు. కానీ హీరో సిద్ధు, దర్శకుడు మల్లిక్‌రామ్, నిర్మాత నాగవంశీ. ఇతర టీమ్ అంతా కలసి ప్రేక్షకులు మెచ్చేలా 'డీజె టిల్లు'కు సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్'ను అందించడంలో విజయం సాధించారు. అదే ఉత్కంఠ, అదే సరదా, అదే నవ్వుల జల్లు. నటుడిగా, కథకుడిగా వ్యవహరించి, ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి ప్రధాన కారణమైన సిద్ధును అభినందిస్తున్నాను.ఈ సినిమా కోసం ఎంత కష్ట పడ్డామో, నిద్రలేని రాత్రులు ఎన్ని గడిపామో అని సిద్ధు నాతో చెప్పాడు. దర్శకుడు మల్లిక్ రామ్, ఎడిటర్ నవీన్ నూలి సహా అందరి సమష్టి కృషి ఉందని తెలిపాడు. విజయం సాధించిన దర్శకనిర్మాతలకు నా శుభాకాంక్షలు. 'మ్యాడ్' చిత్రంతో దర్శకుడిగా ఆకట్టుకొన్న కల్యాణ్ ఈ సినిమా రచనలో సహకారం అందించాడని విన్నాను. కేవలం యువతనే కాకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా సినిమా తీశారు. ఈ సినిమా చూసి నేను బాగా ఎంజాయ్ చేశా. మీరు చేయండి' అన్నారు.

ఫ్యామిలీ ఆడియెన్స్ సెలబ్రేట్ చేసుకునేలా ఉంటుంది



విజయ్ దేవరకొండ, మృణాల్‌ఠాకూర్ నటించిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. పరశురామ్ పెట్ల దర్శకత్వం వహించారు. దిల్‌రాజు,శిరీశ్ నిర్మించారు. ఈ నెల 5న 'ఫ్యామిలీ స్టార్' విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. దిల్‌రాజు మాట్లాడుతూ "ఫ్యామిలీ స్టార్ సినిమా విషయంలో ప్రతీ విషయంలోనూ పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది. డైరెక్టర్ కథ చెప్పగానే అందులోని పాయింట్ నన్ను ఎక్సైట్ చేసింది. ఈ సినిమాకు విజయ్ క్యారెక్టర్ వెన్నెముక లాంటిది. ఇది 30 శాతం ఫ్యామిలీ స్టోరీ, 70 శాతం లవ్ స్టోరీ. మృణాల్ లక్కీ హీరోయిన్. ఈ చిత్రంతో తెలుగులో ఆమె హ్యాట్రిక్ అందుకుంటుంది" అని అన్నారు. విజయ్ మాట్లాడుతూ "మనకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడి నేనున్నా అని చెప్పే వ్యక్తి ఫ్యామిలీలో ఒకరు ఉంటారు. ఆ ఒక్కరే ఫ్యామిలీ స్టార్. ఈ సినిమాకు, 'గీతాగోవిందం' సినిమాకు ఏ పోలిక ఉండదు. ఈ కథ వింటున్నప్పుడు మా నాన్న గుర్తొచ్చారు. అందుకే ఈ సినిమాలో నా క్యారెక్టర్‌కి మా నాన్న పేరు గోవర్ధన్ అని పెట్టాం" అని చెప్పారు. మృణాల్ మాట్లాడుతూ "సీతారామం, హాయ్‌నాన్న తర్వాత నా నెక్స్ట్ తెలుగు ప్రాజెక్ట్ కోసం చాలా కథలు విన్నా. ఈ సినిమా కథ నాకు నచ్చడంతో వెంటనే ఒప్పేసుకున్నాను. మన జీవితాల్లోని ఎమోషన్స్, రిలేషన్స్, అచీవ్‌మెంట్స్, స్ట్రగుల్స్ అన్నీ ఈ మూవీలో రిలేట్ చేసుకుంటారు" అని తెలిపారు.

'ఓ భామ అయ్యో రామ'



వైవిధ్యమైన చిత్రాలతో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు సుహాస్. ఆయన హీరోగా నటిస్తున్న మరో వైవిధ్యమైన ప్రేమకథా చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. మాళవిక మనోజ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. రామ్ గోదాల దర్శకత్వం వహిస్తున్నారు. హరీశ్ నల్లా, ప్రదీప్ తాళ్ల నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రాన్ని ప్రారంభించి టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ "దర్శకుడు మంచి కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు" అని తెలిపారు. 'నువ్వు నేను' ఫేమ్ నటి అనిత హస్సనందని మాట్లాడుతూ "నా సెకండ్ ఇన్నింగ్స్‌కు పర్‌ఫెక్ట్‌గా కుదిరిన చిత్రమిది" అని చెప్పారు. దర్శకుడు రామ్ గోదాల మాట్లాడుతూ "ఇదొక బ్యూటిఫుల్ లవ్‌స్టోరి" అని అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "ఈ సినిమాకు ప్రారంభం నుంచే మంచి పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్‌రాజు, డైరెక్టర్స్ వశిష్ఠ, విజయ్ కనకమేడల, శైలేశ్ కొలను పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: భవిన్ ఎమ్.షా, సినిమాటోగ్రాఫర్: మణికందన్, సంగీతం: రథన్, కోప్రొడ్యూసర్: ఆనంద్ గడగోని.

ఈ సినిమాకు ఆ లిమిటేషన్స్ లేవు



'దొరసాని' మూవీతో మంచి డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు కేవీఆర్ మహేంద్ర. ఆయన దర్శకత్వం వహించిన లేటెస్ట్ చిత్రం 'భరతనాట్యం'. సూర్యతేజ ఏలే, మీనాక్షి గోస్వామి హీరో హీరోయిన్లుగా నటించారు. పాయల్‌సరాఫ్ నిర్మించారు. ఈ నెల 5న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మహేంద్ర మీడియాతో ముచ్చటించారు.

భరతనాట్యం ఒక నృత్య కళ. కానీ ఇక్కడ ఆ పేరుని క్రైమ్ వరల్డ్‌కి పెట్టాం. సరైన కారణంతోనే ఈ టైటిల్ పెట్టాం. సినిమా చూశాక ఈ విషయం మీకే తెలుస్తుంది. 'దొరసాని' తర్వాత ఓ స్టార్ హీరోతో క్రైమ్ డ్రామా ప్లాన్ చేశాను. కొన్ని కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఈ సమయంలోనే సూర్యతేజ ఏలే ఓ ఐడియా చెప్పారు. కథలు నెరేట్ చేస్తూ, దర్శకుడు కావాలని కలలు కనే ఓ సహాయ దర్శకుడు..ఆర్థిక ఇబ్బందులతో విచిత్రమైన పరిస్థితిలో క్రైమ్ వరల్డ్‌లో ఇరుక్కుని బయటపడడమే ఆ పాయింట్. ఈ లైన్ బాగా నచ్చడంతో డెవలప్ చేశాం. నా ప్రీవియస్ సినిమా 'దొరసాని'తో పోల్చితే ఈ సినిమాకు లిమిటేషన్స్ లేవు. ఇందులో అన్ని రకాల కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్నాయి. సినిమా చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. చాలా మంచి డ్రామా ఇందులో ఉంటుంది. అలాగే పాత్రల మధ్య ఉన్న బలమైన సంఘర్షణ ఈ సినిమాకు ప్లస్ అవుతుంది. వివేక్‌సాగర్ అందించిన సంగీతం ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ" అని చెప్పారు.





జాన్వీ ప్రేమ విషయంలో నేను ఇన్‌వాల్వ్ అవ్వను

బోనీ కపూర్

అజయ్ దేవగణ్ నటించిన 'మైదాన్' చిత్రం ఈ నెల 10న విడుదలవుతోంది. బోనీకపూర్ నిర్మించారు. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నప్పటికీ ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

"నా పిల్లల వ్యక్తిగత విషయాలలో నేను ఇన్‌వాల్వ్ అవ్వను. వారికి నచ్చినట్టు ఉండే స్వేచ్ఛను ఇస్తా. ఈ కాలం పిల్లలను మన తరంలోలా కట్టిపడేయలేం కదా. పిల్లల రిలేషన్స్ విషయంలో చాలా రూమర్స్ వస్తున్నాయి. ముఖ్యంగా జాన్వీ, శిఖర్ పహారియా ప్రేమ వ్యవహారం గురించి. నేను ఆ విషయంలో తలదూర్చలేను. నా కూతురికి సలహా అవసరమైన సమయంలోనే నేను తండ్రిగా కలుగజేసుకుంటాను అని చెప్పారు. అలాగే ఈ సందర్భంగా తన భార్య శ్రీదేవిని గుర్తు చేసుకొని భావోద్వేగానికి లోనయ్యారు బోనీ కపూర్. 'నాతో పోల్చితే శ్రీదేవికి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. ఆమె నమ్మకాలు, వ్యక్తిత్వం, ఆధ్యాత్మిక భావాలు నాపై కూడా ప్రభావం చూపి నన్ను ఆధ్యాత్మికత వైపు నడిపించాయి. శ్రీదేవి చేసే పనులు ఎప్పుడూ ప్రత్యేకంగా, ఆశ్యర్యకరంగా ఉండేవి. తన తల్లిలాగే జాన్వీకపూర్‌కు కూడా భక్తి ఎక్కువే" అని చెప్పారు. ఈ మధ్యే జాన్వీకపూర్, తన బాయ్‌ఫ్రెండ్ శిఖర్‌పహారియాతో కలిసి తిరుమల దర్శించడం హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే.

కమల్ హాసన్ మెచ్చుకున్నారు



మలయాళ మూవీ ఇండస్ట్రీలో లేటెస్ట్ సెన్సేషన్ 'మంజుమ్మెల్ బాయ్స్'. మలయాళ బాక్సాఫీస్ వద్ద రూ.200 కోట్లు కలెక్ట్ చేసిన మొట్టమొదటి సినిమాగా నిలిచింది. తమిళనాడులోని గుణ కేవ్స్‌లో జరిగిన ఓ వాస్తవ సంఘటన స్ఫూర్తితో చిదంబరం ఎస్ పొదువల్ దీనిని తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ ఏప్రిల్ 6న ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ చిదంబరం మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ మీద ముందు నుంచి అందరికీ నమ్మకం ఉంది. కానీ రూ.200 కోట్లు కలెక్ట్ చేస్తుందని ఎవరూ ఊహించలేదు. నా సెకండ్ సినిమా కథ కోసం అన్వేషిస్తుండగా గుణ కేవ్స్‌లో జరిగిన ఈ సంఘటన గురించి తెలిసింది. నన్ను ఈ కథ ఎంతగానో ఎక్సైట్ చేసింది. వెంటనే వర్క్ స్టార్ట్ చేసి, రియల్ లైఫ్ మంజుమ్మెల్ బాయ్స్‌ను కలిశా. వారు జరిగిందంతా చెప్పారు. విన్నాక ఇది ప్రజలకు తెలియాల్సిన కథ. సినిమా తీయాలి అని మరింత దృఢంగా నిశ్చయించుకున్నాను. సినిమా చూసిన కమల్ హాసన్ మెచ్చుకోవడం పెద్ద అవార్డు గెలుచుకున్నట్లనిపించింది. మలయాళీలకు తెలుగు సినిమాలు అంటే చాలా ఇష్టం. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని ఆశిస్తున్నాను. తెలుగులో ఎంతో మంది మంచి నటులు ఉన్నారు. వారితో సినిమా చేసే అవకాశం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు.

పొలిటికల్ డ్రామా



జగిత్యాల పట్టణంలో 1980ల దశకంలో జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా రూపుదిద్దుకొన్న 'జితేందర్ రెడ్డి' చిత్రం మే 3న విడుదల కానుంది. రాకేశ్ వర్రే హీరోగా నటించిన ఈ చిత్రాన్ని విరించి వర్మ దర్శకత్వంలో ముదుగంటి రవీందర్‌రెడ్డి నిర్మించారు. యాక్షన్ నేపథ్యంలో పొలిటికల్ డ్రామాగా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. అప్పుడు జరిగిన సంఘటలన్నీ, కథను చూసిస్తున్నామనీ, ఎవరినీ కించ పరచాలనే ఉద్దేశం తమకు లేదనీ నిర్మాత తెలిపారు. తన సొంత సినిమాలు మూడు నిర్మాణంలో ఉన్నప్పటికీ 'జితేందర్ రెడ్డి'ని కూడా తన సొంత చిత్రంగానే భావించి హీరో రాకేశ్ వర్రే ఎంతో ఇన్‌వాల్వ్ అయ్యారని రవీందర్‌రెడ్డి చెప్పారు.

కేసు నంబర్ 15లో ఏముంది?



అజయ్, రవిప్రకాశ్, హర్షిణి, మాండవియా సెజల్ ముఖ్యపాత్రలు పోషించిన సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ 'కేసు నంబర్ 15' అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. తడకల్ వంకర్ రాజేశ్ స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా నిర్మించారు. విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత సి.కల్యాణ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ప్రెసిడెంట్ రామకృష్ణ గౌడ్ టీజర్‌ను, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ లిరికల్ వీడియోను విడుదల చేశారు. సినిమా విజయం సాధించాలని వారందరూ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తడకల వంకర్ రాజేశ్ మాట్లాడుతూ 'మా సినిమాకు జాన్ మంచి సంగీతం ఇస్తే, ఆనం వెంకట్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ ఇచ్చారు. సినిమాలో ప్రతి సీన్ ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రేక్షకుల్ని కచ్చితంగా అలరిస్తుంది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వస్తాం' అని చెప్పారు.

క్రేజీ కాంబోలో వైబ్



'ఊరుపేరు భైరవకోన' చిత్రంతో హిట్ ట్రాక్ ఎక్కారు సందీప్ కిషన్. ఇప్పుడు ఆయన కథానాయకుడిగా కొత్త చిత్రం ఖరారైంది. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' చిత్రంతో దర్శకుడిగా అందరి దృష్టిని ఆకర్షించిన స్వరూప్ ఆర్‌ఎస్‌జే దర్శకత్వం వహిస్తున్నారు. రాహుల్ యాదవ్ నక్కిన నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి వైబ్ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌లో సందీప్ కిషన్ యాక్షన్ ప్యాక్డ్ అవతార్‌లో కనిపించారు. కాలేజీ బేస్డ్ యాక్షన్ లవ్ స్టోరీ ఇది. 2025 వేసవిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

మీకు తెలుసా?

దినుసుల్లో ఏముంది?

జీలకర్ర, దాల్చినచెక్క మొదలైన సుగంధ ద్రవ్యాల్లోని ఆరోగ్య విలువల గురించి మనకు అంతగా అవగాహన ఉండదు. మసాలా దినుసులు అందించే ఆరోగ్య ప్రయోజనాలు ఏవంటే...



- **నల్ల మిరియాలు:** జీర్ణ సంబంధ సమస్యలకు నల్ల మిరియాలు చక్కని విరుగుడు. వీటిలో ఉండే పెపరీన్ కొవ్వును కరిగిస్తుంది. కొత్తగా కొవ్వు కణాలు ఏర్పడకుండా నియంత్రిస్తుంది.
- **జీలకర్ర:** వీటిత మొలల సమస్య తగ్గుతుంది. మతిమరుపు, నిద్రలేమి, రక్తహీనతలు కూడా తొలగిపోతాయి. భోజనంతో పాటు లేదా భోజనం తర్వాత జీలకర్రను తినడం వల్ల రక్తశుద్ధి జరుగుతుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది.
- **అల్లం:** అల్లానికి కొవ్వును కరిగించే గుణం ఉంటుంది. కాబట్టి పరగడుపున వేడి నీళ్లతో అల్లం రసం కలిపి తీసుకుంటే స్థూలకాయం రాకుండా ఉంటుంది.
- **పసుపు:** దీన్లోని కర్‌క్యుమిన్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది.

గుడ్ ఫుడ్

రంగుల్లో హంగులు

పండ్లు, కూరగాయల రంగు వాటిలోని పోష కాలకు ప్రతిబింబాలు. కాబట్టి ఆకట్టుకునే రంగులను కలిగి ఉండే పండ్లు, కూరగాయలను ఎంచుకోవాలి.

- **ఆకుపచ్చ:** ఈ రంగుతో కూడిన పండ్లు, కూరగాయలను తినడం వల్ల జీర్ణశక్తి,




కాలేయ పనితీరు మెరుగవుతుంది. దంతాలు, ఎముకలు బలపడతాయి. రోగనిరోధకశక్తి కూడా పెరుగుతుంది. ఇందుకోసం సొర, బీర, బెండ కూరగాయలతో పాటు, జామ, అవకాడొ, ద్రాక్ష మొదలైన పండ్లు తినాలి.
- **పర్పుల్, నీలం:** జ్ఞాపకశక్తి పెరుగుతుంది. గుండె, రక్తనాళాలు, మూత్రాశయాల ఆరోగ్యం మెరుగవుతుంది. ఇందుకోసం ద్రాక్ష, చిలగడదుంప, క్యాబేజీ, బీట్‌రూట్ తినాలి.
- **ఎరుపు:** గుండె బలపడుతుంది. వ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది. కణ ఉత్పత్తి పెరుగుతుంది. అధిక రక్తపోటు తగ్గడంతో పాటు చర్మపు ఆరోగ్యం మెరుగవుతుంది. ఇందుకోసం రెడ్ క్యాప్సికం, టమాటా, పండు మిరప, చెర్రీ తినాలి.
- **పసుపు, నారింజ:** కీళ్లు, కణజాలాలు, మృదులాస్థి మెరుగుపడతాయి. చర్మపు కొల్లాజెన్ వృద్ధి చెందుతుంది. ఇందుకోసం ఎల్లో క్యాప్సికం, ఆరెంజ్, ఎల్లో జుకినీ, అరటి, దోస పండు తినాలి.
- **తెలుపు, గోధుమ రంగు:** పెద్దపేగులు, పొట్ట ఆరోగ్యం మెరుగవుతుంది. అల్సర్లు తగ్గుతాయి. అసిడిటీ అదుపులోకొస్తుంది. ఇందుకోసం వెల్లుల్లి, ఉల్లి, బంగాళాదుంపలు, చామ దుంపలు తినాలి.

సూపర్ ఫుడ్

ఉలవలు... ఉపయోగాలు

ఉలవల్లో పిండిపదార్థాలు, ప్రొటీన్, పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి వాటితో అప్పుడప్పుడూ చారు పెట్టుకుంటూ ఉండాలి. ఉలవలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏవంటే...

- **జీర్ణశక్తి:** వీటిలో పీచు ఎక్కువ కాబట్టి మలబద్ధకం వదలడంతో పాటు, సుఖ విరోచనం అవుతుంది. అంతే కాకుండా జీర్ణశక్తి కూడా మెరుగు పడుతుంది. అలాగే ఇతరత్రా జీర్ణకోశ సమస్యలు కూడా అదుపులోకి వస్తాయి.



- **కండరాలు:** ఉలవల్లోని మాంసకృత్తుల వల్ల కండరాలు బలపడతాయి. ఐరన్ లోపం తొలగిపోతుంది. సర్జరీలు చేయించుకున్నవాళ్లు త్వరగా కోలుకోవాలంటే తరచూ ఉలవలతో తయారైన పదార్థాలు తింటూ ఉండాలి.
- **పోషకాలు:** వీటిలో క్యాల్షియం, పొటాషియం సమృద్ధిగా ఉంటాయి. కాబట్టి ఉలవలు తినడం వల్ల ఎముకలు దృఢంగా ఉంటాయి.

ఆ మత్తుతో చిత్తే!




ఎండ దంచేస్తుంటే, చిల్డ్ బీర్‌తో చల్లబడాలనిపిస్తుంది. హార్డ్ లిక్కర్ కాదు కాబట్టి ఓ పట్టు పట్టినా ఫర్వాలేదనే ఆలోచనతో బీర్లను వరదల్లా పొంగిస్తున్నారా? అది ఎలాంటి మద్యమైనా పరిమితి మించితే వ్యసనానికీ, అంతిమంగా ఆరోగ్య నష్టానికీ దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు వైద్యులు.

ఆల్కహాలిజం

ఫ్రెండ్స్‌తో సరదాగా చిల్ అవడం కోసం చిల్డ్ బీర్ లేదా, హార్డ్ లిక్కర్‌లను ఆశ్రయించేవాళ్లు ఎక్కువ. ఇలా అరుదుగా సరదా పడేవాళ్లతో పాటు ఆ సరదాను అలవాటుగా మార్చుకున్న వాళ్లు కూడా ఉంటారు. వీళ్లు, తాగిన సమయంలో మత్తులో ఉండే గమ్మత్తుకు అలవాటు పడిపోయి, ప్రతి రోజూ అదే మత్తులో చిత్తైపోదామనుకుంటూ ఉంటారు. ఆ అలవాటు కాస్తా, క్రమేపీ వ్యసనంగా మారి, మందు తాగనిదే రోజు గడవని పరిస్థితి నెలకొంటుంది. మద్యం ముట్టనిదే శరీరం సహకరించని పరిస్థితి నెలకొంటుంది. చివరకు ఈ వ్యసనం ఆర్థిక, ఆరోగ్య పతనాలకు దారి తీస్తుంది. అయితే నిజంగానే మద్యంతో అంతటి ముప్పు ఉంటుందా? ఏ మద్యం, ఎంత మద్యం సురక్షితం?

ప్రతి మద్యం ఆరోగ్యానికి చేటు చేసేదే! కొందరు వారాంతాల్లో తక్కువ మోతాదుల్లో తాగుతారు. ఇంకొందరు ఆ ఒక్కసారే తాగినా, విపరీతంగా తాగేస్తూ ఉంటారు. ఈ రెండు కోవలకు చెందిన వాళ్లకూ రెండు రకాల అపోహలుంటాయి. తక్కువ మోతాదులో తాగాం కాబట్టి తమకేమీ కాదని ఒకరనుకుంటే, ఎంతో అరుదుగా తాగాం కాబట్టి పెద్దగా ప్రమాదం ఉండదని ఇంకొకరు అనుకుంటారు. కానీ ఎలా తాగినా, ఏ లిక్కర్ తాగినా ఆరోగ్యానికి కలిగే చేటు ఒక్కటే! బ్రాందీ, విస్కీ, ఓడ్కాల్లాంటి హార్డ్ లిక్కర్ కంటే బీరు అన్ని విధాలా సురక్షితమనే అపోహలో ఉన్నవాళ్లూ ఉన్నారు. కానీ వాస్తవానికి మద్యం ఏదైనా దాన్లో ఉండే ఆబ్సల్యూట్ ఆల్కహాల్ పరిమాణమే కీలకం. 100 మి.లీ హార్డ్ లిక్కర్‌లో 42% ఆల్కహాల్ ఉంటే, 100 మి.లీ బీరులో 5% ఆల్కహాల్ ఉంటుంది. దీన్ని బట్టి ఒక డ్రింక్‌కు 30 గ్రాముల చొప్పున, ఐదారు డ్రింకుల హార్డ్ లిక్కర్‌తో ఏకంగా 200 గ్రాముల ఆల్కహాల్ శరీరంలోకి చేరుకుంటే, 100 మి.లీ బీరుకు 5 గ్రాముల చొప్పున ఒక బీరుతో 30 గ్రాముల ఆల్కహాల్ శరీరంలోకి చేరుకుంటుంది. అంటే ఒక బీరు 100 మి.లీ హార్డ్ లిక్కర్‌తో సమానం. కాబట్టి ఒక్క బీరుతో ఆపేస్తే పరవాలేదు. కానీ అక్కడితో ఆగేదెవరు?



సేఫ్ డ్రింకింగ్

ఆరోగ్యకరమైన ఆల్కహాల్ అనేది లేదు. ఎంత తక్కువ పరిమాణమైనా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆరోగ్యానికి హాని కలిగించకుండా ఉండదు. అలాగని మద్యానికి శాశ్వతంగా దూరంగా ఉండిపోకూడదు అనుకునే వాళ్లు, ఒక కచ్చితమైన నియమాన్ని పాటించాలి. వారంలో ఒక్కసారి రెండు డ్రింకులకు (హార్డ్ లిక్కర్: 60 మి.లీ) పరిమితమవగలగాలి. అదే బీర్ అనుకుంటే, రెండు లైట్ బీర్లు లేదా ఒక స్ట్రాంగ్ బీరుకే పరిమితం కావాలి. దీన్ని సేఫ్ లిమిట్‌గా భావించవచ్చు. దీన్నే సోషల్ డ్రింకింగ్‌గా కూడా పరిగణించవచ్చు. కానీ విదేశాల్లో ఎడాపెడా తాగేస్తూ ఉంటారు. వాళ్లందరూ ఆరోగ్యంగానే ఉన్నారు కదా? అని వాళ్లతో మనం పోల్చుకోకూడదు. మన జెనెటిక్ మేకప్‌కు ఇదే సురక్షితమైన మోతాదు. దీన్ని మించితే కాలేయం, గుండె, నాడీ వ్యవస్థల మీద మద్యం ప్రభావం పడే ప్రమాదం ఉంటుంది. తక్కువ సమయంలో ఎక్కువ మద్యం తాగడమే బింజ్ డ్రింకింగ్. వారానికి ఒక్కసారే కదా అని పీకలదాకా తాగేయడమే బింజ్ డ్రింకింగ్. ఇది కచ్చితంగా ప్రమాదకరమే!

వ్యసనాన్ని ఇలా కనిపెట్టాలి

సరదాగా మొదలైన ఈ అలవాటు తెలియకుండా వ్యసనంగా మారుతుంది. ఎవరికి వారు గ్రహించడం కోసం ఈ లక్షణాలను గమనించాలి.

- మద్యం మీదకే పదే పదే మనసు లాగుతూ ఉండడం
- చికాకు, రెస్ట్‌లెస్‌నెస్
- శరీరంలో వణుకు
- నిద్ర పట్టకపోవడం
- ఆల్కహాల్ తీసుకుంటే ప్రశాంతంగా ఉండడం, తీసుకోకపోతే ఆందోళనకు లోనవడం

మానాలంటే ఏం చేయాలి?

ఎవరికి వారు మద్యం మానేయాలని అనుకోనంత వరకూ ఏ మందులతోనూ ప్రయోజనం ఉండదు. మద్యం మానుకోవాలని అనుకోని వాళ్లు, ఆ అలవాటును మాన్పించే మందులతో తాత్కాలికంగా మద్యం మానినా, తిరిగి మళ్లీ అదే అలవాటును కొనసాగిస్తూ ఉంటారు. కాబట్టి ఈ అలవాటును మాన్పించడంతో మద్యం సేవించే వ్యక్తితో పాటు, అతని కుటుంబ సభ్యులు కూడా కీలక పాత్ర పోషిస్తారు. మొదట కౌన్సెలింగ్‌లో భాగంగా ఆ అలవాటు వల్ల కోల్పోతున్న అంశాలను అర్థమయ్యేలా వివరించాలి. ఆల్కహాల్‌తో ఆరోగ్యానికీ, సోషల్ బిహేవియర్‌కూ కలుగుతున్న చేటు, కలుగుతున్న ఆర్థిక, ఆరోగ్య నష్టాల పట్ల అవగాహన కల్పించాలి. ఆ తర్వాతే మద్యం మాన్పించే మందులను సూచించాలి. ఇందుకోసం ప్రత్యేకించి డీఅడిక్షన్ నిపుణులుంటారు. మద్యం వ్యసనపరులుగా మారడానికి వేర్వేరు కారణాలుంటాయి. వాటిని విశ్లేషించి ఆ మూల కారణాలను సరిదిద్దడంతో పాటు, వ్యక్తి మద్య తీవ్రలను బట్టి మందులు మొదలుపెట్టుకోవాలి. ఈ మందులతో తాగాలనే కోరిక తగ్గిపోవడంతో పాటు, విత్‌డ్రాయల్ సింప్టమ్స్ కూడా అదుపులోకొస్తాయి.

నాటు మందులు వద్దు

మద్యం మాన్పించే మందులు వాడుతూ మద్యం తాగడం ప్రమాదకరం. కాబట్టి రోగికి కౌన్సెలింగ్ ఇవ్వకుండా, అతని అనుమతి, ఆమోదం లేకుండా, డీఅడిక్షన్ మందులు వాడకూడదు. చాలా మంది నాటు మందుల మీద ఆసక్తి కనబరుస్తూ ఉంటారు. వాటిని తెచ్చి, రోగికి తెలియకుండా ఆహారంలో కలిపి ఇచ్చేస్తూ ఉంటారు. ఇది సరి కాదు. ఎలాంటి ఆకులు, అలములూ మద్యం అలవాటను మాన్పించలేవు. నిజానికి ఇలాంటి నాటు మందుల్లో కూడా అల్లోపతి మందులనే కలుపుతూ ఉంటారు. కాబట్టి వాటిని తీసుకున్నప్పుడు మద్యం మీద తాత్కాలిక విరక్తి తలెత్తడం సహజం. దాంతో నాటు మందు పని చేసిందనే భ్రమకు లోనవుతాం. కానీ మందుల వాడకం మానేసిన వెంటనే మళ్లీ మద్యం అలవాటు మొదలవుతుంది. పైగా ఆకు పసర్లు, ఇతరత్రా పదార్థాలతో నాటు మందులు తయారుచేస్తారు కాబట్టి వీటితో అదనపు దుష్ప్రభావాలు కూడా ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంటుంది. కాబట్టి ఆ అలవాటు ఉన్న వ్యక్తి, మద్యం మానాలనే బలమైన నిర్ణయానికి వచ్చిన తర్వాతే, వైద్యుల దగ్గరకు తీసుకు వెళ్లి, మొదట కౌన్సెలింగ్, తర్వాత చికిత్స మొదలుపెట్టాలి.

మానసిక సమస్యలు తప్పవు

మద్యానికీ మనసుకూ దగ్గరి సంబంధం ఉంటుంది. బాధ, ఒత్తిడి, ఆందోళనల నుంచి తప్పించుకోవడం కోసం మద్యం తాగితే, మత్తు దిగిన తర్వాత అవే సమస్యలు రెట్టింపవుతాయి. ఆ సమస్యల నుంచి విరుగుడు కోసం మళ్లీ మద్యం మీద ఆధారపడడం, అవే సమస్యలు తిరగబెడుతూ ఉండడం... ఇలా ఇదొక విష చట్రంలా కొనసాగుతూనే ఉంటుంది. మద్యం మానసిక కుంగుబాటును పెంచుతుంది. ఈ కుంగుబాటు మద్యం వ్యసనానికి దారి తీస్తుంది. కాబట్టి మద్యంతో మానసిక సమస్యలను మర్చిపోయే ప్రయత్నం చేయకూడదు. సమస్యలకు పరిష్కారాలను కనిపెట్టి సరిదిద్దుకోవాలి. అవసరమైతే వైద్యుల సలహాలు, చికిత్సలూ పాటించాలి.

డాక్టర్ కె.ఎస్ సోమశేఖర రావు,
సీనియర్ కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



పాశ్చాత్య ప్రమాణాలతో సరిపోలిస్తే, మన దేశ స్త్రీపురుషులు తీసుకోదగిన మద్యం మోతాదు తగ్గుతుంది. అలాగే జెనెటిక్ మేకప్, హార్మోన్ల మూలంగా పురుషులతో పోలిస్తే, మహిళల మీదే మద్యం ప్రభావం ఎక్కువ. తక్కువ మద్యంతో కూడా మహిళల ఆరోగ్యం మీద ఎక్కువ ప్రభావం పడుతూ ఉంటుంది. కాబట్టి మరీ ముఖ్యంగా మహిళలు మద్యానికి దూరంగా ఉండడం శ్రేయస్కరం.



ఈ ఏడాది ఎండలు మునుపటికి మించి మండిపోతాయని ముందుగానే వార్తలొచ్చాయి. వాటికి తగ్గట్టే వేడి, ఉక్కపోతలు మార్చి నుంచే వేధించడం మొదలుపెట్టేశాయి. అయితే ఈ వేసవి నుంచి రక్షణ పొందాలంటే చల్లదనాన్ని అందించే జాగ్రత్తలు పాటించాలి.

వేడికి విరుగుడు

సమ్మర్ కేర్

వేసవి వేడితో శరీరంలోనూ వేడి పెరుగుతుంది. దాంతో అలసట, బడలిక, విపరీతమైన చమట, చర్మం పొడిబారడం, తలనొప్పి, మగత, ఒళ్లు నొప్పులు లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎండ వేడిమికి శరీర ఉష్ణోగ్రత క్రమేపీ పెరుగుతూ 104 డిగ్రీలకు చేరుకుంటే ఎండదెబ్బకు గురవుతాం! అత్యధిక ఉష్ణోగ్రతలకు గురయినా లేక వేడి వాతావరణంలో శారీరక శ్రమ వల్ల శరీర ఉష్ణోగ్రత ఆ మేరకు చేరుకున్నా, ఎండదెబ్బకు గురవడం సహజం. అందుకు పలు కారణాలు ఉంటాయి. వాటిలో...

- గాలి ధారాళంగా చొరబడని దుస్తులు, చమటను పీల్చుకునే వీలు లేని దుస్తులు ధరించడం. వేడిని గ్రహించే వీలున్న నల్ల దుస్తులు ధరించడం.
- మద్యం తీసుకోవడం. మద్యం తాగడం వల్ల ఉష్ణోగ్రతను క్రమబద్ధం చేసే శక్తి శరీరం కోల్పోతుంది.
- చమట ద్వారా శరీరం కోల్పోయిన నీటిని భర్తీ చేయకపోవడం.

నివారణ తేలికే!

ఎండదెబ్బ బారిన పడి, బాధ పడేకంటే, ఆ స్థితి రాకుండా జాగ్రత్త పడడం మేలు. వేసవి వేడి, ఎండల ప్రభావానికి గురవకుండా ఉండాలంటే ఈ జాగ్రత్తలు పాటించాలి.

దుస్తులు: ధరించే దుస్తులు తేలికగా, గాలి చొరబడేలా, చమట పీల్చేలా సౌకర్యంగా ఉండాలి. వీలైనంతవరకూ తెల్లని దుస్తులే ధరించాలి.

సూర్యరశ్మి: సూర్యరశ్మి నేరుగా సోకితే, శరీరం తనంతట తాను చల్లబడే స్వభావాన్ని కోల్పోతుంది. కాబట్టి ఎండలో బయటకు వెళ్లవలసివస్తే తలకు టోపీ, కళ్లకు చలువ కళ్లద్దాలు, గొడుగు తప్పనిసరిగా వాడాలి. వైద్యులు సూచించే సన్‌స్క్రీన్ వాడడం వల్ల చర్మం కమిలిపోకుండా, పొడిబారకుండా ఉంటుంది.



దాహం వేసేవరకూ ఆగకుండా గంటకొకసారి నీళ్లు తాగుతూ ఉండాలి. నీళ్లతోపాటు కొబ్బరినీరు, మజ్జిగ కూడా తరచుగా తాగుతూ ఉండాలి. ఇలా ఒంట్లో నీరు, ఖనిజలవణాల పరిమాణాన్ని సక్రమంగా ఉంచుకుంటే ఎండ ప్రభావం నుంచి తప్పించుకోగలుగుతాం.

ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎండ తీవ్రత ఎక్కువ. కాబట్టి ఆ సమయాల్లో నీడ పట్టున గడపాలి. వ్యాయామానికి ఎండ లేని సమయాలను కేటాయించాలి.

వేసవిలో పసిపిల్లల రక్షణ!

పిల్లల లేత శరీరాలు ఎండ దెబ్బకు తేలికగా గురవుతాయి. కాబట్టి ఎండాకాలంలో... పిల్లలకు వేసే దుస్తుల మొదలు, అందించే ఘన, ద్రవ పదార్థాల వరకూ ప్రతి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి.

ఆరు నెలల లోపు పిల్లలకు తల్లి పాలు తప్ప విడిగా మరే ద్రవాలు ఇవ్వవలసిన అవసరం లేదు. పాల ద్వారానే వాళ్ల దాహార్తి తీరుతుంది. తల్లి పాలతో వేసవి వేడిమిని తట్టుకునే శక్తి దొరుకుతుంది.

పసికందులు రోజుకి ఆరు నుంచి ఏడుసార్లు మూత్ర విసర్జన చేస్తుంటే వాళ్ల దాహార్తి తీరుతోందని అర్థం చేసుకోవాలి. అంతకంటే తక్కువ సార్లు చేస్తే తల్లి పాలు సరిపోవట్లేదని గ్రహించి పోత పాలు మొదలుపెట్టాలి.

- పిల్లల మూత్రం నీరులా స్వచ్ఛంగా ఉందంటే వాళ్లకు సరిపడా నీరు అందుతోందని గ్రహించాలి.
- ఆరు నెలలు దాటి ఘనాహారం మొదలుపెట్టిన పిల్లలకు కొబ్బరి నీరు, చక్కెర కలపని తాజా పళ్ల రసాలు తాగించవచ్చు.
- పిల్లలకు ఘనాహారంగా బియ్యం నూక, గోధుమలు, రాగులను వేయించి పొడి చేసి డబ్బాల్లో పోసి పెట్టుకుని వాడుకోవాలి.
- పొడికి నీళ్లు చేర్చి మెత్తగా ఉడికించి పప్పు, కూరలతో తినిపించవచ్చు.
- ఘనాహారంతోపాటు తాజా పళ్లు చిన్న ముక్కలుగా కోసి లేదా గుజ్జు చేసి తినిపించాలి.
- ఆహారం తినిపించే ముందు, తినిపించిన వెంటనే స్నానం చేయించకూడదు.

నీరసం ఇలా దూరం

హెల్త్ వెల్త్

పోషకలోపం, శారీరక వ్యాయామం లోపించడం, జీవనశైలి అదుపు తప్పడం లాంటి కారణాల వల్ల నిస్సత్తువ వేధించవచ్చు. కాబట్టి నిరంతరంగా నీరసం వేధిస్తుంటే ఈ కింది అంశాలను గమనించుకోవాలి.

ఆహారం ఇలా: శక్తిని అందించే ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకోసం అరటిపండ్లు, బ్రౌన్ రైస్, చేపలు, చిలగడ దుంపలు, గుడ్లు, ఓట్స్, క్వినోవా, అవకాడోలను ఆహారంలో చేర్చుకోవాలి.

వ్యాయామం: వ్యాయామంతో శరీరం, మనసు చలాకీగా మారతాయి. కాబట్టి ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరం.

ప్రొటీన్: ప్రొటీన్ అధికంగా పదార్థాలను స్నాక్స్‌గా తీసుకోవాలి. ఇందుకోసం యాపిల్, పీనట్ బటర్, ఉడకబెట్టిన గుడ్లు, పాప్‌కార్న్, వేయించిన శనగలు తినాలి.

సంగీతం: శ్రావ్యమైన సంగీతంలో శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి శరీరాన్ని చలాకీగా ఉంచడానికి తోడ్పడతాయి. కాబట్టి రోజులో కొంత సేపు నచ్చిన సంగీతం వినాలి.

చల్ల నీళ్ల స్నానం: చల్లదనం కండరాలను బలపరుస్తుంది. మెటబాలిజంను పెంచుతుంది. కాబట్టి చల్లనీటితో స్నానం చేస్తూ ఉండాలి.

నవ్వడం: నవ్వడం వల్ల ఒత్తిడి తగ్గి, ఇమ్యూనిటీ పెరుగుతుంది. అలాగే నిస్సత్తువ కూడా దూరమవుతుంది. అందుకోసం స్నేహితులతో సరదా సమయం గడపడం, పిల్లలతో ఆడుకోవడం, కామెడీ సినిమాలు, షోలు చూడడం చేయాలి.

నీళ్లు: సరిపడా నీళ్లు తాగకపోయినా నిస్సత్తువ వేధిస్తుంది. కాబట్టి రోజులో రెండు నుంచి మూడు లీటర్లకు సరిపడా నీళ్లు తాగుతూ ఉండాలి.

వాసనలు: పెప్పర్‌మింట్, దాల్చిన చెక్క, నిమ్మ, రోజ్‌మేరీ ఎసెన్షియల్ నూనెలను డిఫ్యూజర్‌లో వేసి వాసనలు పీల్చడం వల్ల ఫలితం ఉంటుంది.

నిద్ర: 8 గంటలకు తగ్గకుండా నిద్రపోవాలి. నిద్రలేమి బడలికను కలిగిస్తుంది.

విటమిన్ డి: విటమిన్ డి లోపం కూడా నిస్సత్తువకు కారణమే! కాబట్టి వైద్యుల సలహా మేరకు డి విటమిన్ లోపాన్ని పరీక్షించుకుని సప్లిమెంట్ రూపంలో తీసుకోవాలి. అలాగే, ఉదయం, సాయంకాలపు నీరెండలో కనీసం 15 నిమిషాల పాటైనా గడుపుతూ ఉండాలి.



అంతర్జాతీయ కరెన్సీగా రూపాయి



ఆర్‌బీఐ 90వ వార్షికోత్సవ సందర్భంగా స్మారక నాణేన్ని విడుదల చేస్తున్న ప్రధాని మోదీ, ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

దేశం మరింత ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాల్సిందే..
ద్రవ్యోల్బణ కట్టడిలో ఎంపీసీ పాత్ర భేష్
అభివృద్ధే ఇక ఆర్‌బీఐ ప్రాధాన్యత: ప్రధాని మోదీ

ముంబై: వచ్చే పదేళ్లలో మరిన్ని రంగాల్లో మన దేశం ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావం మనపై పడకుండా ఉండాలంటే ఇది అత్యంత అవసరమన్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) 90 వసంతాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే మన రూపాయిని అందరికీ ఆమోదయోగ్యమైన, అందుబాటులో ఉండే అంతర్జాతీయ కరెన్సీగా మార్చేందుకూ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల పని భారం మరింత పెరుగుతుందన్నారు. ఉద్యోగులు ఇందుకు సిద్ధంగా ఉండాలని ప్రధాని కోరారు. ఇప్పటి వరకు ద్రవ్యోల్బణ కట్టడిపై ప్రధాన దృష్టి పెట్టిన ఆర్‌బీఐ వచ్చే పదేళ్ళ, జీడీపీ వృద్ధి రేటు పెంచడాన్నే అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని కోరారు. ఇదే సమయంలో ద్రవ్య స్థిరత్వం, విశ్వసనీయతలపైనా ఆర్‌బీఐ దృష్టి పెట్టాలని సూచించారు.

ఆర్‌బీఐ పాత్ర భేష్: జీడీపీ వృద్ధి రేటు వేగంగా, స్థిరంగా పెరగడంలో ఆర్‌బీఐ పోషించిన పాత్రను ప్రధాని మోదీ ప్రశంసించారు. ద్రవ్యోల్బణ కట్టడిలోనూ ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) చురుకైన పాత్ర పోషించిందన్నారు. నిరంతరం ధరల పర్యవేక్షణ, స్థిరమైన ద్రవ్య విధానాల ద్వారా కొవిడ్ వంటి కష్ట సమయంలోనూ ఎంపీసీ ద్రవ్యోల్బణాన్ని పెద్దగా కోరలు చాచకుండా కాపాడిందన్నారు. కొవిడ్ ప్రభావంతో ఇంకా అనేక దేశాలు సతమతమవుతున్నా, భారత్ మాత్రం ఆర్థికాభివృద్ధిలో దూసుకుపోతోందని ప్రధాని అన్నారు.

ఆదుకున్న ఆర్‌బీఐ నైపుణ్యాలు: అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితిని ఎదుర్కోవడంలో వృత్తిపరమైన ఆర్‌బీఐ నైపుణ్యాలు దేశానికి ఎంతగానో ఉపయోగపడ్డాయని ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. బ్యాంకుల ఆస్తులు-అప్పుల పట్టికలను మెరుగుపరచడంలోనూ ఆర్‌బీఐ చర్యలు ఎంతో ఉపకరించాయన్నారు. గత పదేళ్లలో ఆర్‌బీఐ, ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగానే బ్యాంకుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు.

బలమైన ద్రవ్య వ్యవస్థే మా లక్ష్యం: వచ్చే పదేళ్లలో స్థిరమైన, బలమైన ద్రవ్య వ్యవస్థను ఏర్పాటు చేయడమే ఆర్‌బీఐ లక్ష్యంగా ఉంటుందని ఈ ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. దేశ ఆర్థిక పురోగతికి ఇది పునాది రాయిలా ఉపయోగపడుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు అవసరమైన విధాన మార్పులు తీసుకుంటున్న విషయాన్ని దాస్ గుర్తు చేశారు.

బ్యాంకింగ్ వ్యవస్థ మారాలి

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బ్యాంకుల విధానాలూ మారాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారు. దేశ భవిష్యత్ అభివృద్ధికి దోహదం చేసే రంగాలకు అవసరమైన రుణ వితరణపై బ్యాంకులు దృష్టి పెట్టాలని కోరారు. అంతరిక్ష రంగంలో ఉన్న కంపెనీలు, పర్యాటక రంగంలోని కంపెనీలకు మంచి భవిష్యత్ ఉందన్నారు. అయోధ్య ముందు ముందు అతిపెద్ద ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మారనుందన్నారు. బ్యాంకులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ఈ రంగాల్లోని కంపెనీల రుణ సాయంపై దృష్టి పెట్టాలన్నారు. డిజిటల్ బ్యాంకింగ్‌తో పాటు సైబర్ నేరాలు పెరిగి పోవడంపైనా ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బెడదను అరికట్టేందుకు బ్యాంకులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్చి నెల జీఎస్‌టీ ఆదాయం రూ.1.78 లక్షల కోట్లు

- రెండో అత్యధిక వసూళ్లివి.. ఏపీలో వసూళ్లు రూ.4,082 కోట్లు
- తెలంగాణ ఆదాయం రూ.5,399 కోట్లు

న్యూఢిల్లీ: మార్చి నెలకు గాను వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 11.5 శాతం వృద్ధితో రూ.1.78 లక్షల కోట్లకు పెరిగాయని ఆర్థిక శాఖ సోమవారం వెల్లడించింది. 2017 జూలైలో జీఎస్‌టీ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి రెండో అత్యధిక నెలవారీ వసూళ్లివి. దేశీయంగా విక్రయ లావాదేవీలు మరింతగా పుంజుకోవడం ఇందుకు దోహదపడిందని పేర్కొంది. గత నెలలో దేశీయ లావాదేవీల్లో 17.6 శాతం వృద్ధి నమోదైంది. రిఫండ్లు మినహాయించగా గత నెలకు జీఎస్‌టీ నికర ఆదాయం వార్షిక ప్రాతిపదికన 18.4 శాతం వృద్ధితో రూ.1.65 లక్షల కోట్లుగా ఉంది. జీఎస్‌టీ నెలవారీ వసూళ్లలో రెండంకెల వృద్ధి మన ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాల జోరుకు సంకేతమని, జీఎస్‌టీలో భవిష్యత్ సంస్కరణలకు ఇవి బాటలు వేయనున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ ఆదాయం ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1.87 లక్షల కోట్లకు పెరిగింది.

1 గత నెలకు ఏపీలో జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 16% పెరిగి రూ.4,082 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది మార్చిలో వసూళ్లు రూ.3,532 కోట్లుగా ఉన్నాయి.

1 తెలంగాణ జీఎస్‌టీ ఆదాయం గత నెలలో రూ.5,399 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది మార్చిలో నమోదైన రూ.4,804 కోట్లతో పోలిస్తే వసూళ్లు 12 శాతం పెరిగాయి.

వార్షిక వసూళ్లు రూ.20 లక్షల కోట్లు

ఈ మార్చి 31తో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జీఎస్‌టీ స్థూల వసూళ్లు రూ.20.18 లక్షల కోట్లకు పెరిగాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోలిస్తే 11.7 శాతం వృద్ధి చెందాయి. 2022-23లో రూ.1.5 లక్షల కోట్ల స్థాయిలో నమోదైన నెలవారీ వసూళ్ల సగటు 2023-24లో రూ.1.68 లక్షల కోట్లకు పెరిగింది. ఈ మార్చి నాటికి రిఫండ్లు మినహాయించగా జీఎస్‌టీ నికర ఆదాయం వార్షిక ప్రాతిపదికన 13.4 శాతం వృద్ధితో రూ.18.01 లక్షల కోట్లుగా నమోదైంది.

4 కొత్త ప్లాంట్లు ప్రారంభించిన అరబిందో ఫార్మా

హైదరాబాద్: అరబిందో ఫార్మా.. పెన్సిలిన్-జి, 6-అమినో పెన్సిలానిక్ యాసిడ్ (6-ఏపీఏ), ఇంజెక్షన్లు, గ్రాన్యూల్ ఉత్పత్తుల తయారీ యూనిట్లు నాలుగింటిని సోమవారం ప్రారంభించినట్లు ప్రకటించింది. తమ పూర్తి యాజమాన్య అనుబంధ విభాగాల ద్వారా ఈ యూనిట్లను ఏర్పాటు చేసినట్టు అరబిందో ఫార్మా తెలిపింది. ఇందులో పెన్సిలిన్-జి (పెన్-జి) తయారీ విభాగం కాకినాడ సెజ్‌లో ఉంది. దీని వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 15,000 టన్నులు. ఇది కాకుండా గ్లూకోజ్ ఉత్పత్తి సామర్థ్యం 1.8 లక్షలు, 6-అమినో పెన్సిలానిక్ యాసిడ్ ప్లాంట్ సామర్థ్యం ఏటా 3,600 టన్నులని అరబిందో ఫార్మా తెలిపింది.

కొత్త ఆదాయ పన్ను విధానంలో మార్పులు లేవు

న్యూఢిల్లీ: కొత్త ఆదాయ పన్ను విధానంలో మార్పులు జరిగాయని సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తోసిపుచ్చింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. 2023 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైన 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ కొత్త పన్ను విధానం అమల్లోకి వచ్చింది. వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులు తమ ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేసేటప్పుడు పాత లేదా కొత్త ఆదాయ పన్ను విధానాన్ని ఎంచుకోవచ్చు. ఈ కొత్త విధానంలో పన్నుల భారం తగ్గినా, మినహాయింపులు తక్కువ. దాంతో అధిక జీతాలు, ఆదాయం ఉండే వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు పాత ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు.

సరుకు రవాణాలో విశాఖ పోర్టు కొత్త రికార్డు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు సరుకు రవాణాలో కొత్త రికార్డును నెలకొల్పింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 8.109 కోట్ల టన్నుల సరుకును రవాణా చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో (2022-23) 7.375 కోట్ల టన్నుల సరకును రవాణా చేయగా.. దాన్ని ఇప్పుడు అధిగమించింది. గడచిన ఆర్థిక సంవత్సర సరుకు రవాణాలో క్రూడాయిల్‌లో 27 శాతం, ఐరన్ ఓర్‌లో 12 శాతం, ఎరువుల్లో 6 శాతం పెరుగుదలను విశాఖ పోర్టు నమోదు చేసింది. అంతేకాకుండా పోర్టుకు వచ్చే నౌకల సంఖ్యలో కూడా 35 శాతం పెరుగుదల కనిపించిందని పోర్టు చైర్మన్ అంగముత్తు వెల్లడించారు. కంటైనర్ టెర్మినల్ కూడా 28 శాతం వృద్ధితో 6.65 లక్షల టీఈయూలను హ్యాండిల్ చేసింది.

షాప్ అండ్ విన్ ఫెస్టివల్ విజేతలకు రూ.5 కోట్ల విలువైన బహుమతులు

- జీఆర్‌టీ జువెలర్స్



హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల రిటైలర్ జీఆర్‌టీ జువెలర్స్.. పండగల సీజన్‌ను పురస్కరించుకుని నిర్వహించిన షాప్ అండ్ విన్ ఫెస్టివల్ విజేతలను ప్రకటించింది. గత ఏడాది డిసెంబరు 22 నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ షాప్ అండ్ విన్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని జీఆర్‌టీ జువెలర్స్ నిర్వహించింది. ఈ ఫెస్టివల్‌లో భాగంగా రూ.5,000 అంతకన్నా ఎక్కువ విలువ కలిగిన ఆభరణాలు కొనుగోలు చేసిన వినియోగదారులకు రూ.5 కోట్ల విలువైన బహుమతులను అందించనున్నట్లు ప్రకటించింది. తాజాగా జీఆర్‌టీ జువెలర్స్ 1,062 మంది విజేతలను ప్రకటించింది. 24 మంది ఖాతాదారులకు మహీంద్రా ఎక్స్‌యూవీలు, 47 మంది విజేతలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల విలువైన వజ్రాల నెక్లెస్‌లు, 47 మందికి టీవీఎస్ జూపీటర్ 125 సీసీ, 236 మంది ఖాతాదారులకు ఒక్కొక్కరికి 10 గ్రాముల బంగారు నాణేలు, 708 మంది వినియోగదారులకు 100 గ్రాముల వెండి నాణేలను అందించింది.

2023-24లో రూ.199.89 లక్షల కోట్ల యూపీఐ లావాదేవీలు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా లావాదేవీలు సరికొత్త రికార్డు స్థాయికి పెరిగాయి. 2023-24లో మొత్తం రూ.199.89 లక్షల కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరిగాయి. 2022-23లో నమోదైన రూ.139.1 లక్షల కోట్ల లావాదేవీలతో పోలిస్తే 44% అధికమిది. అంతేకాదు, 2023-24లో యూపీఐ లావాదేవీల సంఖ్య తొలిసారిగా 10,000 కోట్ల మైలురాయిని దాటి 13,100 కోట్లకు చేరుకున్నాయి. 2022-23లో నమోదైన 8,400 కోట్ల లావాదేవీలతో పోలిస్తే 57% వృద్ధి చెందాయి. కాగా, గత నెలలో రూ.19.78 లక్షల కోట్ల విలువైన 1,344 కోట్ల లావాదేవీలు జరిగాయి.

ఆరంభం అదిరింది..
కొత్త ఆర్థిక సంవత్సరం తొలి రోజే సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు

- 363 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



ముంబై: ఏప్రిల్ 1తో ప్రారంభమైన కొత్త ఆర్థిక సంవత్సరాని (2024-25)కి స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాలతో స్వాగతం పలికాయి. అంతేకాదు, సూచీలు సరికొత్త శిఖరాలను సైతం అధిరోహించాయి. ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో పాటు విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడుల దన్నుతో కొనుగోళ్లు పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. సోమవారం ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 603.27 పాయింట్ల వృద్ధితో 74,254.62 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి సూచీ 363.20 పాయింట్ల లాభంతో 74,014.55 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 203.05 పాయింట్ల వరకు ఎగబాకి 22,529.95 వద్ద సరికొత్త జీవితకాల ఇంట్రాడే గరిష్ఠ స్థాయికి చేరింది. ట్రేడింగ్ నిలిచేసరికి, 135.10 పాయింట్ల లాభంతో 22,462 వద్ద క్లోజైంది. సూచీలు లాభపడటం వరుసగా ఇది మూడో రోజు. ఈ మూడు రోజుల్లో సెన్సెక్స్ 1,544.25 పాయింట్లు (2.13%) పుంజుకుంది. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.10.58 లక్షల కోట్ల వృద్ధితో రూ.393.15 లక్షల కోట్లకు చేరుకుంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 లాభపడ్డాయి.

అదానీ షేర్లకు భారీ డిమాండ్

అదానీ గ్రూప్‌లోని అన్ని లిస్టెడ్ కంపెనీల షేర్లలో సోమవారం జోరుగా కొనుగోళ్లు జరిగాయి. బీఎస్ఈలో అదానీ ఎనర్జీ షేరు 8.40 శాతం ఎగబాకగా.. ఎన్‌డీటీవీ 6.16 శాతం, అదానీ విల్మర్ 5.92 శాతం, అదానీ పవర్ 4.99 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 4.81 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 2.93 శాతం, అదానీ పోర్ట్స్ 2.56 శాతం, ఏసీసీ 2.38 శాతం పుంజుకున్నాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అంబుజా సిమెంట్స్ షేర్లు ఒక శాతానికి పైగా పెరిగాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,380 ▲	63,600 ▲	81,600 ▲
ముంబై	68,663 ▲	62,895 ▲	75,111 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ



హైదరాబాద్	380	విజయవాడ	403
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	403	వరంగల్	382

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127	గోదావరి	126
వరంగల్	127	విజయవాడ	126
కరీంనగర్	127	గుంటూరు	127
మహబూబ్‌నగర్	127	ఒంగోలు	127
కర్నూలు	127	చిత్తూరు	120
విశాఖపట్నం	117		

ఇప్పటికి వీరే..





పరుగులు	వికెట్లు
రియాన్ పరాగ్ (రాజస్థాన్)	ముస్తాఫిజుర్ (చెన్నై)
181 పరుగులు	7 వికెట్లు

జొకోవిచ్..అందరికంటే పెద్దోడు



లండన్: వరల్డ్ నెం.1 ర్యాంక్‌లో నిలిచిన పెద్ద వయస్కుడిగా సెర్బియా ఆటగాడు నొవాక్ జొకోవిచ్ (36 ఏళ్ల 321 రోజులు) అరుదైన ఘనతను అందుకొన్నాడు. తాజాగా విడుదల చేసిన ఏటీపీ ర్యాంకింగ్స్‌లో స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ (36 ఏళ్ల 195 రోజులు) రికార్డును నొవాక్ అధిగమించాడు. కాగా భారత ఆటగాడు సుమీత్ నగల్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు ఎగబాకాడు. నగల్ రెండు ర్యాంక్‌లు మెరుగుపర్చుకొని 95వ స్థానంలో నిలిచాడు.

హైదరాబాద్ చేరిన చెన్నై జట్టు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)/శంషాబాద్ రూరల్: ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్‌తో శుక్రవారం జరిగే మ్యాచ్‌లో తలపడేందుకు చెన్నై సూపర్ కింగ్స్ జట్టు హైదరాబాద్ విచ్చేసింది. ఆటగాళ్లంతా సోమవారం సాయంత్రం విశాఖపట్నం నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ధోనీని చూసి అభిమానులు కేరింతలు కొట్టారు. మహీ ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లే వరకు ధోనీ, ధోనీ అంటూ హంగామా చేశారు. చెన్నై జట్టు ఎయిర్‌పోర్టు నుంచి భారీ బందోబస్తు నడుమ తాము బస చేసే హోటల్‌కు చేరుకుంది.

పవర్‌లిఫ్టింగ్‌లో శ్యామ్, సాయికి స్వర్ణాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ పవర్‌లిఫ్టర్లు శ్యామ్‌కుమార్, సాయితేజ పసిడి పతకాలు కొల్లగొట్టారు. ఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లోని 82.5 కిలోల విభాగంలో శ్యామ్.. స్క్వాట్‌లో 180, బెంచ్‌ప్రెస్‌లో 120, డెడ్‌లిఫ్ట్‌లో 200, మొత్తంగా 500 కిలోల బరువెత్తి ప్రథమ స్థానంలో నిలిచాడు. 90 కిలోల కేటగిరీలో సాయితేజ.. స్క్వాట్‌లో 72.5, బెంచ్‌ప్రెస్‌లో 55, డెడ్‌లిఫ్ట్‌లో 140, మొత్తంగా 267.5 కిలోల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచాడు.

పంత్‌కు జరిమానా

విశాఖపట్నం: చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటుకు పాల్పడినందుకు ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ పంత్‌కు జరిమానా విధించారు. ఇది ఆ టీమ్ తొలి తప్పిదంగా భావించినందున ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం పంత్‌పై రూ.12 లక్షల ఫైన్ పడింది.

ముంబై మూడోసారీ

దెబ్బ కొట్టిన బౌల్ట్, చాహల్
పరాగ్ మరో అర్ధ సెంచరీ
రాజస్థాన్ హ్యాట్రిక్ విజయం



బౌల్ట్ (3/22)

నేటి మ్యాచ్
బెంగళూరు X లఖ్‌నవూ
రా.7.30 నుంచి

ముంబై: వేదిక ఏదైనా రాజస్థాన్ రాయల్స్ దూసుకెళ్తోంది. సొంత మైదానంలో రెండు విజయాలు సాధించిన ఈ జట్టు.. ఈసారి వాంఖడేలోనూ దుమ్మురేపింది. దీంతో ముంబై ఇండియన్స్‌కి ముచ్చటగా మూడో పరాభవం తప్పలేదు. స్పిన్నర్ చాహల్ (3/11), పేసర్ బౌల్ట్ (3/22) తమ బంతులతో ముంబైని మరీ పసికూన జట్టులా మార్చేశారు. ఇక బ్యాటింగ్‌లో రియాన్ పరాగ్ (39 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 54 నాటౌట్) ఎప్పటిలాగే తన ఫామ్‌ను చాటుకున్నాడు. దీంతో సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ప్రస్తుతం ఆరు పాయింట్లతో ఈ జట్టు టాప్‌లో కొనసాగుతోంది. అటు ముంబై మాత్రం గెలుపనేదే లేకుండా అట్టడుగున ఉంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 125 పరుగులు చేసింది. హార్దిక్ (21 బంతుల్లో 6 ఫోర్లతో 34), తిలక్ వర్మ (29 బంతుల్లో 2 సిక్సర్లతో 32) మాత్రమే రాణించారు. చాహల్, బౌల్ట్‌లకు మూడేసి, బర్గర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 15.3 ఓవర్లలో 4 వికెట్లకు 127 పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బౌల్ట్ నిలిచాడు.

రియాన్ మరోసారి..: స్వల్ప ఛేదనలో రాజస్థాన్‌కు వరుసగా మూడో మ్యాచ్‌లోనూ శుభారంభం దక్కలేదు. అయితే ఈ క్లిష్టమైన పిచ్‌పై రియాన్ సీజన్‌లో రెండో హాఫ్ సెంచరీతో చెలరేగి విజయాన్నందించాడు. ఓపెనర్ జైస్వాల్ (10) తొలి ఓవర్‌లోనే వెనుదిరగ్గా, మూడు ఫోర్లతో ఆకట్టుకున్న కెప్టెన్ శాంసన్ (12), బట్లర్ (13)లను పేసర్ ఆకాశ్ వరుస ఓవర్లలో అవుట్ చేశాడు. 48/3 స్కోరుతో ఆర్ఆర్ కాస్త తడబాటుకు లోనైంది. ఈ స్థితిలో ఫామ్‌లో ఉన్న రియాన్ పరాగ్ క్రీజులో నిలిచాడు. అతడికి అశ్విన్ (16) సహకరించడంతో భారీ షాట్లకు వెళ్లకుండా లక్ష్యం వైపు కదిలారు. బంతికో పరుగు చొప్పున ఆడిన అశ్విన్ నాలుగో వికెట్‌కు 40 పరుగులు జోడించి వెనుదిరిగాడు. ఈ వికెట్‌ను కూడా ఆకాశ్ తీశాడు. అప్పటికే జట్టు పటిష్ఠ స్థితిలో నిలవగా 16వ ఓవర్‌లో రియాన్ 6,6,4తో అర్ధసెంచరీతో పాటు మ్యాచ్‌ను కూడా ముగించాడు.



చాహల్ (3/11)

బౌల్ట్ మెరుపుదాడి: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైని ఆరంభంలోనే పేసర్ బౌల్ట్ ఉక్కిరిబిక్కిరి చేయగా, మధ్య ఓవర్లలో స్పిన్నర్ చాహల్ మూడు వికెట్లతో మరింత దెబ్బతీశాడు. ఇతర బౌలర్లు కూడా విశేషంగా రాణించడంతో ఎంఐ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. బౌల్ట్ చక్కటి లెంగ్త్ బాల్స్‌తో ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే రోహిత్ (0), నమన్ (0)లను వరుస బంతుల్లో డకౌట్ చేశాడు. అలాగే తన తర్వాతి ఓవర్‌లో బ్రేవిస్ (0)ను సైతం అవుట్ చేయగా.. కాస్త ఊపు మీదున్న ఇషాన్ (16)ను బర్గర్ దెబ్బతీయడంతో ముంబై 20/4 స్కోరుతో దారుణ స్థితిలో నిలిచింది. మరోవైపు తిలక్, కెప్టెన్ హార్దిక్ మాత్రం జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ప్రేక్షకుల హేళనల మధ్య క్రీజులోకి వచ్చిన పాండ్యా ఆరో ఓవర్‌లో మూడు ఫోర్లు బాది పవర్‌ప్లేలో స్కోరును 46/4కి చేర్చాడు. మధ్య ఓవర్లలో ఇద్దరు అడపాదడపా ఫోర్లతో స్కోరు కుదురుకున్నట్టే కనిపించింది. కానీ చాహల్ ఓవర్‌లో పెద్ద షాట్‌కు వెళ్లిన పాండ్యా.. పోవెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో ఐదో వికెట్‌కు 56 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఆర్ఆర్ బౌలర్లు మరింత కట్టుదిట్టం చేయడంతో 10-15 ఓవర్ల మధ్య ఒక్క ఫోర్ కూడా రాలేదు. అదే సమయంలో చావ్లా (5)ను అవేశ్, తిలక్‌ను చాహల్ పెవిలియన్‌కు చేర్చడం దెబ్బతీసింది. 17వ ఓవర్‌లో కొట్జీ (4)ని కూడా చాహల్ అవుట్ చేసి తన కోటాను అద్భుతంగా పూర్తి చేశాడు. భారీ హిట్టర్ డేవిడ్ (17) సైతం విఫలం కాగా.. ఆఖరి ఓవర్‌లో పది రన్స్‌తో ముంబై స్కోరు 120 దాటగలిగింది.

స్కోరుబోర్డు

ముంబై: ఇషాన్ (సి) శాంసన్ (బి) బర్గర్ 16, రోహిత్ (సి) శాంసన్ (బి) బౌల్ట్ 0, ధిర్ (ఎల్బీ) బౌల్ట్ 0, బ్రేవిస్ (సి) బర్గర్ (బి) బౌల్ట్ 0, తిలక్ (సి) అశ్విన్ (బి) చాహల్ 32, హార్దిక్ (సి/సబ్) పావెల్ (బి) చాహల్ 34, పీయూష్ (సి) హెట్‌మయెర్ (బి) అవేశ్ 3, డేవిడ్ (సి) బౌల్ట్ (బి) బర్గర్ 17, కొట్జీ (సి) హెట్‌మయెర్ (బి) చాహల్ 4, బుమ్రా (నాటౌట్) 8, ఆకాశ్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 125/9; వికెట్ల పతనం:** 1-1, 2-1, 3-14, 4-20, 5-76, 6-83, 7-95, 8-111, 9-114; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-22-3, బర్గర్ 4-0-32-2, అవేశ్ ఖాన్ 4-0-30-1, చాహల్ 4-0-11-3, అశ్విన్ 4-0-27-0.

రాజస్థాన్: జైస్వాల్ (సి) డేవిడ్ (బి) మఫాక 10, బట్లర్ (సి) పీయూష్ (బి) ఆకాశ్ 13, శాంసన్ (బి) ఆకాశ్ 12, పరాగ్ (నాటౌట్) 54, అశ్విన్ (సి) తిలక్ (బి) ఆకాశ్ 16, దూబే (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 15.3 ఓవర్లలో 127/4; వికెట్ల పతనం:** 1-10, 2-42, 3-48, 4-88; **బౌలింగ్:** మఫాక 2-0-23-1, బుమ్రా 4-0-26-0, ఆకాశ్ 4-0-20-3, కొట్జీ 2.3-0-36-0, పీయూష్ 3-0-18-0.

1 ఐపీఎల్‌లో ఎక్కువసార్లు (17) డకౌట్ అయిన బ్యాటర్‌గా దినేశ్ కార్తీక్‌తో సమంగా నిలిచిన రోహిత్.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	3	3	0	0	6	1.249
కోల్‌కతా	2	2	0	0	4	1.047
చెన్నై	3	2	1	0	4	0.976
గుజరాత్	3	2	1	0	4	-0.738
హైదరాబాద్	3	1	2	0	2	0.204
లఖ్‌నవూ	2	1	1	0	2	0.025
ఢిల్లీ	3	1	2	0	2	-0.016
పంజాబ్	3	1	2	0	2	-0.337
బెంగళూరు	3	1	2	0	2	-0.711
ముంబై	3	0	3	0	0	-1.423

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ముంబైలో మరీ ఎక్కువగా..



హార్దిక్‌ను వదలని ఫ్యాన్స్

ముంబై: ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యాను క్రికెట్ ఫ్యాన్స్ వదిలేలా లేరు. హిట్‌మ్యాన్ అభిమానులు హైదరాబాద్, అహ్మదాబాద్ మ్యాచ్‌ల సందర్భంగా హార్దిక్ పాండ్యాను తీవ్ర స్థాయిలో గేలి చేశారు. తాజాగా సోమవారం రాజస్థాన్‌తో మ్యాచ్‌కు టాస్‌కోసం వచ్చిన సందర్భంగా హార్దిక్‌ను మరింత గేలి చేశారు. అంతేకాదు..'రోహిత్, రోహిత్..ముంబైకా రాజ్ రోహిత్' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆ సమయంలో రోహిత్.. కామెంటేటర్ హర్భజన్‌తో ముచ్చటిస్తూ కనిపించాడు. ఇక..ముంబై నాలుగో ఓవర్లో 20/4తో ఉన్న దశలో బ్యాటింగ్‌కు దిగిన సందర్భంగా అభిమానులు హార్దిక్‌ను మరింత గేలి చేశారు.

అందుకే పేరు మార్చుకున్నా!



నేనిక జోష్ బట్లర్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్ వైట్‌బాల్ జట్టు కెప్టెన్ బట్లర్ ఓ వ్యక్తిగతమైన కీలక నిర్ణయం తీసుకున్నాడు. తన పేరును జోష్ బట్లర్‌గా అధికారికంగా మార్చుకున్నట్టు సోమవారం వెల్లడించాడు. దాదాపు మూడు దశాబ్దాలుగా తన పేరును జాస్ బట్లర్‌కు బదులు అంతా జోష్ బట్లర్‌గా తప్పుగా పిలుస్తున్నారని పేర్కొన్నాడు. 'జాస్' అని తాను ఎన్నిసార్లు చెప్పినా..అంతా జోష్‌గానే పిలుస్తున్నారన్నాడు. ఈనేపథ్యంలో గందరగోళానికి తెరదించుతూ తన పేరును జోష్ బట్లర్‌గా మార్చుకుంటున్నట్టు వివరించాడు.

పట్టుబిగించిన లంక

బంగ్లాతో రెండో టెస్ట్

చట్టోగ్రామ్: పేసర్లు వికెట్ల వేటను కొనసాగించి వేళ.. బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌లో శ్రీలంక పట్టు బిగించింది. 353 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించినా.. ప్రత్యర్థిని ఫాలో ఆన్ ఆడించకుండా రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన లంక 102/6 స్కోరు చేసింది. సోమవారం మూడోరోజు ఆటముగిసే సమయానికి లంక మొత్తంగా 455 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. తొలి రెండు రోజులు బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్.. పేసర్లకు సహకరించడంతో మూడో రోజు ఏకంగా 15 వికెట్లు నేలకూలాయి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 55/1తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా 178 పరుగులకు ఆలౌటైంది. లంక తొలి ఇన్నింగ్స్‌లో 531 పరుగులు చేసింది.



డబుల్స్ విజేత ఆనంద్ జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్‌లో రాష్ట్ర ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ జోడీ విజేతగా నిలిచింది. సోమవారం లేక్‌వ్యూ టెన్నిస్ అకాడమీలో జరిగిన ఈ పోటీల ఫైనల్లోని 40 ప్లస్ విభాగంలో సీవీ ఆనంద్-అరుణ్ కుమార్ జోడీ 10-7తో శ్రీనివాస్-రాజ ద్వయంపై నెగ్గి టైటిల్ సొంతం చేసుకుంది. 40 ప్లస్ సింగిల్స్‌లో సీవీ ఆనంద్ రన్నరప్‌గా నిలవగా, 50 ప్లస్ సింగిల్స్ ఫైనల్లో డీసీపీ నంద్యాల నరసింహారెడ్డి 10-9తో మణికందన్‌పై పోరాడి గెలిచారు. హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

జగన్ అబద్ధాలు చెప్పి నమ్మించాడు!

- రాష్ట్ర విధ్వంసమే ఆయన ఎజెండా
- కూల్చివేతతో పాలనకు శ్రీకారం
- కులముద్రతో అమరావతి నాశనం
- గంజాయి రాజధానిగా ఆంధ్ర
- తాడేపల్లి ప్రచారంలో లోకేశ్ ధ్వజం

నిజాలు వివరించడంలో మేం విఫలం: లోకేశ్



తాడేపల్లి శ్రీచక్ర అపార్ట్‌మెంట్లో ప్రసంగిస్తున్న లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 1: గతంలో జగన్మోహన్‌రెడ్డి అబద్ధాలు చెప్పి నమ్మించాడని.. ఆ స్థాయిలో తాము వాస్తవాలను ప్రజలకు వివరించి చెప్పడంలో విఫలమయ్యామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ వ్యాఖ్యానించారు. ఒక రకంగా ఇది తమ బలహీనతేమోనని అన్నారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేయడమే జగన్ ఎజెండాగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన గుంటూరు జిల్లా తాడేపల్లి శ్రీచక్ర అపార్టుమెంట్ వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగన్ పాలన ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైందని గుర్తుచేశారు. 'రాజధాని అమరావతిపై కులముద్ర వేసి నాశనం చేశాడు. కోవిడ్ సమయంలో కోవాగ్జిన్ టీకా తయారు చేసి ప్రపంచానికి అందించి తెలుగోడి సత్తా చాటిన భారత్ బయోటెక్‌పై కూడా కులముద్ర వేసి ఒడిసాకు తరిమేశారు. జగన్ వినాశకర చర్యల కారణంగా రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాకపోగా ఉన్నవి సైతం పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయి. రాష్ట్రాన్ని గంజాయి కేపిటల్ ఆఫ్ ఇండియాగా మార్చి యువత భవిష్యత్‌ను నాశనం చేశాడు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాటాడిన జగన్ ఎక్కడా ఒక్క ఇటుక కూడా పెట్టలేదు. విశాఖలో రుషికొండకు బోడి గుండు చేసి రూ.500 కోట్లతో తనకో ప్యాలెస్ మాత్రం కట్టుకున్నాడు. అమరావతిని రాజధానిగా కొనసాగించి ఉంటే ఇప్పటికి 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించి ఉండేవి. ఆయన విధ్వంసకర విధానాలతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది. విజనరీ నాయకుడికి, విధ్వంస పాలకుడికి ఉన్న తేడాను యావత్ రాష్ట్ర ప్రజలు ఇప్పటికైనా గమనించాలి' అని కోరారు. అధికారంలోకి వస్తే నైపుణ్య విద్యను అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమాలను బ్యాలెన్స్ చేసుకుంటూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.





లోకేశ్‌ను కాదని మిమ్మల్ని గెలిపించి బికారులయ్యాం

- మేమూ రెడ్లమే.. రాజధాని మార్పుతో తీవ్రంగా నష్టపోయాం
- జగన్‌ను మళ్లీ గెలిపిస్తే... ఆయన విశాఖకు పోతే మా గతేంది?
- తాడేపల్లిలో ఆళ్ల, మురుగుడు లావణ్యను నిలదీసిన స్థానికులు

మంగళగిరి, ఏప్రిల్ 1: 'పోయిన ఎన్నికల సమయంలో జగన్ గెలిస్తే రాజధానిని అమరావతి నుంచి మార్చేస్తాడని టీడీపీ నేతలు చెప్పినా వినలేదు. లోకేశ్‌ను ఓడించాం. మిమ్మల్ని గెలిపించాం. జగన్ సీఎం కాగానే మూడు రాజధానులు ముందుకు తెచ్చారు. అమరావతిని కాదని, విశాఖ పరిపాలనా రాజధాని అన్నారు. నమ్మి ఓట్లేసిన మేం బికారులయ్యాం' అంటూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని స్థానికులు నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తాడేపల్లిలో సోమవారం స్థానికులతో సమావేశమైన ఎమ్మెల్యే ఆళ్ల, వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యలకు ఎదురైన నిలదీతల పర్వం ఇది. 'మేమంతా రెడ్లమే. జగన్ మూడు రాజధానుల ప్రకటనతో తీవ్రంగా నష్టపోయాం' అని సూటిగా చెప్పడంతో వైసీపీ నేతలు బదులివ్వలేకపోయారు. మంగళగిరిలో టీడీపీ అభ్యర్థి లోకేశ్ ఇటీవల వరుసగా బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్ పేరుతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. వైసీపీ నేతలు కూడా ఆయనలాగే అపార్ట్‌మెంట్ వాసులతో భేటీ అవ్వాలని ప్లాన్ చేసుకున్నారు. తొలిగా సోమవారం తాడేపల్లిలోని అమరావతి వన్ అపార్ట్‌మెంట్స్ నుంచి మొదలుపెట్టారు. అభ్యర్థి లావణ్య, ఆళ్ల, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తదితరుల బృందం ఆ అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశమైంది. ప్రారంభంలోనే ఓ యువకుడు మైకు తీసుకుని. 'భూముల విలువలు బాగా పడిపోయాయి. మా కమ్యూనిటీనే తీసుకోండి. ఈ అపార్టుమెంట్‌లో ఎస్ఎఫ్‌టీ రూ.5,500 ఉండేది. మూడు రాజధానుల నిర్ణయంతో రూ.3,300లకు కూడా కొనేవారే లేరు. ఈ అపార్టుమెంట్‌లో ఎక్కువమంది రైతు కుటుంబాలే. చాలావరకు మన రెడ్లు ఉండగా, కొందరు చౌదరీస్ కూడా ఉన్నారు. మా అపార్టుమెంట్‌లోని ప్లాట్లలో దేవుడి బొమ్మలు లేవు. అందరి ఇళ్లలో రాజశేఖరరెడ్డి ఫొటోలే ఉన్నాయి. జగన్ మూడు రాజధానుల ప్రకటనతో మేమంతా నష్టపోయాం. ఆయన ప్రస్తుతానికి తాడేపల్లిలో ఉంటున్నారు. రేపు ఎన్నికల య్యాక విశాఖ నుంచే పాలన చేస్తానంటున్నారు. అపుడు మా పరిస్థితి ఏమిటి? మా ఆస్తుల విలువలు మరింత దిగజారిపోవా? మీరే సమాధానం చెప్పాలి' అంటూ నిలదీశారు. దీంతో నేతలు కంగుతిన్నారు. ఏం చెప్పాలో పాలుపోక నీళ్లు నమలాల్సి వచ్చింది.



సోనియా, ఖర్గే నేతృత్వంలో జరిగిన సమావేశంలో షర్మిల, రఘువీరారెడ్డి

కడప బరిలోనే షర్మిల

- లోక్‌సభకు పోటీ ఖరారు.. ఢిల్లీలో కాంగ్రెస్ సీఈసీ భేటీ
- 5 ఎంపీ, 114 అసెంబ్లీ అభ్యర్థులకు లైన్ క్లియర్.. నేడు జాబితా

న్యూఢిల్లీ/అమరావతి/కడప, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి కడప లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయడం ఖాయమైంది. రాష్ట్రంలో కడప సహా ఐదు లోక్‌సభ సీట్లు, 114 అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీకి చెందిన కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ జాబితాను మంగళవారం ఇడుపులపాయలో ప్రకటించనున్నారు. సీఈసీ సమావేశం సోమవారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగింది. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, ఏఐసీసీ ఎస్టీఎస్టీసెల్ చైర్మన్ కొప్పుల రాజు, షర్మిల పాల్గొన్నారు. మొత్తం 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు గాను 117 అసెంబ్లీ, 17 ఎంపీ స్థానాల అభ్యర్థుల ఎంపికపై ఈ సందర్భంగా చర్చించారు. కడప ఎంపీ స్థానంలో షర్మిల, రాజమండ్రి-గిడుగు రుద్రరాజు, విశాఖ-సత్యారెడ్డి, కాకినాడ-ఎంఎం పళ్లంరాజు, బాపట్ల నుంచి జేడీ శీలం పోటీ చేయనున్నట్లు తెలిసింది. పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఎన్నికల బరిలో లేరని సమాచారం. కమ్యూనిస్టు పార్టీలతో సర్దుబాటు నేపథ్యంలో మిగిలిన స్థానాలను పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. కాంగ్రెస్ తొలి జాబితా ప్రకటన కోసం షర్మిల మంగళవారం కడప జిల్లాకు వెళ్తున్నారు.

కాంగ్రెస్, లెఫ్ట్ సర్దుబాటు కొలిక్కి


అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతో పొత్తులో భాగంగా సీపీఐ, సీపీఎం పార్టీల సీట్ల సర్దుబాటు ఓ కొలిక్కి వచ్చింది. గుంటూరు లోక్‌సభ స్థానాన్ని సీపీఐకి, అరకు లోక్‌సభ స్థానాన్ని సీపీఎంకు కేటాయించారు. వీటితోపాటు ఉభయ కమ్యూనిస్టుపార్టీలు పోటీచేసే అసెంబ్లీ స్థానాల జాబితాలను కూడా మంగళవారం అధికారికంగా ప్రకటించనున్నారు. చెరో రెండేసి పార్లమెంటు, 15చొప్పున అసెంబ్లీ స్థానాలకు తమకు కేటాయించాలని సీపీఐ, సీపీఎం రాష్ట్ర నేతలు ఇంతకుముందే కాంగ్రెస్ పార్టీకి తమ జాబితాలు అందజేశాయి. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి గతనెల 28న సీట్ల సర్దుబాటుపై సీపీఐ, సీపీఎం నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా తమ పార్టీకి బలమున్న అరకు, కర్నూలు లోక్‌సభ స్థానాలతోపాటు కురుపాం, అరకు, రంపచోడవరం, గాజువాక, గన్నవరం, విజయవాడ సెంట్రల్, మంగళగిరి, నెల్లూరు, కర్నూలు, సంతనూతలపాడు.. అసెంబ్లీ స్థానాలను తమకు కేటాయించాలని సీపీఎం నేతలు కోరారు. గుంటూరుతోపాటు రాయలసీమలో మరో పార్లమెంటు స్థానాన్ని, 12 అసెంబ్లీ స్థానాలను తమ పార్టీకి కేటాయించాలని సీపీఐ నేతలు కోరారు.

అవ్వా తాతలకు జగన్ వెన్నుపోటు

- ఇంటికి పింఛన్లు పంపే అవకాశమున్నా కావాలనే పంపడం లేదు: బాబు
- టీడీపీ అడ్డుకుంటోందని ఫేక్ ప్రచారం
- కావలసిన కాంట్రాక్టర్లకు గత 15 రోజుల్లో 13 వేల కోట్లు
- ఖజానా ఖాళీ.. పెన్షన్లకు డబ్బు లేదు
- మేమొస్తే పింఛన్ 4 వేలు: టీడీపీ అధినేత

> ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు ఇవ్వొద్దని కోర్టు చెప్పలేదు. ఎన్నికల కమిషన్ కూడా చెప్పలేదు. అయినా జగన్ మాత్రం ఇంటి వద్దకు పెన్షన్ పంపవద్దని అధికారులను ఆదేశించాడు.
>
> వలంటీర్లూ.. అధికార పార్టీ నేతల మాటలు నమ్మి మీ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు. జగన్ రాజకీయ క్రీడలో పావులు కావొద్దు.
>
> \- చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండుటెండల కాలంలో అవ్వాతాతలకు ముఖ్యమంత్రి జగన్ వెన్నుపోటు పొడిచారని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. పేదల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను ఇచ్చే అవకాశమున్నా కావాలనే చేయడం లేదన్నారు. టీడీపీ వచ్చిన తర్వాత పింఛను మొత్తాన్ని రూ. 4 వేలకు పెంచుతామని ప్రకటించారు. ఈ రెండు మూడు నెలలు ఎవరైనా తీసుకోకపోయినా తర్వాత వారికి పెంచిన మొత్తంతో కలిపి ఇస్తామని తెలిపారు. సోమవారం ఆయన రాష్ట్రంలోని తమ పార్టీ నేతలు, బూత్ స్థాయి కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజకీయ లబ్ధి కోసం వృద్ధులను అవస్థ పెట్టడానికి కూడా జగన్ వెనుకాడడం లేదని ధ్వజమెత్తారు. టీడీపీ కూటమి గద్దెనెక్కితే వలంటీర్లు ఉంటారని చెప్పారు. 'గ్రామ, వార్డు సచివాలయాల్లో లక్షా 30 వేల మంది ప్రభుత్వ సిబ్బంది ఉన్నారు. వారి ద్వారా ఒక్క రోజులోనే పింఛను ఇంటింటికి పంపిణీ చేసే అవకాశం ఉన్నా కావాలనే చేయడం లేదు. టీడీపీ అడ్డుకుంటోందని మోసపూరిత ప్రచారం మొదలుపెట్టారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని జగన్‌కు అర్థమైంది. అందుకే ఫేక్ ప్రచారాలు, కుట్ర రాజకీయాలకు తెరదీశాడు. ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయకపోతే ఊరుకునేది లేదు. దీనిపై ఎంతవరకైనా వెళ్లి పోరాటం చేయడం ఖాయం. మీరు కూడా అధికారులను గట్టిగా నిలదీయండి' అని పార్టీ నేతలకు పిలుపిచ్చారు. వలంటీర్లను వైసీపీ తన రాజకీయ అవసరాల కోసం వాడుకుంటూ పార్టీ ప్రచారం చేయించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. 'వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని అనేక ఫిర్యాదులు వచ్చాయి. అందుకే ప్రభుత్వ పథకాల పంపిణీకి వారిని దూరం పెట్టాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. మనం వలంటీర్ల వ్యవస్థకు, పింఛన్లను ఇంటి వద్ద పంచడానికి వ్యతిరేకం కాదు. వలంటీర్లను రాజకీయంగా వాడుకోవడానికే మనం వ్యతిరేకం' అని స్పష్టం చేశారు. గత 15 రోజుల్లో జగన్ ప్రభుత్వం తమ వారికి రూ.13 వేల కోట్లు చెల్లింపులు చేసి ఖజానా ఖాళీ చేసిందని, చివరకు పేదల పింఛన్లకు కూడా డబ్బు మిగల్చలేదని దుయ్యబట్టారు. తమకు కావాల్సిన కాంట్రాక్టర్లకు పిలిచి డబ్బులిచ్చి- అవ్వా తాతలను ఏడిపిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో గెలవడానికి సొంత బాబాయినే గొడ్డలిపోటుతో లేపేసిన వైసీపీ పెద్ద మనుషులు ఎన్ని కుట్రలైనా చేయగలరన్నారు.



విదేశీ విద్య చిందరవందర

మేం రాగానే న్యాయం చేస్తాం

బాధిత తల్లిదండ్రులకు చంద్రబాబు హామీ

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గతంలో తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అమలు చేసిన విదేశీవిద్య పథకాన్ని జగన్ ప్రభుత్వం చిందరవందర చేసిందని మాజీ సీఎం చంద్రబాబు విమర్శించారు. అధికారంలోకి రాగానే అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. సకాలంలో స్కాలర్‌షిప్పులు అందక తమ పిల్లలకు విదేశీ విద్యను దూరం చేశారు.. మీరైనా న్యాయం చేయాలని 26 జిల్లాల నుంచి వచ్చిన బాధిత తల్లిదండ్రులు ఆయన్ను కోరారు. ప్రజాగళం సభ కోసం ఆదివారం సాయంత్రం బాపట్ల వచ్చిన ఆయన.. సోమవారం ఉదయం ఆ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నాయకులతో రెండు దపాలుగా సమావేశమై ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో విదేశీ విద్యకు సంబంధించిన స్కాలర్‌షిప్పులు సకాలంలో అందక బాధితులుగా మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆయన్ను కలిశారు. వినతిపత్రం అందించారు. ఆయన హయాంలో అంబేడ్కర్ విదేశీ విద్య పేరిట స్కాలర్‌షిప్పులు అందించి పేదవర్గాలకు ఎంతో అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. కానీ ప్రస్తుతం 26 జిల్లాల్లోని 359 మంది పేద విద్యార్థులకు విదేశీ విద్య సాయం అందక అల్లాడిపోతున్నారని చెప్పారు. కాగా.. కాకినాడ జిల్లా జగ్గంపేట ఏఎంసీ చైర్మన్ జన్నపురెడ్డి సుబ్బారావు సోమవారం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు.

వైసీపీకి ఎమ్మెల్సీ జంగా రాజీనామా

- పదవులిస్తేనే సామాజిక న్యాయం రాదు
- తగిన గౌరవం, మర్యాదలు కూడా ఇవ్వాలి
- వైసీపీలో అవేమీ లేవు: కృష్ణమూర్తి
- 5, 6 తేదీల్లో లోకేశ్ సమక్షంలో టీడీపీలోకి!



దాచేపల్లి, ఏప్రిల్ 1: వైసీపీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడులోని తన స్వగృహంలో టీడీపీ, జనసేన నాయకుల సమక్షంలో ఆయన రాజీనామా ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ- 2019లో గురజాల అసెంబ్లీ స్థానాన్ని కాసు మహేశ్‌రెడ్డి కోసం త్యాగం చేశానని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి పార్టీ పెట్టకముందు నుంచీ ఆయనతో కలిసి ప్రయాణం చేసిన పది మందిలో తానూ ఒకడినన్నారు. పదవులిస్తేనే సామాజిక న్యాయం రాదని.. తగిన గౌరవం, మర్యాద కూడా ఇవ్వాలని.. అవేవీ వైసీపీలో లేవని చెప్పారు. 'వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణించిన నెలకే ఆయనకు భారతరత్న ఇవ్వాలని, జగన్మోహన్‌రెడ్డికి సీఎం పదవి ఇవ్వాలంటూ పిడుగురాళ్ల నుంచి ప్రజలతో కలిసి హైదరాబాద్ గాంధీభవన్ వరకు పాదయాత్ర చేశా. వైసీపీ నిర్మాణ కమిటీలో పబ్లిసిటీ, ప్రాపగాండ కార్యదర్శిగా పనిచేశా. గత 14 ఏళ్లలో పార్టీలో ఎన్నో ఒడిదొడుకులు, ఇబ్బందులు, అవమానాలు భరించాను. ఈ విషయాన్ని ఎన్నోసార్లు పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లాను. కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రజాప్రతినిధులంటే ప్రజల సొమ్ముకు ధర్మకర్తలా ఉండాలి. కానీ నేటి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ప్రజల సొమ్మును సొంత సొమ్ముగా భావిస్తున్నారు. గత ఐదేళ్లలో నన్ను నమ్ముకుని ఉన్నవారికి న్యాయం చేయలేకపోయా. అది నాకెంతో బాధకు గురిచేసింది. రాజకీయాల్లో ఇదే నా ఆఖరి మజిలీ కావచ్చు. ఈ నెల 5, 6 తేదీల్లో గురజాలకు రానున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సమక్షంలో పార్టీలో చేరతాను. క్రియాశీలంగా పనిచేస్తా' అని వివరించారు. వైసీపీని వీడడం కష్టంగా ఉన్నా.. పేద ప్రజల కోసం, తనను నమ్ముకున్న వారికి న్యాయం చేసేందుకు పార్టీని వీడుతున్నట్లు స్పష్టం చేశారు.

హోరెత్తిన ప్రజాగళం

బాబు తొలి విడత పర్యటనకు భారీ స్పందన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక ప్రజాగళంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన తొలివిడత పర్యటన విజయవంతమైంది. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఐదు రోజుల్లో ఆయన 15 భారీ బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఆ పార్టీ శ్రేణులు కూడా ఊహించనంత పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ముఖ్యంగా అధికార పార్టీ బలంగా ఉందనుకుంటున్న రాయలసీమలో సభలకు వచ్చిన స్పందన ఆ పార్టీ వర్గాలను బాగా ఉత్సాహపరచింది. మాజీ సీఎంకు కూడా ఎనలేని సంతృప్తినిచ్చింది. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఏర్పాటు ఆవశ్యకత, ధ్వంసమైన రాష్ట్రానికి కేంద్ర సాయం ఎందుకు కావాలో ఆయన విపులంగా వివరించారు. అధికారంలోకి వస్తే ఏమేం చేసేదీ విశదీకరించారు. గత నెల 27 నుంచి 31 వరకు ఐదు రోజుల్లో మొత్తం 15 సభలు నిర్వహించారు. రోజుకు మూడు నియోజకవర్గాల్లో ఇవి జరిగాయి. మండుటెండల్లో మిట్ట మధ్యాహ్నం కూడా సభలు జరగడం విశేషం. 27న పలమనేరు, పుత్తూరు, మదనపల్లె.. 28న రాప్తాడు, శింగనమల, కదిరి.. 29న బనగానపల్లె, కావలి, వింజమూరు(ఉదయగిరి).. 30న ప్రొద్దుటూరు, నాయుడుపేట(సూళ్లూరుపేట), శ్రీకాళహస్తి, 31న మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్లల్లో జరిగిన భారీ బహిరంగ సభలు జనంతో కిక్కిరిశాయి.

సీఎం సభలు అలా.. బాబు సభలు ఇలా..

సీఎం జగన్మోహన్‌రెడ్డి, చంద్రబాబు ఇద్దరూ మార్చి 27వ తేదీనే తమ ప్రచారం ప్రారంభించారు. వీరి సభల నిర్వహణలో చాలా తేడా ఉంది. ముఖ్యమంత్రి సభలను రోజుకొకటి చొప్పున సాయంత్రం చల్లబడిన తర్వాత జరుపుతున్నారు. ఆ జిల్లాలోని మొత్తం నియోజకవర్గాల నుంచి ప్రజలను తరలిస్తున్నారు. అయినా అవి భారీగా ఉండడం లేదని అంటున్నారు. ఇదే సమయంలో చంద్రబాబు రోజుకు మూడు సభలు నిర్వహించారు. అందులో రెండు సభలు పగలు వేసవి ఎండల్లోనే జరిగాయి. జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల నుంచి పెద్దగా జన సమీకరణ చేయలేదు. ఏ నియోజకవర్గం నేతలు దానిపైనే కేంద్రీకరించి సభలు నిర్వహించారు. అయినా జనం భారీగా పోటెత్తారు. ఈసారి టీడీపీ కూటమికి అనుకూల పవనాలు వీస్తున్నాయని.. అందుకే ఈస్థాయిలో సభలు జయప్రదమయ్యాయని టీడీపీ నేతలు చెబుతున్నారు. సీఎం సభలకు జన సమీకరణకు డబ్బులిస్తున్నారని, దానితో తాము పోటీపడే స్థితిలో లేమని.. అయినా తమ సభలే బాగా జరిగాయని ఓ మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాగా, మొదటి విడత పర్యటన పూర్తికావడంతో చంద్రబాబు సోమవారం ఉదయం బాపట్ల నుంచి హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు. అసంతృప్తితో ఉన్న కొందరు పార్టీ నేతలను అక్కడకు పిలిపించారు. బుధవారం నుంచి రెండో విడత పర్యటన ప్రారంభం కానుంది. ఉభయ గోదావరి జిల్లాల్లో ఇది జరుగనుంది. ఎండల వేడిమి పెరిగిపోతుండడంతో సభల సమయం మార్చారు. ఈసారి రోజుకు రెండు సభలు పెడుతున్నారు. ఆ రెంటినీ సాయంత్రమే నిర్వహిస్తారు.

ఈ సభలు మార్పు సంకేతాలు: బాబు

జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత తీవ్రంగా ఉందని, దానివల్లే తన ప్రజాగళం సభలు జయప్రదం అవుతున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సభలు రాబోయే మార్పునకు సంకేతాలని పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో తెలిపారు. 'అధికార పార్టీ వందల కోట్లు గుమ్మరిస్తున్నా రాని ప్రజానీకం మన సభలకు వస్తున్నారు. రాష్ట్ర అవసరాల కోసం ఎన్డీయేతో పొత్తు పెట్టుకున్నాం. దీనిపై కూడా తప్పుడు ప్రచారం చేస్తూ ముస్లింలలో అభద్రత సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు' అని ధ్వజమెత్తారు.

నన్ను బ్లేడ్‌తో కోస్తున్నారు!

(మొదటి పేజీ తరువాయి)



పవన్ కల్యాణ్ సమక్షంలో సోమవారం జనసేనలో చేరిన పిఠాపురంలోని వైసీపీ నేతలు

ఉద్దేశించి పవన్ వ్యాఖ్యానించారు. ఈ మధ్య కూడా ఇలా బ్లేడుతో దాడి చేశారంటూ ఓ ప్రాంతం పేరు చెప్పబోయి మధ్యలోనే ఆపేశారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న పవన్ మూడు రోజుల నుంచి ఇక్కడ పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం పిఠాపురంలోని ఓ హోటల్‌లో పార్టీలో చేరిన న్యాయవాదులు, వైద్యులు, వైసీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 2 లక్షల మంది పైచిలుకు ఉన్న ప్రజలతో తనకూ ఫొటో తీయించుకోవాలని ఉందన్నారు. చేరికల సందర్భంగా జరుగుతున్న సమావేశానికి హాజరైన నేతలు, కార్యకర్తలు కూడా తనతో ఫొటోలు దిగడానికి ముందుకు రావాలని ఉన్నా రాలేకపోతున్నారని చెప్పారు. అందరితో ఒకేసారి ఫొటోలు దిగలేమని, రోజుకు కనీసం రెండు వందల మందితో ఫొటోలు దిగుతానని అన్నారు. ఇందుకు భద్రతాపరమైన సమస్యలు ఉన్నాయని, ఆ నిబంధనలను పాటించాలని కోరారు. తనను కలిసేందుకు భారీగా వస్తున్న వారిలో కొన్ని కిరాయిమూకలు కలిసిపోతున్నాయని, వారు సన్నటి బ్లేడ్లతో తనను, తన సెక్యూరిటీని గాయపరుస్తున్నారని తెలిపారు. దీంతో ఒక్కసారిగా సమావేశంలో నిశ్శబ్దం అలముకుంది. ఇటీవల తనను ఇలాగే గాయపరిచారని పవన్ తెలిపారు. అందుకే భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకుంటూనే అందరికీ అవకాశం కల్పిస్తానన్నారు. గతేడాది జూన్‌లో కాకినాడ జిల్లాలో జరిగిన వారాహి యాత్రలో కూడా తనకు ప్రాణహాని ఎదురైందని పవన్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

పిఠాపురంలోనే ఉంటా!

పిఠాపురంలో ప్రతి మండలం, గ్రామం, పట్టణం, ప్రతి వార్డు పర్యటిస్తానని అన్నారు. శ్రీపాదశ్రీవల్లభుడు, పురుహూతికా అమ్మవారు, ఆంధ్రాబాప్టిస్టు చర్చి, బషీర్‌బీబీ (బంగారుపాప) దర్గా సాక్షిగా పిఠాపురం ప్రజలందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. తానెప్పుడూ భగవంతుడిని తన సొంతానికి ఏదీ కోరుకోలేదన్నారు. వరుసగా సినిమాలు ఫ్లాప్ అయినప్పుడు, ఆ తర్వాత భీమవరంలో ఓడిపోయినప్పుడు తన అభిమానుల కోరిక తీర్చడం కోసం ఒక్కసారైనా తనకు గెలుపు ఇవ్వమని భగవంతుడిని కోరితే పిఠాపురం పిలిచిందన్నారు. ఆ తల్లి పురుహూతిక అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గంలోని 54 గ్రామాల్లో ఏదో ఒక చోట ఇల్లు తీసుకుంటానని పవన్ తెలిపారు. అందరినీ కలుస్తానని, వారి సమస్యలు తెలుసుకుంటానని అన్నారు. నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి తన బాధ్యత అని తెలిపారు. పార్టీలో కష్టపడిన ప్రతిఒక్కరికీ అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా వైసీపీని ఉద్దేశిస్తూ.. ఫ్యాన్‌కు సౌండ్ ఎక్కువ.. గాలి తక్కువ అన్నారు. గాజు గ్లాసుకు పగిలేకొద్దీ పదును ఎక్కువ అని వ్యాఖ్యానించారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి భారీ మెజార్టీతో గెలవబోతోందని చెప్పారు.

జనసేనలో చేరిన మండలి బుద్ధప్రసాద్

- నిమ్మక జయకృష్ణకు పార్టీ కండువా కప్పిన పవన్
- రైల్వేకోడూరు నుంచి భారీగా చేరికలు

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో పలువురు టీడీపీ నాయకులు జనసేనలో చేరారు. సోమవారం సాయంత్రం పిఠాపురంలో జరిగిన సమావేశంలో అవనిగడ్డ, పాలకొండ, రైల్వేకోడూరు నేతలు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో మాజీ ఉపసభాపతి, మాజీ మంత్రి.. మండలి బుద్ధప్రసాద్, పాలకొండ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు నిమ్మక జయకృష్ణ, రైల్వే కోడూరు నియోజకవర్గం ముక్కావారిపల్లె గ్రామ సర్పంచ్ అరవ శ్రీధర్ కూడా ఉన్నారు. వీరంతా అవనిగడ్డ, పాలకొండ, రైల్వేకోడూరు టికెట్లు ఆశిస్తున్నారు.



ఎన్నికల ప్రధానాధికారి మీనాకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

అధికారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు

- పల్నాడు ఎస్పీకి ఆ పదవిలో ఉండే అర్హత లేదు
- చీవాట్లు తిన్నా నంద్యాల ఎస్పీ వైఖరి మారలేదు
- వైసీపీ కార్యకర్తలా తిరుపతి కలెక్టర్
- కోడ్‌ను ఉల్లంఘిస్తూ శ్రీలక్ష్మి జీవో
- సీఈఓకు టీడీపీ, బీజేపీ, జనసేన ఫిర్యాదు
- టీడీపీకి ఓటు వేస్తే చంపుతామంటూ వైసీపీ ఎమ్మెల్యే బొల్లా బెదిరిస్తున్నారు: జీవీ

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ వైసీపీకి అనుకూలంగా పని చేస్తున్న అధికారులపై టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. సోమవారం అమరావతి సచివాలయంలో ఆయనకు ఫిర్యాదు చేసిన అనంతరం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య మీడియాతో మాట్లాడారు. కొంత మంది ప్రభుత్వ అధికారులు యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డికి ఒక్క క్షణం కూడా ఆ పదవిలో ఉండే అర్హత లేదన్నారు. 'నరసరావుపేట పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో వైసీపీని గెలిపించి కానుకగా ఇస్తానని జగన్‌కి ఎస్పీ ప్రమాణం చేశారంటూ స్థానిక ప్రజలు చెప్పుకుంటున్నారు. నంద్యాల ఎస్పీకి ఈసీ చీవాట్లు పెట్టినా ఆయన వైఖరిలో మార్పు లేదు. సీఈవో పిలిపించినా, ఈసీకి ఫిర్యాదు వెళ్లినా ఆ జిల్లాల్లో మళ్లీ టీడీపీ కార్యకర్తపై దాడి జరిగింది. తిరుపతి కలెక్టర్ వైసీపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారు. వీరందరినీ ఎన్నికల విధుల నుంచి తొలగించాలని కోరాం. 5వ తేదీలోపు పింఛన్లు పంపిణీ చేసేలా ఆదేశించాలని కోరాం. చంద్రబాబు అధికారంలోకి వస్తే పింఛన్లు రావంటూ సోషల్ మీడియాలో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది. దీనికి బాధ్యులైన వారందరినీ అరెస్టు చేయాలని కోరాం. కోడ్ వచ్చిన తర్వాత ఆగమేఘాలపై మంగళగిరి మున్సిపాలిటీకి రూ.700 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రాష్ట్రంలోని మిగతా మున్సిపాలిటీలపై లేని ప్రేమ మున్సిపల్‌శాఖ ప్రత్యేక సీఎస్ శ్రీలక్ష్మికి ప్రత్యేకంగా ఈ మున్సిపాలిటీపై ఎందుకు? కోడ్ అమల్లో ఉండగా జీవో ఎలా ఇస్తారు? మంగళగిరిలో లోకేశ్ గెలుపు ఖాయమైంది. అందుకే వైసీపీ ప్రభుత్వం అనైతిక చర్యలకు పాల్పడుతోంది. తొలగించిన 440 మంది వలంటీర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్య, పొన్నూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీ కృష్ణ ఓ గ్రామంలోని చర్చిలో ప్రచారం నిర్వహించారు. మతం పేరుతో ఓట్లు అడిగారు. వీరిపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరాం. మేం చేసిన ఫిర్యాదులపై ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు' అని వర్ల తెలిపారు.

పోలీస్ బలగాలను పెంచాలి

టీడీపీకి ఓటు వేసే వాళ్లను చంపుతామని వినుకొండ వైసీపీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బెదిరిస్తున్నారని టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు ఫిర్యాదు చేశారు. ఆయన సోమవారం అమరావతి సచివాలయంలో సీఈవో మీనాను కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'బ్రహ్మనాయుడు నోటికి వచ్చిన బూతులు తిడుతున్నారు. టీడీపీకి ఓటు వేసిన వాళ్లను చంపుతానని బెదిరిస్తున్నారు. కోడ్ అమలులో ఉండగా ఓటర్లను బెదిరింపులతో ప్రభావితం చేస్తున్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరాం. వినుకొండలో కొంత మంది పోలీసుల సహకారంతో రిగ్గింగ్ చేసుకోవాలని చూస్తున్నారు. పోలీస్ బలగాలను పెంచి అన్ని బూత్‌ల వద్ద వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలని ఈసీని కోరాం' అని వర్ల రామయ్య తెలిపారు. కార్యక్రమంలో నక్కా ఆనందబాబు, దేవినేని ఉమామహేశ్వరరావు, మాచర్ల టీడీపీ అభ్యర్థి బ్రహ్మారెడ్డి, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాజీ, జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీపై వైసీపీ నీచ రాజకీయం

» ప్రతిపక్షాలు, ఎన్నికల సంఘంపై అసత్య ప్రచారం: మనోహర్



తెనాలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): 'పెన్షన్ల పంపిణీ విషయాన్ని అధికార వైసీపీ రాజకీయం చేస్తోంది. ప్రతిపక్షాలపై విష ప్రచారం చేసి, జనంలో వారిపై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకోవడానికి కుట్ర చేస్తోంది. ఈ నెల 3లోపు పెన్షన్లన్నీ పంపిణీ చేయకుంటే ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయిస్తాం. సంబంధిత అధికారులపై చర్యలకు డిమాండ్ చేస్తాం' అని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న జాప్యంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పంపిణీ విషయంలో దుష్ప్రచారం చేయడం కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని ఆయన మండిపడ్డారు. వీరు పంపిణీ చేస్తామంటే, ప్రతిపక్షాలు ఆపేసినట్లు, చంద్రబాబు వల్లే పంపిణీ ఆగినట్లు ప్రచారం చేయడం రాజకీయ లబ్ధి కోసమేనన్నారు. ఇంటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చెయ్యొద్దనే మాటను ఎన్నికల సంఘం ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. ప్రతిపక్షాలపై బురద చల్లేందుకు కావాలనే పంపిణీని ఆలస్యం చేశారని, మందులు కొనుక్కునేందుకు డబ్బుల కోసం ఎదురు చూసే ఎందరో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల ఉసురు పోసుకుంటున్నారని మండిపడ్డారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని తొలగించాలి: కాలవ



రాయదుర్గం, ఏప్రిల్ 1: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని ఎన్నికల కమిషన్ తొలగించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వానికి పింఛన్ల పంపిణీ చేతకాకపోతే ఎన్నికల కమిషన్‌కు అప్పగించాలని, వాళ్లే పంపిణీ చేస్తారని అన్నారు. వైసీపీ నాయకుల అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకు టీడీపీ మీద నెపం వేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి పావుగా మారారని ఆరోపించారు. పింఛన్ల పంపిణీకి పది రోజులు పడుతుందని సీఎస్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. మూడు రోజుల్లో పింఛన్లను పంపిణీ చేయవచ్చని అన్నారు.

పెన్షన్ల జాప్యంలో జవహర్ రెడ్డి కుట్ర: బీజేపీ

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్ల పంపిణీ జాప్యానికి కర్త, కర్మ, క్రియ ప్రభుత్వ యంత్రాంగ అధిపతి జవహర్ రెడ్డి అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగోతు రమేశ్ నాయుడు మండిపడ్డారు. ఎన్నికల వేళ నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులు కుట్రలకు తెరలేపడం అత్యంత దురదృష్టకరం అన్నారు. ఉద్దేశ పూర్వకంగా రద్దు చేసి ప్రతిపక్షాలపై వ్యతిరేకత పెంచి అధికార వైసీపీకి రాజకీయంగా లబ్ధి చేకూర్చేందుకు కుట్ర చేస్తున్న జవహర్ రెడ్డిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాజకీయ ప్రయోజనాల కోసమే నిందలు: సీపీఐ

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో వృద్ధులను సచివాలయాలకు వచ్చి పెన్షన్ తీసుకోవాలని చెప్పడం వెనుక ప్రభుత్వ దురుద్దేశం ఉందని, ఇది ప్రతిపక్షాలపై నింద వేసే ప్రయత్నం తప్ప మరొకటి కాదని సామాజిక పెన్షనర్ల సంక్షేమ సంఘం కన్వీనర్, సీపీఐ రాష్ట్ర నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనాకు సోమవారం ఆయన లేఖ రాశారు. ఎన్నికల సంఘానికి ఉన్న విచక్షణాధికారాన్ని ఉపయోగించి సచివాలయ సిబ్బందితోపాటు పంచాయతీ, మున్సిపల్, మండల స్థాయి ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల ద్వారా పింఛన్లను ఇంటింటికీ పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నామని ముప్పాళ్ల తన లేఖలో పేర్కొన్నారు.

పింఛన్లపై రాజకీయం సరికాదు: షర్మిల

పింఛన్ల పంపిణీ విషయంలో రాజకీయం చేయడం సరికాదని వైఎస్ షర్మిల అన్నారు. జగన్ ప్రభుత్వానికి లాభం చేకూరేలా సీఎస్ వ్యవహరిస్తున్నారని, ఇది సరికాదని చెప్పారు. ఢిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా పింఛన్ పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించిందని, అయినప్పటికీ సీఎస్ అలా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. డీబీటీ పద్ధతిలో ఒక్క రోజులో అయ్యే ప్రక్రియకు పది రోజులెందుకని ప్రశ్నించారు. తక్షణమే పింఛన్ పంపిణీ పూర్తిచేయాలని, లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

వంచన వైసీపీదే!

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించింది. అది పాపమైతే... ఆ పాపానికి కారణం వైసీపీనే!

రాజీనామాలు చేయిస్తున్నారు కదా!

సార్వత్రిక ఎన్నికల్లో వలంటీర్ల పాత్ర, ప్రమేయాన్ని ఎన్నికల కమిషన్ ప్రశ్నిస్తుందని... అడ్డుకుంటుందని వైసీపీకి ముందే తెలుసు. వారిని ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంచాలని అటు ఈసీ, హైకోర్టు స్పష్టం చేశాయి. దీంతో.. వైసీపీ ముందుగానే 'రాజీనామా'ల డ్రామాలు మొదలుపెట్టింది. "ఈ రెండు నెలలు మీరు పూర్తిగా మా కోసమే పని చేయాలి. ఈ విషయంలో ఇబ్బందులు ఎదురైతే రాజీనామాలు చేసేయండి. మీకు నెలనెలా ఇచ్చే ఐదువేలకు రెండు మూడు రెట్లు మేమే ఇస్తాం" అని చెప్పారు. వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వలంటీర్లపై అధికారులు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో... చాలాచోట్ల వాళ్ల రాజీనామాలు చేయడం ప్రారంభించారు. ఇక.. తాజా పరిణామాల నేపథ్యంలో పేదల పెన్షన్ పంపిణీకి తమను దూరం చేయడానికి విపక్షాలే కారణమని నిందలు వేస్తూ రాజీనామాలు చేసేయాలని వలంటీర్లందరికీ వాట్సప్ మెసేజ్‌లు పంపించారు. సోమవారం మూకుమ్మడి రాజీనామాలు కూడా మొదలయ్యాయి. విపక్షాలపై విషం చిమ్ముతూ వారి ఫోన్ల నుంచి తమ పరిధిలోని లబ్ధిదారులకు వాయిస్ మెసేజ్‌లు పంపిస్తున్నారు.

రూ.4వేల పెన్షన్‌పై 'కుట్ర'?

పెన్షన్ అంటే గుర్తుకొచ్చేది తెలుగుదేశం పార్టీనే. వృద్ధులకు పెన్షన్లు ఇవ్వాలన్న ఆలోచన ఎన్టీఆర్‌దే. ఆయన రూ.75ల పెన్షన్ మంజూరు చేశారు. అది... వైఎస్ హయాంలో రూ.200కు చేరింది. చంద్రబాబు దానిని తొలుత వెయ్యికి, తర్వాత రూ.2వేలకు పెంచారు. వికలాంగులకు రూ.3 వేల పెన్షన్ మంజూరు చేశారు. కానీ... వైసీపీ సామాజిక పెన్షన్ రూ.3 వేలకు పెంచుతామని ఎన్నికల ముందు చెప్పి ఆ తర్వాత దశలవారీగా ఐదేళ్లకు రూ.3 వేలు చేసింది. మళ్లీ చంద్రబాబు పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇవ్వడంతో వైసీపీ నేతలకు గుబులు పుట్టుకొచ్చింది. చంద్రబాబు పెన్షన్ పెంచుతామన్న హామీని సామాజిక పెన్షన్‌దారులకు చేరకుండా చంద్రబాబుపై ద్వేషం పెంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ఇళ్ల వద్దకే పింఛన్లు!

- » ఇంటింటికీ వెళ్లి పంపిణీకే ప్రయత్నం
- » పెన్షన్లకు అవసరమైనంత సొమ్ముంది
- » టీడీపీ నేతలతో సీఎస్ జవహర్ రెడ్డి
- » సచివాలయంలో టీడీపీ బృందం భేటీ
- » ఇళ్ల వద్దకే పెన్షన్ పంపిణీకి వినతి
- » బాబుపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు



సోమవారం అమరావతిలోని సచివాలయంలో సీఎస్ జవహర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పేదల పింఛన్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయడానికే ప్రయత్నిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి చెప్పారు. సోమవారం సచివాలయంలో తనను కలిసిన టీడీపీ నేతలతో ఆయన ఈ విషయం చెప్పినట్లు సమాచారం. పింఛన్లను ఇళ్ల వద్ద కాకుండా గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పంపిణీ చేయాలని సెర్ప్ సీఈవో ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో టీడీపీ నేతలు ఆయనను కలిశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో లక్షకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నందున వారి ద్వారా ఇళ్ల వద్ద పింఛన్లను పంపిణీ చేయించాలని వారు కోరారు. మాజీ మంత్రులు నక్కా ఆనంద బాబు, దేవినేని ఉమా మహేశ్వరరావు, నెట్టెం రఘురాం, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తదితరులు ఈ బృందంలో ఉన్నారు. ఎండలు మండిపోతున్నాయని, ఈ సమయంలో వయసు మీరిన వృద్ధులు సచివాలయాల వద్దకు వెళ్లి పింఛన్లు తెచ్చుకోవడం సమస్య అవుతుందని, ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ సిబ్బంది ఉన్నందువల్ల వారిని ఉపయోగించుకోవాలని టీడీపీ నేతలు కోరారు. 'మేం కూడా అదే ఆలోచన చేస్తున్నాం. ఎండలు విపరీతంగా ఉన్న ఈ సమయంలో వయసు మీరిన వారు గ్రామ సచివాలయాల వద్దకు రావడం ఇబ్బందే. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ సూచనలు కూడా తీసుకొంటున్నాం. అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతున్నాం. వీలైనంతవరకూ ఇళ్ల వద్ద పంపిణీ చేయాలనే ఆలోచనలోనే ఉన్నాం' అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది రాష్ట్రంలో లక్షా ముప్పై వేలమంది ఉన్నారని, ఒక్కొక్కరికి 40-50కు మించి ఇళ్లకు వెళ్లాల్సిన అవసరం ఉండదని టీడీపీ నేతలు వివరించగా... ఆ లెక్కలు తమ వద్ద కూడా ఉన్నాయని సీఎస్ చెప్పారు. సీఎం జగన్ రాజకీయ కోణంలో ఆలోచించి సచివాలయాల వద్ద పింఛన్లను పంపిణీ చేయించి, ఆ నింద తమపై మోపాలని చూస్తున్నారని, ఇటువంటి రాజకీయ కుట్రలకు అధికారులు దూరంగా ఉండాలని టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. కోడ్ వచ్చిన తర్వాత తాము ఎవరికీ అనుకూలంగా ఉండబోమని, తమ విధిని తాము నిర్వర్తిస్తామని సీఎస్ వ్యాఖ్యానించారు. పింఛన్ల పంపిణీకి అవసరమైనంత సొమ్ము ప్రభుత్వ ఖజానాలో ఉందా అని టీడీపీ నేతలు అడగగా... సరిపోయినంత ఉందని, దానికి ఇబ్బందేమీ లేదని ఆయన బదులిచ్చినట్లు సమాచారం.

5వ తేదీలోపు పంపిణీ చేయండి

ఇంటింటికీ వెళ్లి అవ్వాతాతలకు పెన్షన్ల పంపిణీ ప్రక్రియ ఈ నెల 5లోపు పూర్తి చేయాలని టీడీపీ నేతలు ప్రభుత్వ సీఎస్ జవహర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పెన్షన్ల పంపిణీని చంద్రబాబు అడ్డుకుంటున్నారంటూ వైసీపీ అధికార వెబ్‌సైట్‌లో పోస్టింగులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎస్‌ను కోరారు. అనంతరం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. దొడ్డిదారుల్లో అధికారాన్ని నిలబెట్టుకోవాలని జగన్ చూస్తున్నారని వర్ల రామయ్య మండిపడ్డారు. ఓడిపోతున్నామని జగన్ రెడ్డికి అర్థమైపోయిందని, అందుకే చంద్రబాబుపై ప్రజల్లో వ్యతిరేకత తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం నిర్ణయానికి, చంద్రబాబుకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... బాబాయిని చంపి ఆ నేరాన్ని చంద్రబాబుపై మోపి గత ఎన్నికల్లో లబ్ధిపొందిన జగన్‌రెడ్డి నేడు అవ్వాతాతలను అడ్డంపెట్టుకుని రాజకీయ కుట్రలకు తెరలేపారని విమర్శించారు. అవ్వాతాతలకు పింఛను పంపిణీ చేయకుండా చేసి ఆ నిందను చంద్రబాబుపై మోపి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. వలంటీర్ల చేత పింఛను పంపిణీ చేయొద్దని ఈసీ ఉత్తర్వులు ఇవ్వకముందే 3వ తేదీన పింఛను ఇస్తామని సాక్షి పత్రికలో వేశారన్నారు. రాజకీయ లబ్ధికోసం ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను జగన్‌రెడ్డి వాడుకుంటున్నాడని మాజీ మంత్రి నెట్టం రఘురాం అన్నారు. ఏ విషయాన్నైనా రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడంలో వైసీపీ పీహెచ్‌డీ చేసిందని తెనాలి శ్రావణ్ కుమార్ ఎద్దేవా చేశారు.

రేపట్నుంచి పెన్షన్ల పంపిణీ

» రివైజ్డ్ మార్గదర్శకాలు జారీ చేస్తాం: సీఎస్

రాష్ట్రంలో సామాజిక పింఛన్ల పంపిణీకి సంబంధించి వెంటనే సవరించిన మార్గదర్శకాలను జారీ చేయనున్నట్లు సీఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అమరావతి సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాలు, ఇతర ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీకి సంబంధించి సోమవారం రాత్రికి సవరించిన మార్గదర్శకాలను జారీ చేయనున్నట్లు సీఎస్ స్పష్టం చేశారు. పింఛన్లను ఏ విధంగా పంపిణీ చేయాలనే దానిపై వివిధ జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు.

ఎన్నికల వేళా షాకులే!

(మొదటి పేజీ తరువాయి)

ఏకీభవించింది. ఈ వ్యత్యాసమొత్తాన్ని ట్రూఅప్ చార్జీల కింద వినియోగదారుల నుంచి వసూలు చేసి జెన్కోకు చెల్లించాలని ఆదేశించింది. అదేవిధంగా .. వీటీపీఎస్ ఒకటి , రెండు, మూడు యూనిట్లకు సంబంధించి వేరియబుల్ కాస్ట్‌ను యూనిట్‌కు రూ.3.49 నుంచి రూ.4.02కు, విజయవాడ థర్మల్ యూనిట్ నాలుగులో యూనిట్‌కు రూ.3.27 నుంచి రూ.3.76కు, ఆర్‌టీపీపీ ఒకటి, రెండు, మూడు యూనిట్లలో యూనిట్‌కు రూ.3.88 నుంచి రూ.4.47కు, ఆర్‌టీపీపీ ఐదో యూనిట్‌లో యూనిట్‌కు రూ.3.62 నుంచి రూ.4.16కు పెంచాలన్న జెన్కో ప్రతిపాదనను ఈఆర్‌సీ ఆమోదించింది. ఈ సవరించిన చలన ధరలు 2023 ఆర్థిక సంవత్సరం నుంచి వర్తిస్తాయని ఈఆర్‌సీ స్పష్టం చేసింది. అంటే.. ఇది కూడా వినియోగదారులపై పడే వీలుందని నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యత్యాస ధర దాదాపు వెయ్యి కోట్ల పైమాటేనని పేర్కొంటున్నారు. దాదాపు రూ.2148.72 కోట్ల మేర భారం పడనున్నదని విద్యుత్తురంగ నిపుణులు చెబుతున్నారు.

జగన్ అక్రమాస్తుల కేసులో ఎందుకీ జాప్యం?

(మొదటి పేజీ తరువాయి)

ఇవన్నీ ఎందుకు వస్తాయని కోర్టు నిలదీసింది. అలా చెప్పడం కాదని, ఈ వ్యవహారంలో అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదో చెప్పాలని ప్రశ్నించింది. కేసులో నిందితుడు ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి, ఒక పార్టీకి అధ్యక్షుడు. అటువంటి కేసుపై ప్రత్యేక శ్రద్ధ అవసరం కాదా? ఇలాంటి కేసులో జాప్యం చేయడం సరికాదు. సీఎం అనే కారణంతోనే విచారణ ఆలస్యమవుతోందనేది ప్రధాన ఆరోపణ. దీనికి మీరేం సమాధానం చెబుతారు? సీఎం అయినంత మాత్రాన వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు అడుగుతారా? ట్రయల్ సుదీర్ఘంగా సాగుతుంటే వ్యక్తిగత హాజరు నుంచి విధహాయింపు ఎలా ఇస్తారు' అని వ్యాఖ్యానించింది. కేసు ట్రయల్ వేగంగా జరపాలని ఆదేశించింది. జగన్ బెయిల్ రద్దు పిటిషన్‌తో పాటు హైదరాబాద్ నుంచి విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పైనా ఆగస్టు 5న విచారణ జరుపుతామని ధర్మాసనం తెలిపింది.

ఇవేం పదోన్నతులు?

(మొదటి పేజీ తరువాయి)

కోర్టు ముందు హాజరైన పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌పై వరుస ప్రశ్నలు సంధించింది. లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పిస్తే సిలబస్, పాఠ్యాంశాలపై వారికి ఏం అవగాహన ఉంటుందని ప్రశ్నించింది. విద్యాసంస్థకు నేతృత్వం వహించేందుకు వారిని ఎలా అనుమతించారని, జీవోను ఎలా జారీ చేశారని నిలదీసింది. లైబ్రేరియన్లకు పుస్తకం కవర్ పేజీపై ముద్రించిన విషయాల గురించి తెలుస్తుంది, అందులోని కంటెంట్ గురించి ఏమి అవగాహన ఉంటుందని వ్యాఖ్యానించింది. సిలబస్ తయారు చేసే నిపుణుల బృందంలో లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లు సభ్యులుగా లేరని గుర్తుచేసింది. కనీస బోధన పరిజ్ఞానం లేని లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లు విద్యార్థులకు అర్థమయ్యేలా లెక్చర్ ఇవ్వగలరా? అని ప్రశ్నించింది. ప్రిన్సిపాళ్లు కళాశాలకు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలను మాత్రమే చూస్తారని, రాష్ట్రంలోని విద్యావ్యవస్థలో పెద్దఎత్తున డిజిటల్ టెక్నాలజీని వినియోగిస్తున్నామన్న ముఖ్యకార్యదర్శి వాదనను ధర్మాసనం తప్పుపట్టింది. అలా అయితే పరిపాలనా పరమైన వ్యవహారాల్లో డిగ్రీలు పొందిన ఎంబీఏలను ప్రిన్సిపాళ్లుగా నియమించవచ్చు కదా.. జూనియర్ లెక్చరర్‌లను పదోన్నతిపై ప్రిన్సిపాళ్లుగా నియమించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. టీచర్లందరినీ డిస్మిస్ చేసి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని వినియోగించవచ్చు కదా? అని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ నిర్ణయంతో వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని పేర్కొంది. లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లకు పదోన్నతులు ఇవ్వడానికి తాము వ్యతిరేకం కాదంది. వారికి పదోన్నతి కల్పించేందుకు అదనపు పోస్టులు సృష్టించి, అధిక పేస్కేల్ చెల్లించవచ్చని పేర్కొంది. అలాకాకుండా వారికి ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పిస్తే విద్యా ప్రమాణాలు క్షీణిస్తాయంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 76ను మరోసారి పరిశీలించాలని ప్రవీణ్ ప్రకాశ్‌కు సూచించింది. విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జీ.నరేందర్, జస్టిస్ ఎన్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలలోని జూనియర్ లెక్చరర్‌లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించే వ్యవహారంలో 2021లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 76ను, ఏపీ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌ను పాటించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ ఇన్ లైబ్రరీ సైన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సంజీవరావు, మరో నలుగురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి పదోన్నతుల్లో లైబ్రరీ సైన్స్ లెక్చరర్‌లను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని ప్రాథమికంగా తప్పుబట్టింది. కమిషనర్ నిర్ణయం ప్రభుత్వం జారీ చేసిన జీవో 76కి విరుద్ధంగా ఉందని పేర్కొంది. జూనియర్ కాలేజీలలో 197 మంది జూనియర్ లెక్చరర్‌లకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ని సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ నెల్లూరుజిల్లా, సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్యామ్‌కుమార్ హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఈ అప్పీల్ పై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం...జూనియర్ కాలేజీలలో 197 మంది జూనియర్ లెక్చరర్‌లకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సస్పెండ్ చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేసింది.

> "లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పిస్తే సిలబస్‌పై వారికి ఏం అవగాహన ఉంటుంది? విద్యాసంస్థకు నేతృత్వం వహించేందుకు వారిని ఎలా అనుమతించారు? జీవోను ఎలా జారీ చేశారు? లైబ్రేరియన్లకు పుస్తకం కవర్‌పేజీపై ముద్రించిన విషయాల గురించి తెలుస్తుందేగానీ, అందులోని కంటెంట్ గురించి ఏం అవగాహన ఉంటుంది? కనీస బోధన పరిజ్ఞానం లేకుండా విద్యార్థులకు అర్థమయ్యేలా లెక్చర్ ఇవ్వగలరా? విద్యార్థులు సబ్జెక్ట్‌ను ఎంతవరకు నేర్చుకున్నారనేది ఎలా అంచనా వేయగలరు? సీనియారిటీ ఉందని నర్సింగ్ సూపరింటెండెంట్‌ను సర్జన్‌గా నియమిస్తారా?"
>
> **- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌పై హైకోర్టు ప్రశ్నలవర్షం**

ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లను ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 76 జారీ చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. ఈ వ్యవహారం పై వివరణ ఇచ్చేందుకు జీవోలోని అంశాలు, చట్టనిబంధనల పై అధ్యయనం చేసి కోర్టు ముందు హాజరు కావాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ సోమవారం కోర్టు ముందు హాజరయ్యారు. ధర్మాసనం సంధించిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. పాఠశాల విద్యశాఖ ఇచ్చిన జీవో 76 సరైనదేనని ఆయన సమర్థించారు. అందుకు ప్రభుత్వం చేస్తున్న పలు నియామకాలను ఉదహరించారు. రాష్ట్రంలోని పలు యునివర్సిటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను వైస్ చాన్సలర్లుగా నియమిస్తోందని, వారికి బోధన అంశాల పై అవగాహన ఉండదు కదా అని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఏదో ఒక సబ్జెక్ట్‌లో నిష్ణాతుడైన జూనియర్ లెక్చరర్‌నే ప్రిన్సిపాల్‌గా నియమిస్తున్నారని, అన్ని సబ్జెక్ట్‌లపై వారికి కూడా అవగాహన ఉండదన్నారు. డిగ్రీ కళాశాలల్లో లైబ్రేరియన్లను పదోన్నతిపై ప్రిన్సిపాళ్లుగా నియమిస్తున్నారని, అదే విధానాన్ని ఇంటర్మీడియట్, స్కూల్ స్థాయిలో అమలు చేస్తున్నామన్నారు. బీఈడీ డిగ్రీ లేకున్నా ఏదైనా సబ్జెక్ట్‌లో మాస్టర్స్ చేసిన వారు జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నారన్నారు. ప్రిన్సిపాళ్లు కేవలం కళాశాలకు సంబంధించిన పరిపాలన వ్యవహారాలను మాత్రమే చూస్తారన్నారు. ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి పొందిన లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తామన్నారు. ప్రస్తుతం మనం 21వ శతాబ్దంలో ఉన్నామని.. విద్యాబోధనలో ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నామని తెలిపారు. ఈ వాదనను ధర్మాసనం తప్పుపట్టింది. సీనియారిటీ ఉంది కదా అని నర్సింగ్ సూపరింటెండెంట్‌కు సర్జన్‌గా పదోన్నతి కల్పిస్తారా? ఐఐటీలు, ఐఐఎమ్‌లు, మెడికల్ కాలేజీలకు లైబ్రేరియన్లు, పీడీలు నేతృత్వం వహిస్తున్న ఉదంతాలు ఏమైనా ఉన్నాయా? అని ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌ను ప్రశ్నించింది. ఈ దశలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కలగజేసుకుంటూ... లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించిన వ్యవహారంపై లోతుగా పరిశీలిస్తామని, ఈ వ్యవహారంపై ఉన్నత విద్యాశాఖ అధికారులు, ఇతర ఉన్నతాధికారులతో చర్చించాల్సి ఉందన్నారు. తగిన సమయం ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన ధర్మాసనం విచారణను ఏప్రిల్ 18కి వాయిదా వేసింది.



డివైజ్‌లు అప్పగించాలంటూ మునిసిపల్ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు

రాజీనామాకుససేమిరా!

- » అధికార వైసీపీ ఒత్తిడికి లొంగని కొందరు వలంటీర్లు
- » ఎన్టీఆర్ జిల్లాలో ఆరుగురే రాజీనామా

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

అంతా అధికార వైసీపీ స్కెచ్ ప్రకారమే నడుస్తోంది. అధికార పార్టీ ఒత్తిడి మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు పెద్ద ఎత్తున రాజీనామాలు చేశారు. కానీ కొన్నిచోట్ల రాజీనామా చేసేందుకు వలంటీర్లు ససేమిరా అన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 880 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. కృష్ణా జిల్లాలో 9,600 మంది వలంటీర్లకుగాను మచిలీపట్నం నియోజకవర్గం పరిధిలో పేర్ని నాని బలవంతం, బెదిరింపుల కారణంగా 860 మంది రాజీనామాలు చేశారు. మిగిలిన నియోజకవర్గాల్లో కేవలం 14 మందే రాజీనామా చేశారు. మొత్తంగా కృష్ణా జిల్లాలో 874 మంది రాజీనామాలు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 10,418 మంది వలంటీర్లకుగాను ఆరుగురే రాజీనామా చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగించేస్తారని, మీకు ఉద్యోగాలు కావాలంటే మేమే అధికారంలో ఉండాలని ఎంతగా బలవంతం పెట్టినా వలంటీర్ల నుంచి స్పందన రావటం లేదు. జీతం బకాయిలు వైసీపీ పార్టీనే చెల్లిస్తుందని నేతలు చెబుతున్నా.. వలంటీర్లు విశ్వసించడం లేదు. 'పార్టీ కోసం పనిచేయండి.. ప్రభుత్వం చెల్లించే గౌరవ వేతనం పార్టీయే చెల్లిస్తుంది' అని నమ్మించేందుకు పార్టీ నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు.

జీతం బకాయిలు చెల్లిస్తేనే డివైజ్‌లు ఇస్తాం!

అధికార పార్టీ నేతల ఒత్తిడితో నరసరావుపేట డివిజన్‌లో పలువురు వలంటీర్లు రాజీనామాలు చేశారు. అయితే వారివద్ద ఉన్న మొబైల్, వేలి ముద్రల స్కానింగ్ పరికరాలను అప్పగించలేదు. వలంటీర్లకు 3 నెలల నుంచి గౌరవ వేతనాలు ఇవ్వలేదు. దీంతో రూ.15 వేలు జీతం ఇచ్చిన తర్వాత డివైజ్‌లను అప్పగించాలనే యోచనలో వలంటీర్లు ఉన్నారు. నరసరావుపేటలో 435 మంది వలంటీర్లకు 200 మందికిపైగా రాజీనామా చేసినట్టు తెలిసింది. వీరిలో ఎక్కువ మంది డివైజ్‌లను అప్పగించలేదు. వలంటీర్ల వద్ద ఉన్న మొబైల్, ఇతర పరికరాలను మంగళవారం ఉదయం 10 గంటల కల్లా స్వాధీనం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కానీ, రాజీనామాలు చేస్తున్న వలంటీర్లు డివైజ్‌లు మాత్రం అప్పగించడం లేదు.

ఇదో.. 'బొమ్మల' కథ!



జగనన్న గోరుముద్ద, విద్యాకానుక, అమ్మ ఒడి... ఇలా అన్ని స్కీములపైనా జగన్ బొమ్మలే

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేస్తున్న 'జగనన్న విద్యాకానుక'ను అధికారులు జగన్ బొమ్మలతో సిద్ధం చేయిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం(జూన్ నుంచి మొదలు)లో ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఇచ్చే విద్యా కానుక కిట్ల తయారీకి ఏకంగా రూ.వెయ్యి కోట్లను ఖర్చు చేస్తున్నారు. అది కూడా ప్రతి కిట్‌పైనా జగన్ బొమ్మలు వేసి!! దీంతో ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. వాస్తవానికి గత నాలుగేళ్లుగా ఇచ్చిన విద్యా కానుకలోని వస్తువులపై జగన్ ఫొటోలు, 'జగనన్న విద్యా కానుక' పేరుతో లోగోలు ముద్రిస్తూ వచ్చారు. 2024-25 విద్యా సంవత్సరానికి జూన్‌లో ఇవ్వబోయే విద్యా కానుక కిట్లపై జగన్ ఫొటోలు, లోగోలు ముద్రిస్తున్నారు. అయితే ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతే... జగన్ ఫొటోలు, జగన్ పేరుతో ఉన్న లోగోలు ముద్రించిన పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు ఏం చేయాలి? రూ.వెయ్యి కోట్లు వెచ్చించి ఇస్తున్న విద్యా కానుక కిట్లను కొత్త ప్రభుత్వం పంపిణీ చేస్తుందా? ఆ ఫొటోలు, లోగోలు చెరిపేయడం సాధ్యమేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారుల అత్యుత్సాహం

విద్యా కానుక కిట్‌లో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం క్లాత్, బ్యాగు, బెల్టు, బూట్లు, సాక్సులు పంపిణీ చేస్తున్నారు. వీటిలో నోట్ పుస్తకాలపై జగన్ ఫొటో ముద్రిస్తున్నారు. బ్యాగులు, బెల్టులపై జగనన్న విద్యా కానుక పేరును ముద్రిస్తున్నారు. ఈ మొత్తం కిట్‌లో పుస్తకాలు, బ్యాగులకే ఎక్కువ ధర వెచ్చిస్తున్నారు. అలాంటి వాటిపై ఏ ప్రభుత్వం వస్తుందన్న ఆలోచన లేకుండా యథావిధిగా జగన్ ఫొటోలు, ఆయన పేరుతో పథకం లోగోలు ముద్రిస్తుండడం వెనుక స్వామి భక్తి ప్రదర్శించే అధికారుల హస్తం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ పుస్తకాలపై వేసే ఫొటోలు తొలగించడం సాధ్యం కాదు. అలాగే బ్యాగులు, బెల్టులపై వేసే లోగోలను కూడా తీసేయలేరు. ఎన్నికలు సమీపించినందున వారి ఫొటోలు, లోగోలు లేకుండా కిట్లు తయారుచేస్తే బాగుంటుందని విద్యాశాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవేళ వైసీపీ ప్రభుత్వమే తిరిగి ఏర్పాటైనా ఒక ఏడాదికి జగన్ ఫొటోలు, పేర్లు లేకపోతే వచ్చే నష్టం ఏం ఉండదని అంటున్నారు. ప్రచారమే కావాలనుకుంటే మిగిలిన నాలుగేళ్లు ఫొటోలు వేసుకోవచ్చు. కానీ, ఇవేం పట్టించుకోని సమగ్ర శిక్ష విభాగంలోని స్వామి భక్తి ప్రదర్శించే కొందరు అధికారులు అత్యుత్సాహంతో మళ్లీ ఈ ప్రభుత్వమే వస్తుందన్నట్టుగా జగన్ ఫొటోలతో కిట్లు తయారు చేస్తున్నారు. ఆ మేరకు ఇటీవల వర్క్ ఆర్డర్లు జారీచేశారు. ఒకవేళ రేపు ప్రభుత్వం మారితే జగన్ ఫొటోల వల్ల కలిగే నష్టాన్ని సమగ్రశిక్ష అధికారులు భరిస్తారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



చివరికి గ్లాసులనూ వదల్లేదు

జగన్ ప్రభుత్వంలో ప్రచారం పిచ్చి పతాక స్థాయికి చేరిందనే దానికి విద్యాశాఖలోని పథకాలే ప్రత్యక్ష ఉదాహరణ. చిన్న పిల్లలకు ఇచ్చే చిక్కీల కవర్లపై జగన్ ఫొటోలు వేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ కవర్లు చించి చిక్కీలు పంపిణీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. కవర్లు చించకుండా పంపిణీ చేశారంటూ ఓ టీచర్‌పై ఇటీవల చర్యలు కూడా తీసుకున్నారు. అసలు జగన్ ఫొటోలే లేకపోతే ఈ గోలంతా ఉండదు కదా అని టీచర్లు అంటున్నారు. అలాగే పిల్లలకు ఇచ్చే కోడిగుడ్లపై 'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ' పేరును ముద్రిస్తున్నారు. ఇక, గతేడాది కొత్తగా ప్రారంభించిన రాగి జావ పంపిణీలోనూ జగన్ పేరును ప్రచారం చేశారు. అందుకోసం పిల్లలకు ఇచ్చిన స్టీలు గ్లాసులపై 'జగనన్న గోరుముద్ద' అనే పేరును ముద్రించారు. దానిని తీసేయడం అసలు సాధ్యం కాదు. అలాగే ఎనిమిదో తరగతి విద్యార్థులకిచ్చిన ట్యాబ్‌లపైనా జగన్ ఫొటోలు వేశారు. టీచర్లకు ఇచ్చిన రిసోర్స్ బుక్స్‌పైనా వైసీపీ జెండా రంగులు వేశారు. ఇలా విద్యారంగంలో ఎక్కడ కనిపిస్తే అక్కడ అధికార పార్టీకి అనుకూల ప్రచారం చేశారు. ఇప్పటివరకు ఎలా ఉన్నా భవిష్యత్తులోనూ వైసీపీనే అధికారంలో ఉంటుందన్నట్టుగా వచ్చే ఏడాదికి ఇవ్వబోయే విద్యాకానుక కిట్లపై జగన్ ఫొటోలు వేయడం విమర్శలకు దారితీసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

దుర్గగుడి లడ్డూ ప్రసాదం కౌంటర్‌లో

సిబ్బంది చేతివాటం

- 500 చిన్నలడ్డూలు, 20 పెద్ద లడ్డూలు మాయం
- అదనంగా రూ.2,700 నగదును తనిఖీల్లో

గుర్తించిన ఈవో రామారావు

వన్‌టౌన్, ఏప్రిల్ 1: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రసాదాల కౌంటర్‌లో పనిచేస్తున్న సిబ్బంది చేతివాటం వ్యవహారాన్ని ఈవో కేఎస్ రామారావు కౌంటర్‌లో చేసిన తనిఖీల ద్వారా బట్టబయలు చేశారు. 500 చిన్న లడ్డూలు, 20 పెద్ద లడ్డూలు తక్కువగా ఉన్నట్టు, అదనంగా రూ.2,700 నగదు ఉన్నట్టు ఆయన గుర్తించారు. ఆదివారం రాత్రి మహా మండపం కింద ఉన్న లడ్డూ ప్రసాదాల కౌంటర్లను ఈవో తనిఖీచేశారు. లడ్డూ ప్రసాద కౌంటర్‌లో జూనియర్ అసిస్టెంట్ పి.శ్రీను, అటెండర్ కె.పాపయ్య, సూపర్‌వైజర్ రెడ్డప్పరెడ్డి విధుల్లో ఉన్నారు. కౌంటర్‌లో ఉన్న నగదు, అక్కడ ఉన్న లడ్డూ వివరాలను ఈవో పరిశీలించారు. లెక్కకు మించి అదనంగా రూ.2,700 నగదు, లెక్కకు ఉండాల్సిన లడ్డూల కన్నా 500 చిన్నలడ్డూలు, 20 పెద్ద లడ్డూలు తగ్గినట్టు ఆయన గుర్తించారు. వారిని ఈవో ప్రశ్నించారు. వారు పొంతన లేని సమాధానం చెప్పడంతో ఈవో ఆగ్రహం వ్యక్తం చేసి, పూర్తి వివరాలు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. తర్వాత ఈవో వారిని సస్పెండ్ చేశారు.

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం

అర్చక విధుల్లో మార్పులు

వన్‌టౌన్, ఏప్రిల్ 1: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అర్చక విధుల్లో మార్పులు చేస్తూ సోమవారం ఆలయ ఈవో కేఎస్ రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. అంతరాలయంలో ఉదయం 4 గంటల నుంచి 10 గంటల వరకు ప్రధాన అర్చకుడు ఎల్.దుర్గాప్రసాద్, ఉప ప్రధాన అర్చకుడు యు.వి.రామమూర్తి, ముఖ్య అర్చకుడు పి.రామకృష్ణ, అర్చకుడు నేతి ప్రసాద్, ఉదయం 10 గంటల నుంచి 4గంటల వరకు ప్రధాన అర్చకుడు కె.వెంకట కనకసుందరశర్మ, ముఖ్య అర్చకుడు పీవీ కేఎస్ కామేశ్వరరావు, ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాసశాస్త్రి, అర్చకుడు వైఎస్ ఉమాకాంత్‌శర్మ, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రధాన అర్చకుడు ఎల్‌వీఎస్ బదరీనాథబాబు, ఉప ప్రధాన అర్చకుడు. డి.శంకరశాండిల్య, ముఖ్య అర్చకుడు కె.హరి వాసుదేవ కుమార్, అర్చకుడు బి.ప్రవీణకుమార్ విధులు నిర్వహిస్తారు. ధర్మ దర్శనం వద్ద షిఫ్టుకు ఇద్దరు చొప్పున అర్చకులను నియమించారు. మల్లేశ్వర స్వామి ఆలయంలో నిత్యం ఉదయం ప్రధాన అర్చకుడు వై.మల్లేశ్వర శాస్త్రి ఉంటారు. రోజూ ఉదయం 10 నుంచి 4గంటల వరకు ఎం.సత్య నారాయణమూర్తి విధులు నిర్వహిస్తారు. మూడు షిఫ్టులలో అర్చకులు విధులు నిర్వహిస్తారు. శివకామసుందరీ సమేత నటరాజస్వామి ఆలయంలోనూ మూడు షిఫ్టుల్లో అర్చకులు విధులు నిర్వహిస్తారు. నాగ పుట్ట, గోపూజ దగ్గర ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు పూజలు జరుగుతాయి. ఇక్కడ మూడు షిఫ్టులలో అర్చకులు అందుబాటులో ఉంటారు. అష్టోత్తర పూజల వద్ద మొదటి షిఫ్టులో ఉదయం 4 గంటల నుంచి 10 గంటల వరకు ముఖ్య అర్చకుడు యజ్ఞనారాయణ శర్మ, తరువాత షిఫ్టులో పీఎస్ఎన్ మూర్తి, మూడో షిఫ్టులో ఐ.వి.రాజశేఖర్ విధులు నిర్వహిస్తారు. అద్దాల మండపం, ఘాట్‌రోడ్డులో కామధేను అమ్మవారు, ఘాట్‌రోడ్డులోని అభయ ఆంజనేయస్వామి ఆలయం, అమ్మ వారి పాతమెట్ల వద్ద ఆంజనేయస్వామి, గణపతి స్వామి ఆలయాల్లో షిఫ్టుల ప్రకారం విధులు కేటాయించారు. ఎవరైనా వారాంతపు సెలవులు పెడితే వారి స్థానంలో విధులు నిర్వహించడానికి అర్చకులను కేటాయించారు. వేదాశీర్వచనం వద్ద ఉపప్రధాన అర్చకుడు మార్తి వెంకటలక్ష్మీనరసింహమూర్తి, అర్చకులు డి.శ్రీనివాస్, ఎల్.భవానీప్రసాద్, ఎస్.శివప్రసాద్, ఎల్.ఫణీంద్ర, కన్సాలిడేటెడ్ పరిచారకుడు పి.అశ్వనీకుమార్ శర్మ విధులు నిర్వహిస్తారు. లక్ష కుంకుమార్చన వద్ద పది మంది అర్చకులను కేటాయించారు. సూర్యోపాసన సేవ, రాహుకేతు పూజ, పల్లకీసేవ, దర్బార్ సేవ, చండీహోమం, గణపతి హోమం, రుద్ర హోమం, శాంతి కల్యాణం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఇలా ప్రతి విభాగం వద్ద విధులను కేటాయించారు.



డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ నుంచి అవార్డులు అందుకుంటున్న రైల్వే ఉద్యోగులు

ముగ్గురు రైల్వే ఉద్యోగులకు సేఫ్టీ అవార్డులు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 1: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ముగ్గురు ఉద్యోగులకు 2024 ఫిబ్రవరికి జీఎం మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులు దక్కాయి. సోమవారం డివిజన్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన వర్చువల్ సేఫ్టీ సమావేశంలో డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ అవార్డులు ప్రదానం చేశారు. దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ఆర్.ధనుంజయులు సికింద్రాబాద్‌లోని రైలునిలయం నుంచి ఆయా విభాగాల ముఖ్య అధిపతులతో సమావేశం నిర్వహించారు. విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్‌ల నుంచి డీఆర్‌ఎంలు పాల్గొన్నారు. విజయవాడ డివిజన్ నుంచి నరేంద్ర ఏ పాటిల్ పాల్గొని డివిజన్‌లోని పరిస్థితిని వివరించారు. క్రమం తప్పకుండా సేఫ్టీ డ్రైవ్‌లు నిర్వహించడం సెక్షన్లలో రాత్రి పూట తనిఖీలు చేసి, వ్యవస్థలోని లోపాలను గమనించి అప్రమత్తంగా ఉండడం, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవడం వంటి అంశాలపై డీఆర్‌ఎం సిబ్బందిని అభినందించారు. రాజమండ్రి మెకానికల్ డిపార్ట్‌మెంట్ టెక్నీషియన్ ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, కాకినాడ పోర్ట్ ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్ లోకో పైలట్ కేవీఎస్ నారాయణ, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ట్రాలీమ్యాన్ వి.వీరలింగేశ్వరరావులు డీఆర్‌ఎం నుంచి అవార్డులు అందుకున్నారు.

గన్నవరం విమానాశ్రయంలో

ఉరేసుకుని కార్మికుడి ఆత్మహత్య

గన్నవరం, ఏప్రిల్ 1: గన్నవరం విమానాశ్రయ నూతన భవన నిర్మాణంలో పని చేస్తున్న కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం విమానాశ్రయంలో మధ్య ప్రదేశ్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికులు పని చేస్తున్నారు. వారితో పాటు సునీల్ కోయల్ అనే వ్యక్తి కూడా ఉన్నాడు. అతనికి వివాహం కాలేదు. ఎప్పుడూ ఒంటరిగా ఉండేవాడు. ఆదివారం కూడా పనికి వెళ్లాడు. ఒంటి గంట వరకూ పని చేసి అందరు వెళ్లిపోయారు. అతను అక్కడే ఉండటంతో తోటి కార్మికుడు భోజనానికి రమ్మని పిలిచాడు. నేను తరువాత వస్తాను వెళ్లమని సునీల్ చెప్పాడు. తర్వాత చెట్ల మధ్యకు వెళ్లి తన కండువాతో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో

మైనార్టీ బాలికల సీట్ల భర్తీకి దరఖాస్తులు

భవానీపురం, ఏప్రిల్ 1: ఏపీ గురుకుల విద్యాలయం సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పరిధిలో భవానీపురం ఐరన్ యార్డు వద్ద గురుకుల పాఠశాల మైనార్టీ బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సీట్ల భర్తీ కోసం ఈనెల ఐదో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ ఎస్.శివకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. కోస్తా జిల్లాలైన శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లాల ముస్లిం, మైనార్టీలకు రిజర్వేషన్ల ప్రకారం, ఎస్సీ, ఎస్టీ బాలికలకు 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలోని అన్ని సీట్లకు, 6,7,8వ తరగతులకు మిగిలి ఉన్న సీట్లకు ప్రవేశ పరీక్ష ఏపీఆర్ఎస్ కాట్-2024 అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో ఈనెల 25న ఉంటుందన్నారు. మైనార్టీ బాలికలు బీసీ-ఈ, బీసీ- బీ, దూదేకుల బాలికలు, బీసీ-సీ క్రిస్టియన్ బాలిలకు నేరుగా ప్రవేశం కల్పిస్తామన్నారు. 8712625036లో సంప్రదించాలని, హెచ్‌టీటీపీ// ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



కూటమి ప్రభుత్వమొచ్చాక..

రామవరప్పాడు రాజుల బజారులో ఎన్నికల ప్రచారం చేస్తున్న యార్లగడ్డ జ్ఞానేశ్వరి, టీడీపీ నేతలు

ఏలూరు కాల్వపై వంతెన నిర్మిస్తాం

రామవరప్పాడువాసులకు యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి హామీ

గుణదల, ఏప్రిల్ 1: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఏలూరు కాల్వపై రామవరప్పాడులో వంతెన నిర్మిస్తామని కూటమి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం సోమవారం రామవరప్పాడు చేరుకున్న ఆమె పేరంటాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన మాట ప్రకారం రైవస్ కాల్వపై వంతెన నిర్మాణం చేపట్టారని, ఈసారి ఏలూరు కాల్వపై డబుల్‌లైన్ వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం సూపర్ సిక్స్ పథకాలను పెట్టారని, యార్లగడ్డ వెంకట్రావు కూడా నియోజకవర్గ అభివృద్ధి కోసం సూపర్ సిక్స్ పథకాలను రూపొందించారని అందులో రామవరప్పాడు వంతెన సమస్య కూడా ఉందని తెలిపారు. టీడీపీ నాయకులు కొల్లా ఆనంద్, బొమ్మసాని అరుణ, తుపాకుల శివలీల, కొంగన రవి, అద్దేపల్లి సాంబశివనాగరాజు, కళ్లేపల్లి నాగరాజు, అడ్డగిరి రామకృష్ణ, నాభిగాని కొండ, విజ్జి రాము, మున్నాగి సత్యన్నారాయణ, పట్టపు చంటి, కురమద్దాలి ఫణికుమార్, లక్కు రాజు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం బీజేపీ కార్యాలయం వద్ద

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల హల్‌చల్

విద్యాధరపురం, ఏప్రిల్ 1: భవానీపురం శివాలయం సెంటర్‌లో బీజేపీ నాయకులు ఏర్పాటు చేస్తున్న ఎన్నికల కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి ఎన్నికల కమిషన్ ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు హల్‌చల్ చేశాయి. ఆదివారం సాయంత్రం విజయవాడ పశ్చిమ నియోజకవర్గం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వై.సుజనాచౌదరి శివాలయం సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల కార్యాలయాన్ని పరిశీలించారు. పార్టీ నాయకులతో కార్యాలయం ఏర్పాట్లపై కొద్దిసేపు చర్చించి పలు సూచనలు చేసి అక్కడి నుంచి ఆయన వెళ్లిపోయారు. తర్వాత ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కార్యాలయం వద్దకు వచ్చాయి. అనుమతి లేకుండా కుర్చీలు ఎలా వేస్తారు? మీటింగ్‌లు ఎలా నిర్వహిస్తారంటూ అక్కడ ఉన్న నాయకులను ప్రశ్నించారు. సమావేశాలు నిర్వహించలేదని అభ్యర్థి సుజనాచౌదరి కార్యాలయం పరిశీలించడానికి మాత్రమే వచ్చారని, అధికారులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె వెంకటనారాయణ ప్రసాద్(అన్న), ఎన్టీఆర్ జిల్లా పార్టీ కార్యాలయం కార్యదర్శి సారేపల్లి రాధాకృష్ణ తెలిపారు. దీంతో అధికారులు సెల్‌ఫోన్లలో కార్యాలయాన్ని, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకుల ఫొటోలు తీసుకున్నారు. అధికార పార్టీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా ఎలాంటి చర్యలు తీసుకోని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తమ నాయకుడు కార్యాలయాన్ని పరిశీలించడానికి వస్తే హడావుడి చేయడమేమిటని అక్కడున్న నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న సుజనాచౌదరి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

బిల్డింగ్ మెటీరియల్ రవాణా

వాహనాలపై టార్పాలిన్ కప్పాల్సిందే

- టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానులకు ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి ఆదేశం
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

గుణదల, ఏప్రిల్ 1: బిల్డింగ్ మెటీరియల్‌ను రవాణా చేసే సమయంలో టిప్పర్లు, ట్రాక్టర్లపై టార్పాలిన్ కప్పకుండా వెళితే చర్యలు తీసుకుంటామని వాహన యజమానులను ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి హెచ్చరించారు. బందరు రోడ్డులోని కేఎస్‌వ్యాస్ భవనంలోని ట్రాఫిక్ సమావేశ హాలులో టిప్పర్ వాహన యజమానులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. కంకరు, గ్రావెల్, ఇసుక, ఇటుకలు, బూడిదపై టార్పాలిన్ కప్పి రవాణా చేయాలని ఆదేశించారు. టిప్పర్ వాహనాలు ఇబ్రహీంపట్నం నుంచి గొల్లపూడి వై జంక్షన్, గొల్లపూడి బైపాస్, సీవీఆర్ ఫ్లైఓవర్, వైవీరావ్ సర్కిల్, పైపులరోడ్డు ఐఆర్ఆర్ నుంచి రామవరప్పాడు మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. టిప్పర్ వాహనాలను కనకదుర్గ ఫ్లై ఓవర్ వారధి వైపునకు అనుమతించబోమని తెలిపారు. టిప్పర్ వాహనదారులకు సూచనలు, సలహాలు ఇచ్చి నిబంధనల ప్రకారం ప్రజలకు ఇబ్బంది కలగకుండా వాహనాలను నడిపేలా చూడాలన్నారు. డ్రైవర్లు వాహనంలో రికార్డులు తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ ఏడీసీపీ, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

షెడ్డు నిర్మాణం నిలిపివేత

- నిర్మాణం కోసం వేసిన పైపుల తొలగింపు



చినఓగిరాల బీసీ కాలనీ సమీపాన ఆర్ అండ్ బీ రోడ్డు పక్కన నిర్మిస్తున్న షెడ్డు పైపులను తొలగిస్తున్న అధికారులు

ఉయ్యూరు, ఏప్రిల్ 1: చినఓగిరాల బీసీ కాలనీ సమీపాన ప్రభుత్వ స్థలంలో చేస్తున్న షెడ్డు నిర్మాణాన్ని మండల అధికారులు అడ్డుకుని తొలగించారు. చినఓగిరాలలో స్థానిక వైసీపీ నాయకుల ప్రోద్బలంతో బీసీ కాలనీ సమీపాన ఆర్ అండ్ బీ రోడ్డు పక్కన షెడ్డు నిర్మాణానికి గోతులు తీసి పైపులు వేసి కాంక్రీట్ పని చేస్తుండడంతో 'వైసీపీ నేతల ఓట్ల రాజకీయం' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఎంపీడీవో జి.లక్ష్మీదేవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట సుబ్బారావు, వీఆర్వో సీహెచ్ శ్రీనివాసరావు షెడ్డు నిర్మాణ స్థలాన్ని సందర్శించి ప్రొక్లెయిన్‌తో పైపులు తొలగింపజేశారు.

విశాఖ స్టీల్‌ను దోచుకునేందుకు ప్రయత్నాలు

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

ధర్నాచౌక్, ఏప్రిల్ 1: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆరోపించారు. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో సోమవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మంత్రి బొత్స సత్యనారాయణకు సిగ్గులేదన్నారు. పనికిమాలిన అతనికి వైసీపీ ప్రభుత్వం మంత్రి పదవి ఇచ్చిందన్నారు. గంగవరం పోర్టును వైసీపీ ప్రభుత్వం అమ్మడం లేదా అని పాల్ ప్రశ్నించారు. మూడేళ్లుగా విశాఖస్టీల్‌ను అమ్మకుండా తాను అడ్డుపడుతున్నానన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకుండా తానే ఆపానని పవన్ కల్యాణ్ ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. ఆయన ఎన్ని అబద్ధాలు మాట్లాడుతున్నారో రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు అవినీతికి పాల్పడుతున్నాయన్నారు. దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడేది ప్రజాశాంతి పార్టీ మాత్రమేనన్నారు. విశాఖపట్నం నుంచి తనను పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించాలని ఆయనను కోరారు.

సంస్కృత భాష ఔన్నత్యం వర్ణించలేనిది



సంస్కృత భాష పుస్తకాలను అందజేస్తున్న ఈవో రామారావు, యూవీ రమణమూర్తి, షణ్ముఖశాస్త్రి

వన్‌టౌన్, ఏప్రిల్ 1: సంస్కృతభాష ఔన్నత్యం వర్ణించలేనిదని దాని విలువ అమూల్యమని సంస్కృత భారతి ట్రస్ట్ కార్యదర్శి సంచాలకుడు డాక్టర్ యూవీ రమణమూర్తి అన్నారు. పోరంకిలో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వేదపాఠశాలలో సోమవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన వేద విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సంస్కృత భాష ప్రాధాన్యం, ఆవశ్యకతలను వివరించారు. కార్యక్రమానికి హాజరైన ఈవో రామారావుతో కలసి పది రోజుల్లో సంస్కృత భాషను నేర్పడం కోసం దశదిన సంస్కృత సంభాషణ శిబిరాన్ని ప్రారంభించారు. సంస్కృత పుస్తకాలు, అమ్మవారి సుప్రభాతం పుస్తకాలను ఆవిష్కరించారు. ట్రస్ట్ ఆంధ్రప్రాంత బాలకేంద్ర ప్రముఖ్ అరుణ శ్రీ, వేదపాఠశాల ప్రిన్సిపాల్ షణ్ముఖశాస్త్రి, ఈఈ లింగం రమ, డీఈఈ రవీంద్ర పాల్గొన్నారు.

పూలతో శ్రీచక్రం



శ్రీచక్రంపై దీపారాధన చేస్తున్న భవానీ సేవాదారులు

భవానీ సేవాదారులు సోమవారం ధర్మపథం వేదిక వద్ద వివిధ రకాల పూలతో శ్రీచక్ర ఆకారాన్ని తీర్చిదిద్దారు. ప్రవచకురాలు డాక్టర్ అనంతలక్ష్మి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఇటువంటి మంచి కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందని ఈవో రామారావు అన్నారు. ఇంకా ఇటువంటి మంచి కార్యక్రమాలు మరిన్ని జరగాలన్నారు. ధర్మపథం వేదికపై నుంచి పురాణ ప్రవచకుడు చింతలపాటి వెంకటేశ్వర్లు శ్రీరామ తత్వంపై ప్రసంగించారు.

టీటీడీ కల్యాణ మండపంలో

తెలుగు పంచాంగం విక్రయాలు

లబ్బీపేట, ఏప్రిల్ 1: తిరుమల తిరుపతి దేవస్థానం 2024-2025 ఉగాది తెలుగు పంచాంగం విక్రయాలను సోమవారం నుంచి టీటీడీ కల్యాణ మండపంలో ప్రారంభించామని మండపం మేనేజర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో రోజూ ఉదయం 10గంటల నుంచి విక్రయాలు ప్రారంభమవుతాయని, తెలుగు పంచాంగం వెల రూ.75 అని ఆయన తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

7న గ్రీన్‌స్కూల్‌లో చెస్ జిల్లా టోర్నీ

విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 1: ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక గ్రీన్ స్కూల్‌లో ఈనెల 7న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్‌లో ఇద్దరు, బాలికల కేటగిరిలో ఇద్దరిని కృష్ణాజిల్లా తరపున ఎంపిక చేసి ఈనెల 20, 21వ తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నీకి ఎంపిక చేస్తామని తెలిపారు. అండర్-7, 9, 11, 13, 15 కేటగిరీల్లో మొదటి రెండు స్థానాలకు ప్రత్యేక బహుమతులు అందిస్తామని తెలిపారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఏపీచెస్ ఓఆర్‌జీలో శనివారం సాయంత్రం ఐదు గంటల్లోపు రిజిస్టర్ చేయించుకోవాలని, వివరాలకు 97007 75220, 92471 53387లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ సిబ్బందితో ఒక్కపూటలో

ఇంటింటికీ పింఛన్లు పంచొచ్చు

- ఈసీ ఆదేశాలకు సీఎస్ వక్రభాష్యం
- వైసీపీకి లబ్ధి చేకూర్చడమే పరమార్థం
- పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ ధ్వజం

ఉయ్యూరు, ఏప్రిల్ 1: వలంటీర్లను పింఛన్లు పంపిణీ చేసే విధుల నుంచి తప్పించి ఇతర ప్రభుత్వ సిబ్బంది ద్వారా పంపిణీ చేయించాలన్న ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి వక్రీకరించి వైసీపీకి, జగన్మోహన్‌రెడ్డికి లబ్ధి కలిగేలా వ్యవహరిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు, సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. ప్రభుత్వ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఒక్కపూటలో పెన్షన్ పంపిణీ చేసే అవకాశం ఉన్నా అలా చేయడం లేదన్నారు. పెన్షన్ల పంపిణీకి అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన తప్పుబట్టారు. రాష్ట్రంలో ఎన్నికలకోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పింఛన్లు, ఇతర పథకాలు లబ్ధిదారులకు పంపిణీ చేసే విధుల నుంచి వలంటీర్లను తప్పించి వేరే ప్రభుత్వ సిబ్బంది ద్వారా పంపిణీ చేయించమని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలిచ్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వం, పార్టీకి, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తొత్తులుగా ఉన్న అధికారులు ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు వక్రీకరిస్తూ రాజకీయంగా ఆ పార్టీకి లబ్ధికలిగేలా తయారు చేశారని విమర్శించారు. గ్రామసచివాలయానికి వెళ్లి లైన్‌లో నిలుచుని పెన్షన్ తీసుకోవాలని జవహర్‌రెడ్డి ఆదేశాలు జారీచేయడం అత్యంత దుర్మారమన్నారు. రెండు మూడు గ్రామాలకు కలిపి ఒక సచివాలయం ఉన్న పరిస్థితుల్లో మండుటెండల్లో వృద్ధులు, వికలాంగులు సచివాలయానికి వెళ్లి క్యూల్లో నిలబడి తీసుకునేందుకు ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తంచేశారు. వలంటీర్లు లేకపోవడం వల్ల ఇటువంటి ఇబ్బందులు వస్తున్నాయనే భావన కల్పించడం ద్వారా జగన్మోహన్‌రెడ్డి, వైసీపీకి లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతో చీఫ్ సెక్రటరీ ఇటువంటి ఆదేశాలు జారీ చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఇంటింటికి వెళ్లి పెన్షన్లు, అందించేందుకు పంచాయతీ సిబ్బంది, సర్పంచ్‌లు సిద్ధంగా ఉన్నారని, సిబ్బంది చాలకపోతే గ్రామ, సచివాలయ కార్యదర్శులు లక్షా 60 వేల మందితో ఇంటింటికి వెళ్లి పింఛన్లు ఒక్క పూటలో అందజేసేందుకు అవకాశముందన్నారు. మండు టెండల్లో పింఛను లబ్ధిదారులను ఇబ్బంది పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని అత్యంత హేయమన్నారు. సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోలి వసంత కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం కల్పించిన హెల్పింగ్ హ్యాండ్స్

ధర్నాచౌక్, ఏప్రిల్ 1: ఏ ఆధారం లేక ఇబ్బంది పడుతున్న వృద్ధులకు తాము ఆశ్రయం కల్పిస్తున్నామని హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి వెంకట్ తెలిపారు. కొత్త ప్రభుత్వాస్పత్రి వద్ద కొన్ని రోజులుగా ఒక వృద్ధురాలు రోడ్డుపై ఉండటాన్ని గమనించిన ఒక వ్యక్తి ఇచ్చిన సమాచారంతో అమెకు చికిత్స చేయించి తమ ఆశ్రమానికి తరలించామన్నారు. ఏలూరు శాస్త్రి కాలనీకి చెందిన వృద్ధురాలు షేక్ మోతి తన కుమార్తె వద్ద ఆశ్రయం పొందేందుకు వచ్చిందని దీనికి నిరాకరించిన కుమార్తె, అల్లుడు వృద్ధురాలిని గాయపరచి రోడ్డుపై పడేశారని ఆయన తెలిపారు. ఉచిత ఆశ్రయం కావాలనేకునే వారు 99499 26465లో సంప్రదించాలని వెంకట్ సూచించారు.



వృద్ధురాలిని ఆశ్రమానికి తరలిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి వెంకట్

గన్స్, అమ్యునిషన్ షాపుల తనిఖీ



నగరంలోని గన్స్ అండ్ అమ్యునిషన్ షాపుల తనిఖీకి వెళుతున్న డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా, సెంట్రల్ జోన్ ఏసీపీ పి.భాస్కరరావు

గుణదల, ఏప్రిల్ 1: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకుంటున్న ముందు జాగ్రత్తల్లో భాగంగా గవర్నర్‌పేట, మాచవరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని గన్స్, అమ్యునిషన్ డీలర్‌షిప్ ఉన్న షాపులను డీసీపీ అధిరాజ్‌సింగ్, సెంట్రల్‌జోన్ ఏసీపీ పి.భాస్కరరావు సోమవారం తనిఖీ చేశారు. వారు షాపుల్లో రికార్డులను పరిశీలించారు. లైసెన్స్ ఉన్న గన్స్, అమ్యునిషన్లు మాత్రమే ఉంచాలని, అన్ని వెపన్స్ డిపాజిట్ చేశారా ఇంకా ఎవరైనా చేయాల్సిన వారు ఉన్నారా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. షాపులోని రికార్డులు, డిపాజిట్ చేసిన వెపన్స్ వివవరాలు సరిగా ఉన్నదీ లేనిదీ తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డిపాజిట్ చేసుకున్న వెపన్స్ బయటకు పంప కూడదని, షాపు చుట్టూ సీపీ కెమెరాల పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని, సెక్యూరిటీ గార్డులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. షట్టర్లకు డబుల్ లాక్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనుమతి ఉన్న పర్సనల్, కమర్షియల్ వెపన్స్‌ను మాత్రమే డిపాజిట్ చేసుకోవాలని షాపు యజమానులకు ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీతకు

ప్రాజెక్టు ఎక్స్‌పోలు దోహదం



విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్‌ను తిలకిస్తున్న ఉషారామా కళాశాల ఈసీఈ విభాగాధిపతి బి.నాంచారయ్య

ఉంగుటూరు, ఏప్రిల్ 1: విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలకు మరింత పదునుబెట్టి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు దోహదపడతాయని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగాధిపతి బత్తుల నాంచారయ్య అన్నారు. కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రాజెక్ట్ ఎక్స్‌పోను నిర్వహించారు. ఇంజనీరింగ్ ఫైనలియర్ విద్యార్థులు రూపొందించిన. 5జీ కమ్యూనికేషన్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్(ఐవోటీ), వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్, యాంటెనా, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి 45 ప్రాజెక్ట్ నమూనాలను ఇందులో ప్రదర్శించారు. కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, డైరెక్టర్ కె.రాజశేఖరరావు, ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్, డీన్ ఆఫ్ అకడమిక్స్ సీహెచ్ శాంతిరాణి, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు ప్రాజెక్ట్ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ప్రాజెక్టుల వివరాలు, వాటి ప్రయోజనాలను అడిగి తెలుసుకుని, రూపకర్తలను అభినందించారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పో పర్యవేక్షకులుగా కె.బాబూరావు, ఎంకే కిషోర్, జి.సునీత వ్యవహరించారు.

బెజవాడ బార్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

విజయవాడ లీగల్, ఏప్రిల్ 1: బెజవాడ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కొత్త చంద్రమౌళి, అరిగల రాజా సోమవారం బార్ అసోసియేషన్ చాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా ఎన్నికైన జీవీ రామశర్మ, జాయింట్ సెక్రటరీ కలతోటి క్రాంతికుమార్, లైబ్రేరియన్ సెక్రటరీ సీహెచ్ రవికుమార్, కోశాధికారి ఎన్‌వీవీ సుబ్రహ్మణ్యం, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ అజ్గర్ షేక్, మహిళా కార్యదర్శి ఎస్.రాజ్యలక్ష్మి పదవీ బాధ్యతలు స్వీకరించారు. చంద్రమౌళి, రాజా ఈ సందర్భంగా మాట్లాడారు. బెజవాడ బార్‌లో న్యాయవాద వృత్తి చేస్తున్న న్యాయవాదులు తమకు ఏ రకమైన సమస్యలున్నా 'బార్' కార్యవర్గసభ్యుల దృష్టికి తెస్తే జనరల్ బాడీ సమావేశంలో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. బెంచ్‌కు బార్‌కు మధ్య సంబంధాలు బాగుండేలా చూస్తామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన కార్యవర్గసభ్యులకు న్యాయవాదులు గద్దం రాజేశ్వరరావు, బుచ్చిబాబు అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన బెజవాడ బార్ నూతన కార్యవర్గసభ్యులు

నేను పుట్టిందే ధనికుడిగా...

- ఆ విషయం నానీకి ఇప్పుడు తెలిసిందా?
- ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం అదృష్టంగా భావిస్తున్నా
- పోతిన మహేశ్‌తో పవన్ మాట్లాడతారు:సుజనా చౌదరి



అమరావతి, విజయవాడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): 'నేను ధనికుడినే. ఆ విషయం ఎంపీ కేశినేని నానీకి ఇప్పుడు తెలిసిందా? నేను పుట్టుకతోనే ధనికుడిని' అని కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి వ్యాఖ్యానించారు. కేశినేని నాని ఎందుకు ఇంతగా దిగజారి మాట్లాడుతున్నారో తనకు అర్థం కావడం లేదన్నారు. ఆయనపై సానుభూతి చూపడం తప్ప ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని చెప్పారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్‌తో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను విజయవాడలోనే పుట్టి పెరిగానని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి గల్లీకి వెళ్తానన్నారు. తనకు తెలియకపోతే జీపీఎస్‌ను ఉపయోగించుకుంటానన్నారు. కేశినేని దిగజారిన స్థాయికి తాను వెళ్లలేనన్నారు. తాను ఇక్కడే చదువుకున్నానని, తన కుటుంబానికి వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. తాను పోటీ చేస్తానని పార్టీకి దరఖాస్తు చేసుకోలేదని, కూటమిలో మూడు పార్టీలు కలిసి తనను అభ్యర్థిగా ఎంపిక చేశాయని చెప్పారు. జనసేన నేత పోతిన మహేశ్ తమతో కలిసి పనిచేస్తారని, అయనతో ఆ పార్టీ చీఫ్ పవన్ కల్యాణ్ మాట్లాడతారని తెలిపారు. రాజకీయాలకు రాజధానిగా ఉన్న విజయవాడలో పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యేకు కొత్త నిర్వచనం చూపిస్తానన్న విశ్వాసం తనకు ఉందన్నారు. ప్రత్యర్థులు వారి పని వారు చేసుకుంటారని, వారిపై ఎలాంటి విమర్శలు చేయబోనని చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో 20 కోట్ల మంది దారిద్ర్య రేఖ దిగువ నుంచి విముక్తి పొందారని, పేద మహిళలకు ఉచిత రేషన్, ఉజ్వల గ్యాస్, ముద్ర రుణ సదుపాయం, ప్రధాని ఆవాస్ యోజన ఇళ్లు, జన ఔషధి ద్వారా తక్కువ ధరకు మందులు, ఆయుష్మాన్ భారత్, ముస్లిం మహిళలకు ఆర్థిక సహాయంతోపాటు త్రిపుల్ తలాక్ రద్దుతో వైవాహిక భద్రత ఇలా అన్ని వర్గాల అభివృద్ధే ఎన్డీఏ ధ్యేయమన్నారు. రాష్ట్రంలోనూ ఎన్డీఏ ప్రభుత్వం రాబోతోందని, ఐదేళ్లుగా తిరోగమనంలో పయనిస్తున్న ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి బాటలో ముందుకు వెళ్లబోతోందని సుజనా చౌదరి వ్యాఖ్యానించారు.

జగన్... సీఎంగా తప్పుకో

- ఒక్క రోజులో పింఛన్లు పంపిణీ చేస్తాం: పట్టాభి సవాల్
- ఓటమి భయంతోనే అసత్యాల ప్రచారం



విజయవాడ(విద్యాధరపురం), ఏప్రిల్ 1: 'జగన్... సీఎంగా 24 గంటలు తప్పుకుంటే చంద్రబాబు నేతృత్వంలో ఒక్క రోజులో పెన్షన్లను పంపిణీ చేసి చూపిస్తాం' అని టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సవాల్ విసిరారు. సోమవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'అప్పు పుడితే తప్ప పెన్షన్లు ఇవ్వలేని దుస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారు. మంగళవారం ఆర్బీఐ ఆక్షన్‌లో రూ.4,000 కోట్లు అప్పు ఇస్తే తప్ప పెన్షన్ ఇవ్వలేని పరిస్థితి. హైకోర్టు, ఎలక్షన్ కమిషన్‌లు ఎక్కడా ఇంటింటికి తిరిగి పంపిణీ చేయవద్దని చెప్పలేదు. ఎలక్షన్ కమిషన్ కన్నా ముందే హైకోర్టు ఆదేశాల ప్రకారం పింఛన్ పంపిణీ కార్యక్రమంలో వలంటీర్లను దూరంగా ఉంచాలనే ఆదేశాలు వచ్చాయి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు... సీఈవో, సీఎస్‌లను ఇంటింటికి పెన్షన్ పంపిణీ విఘాతం కలగకుండా చూడాలని మాత్రమే కోరారు. జగన్‌కు రానున్న ఎన్నికల్లో ఓడిపోతామని అర్థమై టీడీపీపై కుట్రలు పన్నుతున్నారు. మార్చి 29, 30, 31 తేదీల్లోనే కొన్ని రూ.వేల కోట్లను జగన్ తనకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లకు కట్టబెట్టారు. దీంతో ఖజానా వట్టిపోయింది. రాష్ట్రంలో 60 లక్షలకు పైగా పింఛన్‌దారులకు రూ.1,958 కోట్లు ఇవ్వవలసి ఉంది. ఖజానాలో నిధులు లేక జగన్... టీడీపీపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారు' అని పట్టాభి మండిపడ్డారు.

ప్రవీణ్ ప్రకాశ్‌పై చర్యలు తీసుకోవాలి: రామకృష్ణ

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విద్యలో జగన్ అమలు చేసిన పథకాలపై ప్రచారం చేసేందుకు టీచర్లను వాడే ప్రయత్నం చేస్తున్న ప్రవీణ్ ప్రకాశ్‌పై ఈసీ చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత కేఎస్ రామకృష్ణ అన్నారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... 'విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ జగన్ తాబేదారులా, వైసీపీ కార్యకర్తలా మారిపోయారు. ఎన్నికల కోడ్‌కి విరుద్ధంగా పుస్తకాలు, విద్యాకానుకలపై జగన్ బొమ్మలు ప్రచురిస్తున్నారు. ఏటా డీఎస్సీ అని హామీ ఇచ్చిన జగన్ ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఎన్టీఆర్ హయాంలో మూడు, చంద్రబాబు హయాంలో తొమ్మిది డీఎస్సీలు జరిపి దాదాపు 1.70 లక్షల ప్రభుత్వ టీచర్లను నియమించిన చరిత్ర టీడీపీదే. వైసీపీ ప్రభుత్వం జీఓ నంబరు 117 తెచ్చి 25 వేల స్కూళ్లను మూసేసి, 50 వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసింది' అని ఆరోపించారు.

వైసీపీకి అనుకూలంగా ఇంటర్‌బోర్డు కార్యక్రమాలు: కనకమేడల

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారులు వైసీపీకి అనుకూలంగా కార్యక్రమాలు రూపొందిస్తున్నారంటూ టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. టీచర్-పేరెంట్ సమావేశాలు, సర్టిఫికెట్ల పంపిణీ పేరుతో అధికారపార్టీకి అనుకూలంగా అధికారులు నిర్ణయం తీసుకుంటున్నారని ఆరోపించారు. మార్చిలో పరీక్షలు పూర్తి చేసుకున్న పదో తరగతి విద్యార్థుల కుటుంబాలను కలవాలంటూ జూనియర్ లెక్చరర్లకు ఆదేశాలు జారీ చేసిన ఇంటర్‌బోర్డు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచాలనే నెపంతో ప్రభుత్వ పథకాల ప్రచారం మొదలు పెట్టారన్నారు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద లాంటి పథకాల గురించి కుటుంబ సభ్యులకు చెప్పాలని ఆదేశించారన్నారు. ఏప్రిల్ 2 నుంచి మే 13 వరకు చేపట్టే ఈ కార్యక్రమాన్ని వెంటనే నిలిపేయాలని ఆ లేఖలో రవీంద్ర కోరారు.

60ఏళ్లు దాటిన వారికి ఎన్నికల విధులు వద్దు

- ఈసీకి టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి లేఖ

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): 60 ఏళ్ల వయసు పైబడిన ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఆరోగ్య సమస్యలున్న వారికి ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఈసీఐ, ఏపీ సీఈవోకు ఆయన లేఖలు రాశారు. '60 ఏళ్లు దాటిన ఉద్యోగులకు ఆరోగ్యం సహకరించకపోవచ్చు. అలాగే కోవిడ్‌తో బాధ పడిన వారు ఆరోగ్యపరంగా ఇబ్బందిలో ఉంటారు. గుండెపోటు సంబంధిత సమస్యలున్న వారు, గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలున్న ఉద్యోగినుల శ్రేయస్సు దృష్ట్యా ఇలాంటి వారందరినీ ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలి. ఈ మినహాయింపు వల్ల వారి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు, ఆరోగ్యవంతులైన వ్యక్తులతో పని చేయించడం వల్ల ఎన్నికల ప్రక్రియ సమర్థంగా నిర్వహించడానికి వీలు కలుగుతుందని లేఖల్లో పేర్కొన్నారు.

తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండగా ఆయిల్ కంపెనీలు 19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర అలాగే మార్కెట్లో లభించే 5 కేజీల గ్యాస్ సిలిండర్ల ధరలను తగ్గించాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇది అమలులోకి వచ్చింది. వాణిజ్య సిలిండర్ ధర రూ.30.50 చొప్పున తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సిలిండర్ ధర ఏప్రిల్ ఒకటి నుంచి రూ.1,764.50 పలుకుతుంది. 5 కేజీల సిలిండర్ ధర రూ.7.50 చొప్పున తగ్గింది. మార్చి ఒకటో తేదీన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.25 చొప్పున పెంచిన తర్వాత ఈ నెల ఒకటో తేదీన తగ్గించడం విశేషం. ఆయిల్ కంపెనీలు ప్రతి నెలా ఒకటో తేదీన వంటగ్యాస్ ధరలను సవరిస్తుంటాయి. ఇంధన ధరలు, మార్కెట్ పరిస్థితులనుబట్టి సిలిండర్ ధరలను నిర్ణయిస్తాయి. ఈ ఏడాది జనవరిలో రూ.39.50 చొప్పున వాణిజ్య సిలిండర్ ధర తగ్గించగా... ఫిబ్రవరి, మార్చి నెలల్లో మాత్రం వరుసగా పెంచాయి. మరోవైపు విమాన ఇంధనం(ఏటీఎఫ్) ధరలు కూడా 0.50 శాతం తగ్గాయి.

రుణమాఫీపై లీకులు!

- ఎన్నికల వేళ అధికార పార్టీ నేతల గిమ్మిక్కులు!
- చెల్లింపులపై రైతుల్లో గందరగోళం
- బాకీలు కట్టొద్దని సహకార కమిటీల ప్రచారం
- బాకీలు రెన్యువల్ చేస్తున్న బ్యాంకులు, సొసైటీలు
- వడ్డీ వసూలుతో అసలుకు బుక్ ఎడ్జెస్ట్‌మెంట్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు రుణమాఫీ ప్రకటిస్తాయనే ఆశతో.. ఎక్కువ మంది రైతులు వడ్డీ కట్టి, మిగతా మొత్తాన్ని రెన్యువల్ చేయించుకుంటున్నారు. ప్రధానంగా రుణమాఫీపై అధికార పార్టీ నేతలు లీకులు ఇచ్చి, రుణాల్ని సందిగ్ధంలోకి నెడుతున్నారు. ఇందులో భాగంగా సహకార సంఘాలకు అనధికార పర్సన్ ఇన్‌చార్జి కమిటీల్లో ఉన్న అధికార పార్టీ నేతలు కొందరు.. ప్రభుత్వం ఈసారి రుణ మాఫీ చేస్తుందన్న ప్రచారంతో రుణాలు చెల్లించవద్దని రైతులకు సూచిస్తున్నట్లు తెలిసింది. దీంతో 2023-24లో ఖరీఫ్, రబీ సీజన్లలో పంట రుణాలు తీసుకున్న రైతుల నుంచి సహకార సంఘాలు వడ్డీ వసూలు చేసి, అసలు మొత్తాన్ని రెన్యువల్ చేస్తున్నాయి. వాణిజ్య బ్యాంకులు మాత్రం వడ్డీతో సహా అసలు చెల్లించగలిగిన రైతుల నుంచి రుణ మొత్తాన్ని వసూలు చేస్తున్నాయి. చెల్లించలేకపోతే.. వడ్డీలు మాత్రమే కట్టించుకుంటున్నాయి. అయితే రుణ మొత్తాలను తీసుకున్న తేదీ నుంచి సరిగ్గా ఏడాది వరకు డ్యూ డేట్‌గా చూపి, తిరిగి మరుసటి రోజు నుంచి మళ్లీ రుణం తీసుకున్నట్లుగా రెన్యువల్ చేస్తున్నారు. దీంతో ఏ పార్టీ అయినా రుణ మాఫీ ప్రకటిస్తే.. కటాఫ్ డేట్ ఎప్పటి వరకు అని నిర్ణయిస్తాయో తెలియని పరిస్థితితో రైతులు అయోమయానికి గురవుతున్నారు.

> ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రుణమాఫీ చేసే పరిస్థితి లేదని బ్యాంకింగ్ రంగ నిపుణులు చెబుతుంటే.. ఎన్నికల్లో గెలవాలన్న ఆశతో సర్కారు రకరకాల గిమ్మిక్కులు చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా రుణమాఫీపై కొన్ని సహకార సంఘాల త్రిసభ్య కమిటీలు రైతుల్ని మభ్యపెడుతున్నాయి. వడ్డీలు మాత్రం కట్టించుకుని, రుణ మొత్తాన్ని రెన్యువల్ చేయిస్తున్నాయి. ఈ విధానం వాణిజ్య బ్యాంకులపై ఎలాంటి ప్రభావం చూపినా.. పంట రుణాల చెల్లింపులపై మాత్రం రైతుల్లో గందరగోళం నెలకుంది.

గతంలో ఇలా..

2004లో రుణమాఫీ చేసిన అప్పటి ప్రభుత్వం 2003 డిసెంబరు వరకు ఉన్న వాయిదా మీరిన రుణాలన్నీ రుణమాఫీ కిందకు వస్తాయని ప్రకటించింది. ఈ మేరకు రుణమాఫీ చేసింది. కానీ రుణమాఫీ కోసం ఎదురుచూడకుండా, సకాలంలో పూర్తిగా రుణమొత్తాన్ని చెల్లించిన రైతులకు రూ.5వేలు చొప్పున వైఎస్సార్ ప్రభుత్వం చెల్లించింది. 2014లో చంద్రబాబు ప్రభుత్వం రూ.లక్షన్నర వరకు రుణమాఫీ ప్రకటించారు. తొలి విడత ఏకంగా రూ.50వేలు మాఫీ చేసి, మిగతా మొత్తాన్ని నాలుగు కిస్తీల్లో మాఫీ చేస్తామని చెప్పింది. రెండు,మూడు విడతల సొమ్మును వడ్డీతో సహా రుణ సంస్థలకు జమ చేసింది. దీంతో ఒక్కో రైతు రూ.లక్షపైగా లబ్ధి పొందారు. అయితే మిగిలిన రుణానికి 2019 ఎన్నికల కోడ్ కారణంగా మాఫీ సాధ్యపడలేదు. కానీ ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రుణ మాఫీ చేసే పరిస్థితి లేదని బ్యాంకింగ్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయినా రుణమాఫీపై కొన్ని సహకార సంఘాల త్రిసభ్య కమిటీలు రైతుల్ని మభ్యపెడుతున్నాయి. వడ్డీలు మాత్రం కట్టించుకుని, రుణ మొత్తాన్ని రెన్యువల్ చేయిస్తున్నాయి. ఈ విధానం వాణిజ్య బ్యాంకులపై ప్రభావం చూపుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.2లక్షల కోట్లు అవుట్ స్టాండింగ్ ఉన్నట్లు సమాచారం. ఇందులో పావు వంతు కూడా వసూలు కాలేదని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. నిజానికి ఈ ఏడాది కరువు, తుఫాన్‌తో రైతులు నష్టపోయారు. గత ఐదేళ్లూ వరుస విపత్తులతో అనేక రకాల రైతులు ఇబ్బందిపడ్డారు. దీంతో రైతులను ఆర్థికంగా ఆదుకోవటానికి ఏటా రూ.20వేలు ఇస్తామని టీడీపీ ప్రకటించింది. కానీ అధికార పార్టీ ఇంత వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. వాస్తవంగా 2022-23 రబీ సీజన్‌లో రూ.లక్షలోపు రుణాలు తీసుకుని, వడ్డీతో సహా రుణమంతా చెల్లించిన రైతులకు ఏడాది గడిచినా జగన్ సర్కార్ ఇంత వరకు వడ్డీ సొమ్మును రీయింబర్స్‌మెం ట్ చేయలేదు. 2022-23 రబీ పంటల బీమా పరిహారం కూడా ఇవ్వలేదు. 2023-24 పంటల బీమా జూన్‌లో వస్తుందని సీఎం ప్రకటించారు. సున్నావడ్డీ, పంటల బీమా పథకాల కింద ఇప్పటికే రైతులకు రూ.కోట్లలో చెల్లించాల్సి ఉంది. సీఎం మాటలపై నమ్మకం లేక కొందరు రైతులు రుణమాఫీపై ఆశలు వదులుకుని, ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వడ్డీలు చెల్లించి, అసలుకు రెన్యువల్ చేయించుకుంటున్నారు. గత మార్చి నుంచి ఈ మార్చిలోగా తీసుకున్న పంట రుణాలను జాతీయ బ్యాంకులు, సహకార సంఘాలు రెన్యువల్ పేరుతో బుక్ ఎడ్జెస్ట్‌మెంట్ చేస్తున్నాయి.



అమెరికా అధ్యక్షుడి విమానంలో చోరీలు

- విస్కీ గ్లాసులు, ప్లేట్లు, కొన్ని నమూనాలు మాయం
- మీడియా ప్రతినిధుల పనే
- ఇక నుంచి అలా చేయొద్దు: వైట్‌హౌస్

వాషింగ్టన్ డీసీ, ఏప్రిల్ 1: ఎయిర్ ఫోర్స్ వన్! అమెరికా అధ్యక్షుడు ప్రయాణించే ఈ విమానాన్ని ఎగిరే వైట్ హౌస్‌గా అభివర్ణిస్తారు. సకల సౌకర్యాలు, కట్టుదిట్టమన భద్రత, అత్యాధునిక రక్షణ వ్యవస్థల నడుమ ఎగిరే ఈ విమానంలో చోరీలు జరుగుతున్నాయంటే నమ్ముతారా? అదను చూసి.. గ్లాసులనో, ప్లేట్లనో గుట్టుగా బ్యాగుల్లో వేసుకొని విమానం దిగేసి వెళ్లిపోతున్నారట కొందరు! ఇలా హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్న వారు ఎవరంటారా? అధ్యక్షుడి వెంట ఆ విమానంలో ప్రయాణించే మీడియా ప్రతినిధులే! ఎయిర్ ఫోర్స్‌వన్‌లో తరచూ చోరీలు జరుగుతున్నాయంటూ అక్కడి ఆంగ్లపత్రిక 'పొలిటికో' ఓ కథనాన్ని ప్రచురించింది. విస్కీ, వైన్ గ్లాస్‌లు.. శ్వేత సౌధాన్ని పోలివుండే నమూనాలు, పిల్లోకేస్‌లు.. ఇలా ఏ చిన్న వస్తువు కనిపిస్తే దాన్ని బ్యాగుల్లో వేసుకొని విమానం దిగేస్తున్నారట! ఈ విషయాన్ని వైట్‌హౌస్ కరస్పాండెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కెల్లీ ఒడేనియల్ వెల్లడించారు. ఇకముందైనా ఇలాంటి చర్యలు మానుకోవాలని మీడియా ప్రతినిధులను ఆయన సున్నితంగా హెచ్చరించారు. ఫిబ్రవరి 5న ఎయిర్‌ఫోర్స్ వన్‌లో కొన్ని వస్తువులు కనిపించకపోవడంతో.. వైట్‌హౌస్ ట్రావెల్ ఆఫీసు సిబ్బంది అధ్యక్షుడి వెంట పర్యటనకు వెళ్లిన మీడియా ప్రతినిధులకు ఓ మెయిల్ పెట్టారు. దీంతో ఓ మీడియా ప్రతినిధి పిల్లోకేస్‌ను సిబ్బందికి అప్పగించి వెళ్లిపోయారు.

విలక్షణ చిత్రకారుడు 'దాసి' సుదర్శన్ కన్నుమూత

- గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ మృతి
- దాసి చిత్రానికి జాతీయ అవార్డు
- నేడు మిర్యాలగూడలో అంత్యక్రియలు



మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 1: విలక్షణ చిత్రకారుడు, ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్, సాహితీవేత్త పిట్టంపల్లి సుదర్శన్ అలియాస్ దాసి సుదర్శన్ (72) కన్నుమూశారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని తన స్వగృహంలో సోమవారం గుండెపోటుకు గురయ్యారు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. సుదర్శన్ చిత్రకళ, సాహితీరంగంలో విశేష సేవలందించారు. నాగార్జునసాగర్ జూనియర్ కళాశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేసిన ఆయన ఎంతో మంది విద్యార్థులను కళలు, సాహిత్యంవైపు మళ్లించారు.. సాహితీవేత్తగానే కా కుండా సినీరంగంలోనూ రాణించా రు. ప్రముఖ సినీ దర్శకుడు నర్సింగరావుతో కలిసి పలు చిత్రాల్లో పనిచేశారు. నర్సింగరావు దర్శకత్వంలో 1988లో తెరకెక్కిన 'దాసి' సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారు. అప్పట్లో విశేష ప్రజాదరణ పొందిన ఈ చిత్రానికి ఐదు జాతీయ అవార్డులు వచ్చాయి. కాస్ట్యూమ్ డిజైనర్‌గా సుదర్శన్ జాతీయ అవార్డు రావడంతో దాసి సుదర్శన్‌గా ప్రఖ్యాతిపొందారు. జాతీయ అవార్డు జూరీలో ఆయన సభ్యుడిగా సేవలందించి చిత్ర పరిశ్రమలో సుపరిచితుడిగా నిలిచారు. సుదర్శన్ మృతి పట్ల పలువురు కవులు, కళాకారులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. సుదర్శన్ మృతి కళారంగానికి తీరనిలోటు అని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. సుదర్శన్ అంత్యక్రియలు మంగళవారం మిర్యాలగూడలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

నంద్యాల టీడీపీ ఇన్‌చార్జికి టీ హైకోర్టులో ఊరట

నేటి వరకు అరెస్టు చేయకూడదని ఆదేశం

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఓ భూ వివాదం కేసులో ఏపీలోని నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఐపీఎస్ మాండ్ర శివానందరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. వారిని మంగళవారం వరకు అరెస్ట్ చేయరాదని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. అక్రమ పత్రాలను సృష్టించి, రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో 26 ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జాచేశారనే ఆరోపణలపై కేసు నమోదు చేసి న సీసీఎస్ పోలీసులు.. వారిని అరెస్ట్ చేసేందుకు నంద్యాల వెళ్లారు. ఈ నేపథ్యంలో శివానందరెడ్డి, ఆయన భార్య ఉమాదేవి, కుమారుడు కనిష్కలు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ విజయ్‌సేన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. దీనిపై పోలీసుల వైఖరి తెలియజేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈనెల 2 వరకు పిటిషనర్‌లను అరెస్టు చేయరాదని.. ఒకవేళ అరెస్టు చేసే పక్షంలో వ్యక్తిగత బాండ్లపై విడుదల చేయాలని పేర్కొంది. పిటిషనర్లు సీసీఎస్ పోలీసులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ప్రభుత్వ భూములు కబ్జాచేశారని శివానందరెడ్డి, ఆయన కంపెనీ, కుటుంబ సభ్యులపై 2022లో కేసు(క్రైమ్ నంబర్ 194/22) నమోదైంది. కగా.. ఈ కేసులో కనిష్క, ప్రశాంత్‌రెడ్డి, ఉమాదేవిని సీసీఎస్‌కు తీసుకువచ్చామని పోలీసులు వివరించారు. శివానందరెడ్డిని అరెస్టు చేసేందుకు నంద్యాలలోని నందికొట్కూర్ మండలం, అల్లూరు గ్రామానికి వెళ్లినట్లు వివరించారు. అక్కడ కొంత మంది తమను అడ్డుకున్నారని, శివానందరెడ్డి పారిపోయేందుకు సహకరించారని తెలిపారు. దీనిపై బ్రాహ్మణ కొట్కూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని వెల్లడించారు. ఇంతకు ముందే సీసీఎస్‌కు తరలించిన నిందితులను కోర్టు ఆదేశాలతో వ్యక్తిగత బాండ్‌పై విడిచిపెట్టామని, వారు మంగళవారం ఉదయం 11.30కు సీసీఎస్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

జైల్లో కవిత జపం!

- ప్రత్యేకంగా జపమాల కావాలని కోరిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ
- నడకకు స్పోర్ట్స్ షూ.. చదువుకునేందుకు పుస్తకాలు కూడా
- బెయిల్‌పై వాదనలు... విచారణ 4వ తేదీకి వాయిదా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అక్కడ జపం చేసుకోవాలనుకుంటున్నారు. ఇందుకుగాను తనకు జపమాల కావాలని రౌస్ అవెన్యూ కోర్టుకు ఆమె విజ్ఞప్తి చేశారు. మెడిటేషన్‌కు అనుమతి కోరారు. అలాగే స్పోర్ట్స్ షూ, పుస్తకాలు, పెన్నులు, పరుపు, దుప్పట్లు కావాలనీ కోరారు. ఇంటి నుంచి ఆహారానికి అనుమతించాలనీ కోరారు. ఈ మేరకు కవిత తరపున ఆమె న్యాయవాది నితేశ్ రాణా సోమవారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరీ బవేజాను అభ్యర్థించారు. మార్చి 26న ఇచ్చిన ఉత్తర్వుల్లో ఏ ఒక్కటీ అనుమతించలేదని కవిత తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్న అన్నింటినీ తెచ్చుకునేందుకు అనుమతించినట్లు జైలు సూపరింటెండెంట్ న్యాయస్థానానికి తెలిపారు. స్పందించిన కోర్టు, మరోసారి లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేసింది. కవిత కోరినట్లుగా జపమాల సహా అన్ని వస్తువులను అనుమతించింది. కొన్నింటిని స్వయంగా సమకూర్చుకునేందుకు అనుమతించింది. గతంలో కోరిన మేరకు ఆభరణాలు ధరించేందుకు అనుమతించింది. లేసులు లేని బూట్లకు అనుమతించాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా కవితకు బెయిల్ ఇవ్వాలని ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో పాటు నితేశ్ రాణా వాదనలు వినిపించారు. ఆ తర్వాత న్యాయమూర్తి విచారణను 4వ తేదీకి వాయిదా వేశారు. మద్యం విధానం కుంభకోణంలో కవితకు వ్యతిరేకంగా ఈడీ పక్షపాత బుద్ధితో, దురుద్దేశపూరితంగా వ్యవహరిస్తోందని, ఒక దర్యాప్తు ఏజెన్సీగా కాకుండా శిక్షించే సంస్థగా చర్యలు తీసుకుంటోందని అభిషేక్ సింఘ్వీ వాదించారు. ఈ కేసులో ఈడీ పిల్లి, ఎలుకలాగా ఆటలాడుతోందని పేర్కొన్నారు. ప్రతిరోజు సమన్లు పంపకుండా ఈడీ సంతోషించలేకపోతోందని పేర్కొన్నారు. అసలు ఈ కేసులో కవితను అరెస్టు చేయాల్సిన అవసరమే లేదని వాదించారు. కేసులో నిందితుడైన అరుణ్ పిళ్లై, ఈడీ ముందు తొలుత తొమ్మిదిసార్లు ప్రకటనలు చేశారని, అందులో కవిత పేరే లేదని, పదో ప్రకటనలో కవిత పేరు వెల్లడించినా మళ్లీ దాన్ని వెనక్కు తీసుకున్నారని గుర్తు చేశారు. ఛార్జిషీట్లలో కవిత పేరు ప్రస్తావించలేదని కూడా తెలిపారు. తనను వేధిస్తారని తెలిసినప్పటికీ ఈడీ ఎదుట కవిత హాజరై సహకరించారని చెప్పారు. ఒకే రోజు పలు సమన్లు జారీశారని, ఇలా చేయడం ఉద్దేశపూర్వక వేధింపులు కాక మరేమిటి? అని ప్రశ్నించారు. ఈడీ ఒక సర్వశక్తివంతమైన సంస్థగా మారిందని, ఈడీ అధికారులు న్యాయస్థానాలకేకాక దేశానికి, రాజ్యాంగానికి కూడా అతీతులుగా మారారని విమర్శించారు. కవిత పట్ల ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టబోమని సుప్రీంకోర్టుకు ఇచ్చిన అండర్ టేకింగ్‌ను కూడా ఈడీ ఉల్లంఘించిందని, ఇది సరైంది కాదని చెప్పారు. కోర్టుకిచ్చిన అండర్ టేకింగ్‌ను వెనక్కు తీసుకుంటున్నట్లు మార్చి 15న చెప్పారని, కోర్టు అనుమతించకపోయినప్పటికీ గంటలోపు కవిత ఇంటికి వచ్చి అరెస్టు చేశారని తెలిపారు. కాగా, సింఘ్వీ వాదనలు విచిత్రంగా ఉన్నాయని ఈడీ తరపు న్యాయవాది జోహెబ్ హుస్సేన్ పేర్కొన్నారు. అసలు కవితకు మధ్యంతర బెయిల్ కావాలో.. రెగ్యులర్ బెయిల్ కావాలో తేల్చుకోవాలన్నారు. రెగ్యులర్ బెయిల్ కోసం వాదిస్తూ మధ్యంతర ఊరట కోరకూడదని, ఏదో ఒకదానికి పరిమితం కావాలని అన్నారు.

బీఆర్ఎస్ కోసం స్పెషల్ టాస్క్!

- తెలంగాణలో గులాబీ గెలుపు కోసం ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్ స్పెషల్ ఆపరేషన్
- ఒకే సామాజిక వర్గ అధికారులతో బృందాలు
- రాధాకిషన్ రిమాండ్ రిపోర్టులో వెల్లడి

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): "మూడోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టించాలని ఎంతో కృషి చేశాం.! ప్రత్యర్థి పార్టీల నేతల ఫోన్లను ట్యాప్ చేశారు. వారు డబ్బును తరలించే వివరాలను అందజేశారు. ఆ లీడ్స్‌తో మేము దాడులు చేసి, నగదును సీజ్ చేశాం.! ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు చెప్పినట్లు చేశాం. ఆయన మార్గదర్శనంలోనే.. ఒకే సామాజికవర్గానికి చెందిన పోలీసులతో.. 'స్పెషల్ ఆపరేషన్' చేపట్టాం. బీఆర్ఎస్‌లో అనుమానిత నేతల ఫోన్లను కూడా ట్యాప్ చేశాం.!".. ఇవీ తెలంగాణలో ఎస్ఐబీ కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్టులోని కీలకాంశాలు. పంజాగుట్ట పోలీసులు నాంపల్లి కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో ఫోన్ ట్యాపింగ్ జరిగిన తీరు మొదలు.. బీఆర్ఎస్ కోసం పోలీసులు డబ్బును తరలించడం.. ప్రత్యర్థి పార్టీలకు సంబంధించిన నగదును సీజ్ చేయడం వరకు ప్రభాకర్‌రావు 'స్పెషల్ ఆపరేషన్ టీమ్' విధులను రాధాకిషన్ వివరించినట్లు రిమాండ్ రిపోర్టు స్పష్టం చేస్తోంది. పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును ఇంటెలిజెన్స్ చీఫ్(ఓఎస్‌డీ)గా నియమించడం గత ప్రభుత్వ పెద్దల వ్యూహాత్మక చర్య అని రాధాకిషన్‌రావు పేర్కొన్నట్లు దర్యాప్తు అధికారులు రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడించారు. "ప్రభాకర్‌రావు బాధ్యతలు చేపట్టాక.. ఒక క్రమ పద్ధతిలో ఒకే సామాజిక వర్గానికి చెందిన అధికారులను తన కోటరీ(ఇంటెలిజెన్స్, ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్)లో నియమించుకున్నారు. ప్రభాకర్‌రావు వద్ద ప్రణీత్‌రావు పనిచేసేవారు. ఫోన్ ట్యాపింగ్‌లో.. బెదిరింపుల్లో.. ఎన్నికల సమయంలో నగదు పట్టివేతలో వీరు కీలక పాత్ర పోషించారు. ఎన్నికల సమయంలో వీరిని 'స్పెషల్ ఆపరేషన్ టీం'గా పేర్కొన్నారు" అని రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేశారు.

ప్రత్యర్థుల ఆర్థిక మూలాలపై దెబ్బ

బీఆర్ఎస్‌కు తిరుగులేని మెజారిటీ కట్టబెట్టేందుకు ప్రభాకర్‌రావు అహరహం శ్రమించేవారని రాధాకిషన్ పేర్కొన్నట్లు రిమాండ్ రిపోర్టు చెబుతోంది. 2018 ఎన్నికల సమయం నుంచే ఫోన్‌ట్యాపింగ్ జరిగినట్లు ఈ రిపోర్టు తేటతెల్లం చేసింది. "2018 ఎన్నికల్లో శేరిలింగంపల్లి టీడీపీ అభ్యర్థి ఆనంద్‌సాయికి చెందిన రూ.70 లక్షల నగదును సికింద్రాబాద్ ప్యారడైజ్ వద్ద సీజ్ చేశారు. 2020 దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు బంధువులకు చెందిన ఓ చిట్‌ఫండ్ కంపెనీలో రూ.కోటిని సీజ్ చేశారు. 2022 మునుగోడు ఉప ఎన్నిక సమయంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహచరులైన గుంట సాయికుమార్‌రెడ్డి, కుండె మహేశ్, డి.సందీప్ కుమార్, మహేందర్, అనూష్‌రెడ్డి నుంచి రూ.3.5కోట్ల నగదు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలోని గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీజ్ చేశారు. ఫోన్‌ట్యాపింగ్‌ల ద్వారానే ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరేలా చేశారు. బీఆర్ఎస్‌లోనూ అనుమానాస్పద నేతలు అనుకున్న వారి ఫోన్లను ట్యాప్ చేశారు" అని కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడించారు.

36 కోట్ల పెట్రోల్, డీజిల్ వాహనాలకు స్వస్తి

- దశలవారీగా అమలు చేస్తాం: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: దేశంలోని 36 కోట్ల పెట్రోల్, డీజిల్ కార్లు/భారీ వాహనాలను దశలవారీగా తొలగిస్తామని కేంద్ర ఉపరితల రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ఈ విషయంలో వాహనదారులను ప్రోత్సహించేందుకు హైబ్రీడ్, ఫ్లెక్సీ వాహనాలపై జీఎస్టీని తగ్గించే ఆలోచన ఉందన్నారు. హైబ్రీడ్ వాహనాల జీఎస్టీని 5శాతానికి, ఫ్లెక్సీ వాహనాలపై 12శాతానికి తగ్గించాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు లేఖ రాసినట్లు ఆయన వివరించారు. ఆర్థికశాఖ త్వరలో దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోనుందని అభిప్రాయపడ్డారు. "పెట్రోల్ ఉత్పత్తుల దిగుమతికి మన దేశం రూ.16 లక్షల కోట్లు వెచ్చిస్తోంది. ప్రత్యామ్నాయ ఇంధనాలపై దృష్టి సారిస్తే.. ఆ మొత్తాన్ని రైతులు, వ్యవసాయం కోసం వెచ్చించవచ్చు" అన్నారు. గడ్కరీ నిర్ణయాన్ని పర్యావరణవేత్తలు స్వాగతిస్తున్నారు. గ్రీన్‌ఎనర్జీ, విద్యుత్తు వాహనాలను ప్రోత్సహించడం ఆహ్వానించదగ్గ విషయమేనని, అయితే.. విద్యుదుత్పత్తిలో శిలాజ ఇంధనాల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని గ్రీన్‌పీస్ ఇండియా సంస్థకు చెందిన అవినాశ్ చంచల్ విజ్ఞప్తి చేశారు.

విమానం బయలుదేరడం ఆలస్యమయితే ప్రయాణికులు దిగిపోవచ్చు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: బోర్డింగ్ తర్వాత విమానం బయలుదేరడం ఆలస్యమయితే ప్రయాణికులు దిగిపోయి ఎయిర్‌పోర్టు డిపార్చర్ గేట్ ద్వారా బయటకు రావచ్చని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) పేర్కొంది. ఈ మేరకు మార్చి 30న రూపొందించిన నిబంధనలను సోమవారం నుంచి అమల్లోకి తెస్తున్నట్లు బీసీఏఎస్ డైరెక్టర్ జుల్ఫికర్ అలీ తెలిపారు. వాళ్లు తిరిగి విమానం ఎక్కేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విమానయాన సంస్థలు, భద్రతా ఏజెన్సీలు కలిసి రూపొందిస్తాయని చెప్పారు. ఈ ఏడాది జనవరి 14న ఇండిగో విమానం ఆలస్యమైన కారణంగా ముంబై ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు రన్‌వేపై కూర్చున్న ఘటనను ఆయన గుర్తు చేశారు. ఆ ఘటనకు సంబంధించి ఇండిగో సంస్థపై రూ.1.20 కోట్లు ముంబై ఎయిర్‌పోర్టు నిర్వాహకులపై రూ.60 లక్షల జరిమానా విధించి వసూలు చేశామని తెలిపారు.

జ్ఞాన్‌వాపీలో పూజల నిలుపుదలకు సుప్రీం నో



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: వారాణసిలో ఉన్న జ్ఞాన్‌వాపీ మసీదులో ఉన్న దక్షిణ సెల్లారులో హిందువులు పూజలు చేసుకోవడంపై స్టే ఇవ్వాలన్న వినతిని సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. అదే సమయంలో మసీదు ప్రాంగణంలో ముస్లింలు నమాజ్ చేసుకోవడంపై యథాతథ స్థితి కొనసాగించాలని సూచించింది. మసీదు దక్షిణ సెల్లార్ అయిన వ్యాస్ తెకానాలో విగ్రహాలకు జరుగుతున్న పూజలను నిలిపివేయాలంటూ మసీదు నిర్వహణ కమిటీ చేసిన పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఈ నెల 30లోగా సమాధానం ఇవ్వాలని కాశీ విశ్వనాథ మందిర ట్రస్టీలను, పూజారి శైలేంద్ర కుమార్ పాఠక్‌లను కోర్టు ఆదేశించింది. ఇదిలా ఉండగా, మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో ఉన్న భోజశాల కాంప్లెక్స్‌లో ఏఎస్ఐ సర్వేపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే ఇందుకు రెండు షరతులను విధించింది. అక్కడ ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదని, ఏఎస్ఐ ఇచ్చే నివేదిక ఆధారంగా తమ అనుమతి లేకుండా ఎలాంటి చర్యలు చేపట్టకూడదని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

రాజ్యాంగ ధర్మాసనానికి కేరళ సర్కారు వ్యాజ్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: రుణాలపై కేంద్ర ప్రభుత్వం విధించిన పరిమితికి సంబంధించి కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి సుప్రీం కోర్టు సిఫారసు చేసింది. ఈ మేరకు సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. రుణాలపై పరిమితి విధించడం ద్వారా రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో కేంద్రం జోక్యం చేసుకుంటోందని ఆరోపిస్తూ సుప్రీం కోర్టులో కేరళ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. రాజ్యాంగంలోని పలు ఆర్టికల్స్ ప్రకారం రాష్ట్రాలు తమ ఆర్థిక వ్యవహారాలను నియంత్రించుకొనే అధికారం ఉంటుందని పేర్కొంది. రుణ పరిమితులు, రుణాల పరిధి రాష్ట్ర చట్టం ద్వారా నియంత్రించబడతాయని తెలిపింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 2 ఏప్రిల్ 2024



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి- పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ పీజీ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌ను విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు సహా ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ, మైనారిటీ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంసీజే, ఎం.లైబ్రరీ సైన్స్, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అలాగే తెలుగు రాష్ట్రాలు మినహా ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు ప్రతి కోర్సులో 10 శాతం సూపర్‌న్యూమరరీ సీట్లు ప్రత్యేకించారు.

ఏపీ పీజీ సెట్ నోటిఫికేషన్

అడ్మిషన్స్ ఇచ్చే యూనివర్సిటీలు: ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర, శ్రీ కృష్ణదేవరాయ, ఆచార్య నాగార్జున, శ్రీ పద్మావతి మహిళ, యోగి వేమన, రాయలసీమ, విక్రం సింహపురి, ద్రవిడియన్, కృష్ణ, ఆది కవి నన్నయ, డా.బీ.ఆర్.అంబేద్కర్, డా.అబ్దుల్ హక్ ఉర్దు, క్లస్టర్, ఆంధ్ర కేసరి, జేఎన్‌టీయూఏ - ఓటీపీ ఆర్ఐ, స్విమ్స్-తిరుపతి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్నవారు కూడా అర్హులే. ఎంఏ ఎకనామిక్స్‌లో ప్రవేశానికి బీకాం అభ్యర్థులు; ఎంఏ(లాంగ్వేజెస్)లో ప్రవేశానికి బీఈ, బీటెక్, బీఫార్మసీ అభ్యర్థులు అనర్హులు.

ఏపీ పీజీ సెట్ 2024 వివరాలు: పీజీసెట్ 2024ను మూడు కేటగిరీల్లో నిర్వహిస్తారు. మొదటి కేటగిరీలో ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్; రెండో కేటగిరీలో కామర్స్, ఎడ్యుకేషన్; మూడో కేటగిరీలో సైన్సెస్ సంబంధిత సబ్జెక్టుల్లో పరీక్షలు ఉంటాయి.

- **మొదటి కేటగిరీ టెస్ట్‌లు:** ఇంగ్లీష్, జనరల్, తెలుగు, లిటరేచర్, సంస్కృతం, హిందీ, ఉర్దూ, తమిళం, బీఎఫ్ఏ, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ మ్యూజిక్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, టూరిజం
- **రెండో కేటగిరీ టెస్ట్‌లు:** కామర్స్, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్
- **మూడో కేటగిరీ టెస్ట్‌లు:** లైఫ్ సైన్సెస్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్సెస్, బోటనీ, సెరీకల్చర్, జువాలజీ, మేథమెటికల్ సైన్సెస్, స్టాటిస్టిక్స్, ఫిజికల్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ సైన్సెస్, పాలిమర్ సైన్స్, జియాలజీ, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్, జాగ్రఫీ
- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అనాలజీస్, క్లాసిఫికేషన్, మ్యాచింగ్, కాంప్రహెన్షన్ ఆఫ్ రిసెర్చ్ స్టడీ, ఎక్స్‌పెరిమెంటల్, థియరిటికల్ ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 35 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.
- ఎంపీఈడీ కోర్సుకు మాత్రం అభ్యర్థులు క్రీడల్లో సాధించిన విజయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. దీనికి కూడా 100 మార్కులు కేటాయించారు. అభ్యర్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో సాధించిన విజయాలకు సంబంధించిన సర్టిఫికెట్లను దరఖాస్తుకు జతచేయాలి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.850; బీసీ అభ్యర్థులకు రూ.750; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.650
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 4
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 27 నుంచి 29 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 31 నుంచి
- **ఏపీ పీజీ సెట్ 2024 తేదీలు:** జూన్ 10 నుంచి 14 వరకు
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

రైల్వేలో టెక్నీషియన్లు

మొత్తం ఖాళీలు: 9144

దేశ వ్యాప్తంగా వివిధ విభాగాల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.

1. **టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: 1,092 పోస్టులు**
2. **టెక్నీషియన్ గ్రేడ్-3: 8,052 పోస్టులు**

- మొత్తం ఖాళీల్లో ఆర్ఆర్‌బీ సికింద్రాబాద్ పరిధిలో 744 పోస్టులున్నాయి.

అర్హతలు

టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: బీఎస్సీ, బీఈ/బీటెక్, డిప్లొమా(ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.

టెక్నీషియన్ గ్రేడ్-3: మెట్రిక్యులేషన్/ఎస్ఎస్ఎల్‌సీ, ఐటీఐ(ఎలక్ట్రీషియన్/ వైర్‌మన్/ఎలక్ట్రానిక్స్ మెకానిక్/మెకానిక్ పవర్ ఎలక్ట్రానిక్స్/మెకానిక్/ఫిట్టర్/వెల్డర్/పెయింటర్ జనరల్/మెషినిస్ట్/ కార్పెంటర్/ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్/మెషినిస్ట్/మెకానిక్/మెకానిక్ మెకట్రానిక్స్/మెకానిక్ డీజిల్/మెకానిక్(మోటార్ వెహికిల్)/టర్నర్/ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్/గ్యాస్ కట్టర్/హీట్ ట్రీటర్/ఫౌండ్రీమన్/ప్యాటర్న్ మేకర్/మౌల్డర్ తదితరాలు). లేదా 10+2(ఫిజిక్స్, మేథ్స్) ఉత్తీర్ణులై ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు రూ.29,200. టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు రూ.19,900.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 8

వెబ్‌సైట్: https://indianrailways.gov.in/

సిపెట్ అడ్మిషన్ టెస్ట్

చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సిపెట్)- అడ్మిషన్ టెస్ట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా డిప్లొమా, పీజీ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. వయో పరిమితి నిబంధనలు లేవు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. హైదరాబాద్ క్యాంపస్‌లో అన్ని ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ క్యాంపస్‌లో పోస్ట్ డిప్లొమా ప్రోగ్రామ్ లేదు. మహిళలకు, పురుషులకు విడివిడిగా వసతి సౌకర్యం ఉంది. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ, ఎన్‌బీఏ గుర్తింపులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా పాలిమర్స్, ప్లాస్టిక్స్, పెట్రోకెమికల్స్, మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ విభాగాలకు సంబంధించి ప్రొఫెషనల్/టెక్నికల్ ట్రెయినింగ్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా స్టయిపెండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్‌లు కూడా ఉంటాయి. ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ, ప్లాస్టిక్స్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే.

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: బీఎస్సీ ఉత్తీర్ణులు/చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ తరవాత రెండేళ్ల వ్యవధి గల కోర్సులు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్ (పీడీ-పీఎండీ-క్యాడ్/క్యామ్): ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. మూడు సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: మూడేళ్ల డిప్లొమా(మెకానికల్/ప్లాస్టిక్స్/పాలిమర్/టూల్/టూల్ అండ్ డై మేకింగ్/ప్రొడక్షన్/ఆటోమొబైల్ ఇంజనీరింగ్-మెకట్రానిక్స్/ఆటోమొబైల్/పెట్రో కెమికల్స్/ఇండస్ట్రియల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/టెక్నాలజీ) లేదా సిపెట్ నుంచి డీపీఎంటీ/డీపీటీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.

సిపెట్ అడ్మిషన్ టెస్ట్ 2024 వివరాలు: దీనిని కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. అర్హత కింద నిర్దేశించిన కోర్సు సిలబస్, జనరల్ నాలెడ్జ్ అంశాల నుంచి మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. జనరల్ నాలెడ్జ్ కింద స్పోర్ట్స్, హిస్టరీ, పాలిటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, కరెంట్ అఫైర్స్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. డీపీటీ, డీపీఎంటీ ప్రోగ్రామ్‌లకు నిర్వహించే పరీక్షలో జనరల్ నాలెడ్జ్ నుంచి 25, సైన్స్ సబ్జెక్ట్ నుంచి 20, ఇంగ్లీష్ నుంచి 5 ప్రశ్నలు అడుగుతారు. పీజీ డిప్లొమా ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో జనరల్ నాలెడ్జ్ నుంచి 20 ప్రశ్నలు; సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10 ప్రశ్నలు; కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ, మేథ్స్ అంశాలనుంచి మరో 10 ప్రశ్నలు ఇస్తారు. పోస్ట్ డిప్లొమాకు నిర్వహించే ఎగ్జామ్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 20; సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10; ప్లాస్టిక్స్/పాలిమర్స్, టూల్స్ రూం, ఇండస్ట్రియల్ అంశాలనుంచి మరో 10 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంట. నెగెటివ్ మార్కులు లేవు.


ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **సిపెట్ అడ్మిషన్ టెస్ట్ 2024 తేదీ:** జూన్ 9
- **ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్&అడ్మిషన్ లెటర్స్ విడుదల:** జూన్ 14న
- **హైదరాబాద్ క్యాంపస్ చిరునామా:** ఐడీఏ ఫేజ్-2, చర్లపల్లి, హైదరాబాద్-500051
- **విజయవాడ క్యాంపస్ చిరునామా:** సర్వే నెం.377, సూరంపల్లి విలేజ్, గన్నవరం మండలం, విజయవాడ-521212
- **వెబ్‌సైట్:** https://cipet24.onlineregistrationform.org/CIPET/

జమిలి ఎన్నికలు

అనుకూల - ప్రతికూల వాదనలు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



(నిన్నటి దిక్సూచి తరువాయి)

అనుకూల వాదనలు

1. మూడుస్థాయిల్లోని ప్రభుత్వాలకు విడివిడిగా ఎన్నికలు నిర్వహించేకన్నా, ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం మంచిది. తద్వారా ఎన్నికల నిర్వహణకు మూడుసార్లు అయ్యే అనేక ఖర్చులు తగ్గుతాయి. దేశంపై ఆర్థికభారం తగ్గుతుంది. ఇది ప్రభుత్వంతోపాటు రాజకీయ పార్టీలకు, వాటికి నిధులిచ్చే వాణిజ్య సంస్థలకు భారం తగ్గిస్తుంది.
2. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది మొదలు, పూర్తయ్యేవరకూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుంది. ప్రభుత్వాలు దైనందిన పాలనా కార్యక్రమాలు మినహా, కొత్త పథకాలు/ కొత్త విధానాలు చేపట్టడానికి అవకాశం ఉండదు. రెండు మూడు నెలలపాటు ఈ పరిస్థితి నెలకొంటుంది. ఏటా ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు ఒక్కోసారి లోక్‌సభ ఎన్నికలు కూడా జతయై సంవత్సరంలో సగంరోజులపాటు ఈ క్రియాశూన్యత కనిపిస్తూ ఉంటుంది. జమిలి ఎన్నికలతో అయిదు సంవత్సరాలకు ఒకసారి కొన్ని నెలలకే దీనిని పరిమితం చేయవచ్చు.
3. మానవ వనరులపై ఒత్తిడి తగ్గుతుంది. ఎన్నికల సమయంలో భారీఎత్తున భద్రతా బలగాల తరలింపు, ప్రభుత్వాధికారులకు అదనపు పని ఒత్తిడి ఉంటుంది. జమిలి ఎన్నికల వల్ల వారిపై ఈ భారం ఒక్కసారికే పరిమితం అవుతుంది.
4. తరచూ, ఏదో ఒక స్థాయిలో ఎన్నికలు జరుగుతున్నప్పుడు నాయకులు నిరంతరం గెలుపు కోసం ప్రచారాలు, వ్యూహరచనలు చేయడంలో నిమగ్నమైపోతారు. ప్రజా సంక్షేమానికి పనిచేసే సమయం ఉండదు. అందువల్ల ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల చేతుల్లోంచి ప్రభుత్వోద్యోగుల చేతుల్లోకి పాలన వెళ్లి అది ప్రజాస్వామ్యాన్నే ప్రశ్నిస్తుంది.
5. అన్ని స్థాయిల్లో ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల దేశవ్యాప్త అంశాలపై ఎక్కువగా చర్చ జరిగి జాతీయ దృక్పథం అలవడుతుంది. సంకుచిత ప్రాంతీయవాద ఓటుబ్యాంకు రాజకీయాలకు తెరపడి, దేశ సమైక్యతకు, సమగ్రతకు తోడ్పడుతుంది.
6. తాత్కాలికంగా ఎన్నికల కోసం వైరుధ్య సిద్ధాంతాలున్న పార్టీలు అసంబద్ధ పొత్తులు పెట్టుకోవడం జమిలి ఎన్నికలతో తగ్గుతుంది. సిద్ధాంతపరమైన నిజాయితీకి పార్టీలు కట్టుపడతాయి.
7. పార్టీ ఫిరాయింపులు, ఎమ్మెల్యేల బుజ్జగింపులు వంటివి తగ్గి పాలనలో స్థిరత్వం పెరిగి పాలకులు పాలనపై దృష్టిపెట్టడానికి అవకాశం ఉంటుంది.
8. ఏవైనా కఠిన నిర్ణయాలు ప్రజాసంక్షేమం దృష్ట్యా తీసుకోవాల్సి వచ్చినప్పుడు ప్రభుత్వాలు నిర్భీతిగా వ్యవహరించవచ్చు. అయిదేళ్లకు గానీ ఎన్నికలు మరలా రానందున పదే పదే ప్రజాకర్షక ఉచిత పథకాలు వంటివి ప్రకటించాల్సిన అవసరం రెండు స్థాయిల్లోని అధికార పార్టీలకు ఉండదు. ఫలితంగా పెద్దఎత్తున ప్రజాధనం నిర్మాణాత్మక కార్యక్రమాలకు మళ్లుతుంది.
9. జమిలితో ఒకేసారి అన్నిస్థాయిల ఎన్నికల్లో ఓటు వేసే సౌలభ్యం ఉంటుంది. ఓటుహక్కు వినియోగించుకోవాలనే నైతిక ఒత్తిడి కూడా ప్రజలపై ఉండి ఓటింగ్ శాతం పెరుగుతుంది.
10. ఓటర్ల జాబితాలో సవరణలు పదేపదే చేయాల్సిన అవసరం ఎలక్షన్ కమిషన్‌కు ఉండదు. ఓటర్లు కూడా తమ ఓటుహక్కును తరచూ తనిఖీ చేసుకోవాల్సిన శ్రమ ఉండదు.
11. ఎన్నికల సమయంలో మత, సైద్ధాంతిక, ప్రాంతీయపరమైన ఉద్రిక్తలు పార్టీల ప్రయోజనాల కోసం రెచ్చగొట్టబడుతూ ఉంటాయి. ఇటువంటి వాటి సంభావ్యత జమిలి ఎన్నికల వల్ల తగ్గుతుంది.

ప్రతికూల వాదనలు

1. దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించడం అంటే పెద్దఎత్తున రవాణా, ఎన్నికల సామగ్రి అవసరమవుతుంది. ఉదాహరణకు ఇప్పుడున్న ఈవీఎంలకు రెండింతలు ఈవీఎంలు అవసరమవుతాయి. భద్రతా దళాల, మానవ వనరుల కొరత ఏర్పడుతుంది. ఈవీఎంల భద్రత కూడా ప్రశ్నార్థకం అవుతుంది. శాంతిభద్రతలు అదుపుతప్పినప్పుడు వెంటనే కట్టడి చేయడం కష్టం.
2. భారతదేశ జనాభాలో సాంకేతిక అవగాహన లేనివారు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఒకేసారి మూడు నాలుగు ఈవీఎంలను వినియోగించాలంటే వీరు గందరగోళపడి తప్పులు జరగడానికి అవకాశం ఉంది. తదుపరి ఎన్నికలప్పుడు అసలు ఓటు వేయడానికే వీరు ఉత్సాహం చూపకపోవచ్చు.
3. విడివిడిగా ఎన్నికలు జరిగినప్పుడే కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పనితీరులపై ప్రత్యేకంగా ప్రజలు దృష్టి సారించడానికి వీలవుతుంది. ఒకేసారి ఎన్నికలు జరిగినప్పుడు జాతీయస్థాయి చర్చే ప్రధానంగా జరిగి రాష్ట్రాల్లో కూడా జాతీయ పార్టీల ప్రభావం పడే అవకాశం ఉంది. లేదా ప్రాంతీయ పార్టీల వల్ల వర్గ, మత, ప్రాంతీయ అభిమాన ప్రభావాలకు ప్రజలు గురైనప్పుడు వాటికి అనుగుణంగా ఉన్న జాతీయ పార్టీల వైపు మొగ్గు ఏర్పడుతుంది. ఏతావతా ఆయా ప్రభుత్వాల పనితీరు విస్మరించబడుతుంది.
4. ఏదో ఒక ఎన్నికలు ఉండటం వల్ల ప్రభుత్వాలు జాగరూకతతో ఉంటాయి. లేకుంటే నియంతృత్వ పోకడలకు అవకాశం ఉంది.
5. నిధులు సమకూర్చుకోవడంలో, ఎన్నికల ఖర్చులో జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీలు పోటీపడలేవు. అందువల్ల ప్రాంతీయ పార్టీల ఉనికికి ప్రమాదం ఏర్పడి ప్రాంతీయ సమస్యలు, ఆకాంక్షలు గుర్తింపునకు నోచుకోవు. ఇది అశాంతికి దారితీస్తుంది.
6. జమిలి విధానంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ రద్దు, ముందస్తు ఎన్నికలను కోరే అధికారం కోల్పోతారు. కేవలం కేంద్ర ప్రభుత్వానికే ఎలక్షన్ సంబంధిత నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉండి సమాఖ్య లక్షణం ప్రశ్నార్థకమవుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్



బీర్బల్ చాతుర్యం!


అక్బర్ రాజ్యమది. అక్కడ కొలువులో ఉండే బీర్బల్‌కి మంచి పేరుంది. ఆయననే అక్బర్ ఇష్టపడేవారు. ఇది చూసి ఇద్దరికి అసూయ కలిగింది. వారిలో చాంద్ అనే వ్యక్తి అక్బర్ దగ్గర తాను ఉండాలనుకున్నాడు. ఇందుకోసం ఓ ఆలోచన వచ్చింది. దాన్ని అమలు చేయాలనుకున్నాడు. అక్బర్ తన సభలో ఆసీనులై ఉండగా అందరూ చూస్తున్నారు. అంతలోనే చాంద్ లేచి నిలబడ్డాడు. ఒక ప్రశ అడుగుతా? మీరు సమాధానం చెప్పగలరా? అసలు మీకు తెలుసా? అని బీర్బల్‌ను అడిగాడు చాంద్. తాను మనసులో 'అక్బర్ ఇది చెప్పలేడు. కచ్చితంగా తన స్థానం నాకే దక్కుతుంది' అని విర్రవీగాడు మనసులో.

'చాంద్‌గారూ అడగండి' అన్నారు బీర్బల్. 'ఏమీ లేదు. చిన్న ప్రశ్న. ఈ ఆగ్రా నగరంలో ఎన్ని పిచ్చుకలు ఉన్నాయి?' అని అడిగాడు. బీర్బల్ కంగారు పడలేదు. సహనంతో ఇలా అన్నాడు. 'అంతేనా మిత్రమా... రేపటివరకూ సమయం ఇవ్వండి' అన్నాడు. అందరూ ఆశ్చర్యంగా చూశారు. చాంద్ మాత్రం మనసులో సంతోషపడ్డాడు. మరుసటి ఉదయమే సభ ప్రారంభమైంది. రాజుతో సహా మంత్రులు, సేనాధిపతులు,




ప్రజలు ఆసీనులయ్యారు. బీర్బల్ లేచాడు. నిన్నటి ప్రశ్నకు నా జవాబు- 19, 537 అన్నాడంతే. వెంటనే చాంద్ లేచి 'ఇది అబద్ధం. వాటిని లెక్కించలేదు' అన్నాడు కోపంతో. ఒకవేళ అంతకంటే తక్కువా ఉండొచ్చు? ఎక్కువ ఉండొచ్చు? అన్నాడు. బీర్బల్ సహనంతో ఇలా అన్నాడు. '19,537 కంటే తక్కువ ఉంటే మన ఊరి పిచ్చుకలు వేరే నగరంలోని తన బంధువుల ఇంటికి వెళ్లినట్లు. ఒకవేళ ఎక్కువ పిచ్చుకలు ఉంటే ఇతర నగరాల్లోని పిచ్చుకలు మన నగరానికి వచ్చినట్లు' అన్నాడంతే. సభంతా పగలబడి నవ్వారు. శభాష్ అంటూ అక్బర్ చప్పట్లు కొట్టాడు. అందరూ చప్పట్లు కొట్టారు. బీర్బల్ చాతుర్యం, తెలివికి అందరూ ఆశ్చర్యపోవడమే కాదు ఆనందపడ్డారు. బీర్బల్‌కు బంగారు నాణెం ఇచ్చి సత్కరించాడు అక్బర్.

ఏవి ఎన్ని?




10 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 270

	3				8	4		
			5		9	1		
1	5			7		6		
					7			8
	4		3		1		2	
7			4					
		7		1			5	4
		1	7		2			
		9	8				1	

సుడోకు - 269 సమాధానం

4	8	6	5	9	7	1	2	3
3	2	9	1	6	4	5	8	7
7	5	1	3	8	2	4	9	6
5	6	4	7	1	8	9	3	2
8	9	2	4	3	6	7	5	1
1	3	7	2	5	9	6	4	8
6	1	8	9	4	3	2	7	5
2	4	3	6	7	5	8	1	9
9	7	5	8	2	1	3	6	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.